


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 203

మంగళవారం 14-10-2025

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గెలుపు వాకిట్లో భారత్

వెస్టిండీస్‌పై రెండో టెస్టులో విజయానికి 58 పరుగుల దూరంలో ఇండియా -13లో



సృజనాత్మక ప్రగతికి ఆర్థిక నోబెల్

ఎకనమిక్స్ నోబెల్‌కు జోయెల్ మోకిర్, అఘియన్, పీటర్ హోవిట్ ఎంపిక -6లో

అవధుల్లేని ఆనందం

738 రోజుల తర్వాత స్వేచ్ఛా ప్రపంచంలోకి బందీలు

- హమాస్ చెరలో మిగిలిన 20 మంది ఇజ్రాయెల్ పౌరుల విడుదల
- కుటుంబాలను తిరిగి కలుసుకొని భావోద్వేగానికి గురైన బాధితులు
- ప్రతిగా సుమారు 2 వేల మంది ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్ సైన్యం
- మరణించిన 28 మంది మృతదేహాలను త్వరలో అప్పగిస్తామన్న హమాస్
- బందీల విడుదల సందర్భంగా ఇజ్రాయెల్ చేరుకున్న ట్రంప్
- పీడకల ముగిసిందంటూ పార్లమెంటులో ప్రసంగం..
- ట్రంప్‌కు అత్యున్నత పౌర పురస్కారం ప్రకటించిన ఇజ్రాయెల్

6 లో

నాడు చెరలో తన సమాధి కోసం గొయ్యి తవ్వుతూ.. నేడు స్వేచ్ఛాజీవిగా మురిసిపోతూ డేవిడ్



ఇక 100% ఈపీఎఫ్ విత్‌డ్రా



- నిబంధనల మేరకు ఉపసంహరించుకొనే అవకాశం
- ఉపసంహరణల నిబంధనలు సులభతరం.. పాక్షిక విత్‌డ్రా పరిమితులు పెంపు
- విద్యావసరాల కోసం 10 సార్లు, వివాహానికి సంబంధించి 5 సార్లు తీసుకోవడానికి అనుమతి
- మూడు కేటగిరీలుగా విభజన.. కీలక నిర్ణయాలు తీసుకున్న సెంట్రల్ బోర్డు

- వివరాలు 14లో▶



ఢిల్లీ కాంగ్రెస్‌కు సెగ తగలాలి

జూబ్లీహిల్స్‌లో బుల్డోజర్ పాలనకు, కారు సంక్షేమానికి పోటీ

పేదల ఇళ్లు కూల్చి రోడ్డున పడేసిన రేవంత్ సర్కార్: కేటీఆర్

కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ప్రజలకు ఆరు గ్యారంటీలు వస్తాయి

లేదంటే ఏమీ చేయకున్నా గెలిపించారని సీఎం అనుకుంటారు

మాగంటి సునీత గెలుపు ఖాయం: మాజీ మంత్రి హరీశ్‌రావు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రధానంగా పోటీ పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు నడిపించే కాంగ్రెస్ పార్టీకి, ప్రజల మేలు కాంక్షించే కారు పార్టీకి మధ్యే ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడే బీఆర్‌ఎస్ కావాలో, హైడ్రా పేరుతో సామాన్య ప్రజల ఇళ్లను కూల్చేయడమే ఎజెండాగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు సెగ తగిలేలా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు తీర్పు ఇవ్వాలని కోరారు. రహమత్‌నగర్ డివిజన్ క్వారీ మైదానంలో సోమవారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ నగరాన్ని 'హైడ్రా'బాద్‌గా మార్చి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధిని దెబ్బతీసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ రూపొందించిన బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఓట్‌చోరీ అంటుంటే.. జూబ్లీహిల్స్

మిగతా 3వ పేజీలో ▶

ఐదేళ్లలో 3.63 లక్షల కిడ్నీ కేసులు

- గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పెరిగిన కిడ్నీ, కేన్సర్ సమస్యలు
- నాలుగు జిల్లాల్లో మరీ అధికం.. ఆందోళనలో ఆరోగ్యశాఖ
- గత ఐదేళ్లలో 13 వ్యాధులకు సంబంధించి 12.59 లక్షల కేసులు నమోదు
- ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు ఈ వ్యాధుల చికిత్సకు చెల్లించిన మొత్తం రూ. 3 వేల కోట్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ వ్యాధులకు చికిత్స అందించాలని సర్కారు నిర్ణయం

16 లో

అసాంక్రమిక వ్యాధులు మానవాళి బతుకును భారంగా మారుస్తున్నాయి. జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. అకాల మరణాలపాలు చేస్తున్నాయి. మనుషులను రోగ పీడితులుగా, విగత జీవులుగా మార్చటంలో అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీలు) పాత్ర మూడింట రెండు వంతులని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ) తాజా అధ్యయనం వెల్లడించింది.

- సాక్షి, సాగుబడి



అసాంక్రమిక వ్యాధులతో ముప్పే!

1990లలో ప్రపంచ ప్రజల మధ్యస్థ ఆయుర్దాయం (మీన్ ఏజ్) 46.8 ఏళ్లు. 2023 నాటికి అది 63.4 ఏళ్లకు పెరిగింది. ఇది మానవ జాతి సాధించిన గొప్ప విజయాల్లో అత్యంత ప్రధానమైనది. అయినప్పటికీ హార్ట్ స్ట్రోక్, టైప్ 2 మధుమేహం, ఐహెచ్‌డీ (గుండెకు తగినంత రక్తం అందక పోవటాన్ని ఇస్కీమిక్ గుండె వ్యాధి అంటారు) వంటి అసాంక్రమిక వ్యాధుల బారిన పడిన మనుషుల్లో మూడింట రెండొంతుల మంది చనిపోవటమో, తీవ్రంగా జబ్బుపడి జీవన నాణ్యతను కోల్పోవటమో జరుగుతోంది. అంతర్జాతీయ మెడికల్ జర్నల్ లాన్సెట్ తాజా సంచికలో ప్రచురితమైన గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ) అధ్యయనం రోగగ్రస్త జీవన నష్టాల తీవ్రతను తెలిపే ఆసక్తికరమైన వివరాలను వెల్లడించింది.

వాటిలో మార్పు తేగలిగితే..: పురుషుల మధ్యస్థ ఆయుర్దాయం 45.4 ఏళ్ల నుంచి 61.2 ఏళ్లకు, మహిళల ఆయుర్దాయం 48.5 నుంచి 65.9 ఏళ్లకు పెరిగింది. రక్తంలో అధిక చక్కెర స్థాయిలు, అధిక బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) వంటి కొన్ని ప్రధాన ఆరోగ్య సూచికల్లో మార్పు తేగలిగితే సగానికి సగం అకాల మరణాలు, రోగగ్రస్త జీవనం నుంచి మనుషులను రక్షించవచ్చని పరిశోధకుల అంచనా.

భారీగా తగ్గిన జీవన నష్టం..: అకాల మరణం వల్ల కోల్పోయిన సంవత్సరాలను 'జీవిత నష్ట సంవత్సరాలు (ఇయర్స్ ఆఫ్ లైఫ్ లాస్ట్–వైఎల్ఎల్)' పేరిట గణాంక శాస్త్రవేత్తలు లెక్కిస్తారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, టీబీ, పౌష్టికాహార లోపాలు, ఇతర సాంక్రమిక వ్యాధుల వల్ల సంభవించే అకాల మరణాలు గత 30 ఏళ్లలో గణనీయంగా తగ్గాయని పరిశోధకులు తెలిపారు.

5 ఏళ్లలోపు పిల్లలే!



2023లో ప్రపంచవ్యాప్తంగా 6.01 కోట్ల మంది మృత్యువాతపడ్డారు. అందులో 46.7 లక్షల మంది ఐదేళ్ల లోపు పిల్లలు! 1950 తర్వాత జనాభా సంఖ్య, వృద్ధుల శాతం పెరుగుతున్న నేపథ్యంలో 1950–2023 మధ్య కాలంలో ప్రపంచ సగటు మరణాల సంఖ్య 35.2% పెరిగింది. అయితే, ఇదే కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రాంతాలు, వయసుల వ్యత్యాసాలను ప్రామాణీకరించి శాస్త్రీయంగా విశ్లేషించి చూస్తే.. మరణాల రేటు 66.6% తగ్గటం శుభపరిణామమని ఈ అధ్యయనం వెల్లడించింది.

12.6% తగ్గిన వ్యాధుల భారం



ప్రపంచవ్యాప్తంగా 204 దేశాల్లో ప్రజలను వయసు, లింగం, సకల వ్యాధి కారక మరణాలు, ఆయుర్దాయం తదితర అంశాలను పరిశీలిస్తే గతంలో కన్నా ఆరోగ్యస్థితి మెరుగ్గానే ఉందని ఈ అధ్యయనం పేర్కొంది. వయసు– ప్రామాణిక వైకల్యం సర్దుబాటు చేసిన జీవిత సంవత్సరం (డిజ్‌అబిలిటీ అడ్జస్టెడ్ లైఫ్ ఇయర్–డాలీ) రేటు అనేది యావత్ జనాభాపై ఉన్న వ్యాధి భారాన్ని లెక్కించడానికి ఉపయోగపడే ఒక కొలబద్ద. వేర్వేరు దేశాలు, ప్రాంతాల్లో భిన్న వయస్కులతో కూడిన జనాభా ఉంటారు. వారి అందరిపై గల వ్యాధుల భారాన్ని సముచితంగా పోల్చి విశ్లేషించే క్రమంలో ఎదురయ్యే వ్యత్యాసాలను గణాంకపరంగా సర్దుబాటు చేయటానికి ఉపయోగపడే సంవత్సరాల సంఖ్యను 'డాలీ'లలో లెక్కిస్తారు. 2010–2023 మధ్యలో వ్యాధుల భారం 12.6% డాలీల మేరకు తగ్గాయని అధ్యయనం పేర్కొంది.


వాటితో పెరుగుతున్న మరణాలు, తీవ్ర వ్యాధులు

ఆయుర్దాయం పెరిగినా తగ్గని ఎన్‌సీడీల బెడద

లాన్సెట్ తాజా అధ్యయనంలో ఆసక్తికర విశేషాలు

పెరిగిన మానసిక రుగ్మతలు

మానసిక రుగ్మతలు ముఖ్యంగా మనో వ్యాకులత, కుంగుబాటు వంటివి 2010 తర్వాత భారీగా పెరిగాయని ఈ అధ్యయనం తెలిపింది. వ్యాధుల భారాన్ని పెంచుతున్న 26 అంశాల్లో సిర్రోసిస్, క్రానిక్ లివర్ డిసీజ్, అల్జీమర్స్ (మతిమరుపు) వంటివి ఉన్నాయి. 2023లో గుర్తించిన అత్యధిక హెల్త్ రిస్క్ ఫ్యాక్టర్లలో ఉన్న కొన్ని ప్రధానాంశాలు.. అధిక రక్తపోటు, గాలిలో అధికంగా ఉండే సూక్ష్మ కణాలు, అధిక గ్లూకోజ్, ధూమపానం, అధిక బీఎంఐ, తక్కువ బరువు ఉండే శిశు జననాలు, నెలలు నిండకముందు జన్మించే పిల్లల సంఖ్య.




నివారించదగిన జబ్బులపై దృష్టి

యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్(ఐహెచ్ఎంఈ) డైరెక్టర్ డాక్టర్ క్రిస్టోఫర్ ముర్రేతో పాటు మరో 16,500 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ అధ్యయనం చేశారు. పెరుగుతున్న వయోవృద్ధుల సంఖ్య, పుట్టుకొస్తున్న కొత్త సమస్యలు ప్రపంచ ఆరోగ్య సవాళ్లుగా మారుతున్నాయని ముర్రే వ్యాఖ్యానించారు. ప్రపంచ జనాభాపై జబ్బుల భారం గురించి తాజా అధ్యయనం వెల్లడించిన వాస్తవ గణాంకాలు పాలకులకు మేలైన ప్రజారోగ్య విధానాల రూపకల్పనకు మేలుకొలుపు కావాలన్నారు.



బీసీ వర్గీకరణ తర్వాతే ఎన్నికలు

ఈసీని ఆదేశించాలంటూ హైకోర్టులో పిటిషన్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ వర్గీకరణ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీన్ని గతంలో దాఖలైన పిటిషన్లకు జత చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటి నుంచి మరో రెండు వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 3కు వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో వర్గీకరణ లేకుండా బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ నోమాడిక్, సెమీనోమాడిక్, డీనోటిఫైడ్ ట్రైబ్స్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. 'విద్య, ఉపాధి కల్పనలో సంచార, డీనోటిఫైడ్ తెగలకు 5 శాతం రిజర్వేషన్లు అందించడంలో అధికారుల వైఫల్యం రాజ్యాంగ విరుద్ధం. ఉమ్మడిగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఆర్థికంగా ఎదిగిన కులాలు మాత్రమే లబ్ధిపొందుతాయి. పేద బీసీ కులాలకు తీవ్ర నష్టం జరుగుతుంది. జీవో 9ని నిలిపివేసి.. బీసీ వర్గీకరణతో కొత్త జీవో జారీ చేసేలా ఈసీకి ఆదేశాలు జారీ చేయాలి'అని నివేదించారు.

సంక్షేమ వసతి గృహాల్లోనూ ఎఫ్ఆర్ఎస్

- విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత పరిశీలనకు టెక్నాలజీని వినియోగించుకోవాలి
- పుస్తకాలు యూనిఫామ్ పిల్లలకు చేరుతున్నాయో, లేదో ధ్రువీకరించుకోవాలి
- హాస్టళ్లను సమీప టీచింగ్ ఆస్పత్రులకు అటాచ్ చేయాలి.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలి
- సంక్షేమ శాఖల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- గ్రీన్ చానల్ ద్వారా డిమాండ్‌కు తగినన్ని నిధులు విడుదల



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లో ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సిబ్బందితోపాటు విద్యార్థుల హాజరు కూడా ఇదే విధానంలో స్వీకరించాలన్నారు. ఈమేరకు హాస్టల్ సిబ్బంది, విద్యార్థుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాణ్యతను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి, పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలన్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ ఆహారంతో విద్యార్థులకు లభించే కేలరీలను తెలుసుకోవాలని చెప్పారు.

హాస్టళ్ల సమాచారం డాష్‌బోర్డులో...

హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధారించాలన్నారు. 'హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలి. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను సంక్షేమ హాస్టళ్లతో అనుసంధానించాలి. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచూ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలను పరిశీలించాలి'అని రేవంత్ పేర్కొన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ చార్జీలు, నిర్వహణకయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపునకు సంబంధించి సమగ్ర నివేదికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌ను సీఎం ఆదేశించారు.

మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయండి

హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిధుల విడుదల కోసం ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, అవసరమైన యాప్‌లను రూపొందించాలని నిర్దేశించారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద సంక్షేమ విద్యాసంస్థలకు రూ.60 కోట్లు ప్రత్యేకంగా కేటాయించగా... ఇందుకు సంబంధించిన చెక్కులను ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందించారు. ఈ నిధులను హాస్టళ్లలో మరమ్మతులు, తాత్కాలిక సిబ్బంది జీతాలు, డైట్ చార్జీలు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు సీఎం చెప్పారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పూరన్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఐపీఎస్‌కే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటి?

- సూసైడ్ నోట్ ఉన్నా డీజీపీ, ఎస్పీపై చర్యలు తీసుకోరా?
- ప్రధాని మోదీ, అమిత్ షా రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి
- పూరన్ కుమార్ కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి భట్టి పరామర్శ
- ఫోన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఓదార్పు.. అండగా ఉంటామని భరోసా

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటన అత్యంత దారుణమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తన ఆత్మహత్యకు కారకులెవరనేది సూసైడ్ నోట్‌లో స్పష్టంగా చెప్పినప్పటికీ, నిందితులపై చర్యలు తీసుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో కుల వివక్ష ఆరోపణలు ఎదుర్కొంటున్న శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర డీజీపీగా ఇంకా కొనసాగించడం దారుణమని మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇకనైనా రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. సోమవారం చండీగఢ్‌లో పూరన్ కుమార్ కుటుంబాన్ని భట్టి విక్రమార్క పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు, కేసు నమోదు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్‌తో మాట్లాడించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని అమ్నీత్‌కు భరోసానిచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 'ఐపీఎస్ అధికారికే రక్షణ లేకపోతే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటి? మానవ హక్కుల సంఘాలు, పౌర సంఘాలు న్యాయం చేయాలని పోరాడుతున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. హరియాణా, చండీగఢ్‌లలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఇకనైనా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తమ రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించాలి. ఇది రాజకీయ పార్టీల సమస్య కాదు. ఇదొక మానవ హక్కుల సమస్య. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ, ఎస్పీలను వెంటనే అరెస్టు చేసి విచారించాలి. ఇది మన ప్రజాస్వామ్యానికి నైతిక పరీక్ష'అని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పట్టభద్రుడు, ప్రతిష్టాత్మక 'రా'విభాగంలో పనిచేసి.. రాష్ట్రపతి అవార్డులు అందుకున్న వ్యక్తి చనిపోతే ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటం ఏమిటని మండిపడ్డారు. కనీసం ఆయన తల్లి, భార్య, పిల్లలకు పార్థివదేహాన్ని చూపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. భట్టి విక్రమార్క వెంట ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు ఉన్నారు.

రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు

- మంత్రి పొంగులేటి వెల్లడి
- మంత్రి సీతక్కతో కలిసి పనుల పరిశీలన.. అధికారులతో సమీక్ష



అభివృద్ధి పనుల నమూనాను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి సీతక్క తదితరులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతర పనులకు రూ.251 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా రూ.101 కోట్లు మంజూరు చేయగా, వీటిలో రూ.71 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. గతంలో మంజూరైన జాతర ఏర్పాట్ల నిధులు రూ.150 కోట్లు కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేడారం జాతరకు వచ్చే నిధులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాదిరిగా జంపన్న వాగులో వరదలాగా జారిపోకుండా.. గిరిజనుల ఆరాధ్య దైవాల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగేలా కలెక్టర్, ఎస్పీలకు సూచనలు ఇచ్చామన్నారు.

నాపై ఎవరూ ఫిర్యాదు చేసే చాన్సే లేదు..

మేడారం పనుల విషయంలో కొండా సురేఖ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయని మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ 'నేనేంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్ట్ పనులకు తాపత్రయపడే అవసరం నాకు లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మడం లేదు. అధిష్టానానికి ఫిర్యాదు చేసే చాన్సే లేదు. ఆ వార్తలను నేను నమ్మడం లేదు'అని బదులిచ్చారు. జాతరలోపు నెలకు రెండుమూడు సార్లు జాతర అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. తాను రాకున్నా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ పాల్గొన్నారు.

మండలాల వారీగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు

- మండలానికి 4–6 మంది.. వారంరోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి
- రెవెన్యూ అధికారులకు మంత్రి పొంగులేటి దిశా నిర్దేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెవెన్యూ గ్రామాల వారీగా లైసెన్సుడు సర్వేయర్ల నియామక ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఇప్పటికే లైసెన్సుడు సర్వేయర్ల శిక్షణ పూర్తి చేసుకున్న 7 వేల మందికి పైగా సిబ్బందిని మండలాల వారీగా పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రతి రెవెన్యూ మండలంలోని గ్రామాలను బట్టి ఆయా మండలాలకు 4–6 మందిని లైసెన్సుడు సర్వేయర్లుగా నియమించనున్నట్టు సమాచారం. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో లైసెన్సుడ్ సర్వేయర్ల నియామకంపై ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారని, ఈ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తారనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. గత మే 26 నుంచి జూలై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ఏడువేల మందికి పరీక్షలు నిర్వహించారు. అదే నెల 28, 29 తేదీల్లో జేఎన్టీయూ ఆధ్వర్యంలో వారికి ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు కూడా ఇచ్చారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 40 రోజుల పాటు ఇచ్చే అప్రెంటీస్ శిక్షణ కూడా పూర్తి చేశారు. ఇక, రెండోదశ శిక్షణను ఆగస్టు 18వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రారంభించారు. తొలిదశ శిక్షణ పూర్తి చేసుకున్న వారిని అక్టోబర్ రెండో తేదీ నుంచి గ్రామాల్లో నియమించాలని ప్రభుత్వం భావించినా అనివార్య కారణాల వల్ల సాధ్యం కాలేదు. ఈలోపు పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో ఆ ఎన్నికలు పూర్తయిన తర్వాతే నియామకాలు జరపాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. కానీ, కోర్టు కేసుల కారణంగా ఈ ఎన్నికలు వాయిదా పడిన నేపథ్యంలో మళ్లీ పంచాయతీ ఎన్నికల కోడ్ వచ్చేలోపు లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాలను పూర్తి చేయాలని ఆ శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లైసెన్సుడు సర్వేయర్లను అందుబాటులోకి తెచ్చే ప్రక్రియను పూర్తి చేయనుంది.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో పిటిషన్

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్. ఢిల్లీలో ఖర్గేతో భేటీ



ఖర్గేతో భేటీ అయిన మహేశ్ గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హైకోర్టు ఇచ్చిన స్టేను అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. ఇటీవల బెంగళూరులో అనారోగ్యానికి గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. అనంతరం తెలంగాణ భవన్‌లోని శబరిబ్లాక్‌లో మహేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. 'అనారోగ్యానికి గురైన మల్లికార్జున ఖర్గేను కలిశాను. ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలను ఖర్గేకు వివరించా. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో హైకోర్టులో జరిగిన వాదనల తీరుతెన్నులు, హైకోర్టు విధించిన ఇంట్రీమ్ స్టే, సీఎం రేవంత్‌రెడ్డి, మేము సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలనుకుంటున్న విషయాన్ని సవివరంగా వివరించా. అంతా శుభం జరుగుతుందని ఖర్గే చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేపై రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరలో సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే ఆలోచనలో ఉంది. రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఇప్పటికే దీనిపై జూమ్ సమావేశం ద్వారా చర్చించాం'అని తెలిపారు. మంత్రుల మధ్య విభేదాలపై స్పందిస్తూ.. 'కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల పార్టీలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఇది మా కుటుంబంలో సమస్య. మేం కూర్చుని సామరస్యంగా పరిష్కరించుకుంటాం'అని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు. కాగా, ఖర్గేతో డీసీసీల ఎంపికపై కూడా మహేశ్‌గౌడ్ చర్చించారు.

సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు

- సోమవారం రాత్రి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం రాత్రి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఈ వారంలోనే, వీలైతే గురువారం లేదా శుక్రవారం విచారణ జరిగేలా చూడాలని సీనియర్ న్యాయవాదులను ప్రభుత్వం కోరినట్లు సమాచారం. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి, బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, రవివర్మలతో జూమ్ మీటింగ్‌లో చర్చలు జరిపారు. ఈ అంశాల ఆధారంగానే పిటిషన్‌కు తుది మెరుగులు దిద్ది, సోమవారం రాత్రి సుప్రీంలో దాఖలు చేసినట్టు తెలుస్తోంది.

మేడిగడ్డ పునరుద్ధరణకు డిజైన్లు ఇస్తాం

- ముందుకొచ్చిన మూడు ఐఐటీలు, స్పెయిన్ కంపెనీ
- ఈఓఐ గడువు పొడిగించాలని కోరిన సంస్థలు
- అర్హతలను సైతం సడలించాలని పలు సంస్థల విజ్ఞప్తి
- రేపటితో ముగియనున్న బిడ్డింగ్ గడువు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లతోపాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి పలు ఐఐటీలతోపాటు విదేశీ సంస్థలూ ముందుకొచ్చాయి. రూర్కీ, మద్రాస్, హైదరాబాద్ ఐఐటీలతోపాటు నిప్పాన్, ఆర్వీ అసోసియేట్స్, స్పెయిన్‌కు చెందిన మరో సంస్థ ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)లో పాల్గొంటున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన సిఫారసులకు అనుగుణంగా బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లు, పునరుద్ధరణ ప్రణాళిక అందించాలని కోరుతూ నీటిపారుదల శాఖ ఈ నెల 1న ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించగా, ఈ నెల 15తో బిడ్ల దాఖలుకు గడువు ముగియనుంది. ఈ క్రమంలో సోమవారం జలసౌధలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించగా, పైన పేర్కొన్న సంస్థల ప్రతినిధులు పాల్గొని బిడ్ల దాఖలుకు గడువును 15 రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ గడువును వారం రోజులు పొడిగించే అంశాన్ని నీటిపారుదల శాఖ పరిశీలిస్తోంది.

నిబంధనలు సడలించాలి...

బరాజ్‌ల పటిష్టతపై మదింపు, హైడ్రాలజీ, హైడ్రాలిక్ రివ్యూ, వరదలు/భూకంపాలు వంటి విపత్తులను ఎదుర్కోవడంలో బరాజ్‌లకు ఉన్న సామర్థ్యంపై మదింపు, గేట్లు/పియర్లు/సిల్టింగ్ బేసిన్/కటాఫ్ వాల్స్ వంటి కీలక విభాగాలను పటిష్టం చేసేందుకు డిజైన్లు అందించాలని ఈఓఐలో నీటిపారుదల శాఖ కోరింది. బరాజ్‌ల ప్రస్తుత డిజైన్లతో పాటు ఎన్డీఎస్ఏ నివేదికల్లోని సిఫారసులను పునఃసమీక్షించాలని కోరింది. ఈ క్రమంలో అవసరమైతే క్షేత్ర స్థాయిలో పర్యటించి జియోటెక్నికల్, జియోఫిజికల్ వంటి పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ఈ పరీక్షల ద్వారా బరాజ్‌లలో ఉన్న అన్ని రకాల లోపాలను గుర్తించాలని కోరింది. ఎన్డీఎస్ఏ సిఫారసుల మేరకు మేడిగడ్డ బరాజ్‌లోని కుంగిన 7వ బ్లాకును సుస్థిరం చేయడం లేదా సురక్షితంగా తొలగించే అంశంపై అధ్యయనం జరిపి తగిన పరిష్కారాలను సూచించాలని తెలిపింది. పక్కనే ఉన్న ఇతర బ్లాక్‌లకు ఎలాంటి నష్టం కలిగించకుండా 7వ బ్లాక్‌ను తొలగించేలా పరిష్కారాలు ఉండాలని షరతు విధించింది. ఎంపికైన సంస్థ అందించే డిజైన్లు, డ్రాయింగ్స్‌కి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదం పొందాలి. ఆసక్తి గల సంస్థ గత 15 ఏళ్లలో కనీసం ఒకటి రెండు ప్రాజెక్టుల పునరుద్ధరణ కోసం ఇలాంటి పనులు చేసి ఉండాలని అర్హతలను నిర్దేశించింది. 14 మీటర్ల ఎత్తుతో బరాజ్‌ల నిర్మాణంలో అనుభవం కలిగి ఉండాలని మరో అర్హతగా పేర్కొంది. ఈ నిబంధనను సడలించి ఎత్తును 7.5 మీటర్లకు కుదించాలని ప్రీబిడ్ సమావేశంలో కొన్ని సంస్థలు కోరినట్టు తెలిసింది. మరికొన్ని నిబంధనల విషయంలో సైతం సడలింపులు కల్పించాలని ఔత్సాహిక బిడ్డర్లు కోరినట్టు తెలిసింది. ప్రభుత్వంతో చర్చించిన అనంతరం దీనిపై శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఐఐటీ రూర్కీ వద్దు..

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణానికి ఐఐటీ రూర్కీ సాంకేతిక సహకారం అందించింది. ఆ బరాజ్‌లలో లోపాలు బయటపడిన నేపథ్యంలో ఐఐటీ రూర్కీ సహకారం మళ్లీ తీసుకోరాదని ప్రభుత్వం భావిస్తోంది.

ఇదండీ సంగతి



నా హోం వర్క్ అంతా ఏఐనే చేస్తుంది!

క్లుప్తంగా...

కేటీఆర్ ఓటమిని అంగీకరించారు

- అందుకే జూబ్లీహిల్స్‌లో ఓట్ చోరీ అంటూ అడ్డగోలు వ్యాఖ్యలు: ఎమ్మెల్సీ బల్మూరి



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ప్రజల నాడి ఏంటో మాజీ మంత్రి కేటీఆర్‌కు అర్థమైందని, అందుకే ఆయన ఓటమిని అంగీకరించాడని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు వ్యాఖ్యానించారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 100 శాతం విజయం సాధించబోతున్నారన్న వాస్తవాన్ని గ్రహించి ఓటమి నెపాన్ని ఇతరులపై నెట్టేందుకు ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపిస్తున్నారని చెప్పారు. సోమవారం బల్మూరి మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్ చెబుతున్న ఆ ఓటర్ల జాబితా 2023లోనే తయారైందని, ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘమే తేల్చిందన్నారు. కేటీఆర్‌కు చేతకాక ఓట్‌చోరీ అంటూ అడ్డగోలుగా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసేది కాంగ్రెస్ పార్టీ కాదని, ఆ జాబితాలో ఎక్కడైనా తప్పులుంటే ఈసీకి ఆధారాలు సమర్పిస్తే సరిపోతుందని, పదేళ్ల మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు అది కూడా తెలియదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఎలా వ్యవహరించిందో అందరికీ తెలుసునని, ప్రతి ఉప ఎన్నికల సమయంలో కొత్త పథకాలను తెచ్చి ప్రజలను మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని విమర్శించారు. దొంగమాటలు చెప్పి డ్రామాలాడుతున్న కేటీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని బల్మూరి వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే పదవి కోసం నన్ను చంపేస్తారేమో!

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల: సర్పంచ్ పదవి కోసం సొంత తమ్ముడినే చంపిన వ్యక్తి, భవిష్యత్‌లో ఎమ్మెల్యే పదవి కోసం తనను కూడా చంపే పరిస్థితి ఉందని.. అందుకోసం సీఎం రేవంత్‌రెడ్డిని, పీసీసీ అధ్యక్షుడిని తాను జెడ్ కేటగిరీ భద్రతను కోరాలేమో? అంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం మీడియా వద్ద సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారనే అంశంపై ఆయన పరోక్షంగా ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఫ్యాక్షనిస్టులకు స్థానం ఉండదన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని మోసం చేసి వెళ్లిన వారికి మళ్లీ పార్టీలో స్థానం ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. డబ్బు సంచులు తీసుకుని తమను ఓడించేందుకు ప్రయత్నించిన వాళ్లను కాంగ్రెస్‌లోకి తీసుకోవడం జరగదన్నారు. దీనిపై ఇదివరకే తనతో పాటు దేవరకద్ర, మహబూబ్‌నగర్, నారాయణపేట ఎమ్మెల్యేలతో పాటు జిల్లా మంత్రి శ్రీహరి సైతం తేల్చి చెప్పామన్నారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాల అభివృద్ధికి కేటాయించిన నిధులను పరిశీలిస్తామని, వెనుకబడిన పాలమూరు జిల్లాకు అంతకంటే ఎక్కువగా నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతామని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లను తొలగించండి

- బూత్‌కు 50 ఓట్ల చొప్పున 20 వేల ఓట్లు చేర్చారు
- నామినేషన్ల గడువు ముగిసేలోగా దీనిపై చర్యలు తీసుకోవాలి
- లేదంటే ఓటరు జాబితా అక్రమాలపై కోర్టుకు వెళ్తాం
- ఎన్నికల సంఘం సీఈవోకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిర్యాదు



పార్టీ నేతలతో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వినతి పత్రం ఇస్తున్న కేటీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, ప్రవీణ్ కుమార్, ప్రశాంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో అడ్డదారుల్లో గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. నియోజకవర్గం పరిధిలోని 400 పోలింగ్ బూత్‌లలో 50 చొప్పున 20 వేల దొంగ ఓట్లను నమోదు చేయించిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ'పై మాట్లాడుతుంటే జూబ్లీహిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ దొంగ ఓట్లతో గెలిచేందుకు ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. డూప్లికేట్ ఓటర్ల నమోదు, ఇతర అవకతవకలపై సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)కి పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఓటర్ లిస్టుపై సమగ్ర దర్యాప్తు చేయాలి

'ఒక్కో వ్యక్తికి మూడు నాలుగు ఓటర్ గుర్తింపు కార్డులున్నాయి. వేర్వేరు అడ్రస్‌లపై ఒకే వ్యక్తి ఓటు నమోదు, కొద్దిపాటి మార్పులతో ఒకే వ్యక్తి పేరు పలు చోట్ల నమోదు వంటి అంశాలు మా దృష్టికి వచ్చాయి. ఒక్కో ఇంట్లో వందకు పైగా ఓట్లను నమోదు చేసినట్లుగా వందల ఉదంతాలు ఉన్నాయి. ఇంటి యజమానులకు కూడా తెలియకుండా వారి చిరునామాపై ఓట్లు నమోదు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ కింది స్థాయి అధికారులతో కుమ్మక్కై దొంగ ఓట్లు చేర్చినట్టు అనుమానంగా ఉంది. ఓటర్ జాబితా అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలి అని ఎన్నికల సంఘాన్ని కోరాం'అని కేటీఆర్ తెలిపారు. మొత్తం రాష్ట్ర మంత్రులంతా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేరి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఓటర్ జాబితా అక్రమాలపై నామినేషన్ల ప్రక్రియ ముగిసేలోగా చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. దొంగ ఓట్ల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని స్పష్టం చేశారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, క్రిశాంక్, వై.సతీష్‌రెడ్డి, ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

ఢిల్లీ కాంగ్రెస్‌కు సెగ తగలాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో ఆ పార్టీయే ఓట్‌చోరీకి పాల్పడిందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో 20 వేల దొంగ ఓట్లను చేర్చిందని ఆరోపించారు.

ఇదే మోకా..

బీఆర్ఎస్ కార్యకర్తల కసి, పట్టుదల, తపన పార్టీ విజయానికి నాంది కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంతో ఉన్నవారు సీఎం రేవంత్‌రెడ్డిని తిట్టరాని తిట్లు తిడుతున్నారు. ధోకా తిన్న తెలంగాణకు ఇవాళ మోకా వచ్చింది. ప్రతి ఇంటికి వెళ్లి నిజం చెప్పాలి. గులాబీ జెండా రెపరెపలాడాలి. కాంగ్రెస్ ప్రభుత్వంలో మోసపోయిన ప్రతి ఒక్కరినీ కలిసి బాకీ కార్డులు పంచాలి' అని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ వృద్ధులకు రూ.48 వేలు, పెళ్లి అయిన ఆడబిడ్డలకు తులం బంగారం, మహాలక్ష్మి కింద మహిళలకు రూ.40 వేల చొప్పున బాకీ ఉందని అన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా ఇవ్వడం లేదని కేటీఆర్ ఆరోపించారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అందులో కనీసం 5 శాతం ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

జూబ్లీహిల్స్‌లో కొడితేనే ఆరు గ్యారంటీలు వస్తాయి

ఆటో డ్రైవర్లు మొదలుకొని బస్ డ్రైవర్ల వరకు అందరిచూపు ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల వైపే ఉందని కేటీఆర్ అన్నారు. 'ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డులు పెడతామన్నారు. ఇంతవరకు అతీగతీ లేదు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూలగొట్టడమా? ఎంతో మంది నిరుపేదలను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేసింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు కళ్లు బైర్లు కమ్మేలా కొడితేనే 6 గ్యారంటీలు వస్తాయి. కాంగ్రెస్ గెలిస్తే ఏమీ ఇవ్వకున్నా గెలిచామని, ప్రజలు తనకే ఓట్లు వేస్తారని సీఎం రేవంత్ అనుకుంటారు'అని కేటీఆర్ పేర్కొన్నారు. గలీజ్ మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని, ఇంత దివాలాకోరు సీఎంను ఎక్కడా చూడలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.



భావోద్వేగానికి లోనైన మాగంటి సునీత

సునీత గెలుపు ఖాయం: హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖాన వైద్యులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. 'అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు వాగ్దానం చేశారు. ఏళ్లు గడుస్తున్నా నెరవేర్చలేదు. ఉప ఎన్నికల్లో మాగంటి సునీత గెలుపు ఖాయమే. భారీ మెజారిటీ కోసమే మేమంతా ప్రయత్నం చేస్తున్నాం. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన దివంగత మాగంటి గోపీనాథ్.. నియోజకవర్గ అభివృద్ధితో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఆయన ఆశయాలు నేరవేర్చాలన్నా, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నా బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి'అని హరీశ్‌రావు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, నేతలు వద్దిరాజు రవిచంద్ర, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కౌశిక్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ముఠా గోపాల్, మల్లారెడ్డి, వివేకానంద్‌గౌడ్, సుధీర్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, దాసోజు శ్రవణ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, దాస్యం విజయ్ భాస్కర్, రావుల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సునీత కంటతడి.. ఓదార్చిన సబిత

ఎస్సీఆర్ హిల్స్‌లో సోమవారం నిర్వహించిన జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి, దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆమె ప్రసంగిస్తున్న సమయంలో తన భర్తను తలుచుకుని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో ఒక్కసారిగా వేదికపై ఉన్న నాయకులు మౌనంగా ఉండిపోయారు. పక్కనే ఉన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సునీతను ఓదార్చారు.

నేడు రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

- 8 జిల్లాల్లో ఎంపిక చేసిన రైతులకు 100 శాతం సబ్సిడీపై అందజేత
- పంపిణీ ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జాతీయ నూనె గింజల పథకంలో భాగంగా ఈ సంవత్సరం 8 జిల్లాల్లో ఎంపిక చేసిన రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రైతు ఉత్పత్తి సంఘాల (ఎఫ్‌పీవో) ద్వారా ఎంపిక చేసిన రైతులకు రూ.46.14 కోట్ల విలువైన 38,434 క్వింటాళ్ల విత్తనాలను మంగళవారం పంపిణీ చేయనున్నారు. వేరుశనగ అధికంగా పండించే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, రంగారెడ్డి, వికారాబాద్‌తో పాటు నల్లగొండ జిల్లాల్లోని రైతులకు 45,350 ఎకరాలకు సరిపడా ఈ విత్తనాలు అందజేస్తారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎంపిక చేసిన 8 జిల్లాల్లో జీజేజీ 32 రకం విత్తనాలను 19,490 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి రకానికి చెందిన 18,212 క్వింటాళ్లు, గిర్నార్ 732 క్వింటాళ్ల విత్తనాలను 100 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి.గోపి మంత్రికి తెలిపారు. సంప్రదాయంగా సాగు చేసే వంగడాలతో పోల్చుకుంటే కదిరి లేపాక్షి, జీజేజీ 32, గిర్నాల్ రకాల దిగుబడి 50 శాతం నుంచి 60 శాతం మేర అధికంగా ఉంటుందని, గిర్నార్-5 గింజల నూనెలో 80 శాతం ఓలియోక్ ఆమ్లం ఉండడంతో ఎక్కువ రోజులు గింజలను నిలువ చేసుకోవచ్చని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా విత్తనాల పంపిణీని మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని, ఆయా జిల్లాల్లో రైతు వేదికల వద్ద ప్రజా ప్రతినిధులు వేరుశనగ విత్తనాల పంపిణీ చేస్తారని గోపి వివరించారు.

బుల్డోజర్ పాలనను ప్రజలు వద్దనుకుంటున్నారు

- అసలు బీఆర్ఎస్ ఉనికిలోనే లేదు
- హరీశ్‌రావుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బుల్డోజర్లతో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన కారు పార్టీని జూబ్లీహిల్స్ ప్రజలు వద్దనుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిపించిన విధంగానే జూబ్లీహిల్స్‌లో కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని చెప్పారు. బావ, బామ్మర్దులు ప్రయోగించే సెంటిమెంట్‌లతో ఎలాంటి ఉపయోగం ఉండదని, జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని దయాకర్ చెప్పారు. 'మీ విధ్వంస బుల్డోజర్ పాలనను తెలంగాణ ప్రజలు కోరుకోరు. మీరు ప్రతిపక్షంలో కాదు కదా అసలు ఉనికిలోనే లేరు. కానీ, ఇంకా గెలుస్తామనే భ్రమల్లో మాత్రం ఉన్నారు'అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావుకు కౌంటర్ ఇచ్చారు.

తుమ్మిడిహెట్టి డీపీఆర్‌కి టెండర్లు

- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్/సూర్యాపేట: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణలో భాగంగా తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం టెండర్లను ఆహ్వానించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పునరుద్ధరణపై సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి నుంచి 71.5 కి.మీ.ల దూరంలోని మైలారం వరకు గ్రావిటీతో నీళ్లను తరలించేందుకు ప్రధాన కాల్వ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, అక్కడి నుంచి నీళ్లను ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించడానికి రెండు ప్రత్యామ్నాయాలు పరిశీలనలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మైలారం నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లను సుందిళ్ల బరాజ్‌కి తరలించి, అక్కడి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎత్తిపోయవచ్చని తెలిపారు. అయితే, ఇందుకు సొరంగం తవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మైలారం వద్ద పంప్‌హౌస్ నిర్మించి నేరుగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీళ్లను ఎత్తిపోయడం మరో ప్రత్యామ్నాయమని అధికారులు వెల్లడించారు. ఈ రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలించి తక్కువ ఖర్చయ్యే అలైన్‌మెంట్‌ను ఎంపిక చేయాలని మంత్రి ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్ పాల్గొన్నారు.

తుంగతుర్తికి దేవాదుల నీళ్లు: మంత్రి ఉత్తమ్

తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీరు అందించాలన్నదే కాంగ్రెస్ పార్టీ సంకల్పమని, అందుకు గాను రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో, ఆ తర్వాత విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ నీటిని రప్పించిన ఘనత దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిదేనన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆవిర్భావం

- 42% రిజర్వేషన్లకోసం నిరాహార దీక్షకు సిద్ధం: జస్టిస్ ఈశ్వరయ్య
- రాజకీయాలకు బీసీలు మోసపోతున్నారు: రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు
- సమితి ఆధ్వర్యంలో 24న ఇందిరాపార్క్ వద్ద సభ



బీసీలకే ఓటు వేస్తానని ప్రమాణం చేయిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య

పంజగుట్ట (హైదరాబాద్): బీసీలకు రిజర్వేషన్లు సాధించేందుకు 72 సంవత్సరాల వయసులో కూడా తాను నిరాహారదీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నానని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. బీసీల రిజర్వేషన్లు జీవోల వల్ల వచ్చేవి కావని, కేవలం కేంద్రంతో పోరాడి 9వ షెడ్యూల్‌లో పెట్టినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్, ప్రధానకార్యదర్శి అయిలి వెంకన్నగౌడ్, పలు బీసీ సంఘాల నాయకులు, మేధావులు కలిసి బీసీ 42 శాతం రిజర్వేషన్ సాధన సమితిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇతరులను నిందిస్తోందని, కాని తమ తప్పులు మాత్రం చెప్పడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రశ్నించాల్సిన సమయంలో ఒక్కసారి కూడా బీసీ రిజర్వేషన్ల అంశం ప్రస్తావించలేదని, ప్రధానిని ఎన్నోసార్లు ముఖ్యమంత్రి కలిసినా ఒక్కసారి కూడా రిజర్వేషన్ల గురించి అడగలేదని అన్నారు. తాను ఇప్పటివరకు అగ్రకులాల వారికి ఓటు వేయలేదని, బీసీ సమాజానికి తాను ద్రోహం చెయ్యనని, అదే తరహాలో అందరూ ప్రతిజ్ఞ చేయాలని పేర్కొన్నారు. బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు ఆడుతున్న రాజకీయ చదరంగంలో బీసీలు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ సాధన సమితి ప్రధాన డిమాండ్.. రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పొందుపర్చడమేనని అన్నారు. సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న ఇందిరా పార్క్ వద్ద సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. జనాభా ప్రకారం ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 10 శాతం, బీసీలు 52 శాతం రిజర్వేషన్లు సాధించినప్పుడు ప్రత్యేక తెలంగాణ ఏర్పడినదానికన్నా వందరెట్లు ఎక్కువ లాభం చేకూరుతుందని అన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధమతం స్వాభావికంగా ప్రజాస్వామ్యబద్ధమైనది.
స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ నిరాకరించకుండానే రక్షణ కల్పిస్తుంది.
– బి.ఆర్. అంబేడ్కర్
(అక్టోబర్ 14 అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన రోజు)

సాక్షి

మంగళవారం, 14 అక్టోబర్ 2025

బిహార్‌లో కొత్త ప్రయోగం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల పరుగు పందెంలో తనది ముందంజేనని పాలక పక్షమైన ఎన్డీయే నిరూపించుకుంది. ఆదివారం చర్చోపచర్చల తర్వాత జేడీ(యూ), బీజేపీలు చెరో 101 సీట్లకూ పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. భాగస్వామ్య పక్షాల్లో ప్రధానమైన లోక్ జనశక్తి పార్టీకి 29 స్థానాలీయగా, మాజీ ముఖ్యమంత్రి జితన్ రాం మాంఝీ నేతృత్వంలోని హిందూస్తానీ అవామీ పార్టీ (సెక్యులర్), ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)కు ఆరేసి సీట్ల చొప్పున కేటాయించారు. సర్దుబాటు వ్యవహారం గమనిస్తే బిహార్‌ను గత నాలుగు దశాబ్దాలుగా శాసిస్తున్న మండల్ రాజకీయాల ప్రభావం కొడిగట్టిందని బీజేపీతోపాటు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా భావిస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. వేర్వేరు కారణాలతో ఈసారి బిహార్ పతాక శీర్షికలకెక్కింది. హడావిడిగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు పూనుకోవటం వివాదాస్పదంగా మారింది. బీజేపీ వ్యతిరేక ఓటర్ల పేర్లు తొలగింపే దీని ఆంతర్యమని విపక్షాలు దుమ్మెత్తిపోశాయి. వచ్చే నెల 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగబోయే పోలింగ్ కూడా పెద్ద వార్తే. 2010లో ఆరు దశలలో పోలింగ్ జరిగిన ఆ రాష్ట్రంలో అది క్రమేపీ తగ్గుతూ వస్తోంది. క్రితంసారి దాన్ని మూడు దశలకు కుదిస్తే, ఈసారి రెండు దశలుగా మారింది. తొలి దశలో జరిగే 121 స్థానాల్లో అత్యధిక భాగం మధ్య బిహార్ లోనివి కాగా, కొన్ని ఉత్తరప్రదేశ్‌కు పొరుగునున్నాయి. రెండో దశలోని 122 స్థానాలూ నేపాల్ సరిహద్దుల్లోనూ, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల పొరుగున ఉన్నాయి.

ఎన్డీయే సీట్ల పంపకమే అందరినీ ఆశ్చర్యపరిచింది. తొలిసారి 1996 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తు కుదిరినప్పటినుంచీ జేడీ(యూ) తనకు రావాల్సిన సీట్ల సంఖ్యపై పట్టుదలతో ఉండేది. తమదే పెద్ద పార్టీ గనుక అత్యధిక స్థానాలుండాలని కోరేది. కానీ 2020 ఎన్నికల్లో ప్రజలు జేడీ(యూ)ను బాగా దెబ్బతీశారు. అప్పుడు పట్టుబట్టి బీజేపీ కన్నా ఒక్క సీటైనా తనకు అధికంగా ఉండాల్సిందేనని కోరి 122 స్థానాలు తీసుకున్న జేడీ(యూ), ఒప్పందం ప్రకారం తన వాటా నుంచి మరో భాగస్వామ్య పక్షమైన హిందూస్తానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం)కు 11 ఇచ్చింది. 111 చోట్ల పోటీ చేయగా తీరా గెల్చుకున్నవి 43 మాత్రమే. 121 స్థానాలు రాబట్టుకున్న బీజేపీ, వికాశ్ శీల్ ఇన్‌సాన్ పార్టీ(వీఐపీ)కి 11 కేటాయించింది. 110కి పోటీ చేసి 74 చోట్ల విజయం సాధించింది. అప్పుడు ఎన్డీయే నుంచి బయటకుపోయి 135 చోట్ల పోటీ చేసిన లోక్ జనశక్తి ఒక స్థానమే గెల్చుకున్నా 33 చోట్ల తమను దెబ్బతీయగలిగిందన్న బాధ జేడీ(యూ)ను పీడించింది. బీజేపీ లోపాయకారీ మద్దతు వల్లే ఇలా జరిగిందన్న అభిప్రాయం ఏర్పడింది. అందుకే సీఎంగా ఉన్నా మధ్యలోనే ఎన్డీయేకు గుడ్‌బై చెప్పి మహా కూటమి వైపు వెళ్లి సీఎం పదవిని పదిలం చేసుకున్నారు నితీశ్. కానీ అది కూడా ఎంతోకాలం సాగలేదు. తిరిగి ఎన్డీయే వైపు వచ్చారు.

బిహార్ రాజకీయాల్లో నితీశ్ శకం ముగిసిందనీ, తన ప్రాభవం మొదలైందనీ బీజేపీ విశ్వసిస్తోంది. తాజా సర్దుబాటులో 29 స్థానాలు పొందిన ఎల్‌జేపీ పూర్తిగా తన చెప్పుచేతల్లో ఉంటుంది గనుక ఈసారి సీఎం పదవి సునాయాసంగా రాగలదని భావిస్తోంది. క్రితం అసెంబ్లీ ఎన్నికలకు ముందు నితీశే తమ సీఎం అని చెప్పిన ఎన్డీయే ఇప్పుడు మౌనం వహించటాన్ని జేడీ(యూ) కూడా గమనించకపోలేదు. కానీ ఆ పార్టీకి వేరే గత్యంతరం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే జేడీ(యూ) కన్నా ఒక స్థానం అధికంగా డిమాండ్ చేసి సాధించుకున్న బీజేపీ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే సరళిని అనుసరిస్తుందని నితీశ్ ముందే గ్రహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీది పైచేయి అయితే అది నితీశ్‌కు మాత్రమే కాదు... మొత్తంగా మండల్ రాజకీయాలకే విఘాతం. ఎందుకంటే బీజేపీ అధికారం కైవసం చేసుకోవటమంటే విపక్ష ఆర్జేడీని కూడా వెనక్కి నెట్టినట్టే అవుతుంది. పైగా జాతీయ స్థాయిలో బీజేపీ బలం పుంజుకోవటానికి దోహదపడుతుంది. ఇంత కీలకమైన ఈ పోరులో తమ వైఖరి మారబోదని బిహార్ ఓటర్లు తేలుస్తారా... బీజేపీ కోరుకునే కొత్త దోవన పయనిస్తారా అన్నది వచ్చే నెల ఎన్నికల తర్వాత వెలువడబోయే ఫలితాలతో వెల్లడవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.అష్టమి సా.4.03 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** పునర్వసు సా.5.25 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.1.12 నుండి 2.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు తదుపరి రా.10.34 నుండి 11.23 వరకు, **అమృత ఘడియలు:** ప.3.11 నుండి 4.41 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

మనసు మాటే బతుకు బాట

విశ్వ గురు

తల్లితండ్రులను మనసారా గౌరవించి, ప్రశంసించాలని బెంట్లీ విద్యార్థులకు నేనిచ్చే మొదటి సలహా. కన్నవారు ప్రేమించినంతగా మనల్ని మరెవరూ ప్రేమించరు. మనల్ని పెంచి పెద్దచేసే క్రమంలో వారు కూడా తప్పులు చేసి ఉండవచ్చు. కానీ వారికి తెలిసినంతలో, ఉన్నంతలో మనల్ని తీర్చిదిద్దే కృషి చేశారని గుర్తించాలి. వారు మన కోసం ఎన్నో త్యాగాలు కూడా చేసి ఉంటారు. వాటిలో కొన్ని మనకు ఎప్పటికీ తెలియకపోవచ్చు.

అంతరాత్మకు వ్యతిరేకంగా పోతే...

జీవిత కాలం నిజంగానే చాలా చిన్నది. ఈ ప్రాథమిక సత్యాన్ని ఎన్నడూ మరచిపోకూడదు. మృత్యువు అనివార్యం కనుక మన జీవితాలను ఎలా గడపాలి? ఈ ప్రశ్నకు జవాబు విషయంలో యువకుడిగా ఉన్నప్పటి నుంచి నాకొక స్పష్టత ఉంది. అంతరాత్మ ప్రబోధం మేరకు నడుచుకోవాలి. ఇష్టమైన వ్యాపకాన్నే చేపట్టాలి. జీవితంలో ఏం చేయాలని కోరుకుంటున్నామో, దేన్ని ఎక్కువ అభిమానిస్తామో ఆ రంగంలోకే దిగాలి. నేను 19 ఏళ్ల వయసు నుంచి నా జీవితంలో అలాగే నడచుకునేందుకు ప్రయత్నించాను. కాలేజీ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి, హోల్ ఫుడ్స్ మార్కెట్ ప్రారంభించాలనే నిర్ణయం నా హృదయం నుంచే వచ్చింది. ఈ నిర్ణయం నా తల్లితండ్రులనూ, స్నేహితుల్లో చాలా మందినీ ఆశాభంగానికి గురిచేసింది. కానీ, నిస్సందేహంగా అది సరైన నిర్ణయమనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగాను.

హృదయం చెప్పినట్లు నడుచుకోవడంలో రెండు ముఖ్యమైన కోణాలున్నాయి. మొదట– మనల్ని మనం తెలుసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడే మనం నిజంగా అంతరాత్మ చెప్పినట్లు నడుచుకుంటున్నామా లేక ఎక్కడన్నా దారి తప్పామా అన్నది తెలుస్తుంది. మనం గాఢంగా ఇష్టపడే వ్యాపకాలను చేపడితే మనం రెట్టింపు శక్తితో పని చేస్తాం. సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. అది సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా, చేసే పనికి ఒక ప్రయోజనాన్ని కూడా చేకూరుస్తుంది.

> మనం గాఢంగా ఇష్టపడే వ్యాపకాలను చేపడితే మనం రెట్టింపు శక్తితో పనిచేస్తాం. సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. అది సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా, చేసే పనికి ఒక ప్రయోజనాన్ని కూడా చేకూరుస్తుంది.

అంతరాత్మ చెప్పినట్లు నడుచుకోవడం మానేస్తే దానికి వ్యతిరేక ఫలితాలు సంభవిస్తాయి. శక్తి సన్నగిల్లుతుంది. సృజన కొరవడుతుంది. చేసే పనికి ఒక పరమార్థం అంటూ ఉండదు. ముఖ్యంగా సంతోషం కూడా లోపిస్తుంది. ఒక దిశ, దశ లోపించాయని అనిపించినపుడు మరో దాన్ని ఎంచుకోండి. కొన ఊపిరి ఉన్నంత వరకు ఏదీ చేజారిపోయినట్లు కాదు. దేనికీ కాలం మించిపోయినట్లు కాదు.

హృదయం చెప్పిన మార్గంలో నడిచేందుకు మరొకటి అవసరం పడుతుంది. అది భయాన్ని జయించడం! జీవితానికి ఒక పూర్తి సార్థకత చేకూర్చుకోకుండా చాలా మందికి అడ్డుపడేది భయమే! చేపట్టే పనిలో విఫలమవుతామేమోననే భయం. ఆత్మీయులు మనం ఇష్టపడుతున్న రంగాన్ని తిరస్కరిస్తారేమోనని భయం. సక్రమంగా నిర్వహించగలమో, లేదోనని మనకే ఒక సందేహం. మనలో రేకెత్తే భయాన్ని బయటివారు ఎవరూ పోగొట్టలేరు. దాన్ని మనకు మనమే తొలగించుకోవాలి. భయం మన మనసు సృష్టించే ఒక బూచి. అది బయటిది కాదు. లోపలి నుంచి పుట్టుకొచ్చేది. పుడుతున్న చోటనే దాన్ని అంతం చేయాలి.



గొలుసుకట్టు సరుకుల దుకాణాల సంస్థ ‘హోల్ ఫుడ్స్ మార్కెట్’ సహ వ్యవస్థాపకునిగా, దాని మాజీ సీఈఓగా **జాన్ మెకే** ప్రఖ్యాతి వహించారు. ఈ అమెరికన్ 44 ఏళ్ళ పాటు శ్రమించి దాన్నొక బహుళ జాతి సంస్థగా వృద్ధిలోకి తెచ్చారు. 2022లో అందులోంచి రిటైరయ్యాక ‘లవ్ లైఫ్’ పేరుతో ఆరోగ్య, స్వస్థతా వ్యాపారాన్ని ప్రారంభించారు. బెంట్లీ కాలేజ్ పట్టభద్రులను ఉద్దేశించి మెకే చేసిన ప్రసంగ సంక్షిప్త పాఠం:

ప్రేమే జీవిత మూలసూత్రం

మన జీవితాల్లో ప్రేమను పెంచి పోషించుకోవడాన్ని ఒక మూలసూత్రంగా అనుసరించాలి. ఇక్కడ ప్రేమ అంటే స్త్రీ పురుషుల మధ్య లైంగికతకు సంబంధించినది కాదు. నేను చెప్పే ప్రేమ ఎదుటివారి పట్ల దయతో వ్యవహరించడానికి చెందినది. ఎదుటివారు మంచిపని చేస్తే నిండు మనసుతో అభినందించగలగాలి. తోటివారిని ప్రేమించడం వల్ల మన జీవితాలు సుసంపన్నమవుతాయి. ప్రేమతో మెలిగేందుకు మరో మూడు సుగుణాలు అవసరమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

మొదటిది – కృతజ్ఞత చూపడం! బతికున్నంత కాలం మనం ధన్యవాదాలు తెలుపవలసిన సందర్భాలు అనేకం ఎదురవుతూంటాయి. ప్రతి రోజూ ఉదయం పూట కొద్ది నిమిషాలు మనకు మేలు చేసినవారిని, మనల్ని సంతోషపరచినవారిని గుర్తు చేసుకోవాలి. అవకాశం రాగానే వారికి కృతజ్ఞత తెలియచేయాలి. వృత్తి ఉద్యోగాలలోనూ సంతోషపెట్టే పనులు చేసిన తోటి సిబ్బందిని అభినందించాలి. అది సంస్థ పనితీరు మెరుగుపడేందుకూ, మరిన్ని సత్ఫలితాలు సాధించేందుకూ నిస్సందేహంగా తోడ్పడుతుంది.

రెండవది – క్షమాగుణం! అరకొర అవగాహనతో, అపోహలతో ఎదుటివారి పట్ల ఒక నిర్ణయానికి వచ్చేస్తూంటాం. వారిపట్ల మనసులో అక్కసు పెంచుకుంటాం. మన బాధలకు వారే కారణం అనుకుంటాం. మన జీవితాల్లో ప్రేమ పొంగి పొరలకుండా అడ్డుకునేది అలా పొరపాటు అభిప్రాయాలను ఏర్పరచుకోవడమే! దానివల్ల మనకు మనమే ఎంత హాని చేసుకుంటున్నామో పూర్తిగా గుర్తెరగం. అది తెలిస్తే అటువంటి అలవాటు మానుకుంటాం.

మనం చేసిందే ఒప్పు అని, ఎదుటివారిది తప్పు అని మనసులో బలంగా ఉండటం వల్ల క్షమించలేం. ఎదుటివారు తప్పు చేయడం వల్లనే మనం క్షమించవలసి వచ్చిందనే అభిప్రాయం కూడా మనకు తరచు కలుగుతూ ఉంటుంది. కానీ, క్షమించడమంటే అసంతృప్తినీ, కోపాన్నీ మన మనసు నుంచి పారదోలడమే! అంతేకానీ, మన విలువలను, నైతిక సూత్రాలను వదులుకుంటున్నట్లు కాదు. క్షమించడం వల్ల మనం గతం నుంచి విముక్తులమవుతాం. వర్తమానంలో ప్రేమను ఆస్వాదించగలుగుతాం.

మూడవది – ఉదారత! దీన్ని చాలా మంది డబ్బు ఇవ్వడమే అనుకుంటారు. ఎదుటివారికి మన సమయాన్ని వెచ్చించి, సేవలందించడం కూడా ఉదారత చూపడమే. అవి మనం వారికిచ్చే కానుకలు. మనం దేన్నో త్యాగం చేస్తున్నామనుకోవడం, మన ప్రయోజనాలను పక్కనపెట్టి వారికి సేవ చేస్తున్నామనుకోవడం నిజమైన ఉదారత అనిపించుకోదు. వారి లాభం మనకు నష్టం అనే భావన రాకూడదు. ఉదారత అంటే మన హృదయం నుంచి ప్రవహించే ప్రేమకు పొడిగింపు మాత్రమే!

> ఎదుటివారిదే తప్పు అని మనసులో బలంగా ఉండటం వల్ల క్షమించలేం. కానీ, క్షమించడమంటే అసంతృప్తినీ, కోపాన్నీ మన మనసులోంచి పారదోలడమే! క్షమించడం వల్ల గతం నుంచి విముక్తులమవుతాం.

ఆశాభంగపు పాఠాలు

జీవితంలో ఆశాభంగాలు, అన్యాయాలు చాలా ఎదురవుతాయి. మనకు ఎదురయ్యే కష్టాలు, సవాళ్ళలో చాలా వాటిని మనం వృద్ధి చెందడానికి తోడ్పడే అవకాశాలుగా చూడటం నేర్చుకోవాలి. గతంలో చూడని నెలవులను మించి కొత్తవాటిలోకి ప్రవేశించేందుకు సహాయపడగల పాఠాలనుకోవాలి. పరిస్థితుల ప్రాబల్యం లేదా ఇతరుల వల్ల నష్టపోయిన వ్యక్తిగా మనల్ని మనం చూసుకోవడం వల్ల ఉపయోగం ఉండదని గ్రహించాలి. మనల్ని చూసి ఎదుటివారు జాలి పడాలనుకోవడం కన్నా, మన మీద మనం జాలిపడటం కన్నా పెను విధ్వంసక భావావేశం మరొకటి లేదు. దాన్ని కనుక నిర్మూలించకపోతే – నిస్సహాయులం, నిర్వీర్యులం అయిపోతాం. హృదయం చెప్పినట్లు నడుచుకోలేం. జీవితం నేర్పాలనుకుంటున్న పాఠాలను అర్థం చేసుకునేందుకు నిపుణుల సలహాలు తీసుకోవడం, ధ్యానం వంటివాటిని ఆశ్రయించవచ్చు. ◆

అణుశక్తితోనే ‘వికసిత్ భారత్’

‘వికసిత్ భారత్’ అనేది 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే ఒక విజన్. ఇది భారత స్వాతంత్ర్యానికి శత వసంతాలు పూర్తయ్యేనాటికి సాధించాల్సిన లక్ష్యం. ఆర్థిక పురోగతీ, సామాజిక అభివృద్ధీ, పర్యావరణ సమతౌల్యం, సుపరిపాలన – ఇవన్నీ ఈ లక్ష్య సాధనలో కీలకాంశాలు. అలాగే భద్రమైన, స్వచ్ఛమైన, సుస్థిరమైన శక్తి ఉత్పాదన అందుబాటులో ఉండటం, అభివృద్ధి అనేవి అవసరమవుతాయి.

ఈ నేపథ్యంలో అణు ఇంధన వనరులను శోధించి, సమర్థంగా వినియోగించడం ముఖ్యం. అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు 24 గంటలూ నిరంతరాయంగా పని చేయగలవు. ఇది పరిశ్రమలకూ, మౌలిక వసతుల అభివృద్ధికీ, ఆర్థిక స్థిరత్వానికీ కీలకమైన ‘బేస్ లోడ్ పవర్’ (కనీస అవసరాలను తీర్చగలిగినంత స్థాయిలో విద్యుత్)ని అందిస్తుంది. భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే, ఇంధన సరఫరా స్థిరంగా ఉండాలి. బొగ్గు, చమురు, సహజవాయువు వంటి శిలాజ ఇంధనాలపై ఆధార పడటం కాలుష్యాన్ని పెంచుతుంది. విదేశీ మారక ద్రవ్యాన్ని వృథా చేస్తుంది. అంతేకాకుండా, ఈ వనరుల ధరలు అంతర్జాతీయ మార్కె ట్‌లలో మార్పులకు గురవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొన్న ప్పుడు... అణు శక్తి స్వచ్ఛమైన, స్థిరమైన విద్యుత్‌గా అవతరిస్తుంది.

భారతదేశం ప్యారిస్ ఒప్పందం కింద 2070 నాటికి ‘నెట్–జీరో’ (మానవుని కార్యకలాపాల వల్ల ఉత్పత్తయ్యే ప్రమాదకర ఉద్గారాలను సహజంగానే ప్రకృతి తొలగించగల స్థాయిలో ఉండే స్థితి) లక్ష్యాన్ని సాధించాలనుకుంటోంది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పా దన పెరుగుతున్నప్పటికీ... సూర్యుడు, గాలి వంటి వనరుల మీద ఇది ఆధారపడినందున నిరంతర విద్యుత్తు సరఫరా సాధ్యం కాదు. అణు విద్యుత్ కేంద్రాలు అలా కాక అవి నిరంతరం పని చేస్తూ విద్యుత్తును ఉత్పత్తి చేయగలవు. అవి వాతావరణానికి చేటుతెచ్చే ఉద్గారాలను (గ్రీన్‌హౌస్ వాయువులు) విడుదల చేయవు. అందువల్ల, అణు విద్యుత్ శుభ్రమైన శక్తి (క్లీన్ ఎనర్జీ) వనరుగా నిలుస్తోంది. కొత్త అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భారతదేశం బొగ్గు ఆధారిత ప్లాంట్లపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, వాతావరణ మార్పు నియంత్రణ లక్ష్యాలను చేరుకోగలదు.

భారతదేశం అణుశక్తి ఉత్పాదనా రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. అయితే ప్రాజెక్టులకు భారీ మూలధనం అవసరమవుతుంది. అలాగే దీర్ఘకాల ప్రణాళికతోనే వీటి నిర్మాణం సాధ్యమవుతుంది. అమెరికా, ఫ్రాన్స్, రష్యా వంటి అణు శక్తి దేశాలతో ఇండియా సాంకేతిక సహకారం కొనసాగిస్తోంది. ఈ భాగస్వామ్యాలు కొత్త తరం పరమాణు రియాక్టర్ల (స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్ –ఎస్ఎమ్ఆర్) రూపకల్పనలో సహకరిస్తున్నాయి. ఇవి తక్కువ ఖర్చుతో, ఎక్కువ భద్రత కలిగి సులభంగా విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని సుసాధ్యం చేయగలవు. అణుశక్తిపై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించడానికి ప్రభుత్వాలు భద్రతా ప్రమాణాలపై ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– వై. శ్రీనివాస్; అణుశక్తి శాఖలో ‘జీ’ గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ (రేడియేషన్ సేఫ్టీ)– రిటైర్డ్

సోషల్ టాక్

అప్పుడే చెప్పొద్దు



ఒకసారి సినిమాకు సంతకం చేశాక, ఇక నేను దాని గురించి ఎక్కడా మాట్లాడను. ఎందుకంటే, సంతకం చేసినప్పటి నుండి షూటింగ్ మొదలై ముగిసేవరకు, ఏదైనా జరగవచ్చు. ఇది మూఢనమ్మకం కాదు. పూర్తయ్యే వరకూ ఏదీ ప్రారంభం అయినట్లు కాదని నా నమ్మకం. – దిల్జీత్ దొసాంఝ్, నట–గాయకుడు

పోటీ లేకనేం?!



పండిట్ రవిశంకర్ కూతుర్ని కావటం నాకు అంత ఒత్తిడిని కలిగించలేదు. ఆయన అత్యంత ప్రసిద్ధులైన భారతీయ సంగీతకారుడు కాబట్టి, సంగీతంలో నన్నంతా ఆయన వారసురాలిగానే చూస్తారు. కానీ నాకు పోటీగా నా తండ్రి తీర్చిదిద్దిన శిష్యులు ఎంతోమంది ఉన్నారు.

– అనౌష్కా శంకర్, సితార్ విద్వాంసురాలు

రాజీ పడవద్దు!



‘మేడ్ ఇన్ ఇండియా’ను నాణ్యతకు పర్యాయపదంగా మార్చాల్సి ఉంది. దక్షిణ కొరియా, జర్మనీ ఇప్పుడు తమ ఉన్నత ప్రమాణాలకు గుర్తింపు పొందుతున్నట్లే భారత్ కూడా ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే మన్నిక ఇవ్వటంలో మనం రాజీ పడకూడదు.

– వేణూ శ్రీనివాసన్, ‘టీవీఎస్’ గౌరవ ఛైర్మన్

అలా ఉండదు!



నాకు సినిమాల్లో చేయాలని ఉండేది. ముంబై వచ్చాను. సినిమా పరిశ్రమ అనేది తెల్లటి భవనంలా ఉంటుందనీ, అక్కడ నిర్మాతలు వేర్వేరు గదుల్లో కూర్చొని ఉంటారనీ, మనం వాళ్లను కలవవచ్చనీ, వాళ్లు మనల్ని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారనీ ఊహించుకున్నా.

– ఇంతియాజ్ అలీ, చిత్ర దర్శకుడు

శాకాహారం



నేను, నా భర్త షాహిద్ శాకాహారులం. మద్యం సేవించము. నేను కనీసం గుడ్డు కూడా తినను. రెస్టారెంట్ వ్యాపారంలోకి మంచి లాభాల కోసం ఇన్వెస్ట్ చేయటానికి నాకు అవకాశం వచ్చినప్పటికీ నేను కాదన్నాను. మనకు ఒక నియమం ఉన్నప్పుడు ఏ రూపంలోనూ దానిని తప్పకూడదు.

– మీరా రాజ్‌పుత్ కపూర్, ఇంటర్నెట్ పర్సనాలిటీ

తెలిసినవాళ్లు



నాకు అత్యంత విలువైన సంపద ఏమిటంటే – లిఫ్ట్‌లో ఎదురుపడిన అపరిచితులు, లేదా నా పొరుగువారు.. “ష్రాఫ్! నిజంగా నువ్వు చాలా బాగా నటించావు” అని చెప్పటం. అలాగే, “ష్రాఫ్‌జీ! మాకు మీలా ఉండాలని ఉంటుంది” అని చెప్పే చిన్న చిన్న అభిమానులు.

– జాకీ ష్రాఫ్, నటుడు

బహుముఖీన ప్రతిభ

ఇన్ బాక్స్

సుమారు 85 సంవత్సరాల కిందటి సంఘటన. అప్పుడు గాంధీజీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. అశేష ప్రజానీకం ఆయనను చూడటానికి వచ్చింది. అలా తల్లితో పాటు వచ్చిన ఒక బాలిక తల్లి చేతిని వదిలించుకుని, బ్యారికేడ్ల కిందినుంచీ మహాత్మా గాంధీ దగ్గరికి చేరుకుంది. తన వేలికున్న బంగారు ఉంగరాన్ని ఆయనకు ఇచ్చేసింది. ఉంగరాన్ని ఇస్తూ ‘కస్తూర్బా ఫండ్ కోసం’ అని చెప్పింది. నవ్వుతూ ఆ ఉంగరాన్ని తీసుకుంటూ, ఆ చిన్నారి తలపై నిమిరాడు మహాత్ముడు.



తురగా జానకీరాణి

అలా చిన్నప్పుడే చొరవనూ, సేవాస్ఫూర్తినీ ప్రదర్శించిన ఆ చిన్నారే అనంతర కాలంలో ‘రేడియో అక్కయ్య’గా ప్రసిద్ధురాలైన బహుముఖ ప్రతిభామూర్తి తురగా జానకీరాణి. నృత్య, సంగీత, సాహిత్య, ప్రసార, సంఘసేవా రంగాల్లో తనదైన పేరుపొందారు ఆమె.


కృష్ణాజిల్లా కోడూరు మండలం మందపాకల గ్రామంలో 1936 ఆగస్టు 31న జన్మించిన జానకీరాణి అనేక కథలతో పాటు పాటలు, రూపకాలు, నాటకాలు రాశారు. ‘సుభాషిణి’ మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. ఆంగ్లంలో ‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ దినపత్రికకు తొమ్మిదేళ్ళు ‘టీవీ టాక్’ కాలం రాశారు. ఆమె రాసిన ‘మా తాతయ్య చలం’ తదితర గ్రంథాలు పాఠక నీరాజనం అందుకున్నాయి. ఆమె కథలు తమిళం, బెంగాలీ, కన్నడ, మరాఠీ, ఒరియా, ఇంగ్లీషు, హిందీ భాషలలోకి తర్జుమా అయ్యాయి. మూడు నవలలు, ముప్పైకి పైగా బాలసాహిత్య గ్రంథాలు ప్రచురితమయ్యాయి. మూడు అనువాద రచనలను కూడా వెలువరించారు. పదహారు రేడియో నాటికలు, ఆరు పిల్లల నాటికలను పుస్తకాలుగా ప్రచురించారు.

తొలి రోజుల్లో కేంద్ర సాంఘిక సంక్షేమ మండలిలో సంక్షేమ అధికారిగా ఉద్యోగం చేశారు జానకీరాణి. 1975లో ఆకాశవాణిలో ప్రొడ్యూసర్‌గా చేరారు. ఆకాశవాణి సహాయ సంచాలకురాలిగా 1994లో ఉద్యోగ విరమణ చేశారు. ఆబాలగోపాలం కోసం ఆమె రూపొందించిన కార్యక్రమాల సంఖ్య పన్నెండు వేల పైమాటే! ఆమె రూపొందించిన ‘ఈ దేశం ఒక హిమాలయం’ జాతీయ స్థాయి నాటకంగా పద్నాలుగు భాషలలో ప్రసారమైంది.

నాట్య కళాకారిణిగా స్వయంగా తాను నర్తించడమే కాకుండా రంగస్థలంపై అనేక నృత్యాలకు దర్శకత్వం వహించారు. ఆచార్య సి.నారాయణరెడ్డి ‘గోకుల విహారం’, ‘వెన్నెలవాడ’ సంగీత రూపకాలకు దర్శకత్వం వహించారు. ఎన్నో సత్కారాలు, గౌరవాలు పొందారు. 2014 అక్టోబరు 15న తుది శ్వాస విడిచిన ఆమె పేరు తెలుగు నాట చిరస్థాయిగా ఉంటుంది.

– డా॥ రాయారావు సూర్యప్రకాశ్ రావు
(‘రేడియో అక్కయ్య’ తురగా జానకీరాణి వర్ధంతి రేపు)

డేటా పాయింట్



శ్రీకృష్ణుని శివదీక్ష

జ్యోతిర్మయం

శ్రీకృష్ణుడూ దేవుడే! పరమశివుడూ దేవుడే! ఇద్దరూ ఘటనాఘటన సమర్థులే! హరిహరులకు భేదం లేదు. ఎవరి ఇష్ట దైవాన్ని వారు పూజించుకుంటూ ఉంటారు. అయితే భక్తులకు వరాలివ్వగల కృష్ణ పరమాత్మ తానే వరం కోరి శివుని గురించి ఉగ్ర తపస్సు చేయటం విశేషం.

కృష్ణుని అష్ట మహిషులలో రుక్మిణి మొదలైన వారికి ప్రద్యుమ్నాదులు జన్మించారు. కానీ, జాంబవతికి సంతానం కలగలేదు. ఆమె దీనంగా కృష్ణుని ప్రార్థిస్తే, కృష్ణుడు పుత్రుని కోసం ఆరునెలలు పాశుపత దీక్షను స్వీకరించి, తీవ్ర తపస్సు చేశాడు. మొదటి నెల రోజులు పళ్ళు భుజించి కృష్ణుడు శివ మంత్రాన్ని పఠించాడు. రెండవ నెలలో జలమే ఆహారంగా ఒంటి కాలి మీద నిలిచి తపస్సు చేశాడు. మూడవ నెలలో వాయుభక్షణ మాత్రమే చేస్తూ, కాలి బొటన వేలు మీద నిలబడి తపస్సు చేశాడు. అలా ఆరునెలలు నిష్ఠగా చేశాక శివుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు.

అప్పుడు కృష్ణుడు, ‘సంసారంలో బందీనైపోయాను. మాయా పాశాలలో చిక్కుకుపోయాను. నా ఈ తపస్సుకు కూడా ఈ సంసారమే కారణం. పుత్రార్థినై జాంబవతి కోసం సకామంగా తపస్సు చేశాను. మోక్ష ప్రదుడవైన నిన్ను ప్రసన్నుని చేసుకుని ముక్తి నిమ్మని కోరాలి కానీ లౌకికము, అశాశ్వతము అయిన కోరిక కోరుతున్నాను’ అంటాడు. శివుడు ‘నీకు చాలా మంది పుత్రులు కలుగుతారు. గృహస్థాశ్రమంలో చిరకాలం ఉంటావు. గాంధారి శాపం వల్ల, బ్రాహ్మణ శాపం వల్ల నీ వంశం అంతరిస్తుంది. ఇది ఇలాగే జరగవలసి ఉంది’ అని అంటాడు.

ఆకలి, నిద్ర, భయం, శోకం, హర్షం, మరణం ఇవన్నీ మానవ దేహం ధరించిన వారికి తప్పవు. మానుష జన్మలో మానుష లక్షణాలే ఉంటాయి. మాయాశక్తి సర్వులనూ ప్రేరేపిస్తుంది. స్వతంత్రురాలు ఆ జగదీశ్వరి మాత్రమే అని వ్యాసుడు దేవీ మహాత్మ్యాన్ని దేవీ భాగవతంలో చెపుతాడు. ఆ దేవిని నిరంతరం ధ్యానించటం ద్వారా లౌకిక సుఖాల పట్ల కొంతైనా విరక్తి సాధించవచ్చునంటారు పెద్దలు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

మహిళలకు 'ఉపాధి' భరోసా

సాక్షి, హైదరాబాద్: మహిళాశక్తి–ఉపాధి భరోసాలో భాగంగా స్వయం సహాయక బృందాలు–నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) సమన్వయంతో పనులు చేపట్టాలని అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. ఇందులో భాగంగా పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం, పాకల నిర్మాణం, బయోగ్యాస్ ప్లాంట్‌ల నిర్మాణం, నాడెప్, వర్మీ కంపోస్ట్ పిట్‌ల నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు, ఉపాధిహామీ 31 జిల్లాల కార్యక్రమ సమన్వయకర్తలు, అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీవోలు, సీఈవో లు, ఇతర అధికారులకు సూచించింది. ఈ ఏడాది అవసరమైన పనుల విలువ లేబర్ బడ్జెట్‌కు 200 శాతం పెంచాలని స్పష్టంచేసింది. అన్ని మిషన్ వాటర్ కన్జర్వేషన్ (ఎండబ్ల్యూసీ) మండలా ల్లో సహజ వనరులకు సంబంధించిన పనులు 65 శాతం, వ్యవసాయ సంబంధితపనులు 60 శాతం మించి ప నులు, వ్యక్తిగత పనులు 60 శాతానికి మించి గుర్తించాలని తెలిపింది. మహా త్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో 2026– 27 ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్‌కు సరిపడా పనుల గుర్తింపు, ప్రణా ళికా తయారీకి సంబంధించి సోమ వారం పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ జి.సృజన అదనపు మార్గదర్శకాలను జారీచేశారు.

నిండా ముంచిన వాన


మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో ఉప్పొంగి ప్రవహిస్తున్న బూర్కపల్లి వాగు


జనగామ మార్కెట్ యార్డులో ధాన్యం రాశుల మధ్య నిలిచిన వరద నీరు

- వర్ష బీభత్సానికి నీట మునిగిన వరి, పత్తి చేలు
- పలుచోట్ల తడిసిన ధాన్యం, మక్కలు
- వరంగల్, యాదాద్రి, భద్రాద్రి జిల్లాల్లో రైతన్న కడగండ్లు

సాక్షి, వరంగల్ నెట్‌వర్క్/యాదాద్రి/భద్రాద్రి కొత్తగూడెం/చౌటుప్పల్ రూరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు యాదాద్రి, భద్రాద్రి జిల్లాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో పంటలు నీటమునిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, ఎనుమాముల మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వేలాది బస్తాల ధాన్యం తడిసిపోయింది. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలంలో మిర్చితోటల్లోకి వర్షం నీరు చేరింది. నెక్కొండ మండలం చంద్రుగొండలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి చెందాయి. మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లలో ఆరబెట్టిన మక్కలు, బయ్యారం, గూడూరు మండలాల్లో రోడ్లవెంట, చెలకల వద్ద ఆరబోసిన మక్కలు తడిసిపోయాయి. మరిపెడ, కురవి, కేసముద్రం, గూడూరు, దంతాలపల్లి మండలాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. మహబూబాబాద్ పట్టణ సమీపంతో పాటు దోర్నకల్‌లో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏజెన్సీలోని కొత్తగూడలో వాగులు ఉరకలేస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గార్ల సమీపంలో పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కురవి, సీరోలు మండలాల్లోనూ వాగులు, వంకల ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా కటాక్షపూర్ చెరువు మత్తడి జాతీయ రహదారి 163పైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో వర్షానికి తడిసిన పత్తి

యాదాద్రి, భద్రాద్రి జిల్లాల్లోనూ బీభత్సం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండలో అత్యధికంగా 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తి, వరి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. సుమారు 500 ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. పలు మార్కెట్ యార్డుల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. ఆయా మండలాల్లో వాగులు ఉధృతంగా పారుతున్నాయి. నక్కలగూడెంలో కోళ్ల ఫారంలోకి భారీగా వరద నీరు చేరి.. 6వేల బ్రాయిలర్ కోళ్లు మృతి చెందాయి. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో మొదలైన వాన సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. ఈ వానతో వాగులు నిండి లోలెవల్ చప్టాలపైకి వరద చేరడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తి గరిష్ట స్థాయికి చేరడంతో.. ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు కూడా భారీగా వరద రావడంతో 25 గేట్లకు 11 ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. పలుచోట్ల పత్తి చేన్లలో నీరు చేరగా, వరి పొలాలు కూడా దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది.

వెంకటమాధవి హత్య కేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

మీర్‌పేట: రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో సంచలనం సృష్టించిన వెంకటమాధవి హత్య కేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. జిల్లెలగూడలోని న్యూవెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి ఈఏడాది జనవరి 14న తన భార్య మాధవిని అతికిరాతకంగా హతమార్చాడు. ఆధారాలు దొరక్కుండా మృతదేహాన్ని ముక్కలు చేసి, ఉడికించి, పొడి చేసి డ్రైనేజీలో పారబోసిన ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి త్వరితగతిన తీర్పును వెలువరించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేశారు.

మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత



మొయినాబాద్/సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) మేనేజింగ్ డైరెక్టర్ కొండా లక్ష్మారెడ్డి (84) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం ఉదయం 5.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారానికి చెందిన ఆయన ఉమ్మడి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కొండా వెంకటరంగారెడ్డికి మనవడు. 1983లో చేవెళ్ల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జర్నలిజంపై మక్కువతో 1980లో న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) వార్తా సంస్థను ప్రారంభించారు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన మృతితో పెద్దమంగళారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఎం, మంత్రుల సంతాపం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ న్యూస్ ఏజెన్సీ స్థాపకుడిగా, శాసనసభ్యుడిగా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.ం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారుం . అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో లక్ష్మారెడ్డి మృతిపై సంతాపం తెలిపారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- ఇందిరమ్మ ఇల్లు కోసం పలుమార్లు దరఖాస్తు


బ్లేడుతో కోసుకోవడంతో గాయపడిన గంగమణి

నిర్మల్ చైన్‌గేట్: ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఓ మహిళ నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం ఆత్మహత్యాయత్నం చేసింది. భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన గంగమణి ఉదయం ప్రజావాణి కోసం కలెక్టరేట్‌కు వచ్చింది. ఇందిరమ్మ ఇల్లు బిల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. గతంలో కూడా పలుమార్లు ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకుంది. ఇటీవల ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో గంగమణి పేరు లేకపోయినా.. ఖాళీ జాగాలో ఇంటి నిర్మాణం ప్రారంభించింది. కానీ జియోట్యాగింగ్ కాకపోవడంతో తనకు బిల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు పెడుతోంది. సాయంత్రం వరకు కలెక్టరేట్‌లోనే ఉన్న మహిళ సాయంత్రం భవనం పైకెక్కి దూకుతానని హడావుడి చేసింది. ఏడు నెలలుగా సమస్యపై కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయింది. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకొని మహిళతో ఫోన్లో మాట్లాడగా, కలెక్టర్ స్పష్టమైన హామీ ఇస్తేనే తాను కిందికి దిగుతానని చెప్పింది. దీంతో పోలీసులు జిల్లా అధికారులను సంప్రదించి కలెక్టర్ ఛాంబర్‌లోకి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆమె వివరాలను అడుగుతుండగానే మరోసారి గంగమణి తన వద్ద ఉన్న బ్లేడుతో చేయి కోసుకుంది. కలెక్టర్ సూచనలతో వైద్య సిబ్బంది అక్కడికి వచ్చి గంగమణికి చికిత్స చేశారు.

ఈ చదువు చదవలేకపోతున్నా

- సూసైడ్ నోట్ రాసి ఇంటర్ గురుకులం విద్యార్థిని ఆత్మహత్య
- మహబూబ్‌నగర్ జిల్లా రంగారెడ్డిగూడలో ఘటన


ప్రియాంక

మహబూబ్‌నగర్ క్రైం: 'ఈ చదువు నేను చదవలేకపోతున్నాను..ఇక్కడ ఉండటం ఇష్టం లేదు.. కనీసం తల్లిదండ్రులకు నచ్చని నష్టజాతకురాలిని నేను'అంటూ సూసైడ్ నోట్ రాసి ఓ ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడింది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన నగేష్, పద్మమ్మ దంపతుల కుమార్తె ప్రియాంక (17) మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని రాంరెడ్డిగూడ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో బాత్‌రూంలోని కిటికీకి ఉరి వేసుకున్న ప్రియాంకను గమనించిన తోటి విద్యార్థులు హాస్టల్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రియాంక మధ్యరాత్రి లేదా తెల్లవారుజాము సమయంలో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అయితే గ్రామంలో ఓ యువకుడు కొన్ని రోజులుగా ప్రేమిస్తున్నానని చెప్పి ప్రేమలేఖలు రాయడం వల్లే తన కూతురు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని బాలిక తండ్రి నగేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. కాగా, మూడు రోజుల క్రితం ప్రియాంక తండ్రికి ఫోన్ చేసి.. ఇక్కడ ఉండాలనిపించడం లేదు.. ఇంటికి వస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో తండ్రి అక్కడే ఉండాలని చెప్పడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. జనరల్ ఆస్పత్రిలో ఉన్న ప్రియాంక మృతదేహన్ని కలెక్టర్ విజయేందిర పరిశీలించి తల్లిదండ్రులను పరామర్శించారు.

సెల్‌ఫోన్లో చిత్రీకరిస్తూ బాలికపై లైంగికదాడి

సోషల్ మీడియాలో వైరల్.. ఇద్దరు అరెస్టు

కొత్తపల్లి (కరీంనగర్): బాలికపై అత్యాచారం చేస్తూ.. సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఆపై వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదైంది. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఇద్దరు యువకులు ప్రేమపేరుతో నమ్మించారు. ఓ రోజు గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. దారుణాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తేరుకున్న బాలిక బంధువులు, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ నేతృత్వంలో రంగంలోకి దిగిన కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ యువకులు విశ్వతేజ (19), సన్నీ (21)లను అరెస్టు చేసి పోక్సో కింద కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

499 కిలోల గంజాయి పట్టివేత

- రూ. 2.50 కోట్ల విలువైన సరుకు ఏపీ నుంచి జైపూర్‌కు తరలిస్తుండగా భద్రాద్రి జిల్లాలో స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయి వద్ద ఎస్పీ, పోలీస్ అధికారులు

సుజాతనగర్: ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక అటవీ ప్రాంతంలో కొనుగోలు చేసి రాజస్థాన్‌లోని జైపూర్‌కు తరలిస్తున్న 499 కిలోల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సరుకు విలువ రూ.2.50 కోట్లు ఉంటుందని ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇద్దరు కంటైనర్‌లో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు సుజాతనగర్ ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కంటైనర్‌లో రవాణా చేస్తున్న 96 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్ యజమాని సంజుకుమార్, మహారాష్ట్రకు చెందిన జగదీష్ దయారాంను అరెస్ట్ చేశామని, వీరితో సంబంధం ఉన్న అమిత్ రోహిదాస్ పాటిల్ (మహారాష్ట్ర), హరి (ఒడిశా) పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. అరెస్టైన ఇద్దరిపై గతంలో కూడా పాడేరు, ఔరద్ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని చెప్పారు. కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 59 మంది నుంచి రూ.25.85 కోట్ల విలువైన 52 క్వింటాళ్ల గంజాయి పట్టుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు చేసిన శాంతి ఒప్పంద పత్రాన్ని చూపుతున్న ట్రంప్

సంక్లిష్ట వ్యవహారమిది

- గాజా శాంతి ఒప్పందంపై సంతకం తర్వాత ట్రంప్ వ్యాఖ్య
- ఎన్నో నిబంధనలు, షరతులు పొందుపరిచామని వెల్లడి
- ఈజిప్ట్ వేదికగా ముగిసిన శాంతి శిఖరాగ్ర సదస్సు

షర్మ్ ఎల్ షేక్(ఈజిప్ట్): గాజాలో శాంతి వీచికలు మొదలయ్యాక ఆ శాంతిని శాశ్వతంగా సుస్థిరం చేసేందుకు మొదలైన ప్రయత్నాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలుచేశారు. ఈజిప్ట్‌లోని సినాయ్ ద్వీపకల్పంలోని షర్మ్ ఎల్ షేక్ నగరంలో పలువురు యూరప్ దేశాలు, పశ్చిమాసియా దేశాల అగ్రనేతల సమక్షంలో శాంతి శిఖరాగ్ర సదస్సులో గాజా కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ సంతకంచేశారు. ఆయనతోపాటు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్ సిసీ, ఖతార్ అమీర్ తమీమ్ బిన్ హమాద్ అల్ థానీ, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అగ్రనేతల సమక్షంలో మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ''ఇది చరిత్రాత్మకమైన ఒప్పందం. కోట్లాది మంది ప్రజల ప్రార్థనలు నెరవేరాయి. మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, ఈజిప్ట్, తుర్కియేలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మధ్యవర్తిత్వం విషయంలో ఈజిప్ట్ అధ్యక్షుడు ఎల్ సిసి అద్భుతంగా వ్యవహరించారు. మీరు నమ్ముతారో లేదో తెలీదుగానీ అసలు ఈ వివాదం 500 నుంచి మూడువేల సంవత్సరాల నాటిది అని అనుకుంటున్నా. ఇప్పటికి ఓ కొలిక్కి వచ్చింది. ఇంకా ఇందులో ఎంతో సంక్లిష్టత ఉంది. ఈ ఒప్పందం అత్యంత చిక్కుముళ్లతో కూడుకుంది. ఎన్నో నిబంధనలు, షరతులను పొందుపరిచాం. వాస్తవానికి పశ్చిమాసియాలో ఈ యుద్ధం చివరకు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని చాలా మంది భావించారు. ఇకపై అలాంటిదేమీ ఉండబోదు. నేను గతంలో ఎన్నో సంక్లిష్టమైన సమరాలు, సమస్యలను పరిష్కరించా. ఇది మాత్రం అతిపెద్ద రాకెట్ షిప్‌లాగా సమస్యాత్మకంగా మారింది. చివరకు పరిష్కరించాం'' అని ట్రంప్ అన్నారు. తర్వాత నేతలంతా గ్రూప్ ఫొటోకు పోజిచ్చారు. తర్వాత నేతలంతా వేరే వేదికపై చేరారు. అక్కడ మళ్లీ ట్రంప్ బ్రిటన్, ఇటలీ, పాకిస్తాన్, ఈజిప్ట్, ఖతార్, తుర్కియే తదితర కీలక దేశాల అగ్రనేతలను పొగుడుతూ మాట్లాడారు.

భారత్ గొప్పదేశం

వెనకాల పలువురు నేతలు, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిలబడి ఉండగా వాళ్ల సమక్షంలో ట్రంప్ మాట్లాడారు. '' భారత్ గొప్పదేశం. నాకు అత్యంత మిత్రదేశం. భారత్ గొప్ప పనులెన్నో చేసింది. ఇక మీదట పాకిస్తాన్, భారత్‌లు ఇరుగుపొరుగున హాయిలా కలిసిమెలసి ఉంటాయని ఆశిస్తున్నా'' అని అన్నారు. ఆ సందర్భంలో షరీఫ్ నవ్వుతూ కనిపించారు. తర్వాత ఈజిప్ట్ అధ్యక్షుడు సిసీ మాట్లాడారు. ''పాలస్తీనియన్లకు స్వయం నిర్ణయాధికారం ఉండాల్సిందే. వాటిని భవిష్యత్తులో ఏ దేశమూ లాగేసుకోకూడదు. స్వతంత్ర దేశంగా ఎదగాలి'' అని సిసీ ఆశాభావం వ్యక్తంచేశారు.

అవధుల్లేని ఆనందం

హమాస్ చెర నుంచి ఎట్టకేలకు బందీల విడుదల

- రెండేళ్ల తర్వాత స్వేచ్ఛా వాయువులు పీల్చిన హమాస్–ఇజ్రాయెల్ యుద్ధ బాధితులు
- ప్రతిగా వేలాది మంది ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్
- ఇజ్రాయెల్‌లో మిన్నంటిన ఆనందోత్సాహాలు

డెయిర్ అల్ బాలాహ్(గాజా స్ట్రిప్)/జెరూసలేం: నెలల తరబడి చీకట్లో మగ్గిపోయిన ఇజ్రాయెలీ బందీలు ఎట్టకేలకు హమాస్ బందీ సంకెళ్లను తెంపుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన హమాస్, ఇజ్రాయెల్ 20 సూత్రాల శాంతి ప్రణాళిక శుక్రవారం అమల్లోకిరాగా బందీల విడుదల సోమవారం మొదలైంది. రెండేళ్లకుపైగా తమ వద్ద బందీలుగా ఉంచుకున్న 20 మంది ఇజ్రాయెలీలను హమాస్ పాలస్తీనాలోని వేర్వేరు చోట్ల ఏకకాలంలో విడిచిపెట్టింది. దీంతో ఇజ్రాయెలీ బందీల కుటుంబాల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. బందీలు విడుదలయ్యారన్న వార్త తెలీగానే ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్ ప్రధాన కూడళ్ల వద్ద వేలాది మంది జనం పోగయ్యి సంబరాలు చేసుకున్నారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, ఆప్తులు బందీల కోసం ఎదురుచూశారు. చిక్కిశల్యమైన తమ వారిని చూసిన ఆనందంలో బందీల కుటుంబ సభ్యులు కేరింతలు కొట్టారు. వాళ్లను హత్తుకుని ఆనందభాష్పాలను రాల్చారు. '' మా నాన్న ఓమ్రీ మిరాన్ ఏకంగా 738 రోజుల తర్వాత ఇంటికొచ్చారు. ఆయన రాక కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. వేదన అంతా ఇప్పుడు మటుమాయమైంది'' అని ఓమ్రీ సంతానం ఆనందం వ్యక్తంచేసింది. ఓమ్రీని వీడియోకాల్‌లో తొలిసారిగా చూసిన ఆయన భార్య లేషే మిరాన్ లావీకు ఆనందంతో మాటలు రాలేదు. నిర్బంధంలో ఉన్నప్పుడు ప్రాణాలు కోల్పోయిన పలువురు బందీల పార్థివదేహాలను సైతం హమాస్ రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అప్పగించింది. మరికొన్ని మృతదేహాలు ఎక్కడ ఉన్నాయో తమకు సైతం స్పష్టంగా తెలీదని హమాస్ ప్రతినిధులు చేసిన ప్రకటనపై బందీలు, ఆచూకీగల్లంతైన బాధితుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 20 సూత్రాల శాంతి ప్రణాళికకు హమాస్ కచ్చితంగా కట్టుబడి ఉండాలని డిమాండ్‌చేసింది. ఇజ్రాయెల్ సైతం ఒప్పందంలో భాగంగా ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని ఓఫెర్ జైలు నుంచి దాదాపు 2,000 మంది పాలస్తీనియన్ ఖైదీలను విడిచిపెట్టింది. వీళ్లలో గతంలో జీవితఖైదు పడిన 250 మంది ఖైదీలున్నారు. యుద్ధం మొదలయ్యాక గాజాలో అదుపులోకి తీసుకున్న వందలాది మందిని ఇజ్రాయెల్ విడుదలచేసింది. దీంతో వీళ్లంతా గాజా, వెస్ట్ బ్యాంక్‌లకు బయల్దేరారు. బస్సులో చేరుకున్న తమ వారిని చూసిన ఆనందంలో రమల్లా సిటీలోని పాలస్తీనియన్లు ఉబ్బితబ్బిబ్బయ్యారు.



బందీల విడుదలను లైవ్‌లో చూస్తూ ఇజ్రాయెలీల ఆనందహేల

పీడకల పోగొట్టాం.. శాంతిస్థాపన బాధ్యత మీదే: ట్రంప్

బందీల విడుదలతో కీలకపాత్రపోషించిన ట్రంప్ సోమవారం పశ్చిమాసియా పర్యటనలో భాగంగా తొలుత ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో ప్రసంగించారు. 2008 తర్వాత అమెరికా అధ్యక్షుడు నెస్సెట్‌లో ప్రసంగించడం ఇదే తొలిసారి. 1949 ఏడాది నుంచి చూస్తే గతంలో కేవలం ముగ్గురు అమెరికా అధ్యక్షులు మాత్రమే కేనేసెట్‌కు వచ్చారు. స్పీకర్ అమిర్ ఒహానా ఘన స్వాగతం తర్వాత పార్లమెంటేరియన్లనుద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. '' నెలలతరబడి పట్టి పీడించిన బాధాతప్త యుద్ధ పీడ కలను మేం పోగొట్టాం. తుపాకులు ఇప్పుడు మౌనం దాల్చాయి. ఇక మీరు రణక్షేత్రంలో సాధించడానికి ఏమీ లేదు. ఇక ఈ ప్రాంతంలో శాంతి స్థాపన సువర్ణావకాశాన్ని మీరు అందిపుచ్చుకోండి. శాంతిని శాశ్వత చేయండి. పశ్చిమాసియాలో కొత్త శాంతి ఉషోదయం మొదలైంది. మధ్యవర్తిత్వం వహించిన నా అల్లుడు జేడ్ కుష్నర్, అమెరికా విదేశాంగ మంత్రి రూబియో, అరబ్ దేశాలకు కృతజ్ఞతలు. ఇజ్రాయెల్‌కు మాత్రమేకాదు పశ్చిమాసియాలో సువర్ణాధ్యాయం మొదలుకానుంది. గాజాలో నిస్సైనికీకరణ జరగాలి. హమాస్ ఆయుధాలను త్యజించాలి. దానికి ఇంకా అంగీకారం కుదరలేదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రసంగాన్ని ఒకరు అడ్డుకోబోగా భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని పక్కకు లాక్కెళ్లారు.

ట్రంప్‌కు ఇజ్రాయెల్ అత్యున్నత పౌర పురస్కారం

గాజా ఒప్పందం కుదిర్చి బందీల విడుదలకు కృషి చేసినందుకు ట్రంప్‌కు ఇజ్రాయెల్ అరుదైన గౌరవంతో సత్కరించనుంది. తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్'ను ట్రంప్‌కు ప్రదానం చేయనున్నట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ సోమవారం ప్రకటించారు. త్వరలో ప్రత్యేక కార్యక్రమంలో ట్రంప్‌ను ఈ పురస్కారంతో సత్కరిస్తామని ఇస్సాక్ చెప్పారు.

బందీల విడుదలను స్వాగతిస్తున్నాం: మోదీ

న్యూఢిల్లీ: గాజాలో బందీలుగా ఉన్న మొత్తం 20 మందిని హమాస్ విడుదల చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు నిజాయితీతో సాగిస్తున్న ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని ప్రకటించారు. 'రెండేళ్లకు పైగా నిర్బంధంలో ఉన్న బందీలందరి విడుదలను స్వాగతిస్తున్నాం. వారి స్వేచ్ఛ వారి కుటుంబాల ధైర్యానికి, అధ్యక్షుడు ట్రంప్ తీవ్రమైన శాంతి ప్రయత్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ బలమైన సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది'అని ప్రధాని మోదీ సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలకు తాము తోడుగా ఉంటామన్నారు.

కరూర్ తొక్కిసలాటపై సీబీ'ఐ'

సీబీఐ దర్యాప్తు పర్యవేక్షణకూ త్రిసభ్య కమిటీ • కమిటీకి సుప్రీం మాజీ న్యాయమూర్తి రస్తోగి నేతృత్వం

సాక్షి, చెన్నై/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తమిళనాడులోని కరూర్ పెను విషాద తొక్కిసలాట ఘటన కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటనపై సీబీఐ జరిపే దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని కూడా సుప్రీంకోర్టు నియమించడం విశేషం. కమిటీలోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు తమిళనాడు కేడర్‌కు చెందిన ఐపీఎస్‌లు ఉంటారని ధర్మాసనం తెలిపింది. తమిళనాడులో గత నెల 27వ తేదీన కరూర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ ప్రచార సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాట పెను విషాదానికి దారి తీసింది. ఈ కేసును ఐజీ అస్రా కార్గ్ నేతృత్వంలోని సిట్ విచారిస్తోంది. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ టీవీకే సుప్రీంను కోరింది. కాగా, బీజేపీసహా కొందరు బాధితులు సీబీఐ విచారణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేశారు. వీరి పిటిషన్‌లను విన్న జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.వి. అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తాజా ఆదేశాలు జారీ చేసింది. మద్రాసు హైకోర్టు సిట్ ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కాగా, ఈ ఘటనపై తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ అరుణా జగదీషన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ యథావిధిగా కొనసాగుతుందని, దీనిపై సుప్రీంకోర్టు ఎలాంటి కామెంట్ చేయలేదని ప్రభుత్వ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో పాటు వాదనలు వినిపించిన న్యాయవాది, డీఎంకే ఎంపీ విల్సన్ తెలిపారు. కాగా, బాధితులుగా పేర్కొంటూ బాధితులు కానివారు సైతం కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్‌లు వేశారన్న విషయాన్ని న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకునిరావడంతో ఈ అంశంపై విచారణ జరుపుతామని బెంచ్ పేర్కొన్నట్లు విల్సన్ తెలియజేయడం గమనార్హం.

సృజనాత్మక ప్రగతికి ఆర్థిక నోబెల్

- 2025 ఏడాదికి ఎకనమిక్స్ నోబెల్‌కు ఎంపికైన జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియన్, పీటర్ హోవిట్
- ఆర్థికాభివృద్ధిపై సృజనాత్మకత ప్రభావాన్ని విశ్లేషించినందుకు దక్కిన గౌరవం
- ప్రైజ్‌మనీలో సగం మోకిర్‌కు
- మిగతా సగాన్ని చెరిసమంగా పంచుకోనున్న ఫిలిప్, పీటర్

స్టాక్‌హోమ్: ప్రపంచ ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తూనే, అంతర్జాతీయంగా జీవన ప్రమాణాల మెరుగుకు దోహదపడే 'సృజనాత్మక విధ్వంసం' భావనను మరింత ప్రభావవంతంగా వివరించిన ముగ్గురు ఆర్థికవేత్తలకు 2025 ఏడాదికిగాను ఆర్థిక నోబెల్ పురస్కారం దక్కింది. సోమవారం నోబెల్ కమిటీ ఆర్థికవేత్తలు జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియన్, పీటర్ హోవిట్‌లకు 2025 ఏడాదికి ఎకనమిక్స్ నోబెల్‌ను ప్రకటించింది. ''కొత్త ఉత్పత్తులు, తయారీ విధానాలకు కొత్త ఆవిష్కరణలు ఏ రకంగా దోహదపడతాయనేది ఈ ముగ్గురు వివరించారు. ఆర్థిక స్తబ్దత అనేది ఎప్పుడైనా జరగొచ్చు. దాని పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని వీళ్లు సోదాహరణంగా హెచ్చరించారు'' అని ఆర్థికశాస్త్ర నోబెల్ కమిటీ చైర్మన్ జాన్ హాస్లర్ కొనియాడారు. ముగ్గురికీ సంయుక్తంగా దాదాపు రూ.10.63 కోట్ల నగదు బహుమతి లభిస్తుంది. ఇందులో సగభాగాన్ని డచ్ ఆర్థికవేత్త మోకిర్ అందుకోనున్నారు. మిగతా సగాన్ని ఫిలిప్, పీటర్ పంచుకోనున్నారు. ముగ్గురికీ విడివిడిగా 18 క్యారెట్ల విలువైన బంగారు నోబెల్ మెడల్‌ను మెడలో వేయనున్నారు. కృత్రిమమేధతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ప్రగతిలో దూసుకుపోతుందన్న అంచనాల మధ్య క్రియేటివ్ డిస్ట్రక్షన్ సిద్ధాంత విశ్లేషకులకు ఆర్థిక నోబెల్ దక్కడం విశేషం.

ఏమిటీ పరిశోధన?

''పాత ఆవిష్కరణల స్థానాన్ని కొత్త ఆవిష్కరణలు భర్తీచేస్తున్నప్పుడు అవి ఎలా పనిచేస్తున్నాయి అనేది ఒక్కటి పరిశీలిస్తే సరిపోదు. అసలు ఆ కొత్త ఆవిష్కరణ ఏ రకంగా విజయం సాధిస్తుందనేది శాస్త్రీయంగా అర్థంచేసుకోగలగాలి. దీనిని ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు చక్కగా వివరించారు'' అని నోబెల్ కమిటీ కొనియాడింది. ప్రత్యామ్నాయంగా కొత్త సాంకేతికతలు రావడంతో పాతవి కనుమరుగవుతాయి. ఒకరకంగా పాత ఆవిష్కరణలను మనుగడలో లేకుండా కొత్తవి నాశనంచేస్తాయి. ఈ ఆర్థిక భావనను 'సృజనాత్మక విధ్వంసం' అంటారు. ఈ భావనను అమెరికా, ఇజ్రాయెల్ మూలాలున్న నెదర్లాండ్స్ ఆర్థిక చరిత్రకారుడు జోయెల్ మోకిర్ తనదైన శైలిలో వివరించారు. ఇందు కోసం పాత ఆర్థికశాస్త్ర పుస్తకాలను తిరగేశారు. 79 ఏళ్ల మోకిర్ ప్రస్తుతం అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ వర్సిటీలో ఆర్థిక పరిశోధనలు చేస్తున్నారు. ఇదే భావనను ఫ్రాన్స్‌లో జన్మించిన ఆర్థికవేత్త ఫిలిప్ అఘియన్, కెనడాలో జన్మించిన ఆర్థికవేత్త పీటర్ విల్కిన్‌సన్ హోవిట్ సైతం గణిత సిద్ధాంతాలతో వివరించారు. 69 ఏళ్ల అఘియన్ ప్రస్తుతం పారిస్‌లోని కాలేజ్ ది ఫ్రాన్స్‌లో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 79 ఏళ్ల హోవిట్ ప్రస్తుతం అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ఆర్థికనోబెల్‌కు ఎంపికైన విషయం తెల్సి ఆర్థికవేత్త మోకిర్ షాక్‌కు గురయ్యారు. ''ఏదైనా అనూహ్యమైనది సాధించినప్పుడు షాక్‌లో ఉన్నామని చాలా మంది చెబుతుంటారు. అది నిజంగా నిజం. నేనిప్పుడు అదే అనుభూతిని పొందా. నోబెల్ గెల్చుకుంటానని అస్సలు అనుకోలేదు. నిజానికి మీకు నోబెల్ రావొచ్చని నా విద్యార్థులు చెప్పారు. వాళ్లతో ఒక్కటే చెప్పా. వస్తే నాకు పోప్ పదవి రావొచ్చుగానీ నోబెల్ రాదని చెప్పా'' అని మోకిర్ సరదాగా మాట్లాడారు. ''ఈ వేసవికాలానికి నాకు 80 ఏళ్లు నిండుతాయి. అయినా నా వృత్తి నుంచి రిటైర్‌మెంట్ తీసుకోను. ఆర్థికవేత్తగా జీవితాంతం కొనసాగాలన్నదే నా కల'' అని ఆయన అన్నారు.

ఈ భావన ఎప్పటిది?

క్రియేటివ్ డిస్ట్రక్షన్ అనేది దశాబ్దాల నాటి పాత సిద్ధాంతం. ఈ భావనను ఆర్థికవేత్త జోసెఫ్ షుమ్‌పీటర్ ప్రతిపాదించారు. ఆయన 1942లో రచించిన తన 'పెట్టుబడిదారీవిధానం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం' పుస్తకంలో ఈ సిద్ధాంతాన్ని తొలిసారిగా పేర్కొన్నారు. ఈ సృజనాత్మక విధ్వంసం భావనను తమదైన రీతిలో వివరించేందుకు అఘియన్, హోవిట్‌లు 1992లో ఒక గణితశాస్త్ర మోడల్‌ను అభివృద్ధిచేశారు. అఘియన్ 2017లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆర్థిక పథకానికి సైతం తుదిరూపునిచ్చారు. కృత్రిమ మేధ రంగంలో ఫ్రాన్స్‌లో అగ్రగామిగా మార్చాలంటే ఏ రకమైన విధానాలను అవలంభించాలో తెలుపుతూ 25 ప్రతిపాదనలను మేక్రాన్‌కు అఘియన్ అందజేశారు. ''ఆర్థిక ప్రగతిని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించకూడదు. అది ఎందుకు సాధ్యమైందో అర్థంచేసుకుని ముందుకు సాగాలి. లేదంటే సంక్షోభంలో చిక్కుకుపోతాం'' అని జాన్ హాస్లర్ వ్యాఖ్యానించారు.



నజరానాను పరిశోధనకు కేటాయిస్తా..

నోబెల్ గెల్చుకోవడంపై ఆర్థికవేత్త అఘియన్ స్పందించారు. ''ఈ అనుభూతిని వర్ణించడానికి నాకు మాటలు రావట్లేదు. ప్రైజ్‌మనీగా నాకు దక్కే నగదును మళ్లీ ఆర్థికశాస్త్ర పరిశోధనల కోసమే ఖర్చు చేస్తా. అమెరికాలో ట్రంప్ సర్కార్ విదేశీ మేధావులను రానీయకుండా అడ్డుకుంటోంది. ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, రక్షణాత్మకత ధోరణి చాలా తప్పు. ఇది ప్రపంచ ఆర్థిక ప్రగతికి, ఆవిష్కరణలకు విఘాతంగా మారనుంది'' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

సంబంధాల బలోపేతానికి భారత్-కెనడా రోడ్‌మ్యాప్ ఖరారు

- పరస్పరం విశ్వాసంతో విభేదాలను పరిష్కరించుకోవాలని నిర్ణయం
- ప్రధాని మోదీ, మంత్రి జై శంకర్‌లతో కెనడా మంత్రి అనితా ఆనంద్ సమావేశం

న్యూఢిల్లీ: వాణిజ్యం, అరుదైన ఖనిజాలు, ఇంధన రంగాల్లో సహకారం బలోపేతానికి భారత్, కెనడాలు రోడ్ మ్యాప్ ఖరారు చేసుకున్నాయి. సోమవారం కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లతో చర్చలు జరిపారు. 2023లో సిక్కు ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యానంతరం రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకోవడమే లక్ష్యంగా ఆమె భారత్‌కు రావడం తెల్సిందే. రెండు దేశాల వ్యూహాత్మక ప్రాముఖ్యతలు, ప్రపంచ ఆర్థిక పరిణామాల ఆధారంగా వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో సాధ్యమైనంత త్వరగా మంత్రుల స్థాయి చర్చలు ప్రారంభించాలని జై శంకర్, అనితా ఆనంద్ నిర్ణయించారు. ఈ సందర్భంగా కెనడా గడ్డపై ఖలిస్తానీ వేర్పాటు వాదులు సాగిస్తున్న కార్యకలాపాలపై జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. రెండు పక్షాలు పరస్పర ఆందోళనలు, సున్నితమైన అంశాలపై నిర్మాణాత్మక, సమతుల్య భాగస్వామ్యాన్ని కొనసాగించేందుకు ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారు. ఈ మేరకు వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'భారత్, కెనడా ప్రధాన మంత్రులు నాలుగు నెలల క్రితం రెండు దేశాల సంబంధాల్లో కొత్త ఊపును తెచ్చేందుకు ప్రాధాన్యతలను నిర్దేశించారు. వాటికి అనుగుణంగా, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకుంటూ పరస్పర గౌరవం ఆధారంగా కొత్త రోడ్‌మ్యాప్‌పై ఏకాభిప్రాయానికి చేరుకున్నాం'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కెనడా యురేనియం సరఫరాదారులతో భారత అణు ఇంధన సంస్థ అధికారులు జరుపుతున్న చర్చలను ఇద్దరు నేతలు స్వాగతించారు. అంతకు ముందు, అనితా ఆనంద్ ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధనం, వ్యవసాయం, ప్రజల మధ్య సహకారం పెంచుకునే అంశాలను మంత్రి అనితా ఆనంద్‌తో చర్చించినట్లు మోదీ ఎక్స్‌లో తెలిపారు. కెనడా ప్రధాని కార్నీతో చర్చలకు ఆసక్తితో ఎదురు చూస్తున్నానన్నారు.



మోదీతో అనితా ఆనంద్

రాజస్తాన్‌లో రోడ్డు ప్రమాదం.. ఏపీకి చెందిన ఆర్మీ మేజర్ కన్నుమూత

జైసల్మీర్: రాజస్తాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీకి చెందిన ఒక అధికారి చనిపోగా మరో నలుగురు గాయపడ్డారు. ప్రాణాలు కోల్పోయిన మేజర్ టీసీ భరద్వాజ్(33) స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు అని అధికారులు తెలిపారు. ఈ ఘటన జైసల్మీర్ జిల్లాలోని గమ్నేవాలా గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చోటుచేసుకుంది. రామ్‌గఢ్ వైపు నుంచి లొంగెవాలా వైపు వెళ్తున్న ఆర్మీ జిప్సీ వాహనం మూలమలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో లెఫ్టినెంట్ కల్నల్, ముగ్గురు మేజర్ స్థాయి అధికారులు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే వీరిని రామ్‌గఢ్ ఆస్పత్రికి తరలించారు. భరద్వాజ్ అప్పటికే కన్నుమూసినట్లు వైద్యులు ధ్రువీకరించారు. క్షతగాత్రులైన లెఫ్టినెంట్ కల్నల్ ప్రశాంత్ రాయ్(33), మేజర్ అమిత్, మేజర్ ప్రాచీ శుక్లా, డ్రైవర్ జవాన్ నసీరుద్దీన్‌లను ప్రాథమిక చికిత్స అనంతరం జైసల్మీర్, జోధ్‌పూర్‌లలోని ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. మేజర్ ప్రాచీ శుక్లా తలకు, మేజర్ అమిత్ కుడి కన్ను వద్ద తీవ్ర గాయాలైనట్లు తనోత్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. మేజర్ భరద్వాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆర్మీకి అప్పగించారు.

కర్ణాటక ఓటర్ల జాబితా మోసాలపై సిట్ ఏర్పాటుకు సుప్రీం నో

న్యూఢిల్లీ: బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. 'మేము పిటిషనర్ తరఫు వాదనలు విన్నాం. ప్రజా ప్రయోజన పిటిషన్ (పిల్)గా దాఖలైన ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి మేము సిద్ధంగా లేము. పిటిషనర్ కావాలంటే ఎన్నికల సంఘం ముందు తన అభ్యర్థనను ఉంచవచ్చు'అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం తమ అభ్యర్థనపై నిర్ణయం తీసుకోవడానికి గడువు విధించాలని ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాది రోహిత్ పాండే చేసిన అభ్యర్థనను సైతం ధర్మాసనం త్రోసిపుచ్చింది. ఇలాంటి సందర్భాల్లో తగిన న్యాయ మార్గాలను అనుసరించవచ్చని సుప్రీం సూచించింది.

లాలు ఫ్యామిలీకి భారీ షాక్!

- ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో కోర్టులో అభియోగాలు
- లాలు కనుసన్నల్లోనే కుట్ర: కోర్టు
- మేం నిర్దోషులం: కోర్టులో లాలు, రబ్డీ దేవి, తేజస్వీ యాదవ్

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఐఆర్‌సీటీసీ హోటళ్ల అవినీతి కేసుకు సంబంధించి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర రైల్వే శాఖ మాజీ మంత్రి లాలు ప్రసాద్ యాదవ్, ఆయన భార్య, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్డీ దేవి, కుమారుడు, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు ఇతర నిందితులపై అభియోగాలను ఖరారు చేసింది. వీరంతా విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా, నిందితుల పాత్ర ఆధారంగా న్యాయస్థానం వేర్వేరు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేసింది. ముఖ్యంగా రబ్డీ దేవి, తేజస్వీ యాదవ్‌లపై ఐపీసీ సెక్షన్ 420 (మోసం), 120బీ (నేరపూరిత కుట్ర) కింద అభియోగాలు మోపింది. అయితే నిందితులందరిపై నేరపూరిత కుట్ర అభియోగం ఉమ్మడిగా ఉంది. తమపై మోపిన ఆరోపణలను లాలు కుటుంబం ఖండించింది. తాము నిర్దోషులమని, విచారణను ఎదుర్కొంటామని కోర్టుకు తెలిపింది. విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'టెండర్ కుంభకోణానికి సంబంధించిన పూర్తి కుట్ర లాలు ప్రసాద్ యాదవ్‌కు తెలిసే జరిగింది. టెండర్ ప్రక్రియలో ఆయన జోక్యం చేసుకున్నారు. ఈ కుట్ర ద్వారా లాలు కుటుంబం లబ్ధి పొందింది. రబ్డీ దేవి, తేజస్వీ యాదవ్‌లకు అత్యంత తక్కువ ధరకే విలువైన భూమి లభించింది'అని పేర్కొంది. కోర్టు లాలు యాదవ్‌ను ఉద్దేశించి, 'మీరు మీపై మోపిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా? లేక విచారణను ఎదుర్కొంటారా?'అని ప్రశ్నించగా, 'ఈ ఆరోపణలన్నీ అవాస్తవం'అని లాలూ యాదవ్ బదులిచ్చారు. అదేవిధంగా, రబ్డీ దేవి, తేజస్వీ యాదవ్‌లు కూడా తాము ఏ కుట్రలో, మోసంలో పాలుపంచుకోలేదని స్పష్టం చేశారు.

ఏంటీ కుంభకోణం?

2004– 2009 మధ్యకాలంలో లాలు ప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా పనిచేశారు. సీబీఐ ఆరోపణల ప్రకారం, రాంచీ, పూరీలలో ఉన్న ఐఆర్‌సీటీసీకి చెందిన రెండు బీఎన్ఆర్ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులను 'సుజాత హోటల్స్'అనే ప్రైవేట్ సంస్థకు అక్రమంగా కట్టబెట్టారు. ఈ టెండర్ల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని సీబీఐ పేర్కొంది. కాంట్రాక్టుకు ప్రతిఫలంగా, లాలు కుటుంబానికి పట్నాలోని అత్యంత విలువైన భూమిని సుజాత హోటల్స్ యజమానులు బదిలీ చేశారని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. 2017 జూలై 17న సీబీఐ ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

తెలంగాణ రాజపత్రం

The Telangana Gazette

Part-1 Extraordinary Published by Authority

District Gazette No. A3/42/2025 తేది: 29.09.2025

తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ (భూ సేకరణ) విభాగము

జిల్లా కలెక్టర్, ఖమ్మం/అదనపు కలెక్టర్ (రెవిన్యూ)/ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ. సే), ఐ.పి.టి. మరియు రైల్వేలు, ఖమ్మం

ఫారం - 7

రూఢీ ప్రకటన

(చూడుము సబ్ సెక్షన్ 1 ఆఫ్ సెక్షన్-25, సెక్షన్-19(1) చట్టము-30/2013)

కలెక్టర్ ఫైల్ నం. నం. జి1/76189/2024 తేది: 27.09.2025

భూ.సే అధికారి ఫైల్ నం. బి/46/2024 తేది: .09.2025

తెలంగాణ ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్టపరిచిన ఖమ్మం జిల్లాలో **సింగరేణి** మండలంలోని బాజుమల్లాయిగూడెం గ్రామము నందు విస్తీర్ణం ఎ. **63.03 1/2** కుంటలు మరియు రేలకయలపల్లి గ్రామము నందు విస్తీర్ణం ఎ. **104.27** కుంటలు మొత్తం విస్తీర్ణం ఎ. **167.30 1/2** కుంటలు గల భూమిని ప్రజా ప్రయోజనార్థం అనగా సీత రామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణం నిమిత్తం భూమి అవసరమైయున్నది. ఈ దిగువ చూపిన భూమి ప్రజా ప్రయోజనం కొరకు అవసరము అయిఉన్నది. సబ్ సెక్షన్ (1) సెక్షన్ 25 మరియు సెక్షన్ 19 (1) భూసేకరణ, పునరావాస మరియు పునరుపాది చట్టం, 2013

RFCTLA & R&R (తెలంగాణ సవరణ), 2016 (చట్టం నం. 21 2017)లోని III.A లోని సెక్షన్ 10A(b) ద్వారా అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, తెలంగాణ ప్రభుత్వం G.O.Ms.No. 38 నీటిపారుదల & CAD (LA. R&R/A2), తేది: 30.06.2017, భూసేకరణ, పునరావాసం మరియు పునరుపాది చట్టం, 2013లో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు యొక్క అధ్యాయం II మరియు III యొక్క నిబంధనాల ధరఖాస్తు నుండి సీత రామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మినహాయింపు ఇవ్వబడింది.

పైన తెలిపిన సీత రామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణం నిమిత్తం ఈ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లా **సింగరేణి** మండలంలోని బాజుమల్లాయిగూడెం గ్రామము నందు విస్తీర్ణం **ఎ.63.03 1/2** కుంటలు మరియు రేలకమలపల్లి గ్రామము నందు విస్తీర్ణం **ఎ. 104.27** కుంటలు మొత్తం విస్తీర్ణం విస్తీర్ణం ఎ. **167.30 1/2** కుంటలు భూమిని తీసుకోబడిన వారి యొక్క వివరములు ఈ క్రింద ఉదహరించబడినవి.

షెడ్యూల్

గ్రామం: బాజుమల్లాయిగూడెం మండలం: సింగరేణి జిల్లా: ఖమ్మం

క్రమ సంఖ్య	సర్వే నం. SSDR ప్రకారం	సర్వే నం. భూ భారతి పహాని ప్రకారం	భూమి రకం	భూమి స్వభావం	భూమి విస్తీర్ణం సర్వే ప్రకారం	పట్టాదారుని పేరు	అనుభవదారుని పేరు	చెట్లు/ కట్టడములు
1	2	3	4	5	6	7	8	9
1	18/2	-	పట్టా	తరి	2.02	ఉట్ల శేషయ్య తండ్రి నర్సయ్య	తాటికొండ యశోదమ్మ భర్త పరమయ్య	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్, తుమ్మ చెట్లు-5
2		18అ2	పట్టా	తరి	1.20	యదవల్లి చందర్ రావు తండ్రి గోపయ్య	యదవల్లి చందర్ రావు తండ్రి గోపయ్య	సుబాబుల చెట్లు, వేప చెట్లు-14, ఫెన్సింగ్
3		18అ/1	పట్టా	తరి	0.27	వినోదరావు రఘువయ్య	బొమ్మేగాని రాములు తండ్రి మైసూర్	సుబాబుల చెట్లు,ఫెన్సింగ్
		విస్తీర్ణం			4.09			
4	20/2	-	పట్టా	తరి	1.00	వరాల సత్యమ్మ	చింతల స్వాతి భర్త రవి శేఖర్	సుబాబుల చెట్లు,ఫెన్సింగ్
5		-	పట్టా	తరి	0.07	వరాల సత్యమ్మ	మద్దెల వెంకటేశ్వర్లు తండ్రి జబ్బిరాములు	సుబాబుల చెట్లు,ఫెన్సింగ్
6		18అ/2	పట్టా	తరి	1.25	యెదవల్లి చందర్ రావు తండ్రి గోపయ్య	యెదవల్లి చందర్ రావు తండ్రి గోపయ్య	సుబాబుల చెట్లు,వేప చెట్లు-14 ఫెన్సింగ్
7		-	పట్టా	తరి	0.06	-	దారి (బాటా)	లేవు
		విస్తీర్ణం			2.38			
8		21/అ	పట్టా	తరి	0.39	జొన్నలగడ్డ సంజీవరాణి భర్త వెంకటేశ్వర్లు	జొన్నలగడ్డ సంజీవరాణి భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల చెట్లు, పైప లైన్-1
9	21/2	-	పట్టా	తరి	1.27	రాయల వెంకయ్య	చింతల స్వాతి భర్త రవిశేఖర్	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
10		-	పట్టా	తరి	1.11	ఉట్ల శేషయ్య తండ్రి నర్సయ్య	తాటికొండ యశోదమ్మ భర్త పరమయ్య	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
11		-	పట్టా	తరి	0.04	-	దారి (బాటా)	లేవు
		విస్తీర్ణం			4.01			
12	22/2	21/అ/అ	పట్టా	తరి	0.06	రాయల వెంకయ్య తండ్రి నాగులు	కొలిశెట్టి సత్యవతి భర్త హరిస్వర్	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
13		22/1 22/2	పట్టా	తరి	7.00	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్, పైప్ లైన్, జామాయిల్ చెట్లు
		విస్తీర్ణం			7.06			
14	23/2	23	పట్టా	తరి	0.10 1/2	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్, పైప్ లైన్, జామాయిల్ చెట్లు
		విస్తీర్ణం			0.10 1/2			
15	24/2	24	పట్టా	తరి	0.04 1/2	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	కందుల రసిక తండ్రి కృష్ణారావు కందుల రచన తండ్రి కృష్ణారావు	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్, పైప్ లైన్, జామాయిల్ చెట్లు
		విస్తీర్ణం			0.04 1/2			
16	26/2	-	పట్టా	తరి	0.38	ఉట్ల శేషయ్య	జొన్నలగడ్డ సంజీవమ్మ భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల చెట్లు, పైప్ లైన్
17		-	పట్టా	తరి	0.30	ఉట్ల శేషయ్య	ఉంగరాల కమలమ్మ భర్త నర్సయ్య	పైప్ లైన్
18		-	పట్టా	తరి	0.29	ఉట్ల శేషయ్య	ఉంగరాల లక్ష్మయ్య తండ్రి పిచ్చయ్య	తుమ్మచెట్లు-6
19		-	పట్టా	తరి	0.08	ఉట్ల శేషయ్య	దసనపూడి చిట్టెమ్మ భర్త లక్ష్మయ్య	లేదు
20		-	పట్టా	తరి	0.09	ఉట్ల శేషయ్య	దసనపూడి రాములు తండ్రి ధర్మయ్య	తుమ్మచెట్లు-3
21		-	పట్టా	తరి	0.14	ఉట్ల శేషయ్య	పోతుల వెంకటేశ్వర్లు తండ్రి నారాయణ	
22		-	పట్టా	తరి	0.13	ఉట్ల శేషయ్య	పోతుల శ్రీనివాస రావు తండ్రి నారాయణ	సుబాబుల చెట్లు,పైప్ లైన్, వేప చెట్లు, తాటి చెట్లు, చెక్క పోల్,ఫెన్సింగ్
23		-	పట్టా	తరి	0.13	ఉట్ల శేషయ్య	పోతుల నాగేశ్వర రావు తండ్రి నారాయణ	
24		-	పట్టా	తరి	0.04	-	వాగు	లేవు
		విస్తీర్ణం			3.38			
25	28/2	28/అ/1/1	నౌకరి ఇనాం	తరి	0.30	పోతుల వెంకటేశ్వర్లు తండ్రి నారాయణ	పోతుల వెంకటేశ్వర్లు తండ్రి నారాయణ	సుబాబుల చెట్లు,పైప్ లైన్, వేప చెట్లు, తాటి చెట్లు, చెక్క పోల్,ఫెన్సింగ్
26		28/అ/2	నౌకరి ఇనాం	తరి	0.30	పోతుల శ్రీనివాస రావు తండ్రి నారాయణ	పోతుల శ్రీనివాస రావు తండ్రి నారాయణ	సుబాబుల చెట్లు,పైప్ లైన్, వేప చెట్లు, తాటి చెట్లు, చెక్క పోల్,ఫెన్సింగ్
27		28/అ/3/1	నౌకరి ఇనాం	తరి	0.30	పోతుల నాగేశ్వర రావు తండ్రి నారాయణ	పోతుల నాగేశ్వర రావు తండ్రి నారాయణ	సుబాబుల చెట్లు,పైప్ లైన్, వేప చెట్లు, తాటి చెట్లు, చెక్క పోల్,ఫెన్సింగ్
		విస్తీర్ణం			2.10			
28	29/2	-	పోరంబోకు	మెట్ట	0.38	ప్రభుత్వ భూమి	వినోదరావు వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మీ రావు(ఆక్రమణదారులు)	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
29		-	పోరంబోకు	మెట్ట	1.04	ప్రభుత్వ భూమి	వినోదరావు అశోక్ తండ్రి వెంకట రమణ రావు(ఆక్రమణదారులు)	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
30		-	పోరంబోకు	మెట్ట	2.37	ప్రభుత్వ భూమి	గుగులోతు వీరన్న తండ్రి మోతిలాల్ (ఆక్రమణదారులు)	లేవు
31		-	పోరంబోకు	మెట్ట	1.22	ప్రభుత్వ భూమి	గుగులోతు చిలకమ్మ భర్త బాలు (ఆక్రమణదారులు)	లేవు
32		-	పోరంబోకు	మెట్ట	0.16	ప్రభుత్వ భూమి	గుగులోతు బుజ్జి భర్త రామకృష్ణ (ఆక్రమణదారులు)	లేవు
33		-	పోరంబోకు	మెట్ట	1.24	ప్రభుత్వ భూమి	గుగులోతు బాలు తండ్రి హరిసింగ్ (ఆక్రమణదారులు)	లేవు
34		-	పోరంబోకు	మెట్ట	0.14	ప్రభుత్వ భూమి	భుక్య వార్య తండ్రి లాలయ్య (ఆక్రమణదారులు)	లేవు
35		-	పోరంబోకు	మెట్ట	1.28	ప్రభుత్వ భూమి	వాగు	-
		విస్తీర్ణం			10.23			
36	29/3	-	పోరంబోకు	మెట్ట	0.28	ప్రభుత్వ భూమి	వినోదరావు అశోక్ తండ్రి వెంకట రమణరావు (ఆక్రమణదారులు)	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
		విస్తీర్ణం			0.28			
37	29/4	-	పోరంబోకు	మెట్ట	0.21	ప్రభుత్వ భూమి	దసనపూడి వెంకయ్య తండ్రి నాగయ్య (ఆక్రమణదారులు)	జమాల చెట్లు, బావి-2, సమాధులు-2
38		-	పోరంబోకు	మెట్ట		ప్రభుత్వ భూమి	దసనపూడి కాంతయ్య తండ్రి వెంకయ్య (ఆక్రమణదారులు)	జమాల చెట్లు, పైప్ లైన్-1
39		-	పోరంబోకు	మెట్ట		ప్రభుత్వ భూమి	దసనపూడి నర్సమ్మ భర్త విజ్జి (లేట్) (ఆక్రమణదారులు)	జమాల చెట్లు, పైప్ లైన్-1
40		-	పోరంబోకు	మెట్ట		ప్రభుత్వ భూమి	దసనపూడి నాగేశ్వర రావు తండ్రి వెంకయ్య (ఆక్రమణదారులు)	పైప్ లైన్-1
		విస్తీర్ణం			0.21			
41	29/5	-	పోరంబోకు	మెట్ట	0.05	ప్రభుత్వ భూమి	కొలిశెట్టి సత్యవతి భర్త హరిస్వర్ (ఆక్రమణదారులు)	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
		విస్తీర్ణం			0.05			
42	29/6	-	పోరంబోకు	మెట్ట	0.17	ప్రభుత్వ భూమి	తాటికొండ యశోదమ్మ భర్త పరమయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల చెట్లు
		విస్తీర్ణం			0.17			
43	30/2	30	పట్టా	తరి	1.20	దాగంటి లక్ష్మణ్ రావు తండ్రి నాగయ్య	దాగంటి లక్ష్మణ్ రావు తండ్రి నాగయ్య	ఫెన్సింగ్ రాళ్ళు -140, సుబాబుల
44		108/అ/1/1	పట్టా	తరి	0.03	వినోదరావు అశోక్ తండ్రి వెంకట రమణరావు	వినోదరావు అశోక్ తండ్రి వెంకట రమణరావు	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
		విస్తీర్ణం			1.23			
45	31/2	-	పట్టా	తరి	2.22	గట్టు రంగమ్మ	కటికోల రాములు తండ్రి భద్రయ్య	సుబాబుల, తాటి చెట్లు-13
46		-	పట్టా	తరి	0.23	గట్టు రంగమ్మ	వినోదరావు మోహన్ రావు తండ్రి వెంకయ్య	సుబాబుల చెట్లు
47		-	పట్టా	తరి	0.22	గట్టు రంగమ్మ	వినోదరావు వెంకటేశ్వర్లు తండ్రి లక్ష్మీ రావు	సుబాబుల
48		-	పట్టా	తరి	1.27	గట్టు రంగమ్మ	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	లేవు
49		-	పట్టా	తరి	1.03	గట్టు రంగమ్మ	మద్దెల రామ్మూర్తి తండ్రి బాలయ్య	లేవు
50		-	పట్టా	తరి	0.19	గట్టు రంగమ్మ	కటికోల వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య	లేవు
		విస్తీర్ణం			6.36			
51	33/2	33/అ	పట్టా	తరి	1.30	వినోదరావు వీరచందర రావు తండ్రి ఆగయ్య	వినోదరావు వీరచందర రావు తండ్రి ఆగయ్య	సుబాబుల చెట్లు,ఫెన్సింగ్ పోల్స్-156, పైప్ లైన్
52		-	పట్టా	తరి	1.03	వినోదరావు వెంకటరమణ రావు తండ్రి రామయ్య	కటికోల లక్ష్మి భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల చెట్లు, పైప్ లైన్
53		33/ఇ	పట్టా	తరి	0.10	వినోదరావు కోటేశ్వరరావు తండ్రి వెంకయ్య	వినోదరావు కోటేశ్వర రావు తండ్రి వెంకయ్య	సుబాబుల చెట్లు
		విస్తీర్ణం			3.03			
54		-	నౌకరి ఇనాం	తరి	0.24	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	రాయల వీరన్న తండ్రి నాగులు	సుబాబుల చెట్లు
55		34/2, 34/3	నౌకరి ఇనాం	తరి	0.19	నల్లమోతు శ్రీనివాస రావు తండ్రి రామలింగయ్య	నల్లమోతు శ్రీనివాస రావు తండ్రి రామలింగయ్య	
					0.19	నల్లమోతు వెంకటేశ్వర్లు తండ్రి రామలింగయ్య	నల్లమోతు వెంకటేశ్వర్లు తండ్రి రామలింగయ్య	సుబాబుల చెట్లు, ఫెన్సింగ్
56	34/2	34/5	నౌకరి ఇనాం	తరి	0.36	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	కొండం రాము తండ్రి పాపయ్య	సుబాబుల చెట్లు
57		34/5	నౌకరి ఇనాం	తరి	0.27	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	సుబాబుల చెట్లు
58		-	నౌకరి ఇనాం	తరి	0.28	-	వినోదరావు కోటేశ్వరరావు తండ్రి వెంకయ్య	సుబాబుల చెట్లు
59		34/1/1	నౌకరి ఇనాం	తరి	1.01	బానోతు సోప్లి భర్త జాప్లు	బానోతు సోప్లి భర్త జాప్లు	లేవు
		విస్తీర్ణం			4.34			
60		-	నౌకరి ఇనాం	తరి	3.07	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య (లేట్)	ఫెన్సింగ్ రాళ్ళు-72 సుబాబుల, తాటిచెట్లు -56 మోటారు బావి-1, పైపు లైన్లు బావి-1
61	35/2	-	నౌకరి ఇనాం	తరి	0.05	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	ఎర్రిపోతుల రఘువులు తండ్రి సూరయ్య	లేవు
62		-	నౌకరి ఇనాం	తరి	0.09	దూలకొండి ముత్యాలు తండ్రి వెంకయ్య	అరేపల్లి సైదులు తండ్రి లక్ష్మీనారాయణ	సుబాబుల చెట్లు
		విస్తీర్ణం			3.21			
63	36/2	36	పట్టా	తరి	2.09 1/2	వినోదరావు వెంకట రమణారావు తండ్రి రామయ్య	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	బావి-1, పైపులైన్, సుబాబుల చెట్లు
		విస్తీర్ణం			2.09 1/2			
64	38/2	38	పట్టా	తరి	2.29 1/2	గట్టు రంగమ్మ	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	సుబాబుల చెట్లు
		విస్తీర్ణం			2.29 1/2			
65	39/2	39/అ	పట్టా	తరి	0.07	వినోద్ రావు మోహన్ రావు తండ్రి వెంకయ్య	వినోద్ రావు మోహన్ రావు తండ్రి వెంకయ్య	చిన్న కుంట
66		36	పట్టా	తరి	0.04 1/2	వినోద్ రావు వెంకటరమణ రావు తండ్రి రామయ్య	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	సుబాబుల
		విస్తీర్ణం			0.11 1/2			
67		57/అ	పట్టా	తరి	0.06	వినోదరావు కోటేశ్వరరావు తండ్రి వెంకయ్య	వినోదరావు కోటేశ్వరరావు తండ్రి వెంకయ్య	లేవు
68	57/2	-	పట్టా	తరి	0.14	వినోదరావు వెంకటరమణరావు తండ్రి రామయ్య	ముత్తినేని వెంకటేశ్వర్లు తండ్రి వెంకటరమణయ్య	లేవు
69		-	పట్టా	తరి	0.05	గట్టు రంగమ్మ	కొండం నాగలక్ష్మి భర్త పాపయ్య	లేవు
		విస్తీర్ణం			0.25			
		మొత్తం విస్తీర్ణం ఎ.కు.			63.03 1/2			

గ్రామం: రేలకాయలపల్లి మండలం: సింగరేణి జిల్లా: ఖమ్మం

క్ర. నం.	సర్వే నం. SSDR ప్రకారం	సర్వే నం. భూ భారతి పహాని ప్రకారం	భూమి రకం	భూమి స్వభావం	భూమి విస్తీర్ణం సర్వే ప్రకారం	పట్టాదారుని పేరు	అనుభవదారుని పేరు	చెట్లు/ కట్టడములు
1	2	3	4	5	6	7	8	9
1		107	మాదుగుల ఇనాం	మెట్ట	1.20	పూసపాటి కొండయ్య తండ్రి నాగయ్య	షైక్ ఉమ భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల ఫెన్సింగ్ తాటిచెట్లు
2	111/2	107/యు/2	మాదుగుల ఇనాం	మెట్ట	0.13	పూసపాటి అరుణ భర్త కొండయ్య	పూసపాటి అరుణ భర్త కొండయ్య	సుబాబుల ఫెన్సింగ్ తాటిచెట్లు
3		111/యు	మాదుగుల ఇనాం	మెట్ట	1.22	గుజ్జర్లపూడి సైదులు తండ్రి రాఘవయ్య	గుజ్జర్లపూడి సైదులు తండ్రి రాఘవయ్య	సుబాబుల బోర్ కరెంటు లైన్ వివాదం
		విస్తీర్ణం			3.15			
4		112/ఈ	మాదుగుల ఇనాం	మెట్ట	0.18	గుజ్జర్లపూడి సైదులు తండ్రి రాఘవయ్య	గుజ్జర్లపూడి సైదులు తండ్రి రాఘవయ్య	ఫెన్సింగ్ వివాదం
5	112/2	111	మాదుగుల ఇనాం	మెట్ట	0.11	దొంతు నర్సింహయ్య తండ్రి పుల్లయ్య	పాటి రామయ్య తండ్రి నారాయణ	సుబాబుల ఫెన్సింగ్ వివాదం
		విస్తీర్ణం			0.29			
6		-	నౌకరి ఇనాం	మెట్ట	2.33	కర్రోజి పెద్దులు	పాటి నాగమ్మ భర్త కోటయ్య	వివాదం
7	113/2	-	నౌకరి ఇనాం	మెట్ట	0.11	కర్రోజి పెద్దులు	గుర్రం భారతమ్మ భర్త జగ్గయ్య	వివాదం
		విస్తీర్ణం			3.04			
8		114/ఈ/2	పట్టా	మెట్ట	2.20	గుజ్జర్లపూడి రంగయ్య తండ్రి బుచ్చయ్య	గుజ్జర్లపూడి రంగయ్య తండ్రి బుచ్చయ్య	సుబాబుల ఫెన్సింగ్
9	114/2	-	పట్టా	మెట్ట	1.18	నల్లమోతు వెంకయ్య తండ్రి అప్పయ్య	చిర్ర భద్రయ్య తండ్రి గౌరయ్య	సుబాబుల ఫెన్సింగ్
10		-	పట్టా	మెట్ట	0.11	నల్లమోతు రామచంద్రయ్య తండ్రి అప్పయ్య	పాటి రామయ్య తండ్రి నారాయణ	సుబాబుల ఫెన్సింగ్
11		114/ఈ/2	పట్టా	మెట్ట	1.03	గుజ్జర్లపూడి రంగయ్య తండ్రి బుచ్చయ్య	గుజ్జర్లపూడి రంగయ్య తండ్రి బుచ్చయ్య	సుబాబుల ఫెన్సింగ్
12		-	పట్టా	మెట్ట	0.06	గుజ్జర్లపూడి బుచ్చయ్య	గుజ్జర్లపూడి సైదారావు తండ్రి నాగభూషణం తండ్రి రంగయ్య, సైదులు	సుబాబుల ఫెన్సింగ్ బావి
13		-	పట్టా	మెట్ట	2.08	నల్లమోతు వీరయ్య తండ్రి అప్పయ్య	కర్రే రమణమ్మ భర్త రమణయ్య	సుబాబుల ఫెన్సింగ్
14		-	పట్టా	మెట్ట	1.00	గుజ్జర్లపూడి బుచ్చయ్య తండ్రి సత్యమయ్య	కర్రే రమణమ్మ తండ్రి నాగయ్య	సుబాబుల ఫెన్సింగ్
15		-	పట్టా	మెట్ట	1.00	గుజ్జర్లపూడి బుచ్చయ్య	పాటి నరసింహ భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల ఫెన్సింగ్
		విస్తీర్ణం			9.26			
16			పట్టా	మెట్ట	0.32	కేతినేని వెంకయ్య తండ్రి పుల్లయ్య	జొన్నలగడ్డ రంగయ్య తండ్రి సీతారామయ్య	సుబాబుల ఫెన్సింగ్
17	123/2	127/5/1	పట్టా	మెట్ట	0.03	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య	సుబాబుల ఫెన్సింగ్
18		-	పట్టా	మెట్ట	0.06	ప్రభుత్వ భూమి	దొంక	లేవు
		విస్తీర్ణం			1.01			
19		123	పట్టా	మెట్ట	0.10	కేతినేని వెంకటపయ్య తండ్రి పుల్లయ్య	జొన్నలగడ్డ రంగయ్య తండ్రి సీతారామయ్య	సుబాబుల ఫెన్సింగ్
20	124/2	124/2/1	పట్టా	మెట్ట	1.04	పాటి నరసింహ భర్త వెంకటేశ్వర్లు	పాటి నరసింహ భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల ఫెన్సింగ్
		విస్తీర్ణం			1.14			
21		-	ప్రభుత్వ భూమి	మెట్ట	2.28	ప్రభుత్వ భూమి	పాటి నరసింహ భర్త వెంకటేశ్వర్లు (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
22		-	ప్రభుత్వ భూమి	మెట్ట	2.10	ప్రభుత్వ భూమి	పుసులూరి హరిస్ సింగ్ తండ్రి భద్రయ్య పుసులూరి వీరబాబు తండ్రి బద్రయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
23	125/ మొత్తం	-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.20	ప్రభుత్వ భూమి	పుసులూరి హరిస్ తండ్రి బద్రయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
24		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.31	ప్రభుత్వ భూమి	నాగండ్ల రమణమ్మ భర్త శ్రీకృష్ణమూర్తి (ఆక్రమణదారులు)	లేవు
25		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.20	ప్రభుత్వ భూమి	పాటి రాంబాబు తండ్రి రఘువయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
26		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.17	ప్రభుత్వ భూమి	జొన్నలగడ్డ రంగయ్య తండ్రి సీతారామయ్య (ఆక్రమణదారులు)	వివాదం
27		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.24	ప్రభుత్వ భూమి	దొంక	లేవు
		విస్తీర్ణం			7.30			
28		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.34	ప్రభుత్వ భూమి	నాగండ్ల రమణమ్మ భర్త శ్రీకృష్ణమూర్తి (ఆక్రమణదారులు)	లేవు
29		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.11	ప్రభుత్వ భూమి	కొండబాల రాజమ్మ భర్త లేట్ వెంకయ్య (ఆక్రమణదారులు)	లేవు
30		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.27	ప్రభుత్వ భూమి	గుజ్జర్లపూడి నాగభూషణం తండ్రి బుచ్చయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్ పైప్ లైన్ ట్రీప్ లైన్
31	126/ మొత్తం	-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.20	ప్రభుత్వ భూమి	పాటి శ్రీనివాసరావు తండ్రి నర్సయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
32		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.20	ప్రభుత్వ భూమి	పాటి రంగయ్య తండ్రి ముత్తయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
33		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.01	ప్రభుత్వ భూమి	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
34		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.10	ప్రభుత్వ భూమి	పాటి నర్సయ్య తండ్రి ముత్తయ్య పాటి బుచ్చయ్య తండ్రి ముత్తయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల ఫెన్సింగ్
		విస్తీర్ణం			6.03			
35		127/5/1	పట్టా	మెట్ట	0.38	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య	సుబాబుల ఫెన్సింగ్
36	127/2	127/4/1	పట్టా	మెట్ట	0.20	పాటి అనంత రామయ్య తండ్రి భద్రయ్య	పాటి అనంత రామయ్య తండ్రి భద్రయ్య	సుబాబుల ఫెన్సింగ్
37		127/6/1	పట్టా	మెట్ట	3.24	పాటి రమేష్ తండ్రి కోటయ్య	పాటి రమేష్ తండ్రి కోటయ్య	సుబాబుల ఫెన్సింగ్
38		127/2	పట్టా	మెట్ట	0.18	పాటి శ్రీనివాస్ రావు తండ్రి నర్సయ్య	పాటి శ్రీనివాస్ రావు తండ్రి నర్సయ్య	సుబాబుల ఫెన్సింగ్
39		127/3/1	పట్టా	మెట్ట	1.06	పాటి రంగయ్య తండ్రి ముత్తయ్య	పాటి రంగయ్య తండ్రి ముత్తయ్య	సుబాబుల ఫెన్సింగ్
		విస్తీర్ణం			6.26			
40	129/2	-	పట్టా	మెట్ట	0.24	విజయగిరి చంద్రయ్య తండ్రి లక్ష్మయ్య	పాటి రమేష్ తండ్రి కోటయ్య	సుబాబుల, ఫెన్సింగ్
41		-	పట్టా	మెట్ట	0.20	విజయగిరి చంద్రయ్య తండ్రి లక్ష్మయ్య	పాటి రంగయ్య తండ్రి ముత్తయ్య	సుబాబుల, ఫెన్సింగ్
42		-	పట్టా	మెట్ట	0.23	విజయగిరి చంద్రయ్య తండ్రి లక్ష్మయ్య	పాటి చంద్రకళ భర్త వెంకటేశ్వర్లు	సుబాబుల, ఫెన్సింగ్
43		-	పట్టా	మెట్ట	1.25	విజయగిరి చంద్రయ్య తండ్రి లక్ష్మయ్య	ఉపాకుల వెంకటమ్మ భర్త లేట్ సైదులు	సుబాబుల, ఫెన్సింగ్
		విస్తీర్ణం			3.12			
44	130/2	-	పట్టా	మెట్ట	0.20	పాటి ముత్తయ్య తండ్రి నారాయణ	పాటి నర్సయ్య తండ్రి ముత్తయ్య పాటి బుచ్చయ్య తండ్రి ముత్తయ్య	సుబాబుల, ఫెన్సింగ్
45		130/2	పట్టా	మెట్ట	6.13	వేము నిర్మల భర్త వెంకట రెడ్డి	వేము నిర్మల భర్త వెంకట రెడ్డి	సుబాబుల, ఫెన్సింగ్
46		130/2 1, 130/2 2	పట్టా	మెట్ట	3.07	శేరు రాజశేఖర్ తండ్రి మల్లయ్య శేరు నాగరాజు తండ్రి మల్లయ్య	శేరు రాజశేఖర్ తండ్రి మల్లయ్య శేరు నాగరాజు తండ్రి మల్లయ్య	సుబాబుల, ఫెన్సింగ్
47		-	పట్టా	మెట్ట	0.05	పాటి ముత్తయ్య తండ్రి నారాయణ	మాచర్ల రమేష్ తండ్రి నాగులు	లేవు
48		-	పట్టా	మెట్ట	0.09	పాటి ముత్తయ్య తండ్రి నారాయణ	దొంతినర్సు వెంకటేశ్వర్లు తండ్రి ఎల్లయ్య	లేవు
		విస్తీర్ణం			10.14			
49	131/2	131/2/4	పట్టా	మెట్ట	4-17	కేతినేని శ్రీనివాస్ రావు తండ్రి నారాయణ	కేతినేని శ్రీనివాస్ రావు తండ్రి నారాయణ	సుబాబుల, ఫెన్సింగ్ తాటి చెట్లు
50		132/1	పట్టా	మెట్ట		కేతినేని అనిరుద్ తండ్రి మాధవరావు	కేతినేని అనిరుద్ తండ్రి మాధవరావు	
51		131/2/2/1	పట్టా	మెట్ట		కేతినేని భువన్ తండ్రి మాధవరావు	కేతినేని భువన్ తండ్రి మాధవరావు	
		విస్తీర్ణం			4.17			
52	132/2	132/2 1	పట్టా	మెట్ట	3-37	కేతినేని శ్రీనివాస్ రావు తండ్రి నారాయణ	కేతినేని శ్రీనివాస్ రావు తండ్రి నారాయణ	సుబాబుల, ఫెన్సింగ్ తాటి చెట్లు
53		132/1	పట్టా	మెట్ట		కేతినేని అనిరుద్ తండ్రి మాధవరావు	కేతినేని అనిరుద్ తండ్రి మాధవరావు	
54		131/2/2/1	పట్టా	మెట్ట		కేతినేని భువన్ తండ్రి మాధవరావు	కేతినేని భువన్ తండ్రి మాధవరావు	
		విస్తీర్ణం			3.37			
55	133/2	133/1/2	పట్టా	మెట్ట	0.04	పాటి రమేష్ తండ్రి కోటయ్య	పాటి రమేష్ తండ్రి కోటయ్య	సుబాబుల, ఫెన్సింగ్
56		-	పట్టా	మెట్ట	1.06	పాటి ముత్తయ్య	కొలిశెట్టి సత్యవతి తండ్రి వీరయ్య	సుబాబుల, ఫెన్సింగ్
		విస్తీర్ణం			1.10			
57	154/3	-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.33	ప్రభుత్వ భూమి	కొలిశెట్టి ప్రశాంత్ తండ్రి నారాయణ (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
58		-	ప్రభుత్వ భూమి	మెట్ట	3.03	ప్రభుత్వ భూమి	కొలిశెట్టి శ్రీనివాస్ రావు తండ్రి సత్తయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
59		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.36	ప్రభుత్వ భూమి	కొలిశెట్టి ప్రశాంత్ తండ్రి నారాయణ (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
		విస్తీర్ణం			5.32			
60	154/2	-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.14	ప్రభుత్వ భూమి	దొంతినర్సు వాణి భర్త హరినాథ్ బాబు (ఆక్రమణదారులు)	లేవు వివాదం
61		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.27	ప్రభుత్వ భూమి	మాచర్ల రమేష్ తండ్రి నాగులు (ఆక్రమణదారులు)	లేవు
62		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.07	ప్రభుత్వ భూమి	దొంతినర్సు వెంకటేశ్వర్లు తండ్రి ఎల్లయ్య (ఆక్రమణదారులు)	లేవు
63		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.16	ప్రభుత్వ భూమి	పాటి నర్సయ్య తండ్రి ముత్తయ్య పాటి బుచ్చయ్య తండ్రి ముత్తయ్య (ఆక్రమణదారులు)	లేవు
64		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.37	ప్రభుత్వ భూమి	పాటి వెంకటేశ్వర్లు తండ్రి భద్రయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
65		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.09	ప్రభుత్వ భూమి	పాటి అనంతరామయ్య తండ్రి భద్రయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
66		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.20	ప్రభుత్వ భూమి	పాటి రంగయ్య తండ్రి ముత్తయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
67		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.21	ప్రభుత్వ భూమి	పాటి శ్రీనివాస్ రావు తండ్రి నర్సయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
68		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.34	ప్రభుత్వ భూమి	గుజ్జర్లపూడి నాగభూషణం తండ్రి బుచ్చయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్, పైప్ లైన్, ట్రీప్ లైన్
69		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.00	ప్రభుత్వ భూమి	కొండ బాల రాజమ్మ భర్త లేట్ వెంకయ్య (ఆక్రమణదారులు)	లేవు
70		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.33	ప్రభుత్వ భూమి	కేతినేని నాగేశ్వరరావు తండ్రి లేట్ వెంకటనారాయణ (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
71		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.08	ప్రభుత్వ భూమి	నాగండ్ల రమణమ్మ భర్త కృష్ణమూర్తి (ఆక్రమణదారులు)	లేవు
72		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.23	ప్రభుత్వ భూమి	పుసులూరి హరిస్ సింగ్ తండ్రి భద్రయ్య (ఆక్రమణదారులు)	లేవు
73		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.38	ప్రభుత్వ భూమి	పుసులూరి వీరబాబు తండ్రి భద్రయ్య (ఆక్రమణదారులు)	లేవు
74		-	ప్రభుత్వ భూమి	మెట్ట	3.14	ప్రభుత్వ భూమి	పాటి రాంబాబు తండ్రి రఘువయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
75		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.01	ప్రభుత్వ భూమి	పాటి నర్సయ్య తండ్రి బసవయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
76		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.09	ప్రభుత్వ భూమి	గుజ్జర్లపూడి రాంబాబు తండ్రి నాగభూషణం (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్, పైప్ లైన్, ట్రీప్ లైన్
77		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.27	ప్రభుత్వ భూమి	పాటి రాంబాబు తండ్రి రఘువయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
78		-	ప్రభుత్వ భూమి	మెట్ట	2.29	ప్రభుత్వ భూమి	పాటి నర్సయ్య తండ్రి బసవయ్య (ఆక్రమణదారులు) పాటి కోటయ్య తండ్రి ముత్తయ్య	సుబాబుల, ఫెన్సింగ్ (వివాదం)
79		-	ప్రభుత్వ భూమి	మెట్ట	2.19	ప్రభుత్వ భూమి	గుజ్జర్లపూడి రంగయ్య తండ్రి బుచ్చయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
80		-	ప్రభుత్వ భూమి	మెట్ట	0.33	ప్రభుత్వ భూమి	గుర్రం లింగయ్య తండ్రి నారాయణ (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
81		-	ప్రభుత్వ భూమి	మెట్ట	3.09	ప్రభుత్వ భూమి	కర్రే రమణయ్య తండ్రి నాగయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
82		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.21	ప్రభుత్వ భూమి	దుద్దుకూరి సుమంత్ తండ్రి రామయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
83		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.19	ప్రభుత్వ భూమి	ఎర్రిపోతుల రాఘవులు తండ్రి సూరయ్య (ఆక్రమణదారులు)	లేవు
84		-	ప్రభుత్వ భూమి	మెట్ట	4.00	ప్రభుత్వ భూమి	యర్రపల్లి కాంతమ్మ భర్త కోటయ్య (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్
85		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.20	ప్రభుత్వ భూమి	పాటి కస్తూరమ్మ భర్త బుచ్చయ్య (ఆక్రమణదారులు)	బోర్, కరెంట్ లైన్
86		107	ప్రభుత్వ భూమి	మెట్ట	2.00	ప్రభుత్వ భూమి	షైక్ ఉమ భర్త వెంకటేశ్వర్లు (ఆక్రమణదారులు)	సుబాబుల, ఫెన్సింగ్, తాటి చెట్లు
87		-	ప్రభుత్వ భూమి	మెట్ట	1.29	-	దొంక	లేవు
		విస్తీర్ణం			35.37			
		మొత్తం విస్తీర్ణం ఎ.కు.			104.27			
		పూర్తి విస్తీర్ణం ఎ.కు.						167.30 1/2

భూ సేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుపాధి చట్టం-2013 (నెం.30/2013)లోని 15 ప్రకారం పై భూ సేకరణ పై (25) అభ్యంతరములు నమోదు అయినవి. కావున రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. భూ సేకరణలో ఎవరు నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

బొగ్గు గనులు, ఇనుప ఖనిజ, సున్నపురాయి లేక ఇతర ఖనిజ సంపద కలిగిన భూమిని లేదా కొంత భాగముగల భూమి త్రవ్వబడిన లేదా తొలగించబడిన లేదా ప్రాజెక్టు నిర్మాణము కలెక్టర్ (భ సేకరణ), ఐ.పి.టి & రైల్వేలు, ఖమ్మం వారి కార్యాలయంలో భూసేకరణకు సంబంధించి భూముల వివరములను కార్యాలయము పనిచేయు దినములలో తనిఖీ చేసుకోవచ్చును.

భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సేకరణ), ఐ.పి.టి మరియు రైల్వేలు, ఖమ్మం మరియు జిల్లా కలెక్టర్, ఖమ్మం వారి కార్యాలయములో భూ సేకరణకు సంబంధించిన భూముల ప్లానును కార్యాలయములో పనిచేయు దినములలో తనిఖీ చేసుకొనవచ్చును.

సం/- భూ సేకరణ అధికారి/ ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), ఐ.పి.టి. మరియు రైల్వేలు, ఖమ్మం

సం/- అదనపు కలెక్టర్ ఖమ్మం

సం/- జిల్లా కలెక్టర్ ఖమ్మం

DIPR RO No. 691/LA-PP/Advt/Pub/2025-26

శ్రీరాంపూర్ ఓసీకి 'మట్టి' కొట్టారు

- రెండు ఓబీ సంస్థలు చేతులెత్తేయడంతో నిలిచిన మట్టి వెలికితీత పనులు
- పడిపోయిన బొగ్గు ఉత్పత్తి
- ఆందోళనలతో అట్టుడుకుతున్న సింగరేణి ఉపరితల గని



శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గని

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గని తీవ్ర సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఓబీ(మట్టి) పనులు చేసే రెండు కాంట్రాక్ట్ సంస్థలు ఒక దాని తర్వాత ఒకటి చేతులెత్తేశాయి. దీంతో మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభావంతో బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. గని ఏర్పడిన నాటినుంచి ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

రెండు సంస్థలకు ఓబీ పనులు

శ్రీరాంపూర్ ఓసీలో ఓబీ వెలికితీత టెండర్‌ను సీఆర్ఆర్, జీవీఆర్ సంస్థలు దక్కించుకున్నాయి. నాలుగేళ్ల నిర్దేశిత ఓబీ వెలికి తీసేలా ఒప్పందం చేసుకున్నాయి. 2022 డిసెంబర్ 1 నుంచి సీఆర్ఆర్ సంస్థ పనులు చేపట్టింది. 2023 అక్టోబర్ 1 నుంచి జీవీఆర్ సంస్థ పనులు ప్రారంభించింది. సీఆర్ఆర్ సంస్థ 720 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాల్సి ఉండగా, అక్టోబర్ 1 వరకు కేవలం 360 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే వెలికితీసింది. జీవీఆర్ సంస్థ 495 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాల్సి ఉండగా, 220 లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే తీసింది.

లాస్ వస్తుందని....

ఈ రెండు సంస్థలు తమకు నష్టం వస్తుందని అర్ధంతరంగా పనులు నిలిపివేశాయి. సీఆర్ఆర్ సంస్థ ఆగస్టు 27 నుంచి, జీవీఆర్ సంస్థ అక్టోబర్ 1 నుంచి పనులు చేయడం లేదు. టెండర్ ప్రకారం నాలుగేళ్ల కాలానికి నిర్దేశించిన ఓబీ తీయాల్సి ఉండగా, తమతో ఇక కాదని చేతులెత్తేశాయి. జీవీఆర్ సంస్థ ముందుగా నోటీసులు ఇచ్చి పనులు నిలిపివేయగా, సీఆర్ఆర్ సంస్థ చెప్పా పెట్టకుండానే పనులు నిలిపివేసింది. ఈ సంస్థకు సింగరేణి యాజమాన్యం పలుమార్లు నోటీసులు ఇచ్చింది. ఇస్తే ఇదిగో వస్తాం .. చేస్తాం.. అంటూ తప్పించుకున్నారు. చేసేది లేక యాజమాన్యం సీఆర్ఆర్‌ను టెర్మినేట్ చేసేలా నోటీసులు ఇచ్చింది.

కంపెనీలపై ఫెనాల్టీల భారం

రెండు సంస్థలకు సింగరేణి యాజమాన్యం రూ. 84 కోట్ల జరిమానా విధించింది. ఇందులో సీఆర్ఆర్ సంస్థకు రూ.57 కోట్లు, జీవీఆర్ సంస్థకు రూ. 27 కోట్ల ఫెనాల్టీ వేసింది. పనులు నిలిపివేయడానికి జరిమానా కూడా కారణమని తెలుస్తోంది.

రోజుకు 12 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం నష్టం

ఓబీ సంస్థల నిర్వాహకంతో శ్రీరాంపూర్ ఓసీలో రోజుకు 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఈ కారణంగా సంస్థ రోజుకు రూ.కోటి వరకు నష్టపోతోంది. టెండర్ సమయంలో అధికారులు ఓబీ సంస్థల సామర్థ్యాన్ని అంచనా వేయకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఓబీ సంస్థలు చేతులు ఎత్తేయడంతో సింగరేణి సొంతంగా ఓబీ పనులు చేపడుతోంది. సంస్థ ఉద్యోగులతో 3 షావల్స్‌తో ఓబీ వెలికి తీస్తున్నా.. రోజుకు కనీసం 5 వేల క్యూబిక్ మీటర్ల కూడా తీయలేకపోతోంది. మరోవైపు కాంట్రాక్టర్‌తో ఓబీ తీస్తే క్యూబిక్ మీటర్‌కు రూ.135 ఖర్చు అయితే నేడు కంపెనీ ఇందుకు రూ.400 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఓసీలో ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 1 వరకు 16.09 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 14.58 లక్షల టన్నులు మాత్రమే వెలికితీశారు. 83 శాతం లక్ష్యాన్నే సాధించారు. సమస్య పరిష్కరించి ఓబీ, బొగ్గు ఉత్పత్తి పెంచకుంటే సంస్థ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

నిత్యం ఆందోళనలు....

ఇదిలా ఉంటే సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు నిత్యం ఆందోళనలు చేస్తున్నారు. కార్మికులకు రూ.4 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో వారు వాహనాల నిలిపివేత, ఆత్మహత్యాయత్నాలు, అధికారులు ఘెరావ్‌లతో గని ఉద్రిక్తంగా మారింది. వేతనాలు చెల్లించకుంటే గనిని పూర్తిగా మూసేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల పహారాలో ఓసీ నడుస్తోంది. వేతనాలు చెల్లించకుంటే మరో రెండు రోజుల్లో అధికారుల కార్యాలయాలకు తాళం వేస్తామని కార్మికులు అల్టిమేటం ఇచ్చారు.

కొత్త టెండర్లు పిలిచాం....

జీవీఆర్ సంస్థ స్థానంలో మరో సంస్థ కోసం కొత్త టెండర్ పిలిచాం. రెండు మూడు నెలల్లో పనులు మొదలవుతాయి. ఇక సీఆర్ఆర్ ఇష్యూ కూడా సెటిల్ చేసి, దానికి కూడా టెండర్ పిలుస్తాం. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. రెండు టెండర్లు పూర్తయితే పనులు పంజుకుంటాయి. అప్పటి వరకు కంపెనీ ఆధ్వర్యంలో ఓబీ వెలికితీస్తూ వీలైనంత బొగ్గు ఉత్పత్తి చేస్తాం.

– చిప్ప వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి, ఓసీపీ పీఓ

సాగు మిగిల్చిన క'న్నీళ్లు'

సాత్నాల: ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలు అన్నదాతకు కన్నీళ్లు మిగులుస్తున్నాయి. అతివృష్టి కారణంగా పలుచోట్ల సోయా, పత్తి పంటల ఎదుగుదల లోపించింది. దిగుబడిపై ఆశలు లేని కొందరు రైతులు గత్యంతరం లేక వాటిని పశువుల మేతగా వినియోగిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండల కేంద్రానికి చెందిన రైతు లంకా రాజు తనకున్న ఎనిమిది ఎకరాల్లో ఈ సీజన్‌లో తొలుత పత్తిని సాగు చేశాడు. అధిక వర్షాలతో పోటెత్తిన వరద పంటను పూర్తిగా ముంచెత్తింది. అనంతరం మళ్లీ సోయా సాగు చేపట్టగా.. వర్షాలు, వాతావరణ మార్పులతో పంట ఎదుగుదల పూర్తిగా లోపించింది. ఎకరాకు రూ.24 వేల చొప్పున పెట్టుబడి అయింది. విత్తనాలు, ఎరువుల, కూలీల ఖర్చు కోసం దాదాపు రూ.2 లక్షల వరకు అప్పు చేశాడు. తాజాగా సోయా పంట కోసినా కనీసం హార్వెస్టర్ చార్జి కూడా రాలేదని గుర్తించిన బాధిత రైతు పంటపై ఆశలు వదులుకున్నాడు. పశువుల మేతకు వదిలేశాడు. అయితే సాగుకు చేసిన అప్పు ఎలా తీర్చాలో అంటూ కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఇతనొక్కడే కాదు మండలంలో.. దాదాపు 200 ఎకరాల్లో ఇదే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.



ఎదుగుదల లేని సోయా చేను మేస్తున్న పశువులు

వృద్ధ దంపతుల బలవన్మరణం



భూక్యా లచ్చు, వీరమ్మ (ఫైల్)

ఆత్మకూరు.ఎస్(సూర్యాపేట): అనారోగ్యంతో బాధపడుతూ ఇతరులకు భారం కారాదని భావించిన వృద్ధ దంపతులు పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం బోట్యాతండాకు చెందిన భూక్యా లచ్చు (65), భూక్యా వీరమ్మ (60) దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వీరందరి పెళ్లిలు కాగా.. కుమారులు స్థానికంగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా లచ్చు, వీరమ్మ దంపతులు వేరే ఇంట్లో నివాసముంటుండగా.. వారి ముగ్గురు కుమారులు సంవత్సరానికి ఒకసారి భృతి ఇస్తున్నారు. కొంతకాలంగా వృద్ధ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. తాము వృద్ధాప్యంలో కుమారులకు భారం కాకూడదని భావించి ఆదివారం రాత్రి ఇంట్లో గడియ పెట్టుకుని భార్యాభర్తలు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. మంటలను గమనించిన చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టగా అప్పటికే వీరమ్మ మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ లచ్చును స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుల కుమారుడు భూక్యా మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

పోక్సో కేసు పెట్టారని ఆత్మహత్య

కొణిజర్ల: బాలుడిని లైంగికంగా వేధించిన కాంట్రాక్టర్ లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేయగా.. పరువు పోయిందని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలివి. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో అరిగెల ప్రభాకర్ (44) కాంట్రాక్ట్ లెక్చరర్‌గా జువాలజీ బోధిస్తున్నాడు. కొంతకాలంగా అదే పాఠశాలలో చదివే మైనర్ బాలుడిని లైంగికంగా వేధిస్తున్నట్లు తెలిసింది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలుడు.. తిరిగి పాఠశాలకు వెళ్లేది లేదని మొరాయించడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా విషయం చెప్పాడు. దీంతో ఆదివారం బాలుడి తండ్రి కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రభాకర్‌పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అయితే, ఈ విషయం మూడు రోజుల క్రితమే ప్రిన్సిపాల్ జితేష్ సాహిల్ దృష్టికి వెళ్లగా ఆయన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ ప్రభాకర్ బెదిరించాడని తెలిసింది. ఇంతలోనే ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. విషయం బయటకు పొక్కడంతో తన పరువు పోతుందని భావించి.. మధిర నుంచి రాకపోకలు సాగించే సదరు లెక్చరర్ ఇంట్లోనే పురుగు మందు తాగినట్లు సమాచారం. ఆయన పరిస్థితి విషమించగా హైదరాబాద్ తరలించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, ఘటనపై సోమవారం పాఠశాలలో విచారణ చేపట్టి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు.

9 ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించిన టీఆర్‌పీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు జిల్లా ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు సోమవారం పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఒక ప్రకటన విడుదల చేశారు. టీఆర్‌పీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. ఆయా జిల్లాలు, మండల, గ్రామాల వారీగా పార్టీ కార్యవర్గాలను సకాలంలో నియమించుకోవాలన్నారు. అదే విధంగా జిల్లా సమాచారాన్ని ఎప్పటికప్పుడు పార్టీ కార్యాలయానికి అందజేయాలని మల్లన్న ఆదేశించారు.

జిల్లా ఇన్‌చార్జిలు: సుధగాని హరిశంకర్‌గౌడ్ (రంగారెడ్డి), మాదం రజిని కుమార్ యాదవ్ (కరీంనగర్), వట్టె జానయ్య యాదవ్ (నల్లగొండ), జ్యోతి పండల్ (మెదక్) కలివేముల మధుబాబు (ఖమ్మం), సంగెం సూర్యారావు (మహబూబ్‌నగర్), పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ (వరంగల్), భావన వెంకటేశ్ (హైదరాబాద్), కొమ్ముల ప్రవీణ్ (ఆదిలాబాద్)లను జిల్లా ఇన్‌చార్జిలుగా నియమించారు.

సిటీ పోలీసుల 'సేఫ్ రోడ్ ఛాలెంజ్'

సోషల్‌మీడియా కేంద్రంగా భారీ అవగాహన

- యువతే లక్ష్యంగా డిజైన్ చేసిన కొత్త కొత్వాల్
- తొలి దశలో హెల్మెట్, సీట్‌బెల్ట్ ధారణపై దృష్టి
- సోమవారం నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: 'సహాయం చేసిన వ్యక్తికి థాంక్స్ చెప్పకు. అతడిని ముగ్గురికి సహాయం చేయమని చెప్పి ఆ ముగ్గురూ మరో ముగ్గురికి చొప్పున సహాయం చేసేలా ప్రోత్సహించు...' సినీ నటుడు చిరంజీవి కథా నాయకుడిగా నటించిన స్టాలిన్ సినిమాలోని కాన్సెప్ట్ ఇది. నగర కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్ దీన్ని పోలిన వినూత్న కార్యక్రమానికి డిజైన్ చేశారు. 'హ్యాష్‌ట్యాగ్ సేఫ్ రోడ్ ఛాలెంజ్' పేరుతో సోషల్‌మీడియా కేంద్రంగా సోమవారం ప్రారంభించారు. తొలి దశలో హెల్మెట్, సీట్‌బెల్ట్ ధారణపై దృష్టి పెట్టిన కమిషనర్ వాటి వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు.

సోషల్‌మీడియా, వైరల్... ఇవే ట్రెండ్స్

రహదారి భద్రతతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించడానికి కొన్నేళ్లుగా ట్రాఫిక్ విభాగం వివిధ రకాలైన కార్యక్రమాలు చేపడుతోంది. ఇటీవల కాలంలో సోషల్‌మీడియా ట్రెండ్ నడుస్తోంది. అందులో తమ ఫొటోలు, వీడియోలు వైరల్ కావాలని ఆశించే వాళ్లు అనేక మంది ఉంటున్నారు. ఈ ధోరణి యువతలో ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే వాహనచోదకులు.. ప్రధానంగా యువతలో అవగాహన పెంచడానికే సజ్జనర్ 'హ్యాష్ ట్యాగ్ సేఫ్ రోడ్ ఛాలెంజ్'ను డిజైన్ చేశారు. అనునిత్యం ఏదో ఒక ఫొటో, వీడియో, కామెంట్లను పోస్టు చేసే నెటిజనుల దృష్టిని రహదారి భద్రత వైపు మళ్లించడానికి, ఈ అంశాలను ప్రచారం కల్పించడానికి అనువుగా దీన్ని కమిషనర్ రూపొందించారు.

ప్రయాణం ప్రారంభానికి ముందు...

దీనికి సంబంధించిన విధివిధానాలను కొత్వాల్ సజ్జనర్ సోమవారం తన అధికారిక 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ ఛాలెంజ్‌లో భాగంగా వాహనచోదకుడు తన ప్రయాణాన్ని ప్రారంభించే ముందు హెల్మెట్ (ద్విచక్ర వాహనం), సీట్‌బెల్ట్ (తేలికపాటి వాహనం) కచ్చితంగా ధరించాలి. అలా తాను రహదారి భద్రత నిబంధనలు పాటిస్తున్నట్లు చిన్న ఫొటో లేదా వీడియో తీసుకోవాలి. దాన్ని తమ సోషల్ మీడియా ఖాతా ద్వారా 'సేఫ్ రోడ్ ఛాలెంజ్' అనే హ్యాష్ ట్యాగ్ ద్వారా షేర్ చేయాలి. ఆ సమయంలో తమ ఫ్రెండ్స్ లిస్ట్ లేదా ఫాలోవర్స్‌లో ఉన్న ముగ్గురు స్నేహితులు లేదా బంధువుల్ని ఎంచుకోవాలి. వాళ్లు సైతం ఈ ఛాలెంజ్‌ను స్వీకరించేలా ట్యాగ్ చేస్తూ ప్రోత్సహించాలి.

గత వారమే చిరంజీవితో భేటీ...

తొలిదశలో హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడకం పెంచేలా, వీటిపై అవగాహన కలిగేలా, కలిగించేలా నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ చేపట్టిన ఈ 'హ్యాష్‌ట్యాగ్ సేఫ్ రోడ్ ఛాలెంజ్'ను కొనసాగించనున్నారు. దశల వారీగా వివిధ రకాలైన రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఎన్స్‌ఫోర్స్‌మెంట్‌తో (జరిమానాల విధింపు) పాటు ఎడ్యుకేషన్‌కు సమ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్న కొత్వాల్ ఈ దిశలో కీలక నిర్ణయం తీసుకున్నారు. 'హ్యాష్‌ట్యాగ్ సేఫ్ రోడ్ ఛాలెంజ్' చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలోని కాన్సెప్ట్‌ను పోలి ఉంది. గత శనివారం చిరంజీవితో పాటు ఆయన కుమార్తె సుస్మిత బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో సజ్జనార్‌ను మర్యాదపూర్వగా కలిసి భేటీ కావడం గమనార్హం.

భద్రత అనేది నిత్యనూతన ఫ్యాషన్: విశ్వనాథ్ చన్నప్ప సజ్జనర్

రహదారి భద్రత అనేది ఎప్పటికీ పాతబడని, నిత్యనూతనంగా ఉండే ఫ్యాషన్. ప్రతి ప్రయాణం మిమ్మల్ని, మీరు ప్రేమించే వారిని సురక్షితంగా ఉంచాలనే తీర్మానంతోనే మొదలవ్వాలి. నగరవాసులం అంతా కలిసి 2025లో భద్రతనే ఓ వైరల్ ట్రెండ్‌గా మారుద్దాం. ప్రతి ఒక్కరూ ఈ ఛాలెంజ్‌లో ఉత్సాహంగా పాల్గొనాలి. ఈ విధంగా ఒకరి నుంచి మరొకరికి స్ఫూర్తిపొందుతూ, యువతలో ట్రాఫిక్ నియమాలపై గౌరవాన్ని పెంచాలి. సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులను ఓ అలవాటుగా మార్చాలన్నదే ఈ ఛాలెంజ్ ప్రధాన లక్ష్యం. ఇది ప్రతి ప్రయాణానికి ముందు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడం, హెల్మెట్ కచ్చితంగా ధరించడం, ఈ నియమాలను పాటించేలా ఇతరులకూ స్ఫూర్తినివ్వడం... ఈ మూడు ముఖ్యమైన సూత్రాలను గుర్తు చేస్తుంది. ఈ డిజిటల్ ఛాలెంజ్‌లో ప్రజలను విస్తృతంగా భాగస్వాములను చేయడం ద్వారా, నగర రహదారులపై భద్రత, బాధ్యతతో కూడిన సంస్కృతిని నిర్మిద్దాం.

మద్యం పాలసీపై స్టేకు నిరాకరణ

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మద్యం పాలసీపై ఎలాంటి నిలిపివేత ఆదేశాలివ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. సర్కార్ విధానపరమైన నిర్ణయంతో జోక్యం చేసుకోలేమని చెప్పింది. ఫీజు విధానంపై అభ్యంతరం ఉంటే పిటిషనర్ దరఖాస్తు చేయకుండా ఉండవచ్చని అభిప్రాయపడింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ వచ్చే నెల 3కు వాయిదా వేసింది. 2025-27 సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన గడ్డం అనిల్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు ఫీజును ప్రభుత్వం రూ.3 లక్షలుగా నిర్ధారించిందని తెలిపారు. దుకాణాలు పొందని వారికి ఈ మొత్తాన్ని తిరిగి ఇచ్చేలా ఆదేశించాలన్నారు. అలాగే గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తోందని, వీరికి ఫీజులో ఎలాంటి తగ్గింపు రాయితీ ఇవ్వలేదని చెప్పారు. 2021లో పిటిషనర్‌కు మద్యం లైసెన్స్ ఉందని, 2023-25 సంవత్సరాలకు సంబంధించి లాటరీలో పిటిషనర్‌కు దుకాణం ఖరారు కాకపోవడమే కాకుండా, ఫీజును ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు. ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, ప్రక్రియ కొనసాగించినా.. దుకాణాలు కేటాయించకుండా స్టే ఇవ్వాలని కోరారు.

బాలుర సదనం ఘటనలో బాధ్యులపై వేటు

- గార్డ్ స్టాఫ్ తొలగింపు
- హెడ్ సూపరింటెండెంట్ సస్పెన్షన్
- హోమ్ ఇన్‌చార్జ్ బదిలీ

సాక్షి, హైదరాబాద్: సైదాబాద్‌లోని బాలుర సదనం (చిల్డ్రన్ హోమ్)లో విద్యార్థులపై లైంగిక దాడి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనకు పాల్పడిన గార్డ్ స్టాఫ్‌ను శాశ్వతంగా తొలగించగా.. ఇక్కడ పనిచేస్తున్న హెడ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హోమ్ ఇన్‌చార్జిని ఇక్కడినుంచి బదిలీ చేయాలని ఆదేశించారు. దీనిపై కమిషన్ సంబంధిత జువైనల్ వెల్ఫేర్ ఉప సంచాలకులకు ఆదేశాలు జారీ చేయడంతో.. ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇక్కడున్న రెండు చిల్డ్రన్ హోమ్‌లతో పాటు స్పెషల్ హోమ్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి నివేదిక సమర్పించాలని జువైనల్ వెల్ఫేర్ శాఖ అధికారిని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై సోమవారం సాయంత్రం వరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ తర్వాత సచివాలయంలో మంత్రి సీతక్క కూడా ఈ అంశంపై సమీక్ష నిర్వహించినట్లు తెలిసింది. కొంతకాలంగా ఈ మూడు హోమ్‌లలో జరుగుతున్న ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. ఒకట్రెండు రోజుల్లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పినట్లు తెలిసింది.

ఎల్ఈడీ తెరలపై వేములవాడ రాజన్న దర్శనం

ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: వేములవాడ దేవాలయ అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యాన్ని కల్పించనున్నట్టు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ప్రకటించారు. పనులు పూర్తయ్యేవరకు సమీపంలోని భీమేశ్వరాలయంలో దర్శనాలు, కైంకర్యాలు నిర్వహించనున్నట్టు దేవాదాయశాఖ ఇప్పటికే ప్రకటించింది. ప్రధా న దేవాలయాన్ని మూసేస్తున్నారన్న ప్రచారంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని పలువురు నేతలు తెలిపారు. దీన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రధాన దేవాలయంలో స్వామివారి దర్శన అవకాశాన్ని తాత్కాలిక పద్ధతిలో కల్పించనున్నట్టు తాజాగా దేవాదాయశాఖ ప్రకటించింది. భక్తుల కోరిక మేరకు ఆర్జిత సేవలను కూడా నిర్వహించనున్నట్టు శైలజారామయ్యర్ వెల్లడించారు. వచ్చే జనవరిలో మేడారం జాతర నేపథ్యంలో సమ్మక్క-సారలమ్మను దర్శించుకునే భక్తులకు, మేడారం దర్శనానికి ముందు ఆ తర్వాత శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనభాగ్యం కల్పిస్తున్నట్టు తెలిపారు.

పేదరికంపై తుది పోరాటంగా మారాలి

- తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమంపై మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: పేదరిక నిర్మూలనకు మోడల్‌గా తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి కార్యక్రమం (టీజీఐఎల్‌పీ) మారాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆకాంక్షించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పేదరికంపై తుది పోరాటంగా మారాలనే విశ్వాసాన్ని ఆమె వ్యక్తంచేశారు. స్థానిక వనరులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా జీవనోపాధి కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో లభించే ఇప్పపువ్వు ఆధారంగా నూనె, ఆహార పదార్థాల తయారీకి సంబంధించిన కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్కను అంతర్జాతీయ సంస్థ బీఆర్‌ఏసీ 'బ్రాక్' ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలోని అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన టీజీఐఎల్‌పీని బ్రాక్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అత్యంత పేద కుటుంబాలకు దీర్ఘకాలిక ఆదాయ మార్గాలను కల్పించి, ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపించాలన్నారు. సీతక్క సూచనలకు సానుకూలంగా స్పందించిన బ్రాక్ ప్రతినిధులు.. మరో 8 వేల కుటుంబాలకు నైపుణ్య శిక్షణతోపాటు వారి ఆదాయ మార్గాలను పెంచేలా చేయూత అందిస్తామన్నారు. సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తెలంగాణలో ఈ కార్యక్రమ పురోగతిని వివరించారు. సమావేశంలో గ్రెగరీ చెన్ (ఎండీ, అల్ట్రాపూర్ గ్రాడ్యుయేషన్ ఇనీషియేటివ్), శ్వేతా బెనర్జీ (ఇండియా లీడ్), ఉషారాణి (ప్రోగ్రాం లీడ్), వి.రమేశ్ (సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్), అభిషేక్ (ప్రోగ్రాం అసోసియేట్) పాల్గొన్నారు.

వివాదాస్పద ప్రకటనలు వద్దు


చిరంజీవి, నయనతారలతో రాంచందర్‌రావు కుటుంబ సభ్యులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని పార్టీ నేతలకు హెచ్చరిక
- రాష్ట్ర అధ్యక్షుడిగా 100 రోజులు పూర్తి

సాక్షి, హైదరాబాద్: పార్టీ నాయకులు క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ చేసే వ్యక్తిగత, వివాదాస్పద ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశించారు. ఇదే విధంగా తమ వ్యవహారశైలిని కొనసాగించిన పక్షంలో తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులకు రాంచందర్‌రావు లేఖ రాసినట్టుగా పార్టీ వర్గాల సమాచారం. శనివారం ఢిల్లీవెళ్లి జాతీయపార్టీ ముఖ్యనేతలతో సమావేశమై వచ్చిన వెంటనే ఆయన ఈ లేఖను విడుదల చేసినట్టు తెలుస్తోంది. కొంతమంది సీనియర్ నాయకులు పార్టీ క్రమశిక్షణ, సిద్ధాంతం, నాయకత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రకటనలను జాతీయ నాయకత్వం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఎవరైనా సరే.. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అంతర్గత విషయాలను సోషల్ మీడియాలో పెట్టడం పార్టీ సిద్ధాంతానికి విరుద్ధమని స్పష్టంచేశారు. అభిప్రాయ బేధాలు ఉంటే వాటిని పార్టీ అంతర్గత వేదికల మీద మాత్రమే చర్చించాలని సూచించారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు సోమవారంతో వందరోజులు పూర్తిచేసుకున్నారు. 'పల్లె నిద్ర'వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు.

చిరంజీవితో సమకాలీన రాజకీయాలపై చర్చించా..

ఇదిలా ఉండగా ప్రముఖ సినీనటుడు చిరంజీవితో సినీరంగ విశేషాలు, సమకాలీన రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చించినట్లు ఎక్స్‌వేదికగా రాంచందర్‌రావు తెలిపారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న తన మనమరాలు ఐరా ఆశీష్ కోరిక మేరకు.. తమ కుటుంబ సభ్యులతో కలసి సినీహీరో చిరంజీవి, నటి నయనతారలను సోమవారం షూటింగ్‌స్పాట్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నట్టు ఆయన వివరించారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ఆత్మీయంగా పలకరించి, తమకు సమయం కేటాయించిన చిరంజీవికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

హామీలపై కాంగ్రెస్ సర్కార్‌వి 420 మాటలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడేదంతా 420 కేసుల మాదిరిగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. సోమవారం రాంచందర్‌రావు సమక్షంలో.. ఖమ్మం, దేవరకొండ, నాగర్ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి పలువురు పార్టీలో చేరారు.

'బంద్ ఫర్ జస్టిస్' బంద్‌కు సీపీఐ మద్దతు

సాక్షి, హైదరాబాద్: 'బంద్ ఫర్ జస్టిస్'పేరుతో ఈ నెల 18న బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ (బీసీ జేఏసీ) తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బీసీ బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని ఆయన స్పష్టం చేశారు. 'బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ'జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సోమవారం మఖ్దూం భవన్‌లో.. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు సోమవారం లేఖ అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాలకు కోసం పనిచేయడం, పోరాటం చేయడమే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతమని చెప్పారు. బీసీ హక్కుల సాధన సమితి ఈ నెల 15న చేపట్టనున్న రాస్తారోకోకు కూడా మద్దతు ఇవ్వాలని ఆయన బీసీ జేఏసీని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు బీజేపీ ప్రభుత్వం కుట్ర

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొత్త చట్టం వస్తే.. సుమోటోగా ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ చార్జీల పెంపు అమల్లోకి వచ్చేలా మార్పులు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రమాదకరమైన మార్పులకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజలు, రైతులు, సంఘాలు ముందుకు రావాలని కోరారు. కేంద్రం తీరుకు నిరసనగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు కూడా ఇందులో భాగమేనని, కేంద్రం నిర్ణయాలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. తెలంగాణలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్, 200 యూనిట్లలోపు వినియోగించే ఇళ్లు, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అమలవుతోందని గుర్తు చేశారు. సబ్సిడీ వినియోగించే వినియోగదారులను కొత్త డిస్కం పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. బిహార్‌లో మహాకూటమిలో చేరేందుకు నిరాకరిస్తున్నందుకే వంద సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించినట్లు ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారని, చెప్పినట్టు వినలేదు కాబట్టి నచ్చినట్టు పోటీ చేస్తాననడం సరైంది కాదని రాఘవులు హితవు పలికారు.

శ్రీరాంసాగర్-2వ దశకు బీఎన్ పేరు పెట్టాలి

ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): త్యాగధనులను రాజకీయాలకు అతీతంగా గౌరవించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని విస్మరిస్తే చరిత్ర క్షమించదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వనం సుధాకర్ అన్నారు. శ్రీరామ్ సాగర్-2వ దశకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు, ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు, అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి (బీ.ఎన్) పేరును పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వనం సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సూర్యాపేటలో చేసిన ప్రకటనను వెనక్కుతీసుకుని అమరజీవి కామ్రేడ్ బీ.ఎన్ పేరు ఎస్ఆర్ఎస్‌పీ-2వ దశకు పెట్టాలని, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలు సాధించే వరకు, ఆ జలాలు తన గొంతులో పడ్డ తరువాతే నాకు విరమణ అని చెప్పి సాధించిన మహనీయుడు కామ్రేడ్ బీ.ఎన్ అని ఆయన గుర్తు చేశారు.

హరిరామ్, నికేశ్ ఆస్తులు అటాచ్

- అక్రమాస్తుల కేసు నిందితులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్
- నోటిఫికేషన్లు జారీ చేసిన నీటిపారుదల శాఖ
- త్వరలో ఈఈ నూనె శ్రీధర్ ఆస్తులు సైతం అటాచ్
- విజిలెన్స్ కమిషన్ అనుమతి కోరిన సర్కారు


హరిరామ్

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఈఎన్సీ (గజ్వేల్), కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీఎల్) మాజీ ఎండీ భూక్యా హరిరామ్, ఆ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) హెచ్.నికేశ్‌కుమార్ ఆస్తులను అటాచ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం రెండు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు. తెలంగాణ విజిలెన్స్ కమిషన్ అనుమతితో ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది. ప్రస్తుతం హరిరామ్, నికేశ్ సస్పెన్షన్‌లో ఉన్నారు. హరిరామ్‌కు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో ఉన్న 28 ఎకరాల వ్యవసాయ భూమి, షేక్‌పేట, కొండాపూర్‌లలో ఉన్న విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్ కాలనీ, నార్సింగిలో ఉన్న ఫ్లాట్లు, శ్రీనగర్ కాలనీలోని రెండు నివాస గృహాలు, పటాన్‌చెరులోని 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలలోని ఓపెన్ ప్లాట్లతో పాటు ఏపీ రాజధాని అమరావతిలో ఉన్న వాణిజ్య స్థలాన్ని అటాచ్ చేస్తున్నట్టు నోటిఫికేషన్‌లో ప్రభుత్వం తెలిపింది. క్రయవిక్రయాలకు ఆస్కారం లేని నిషేధిత జాబితాలో ఈ ఆస్తులను పొందుపరచనుంది. గత ఏప్రిల్‌లో హరిరామ్‌ను ఏసీబీ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించగా, ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఏఈఈ నికేశ్‌కుమార్‌కు సంబంధించి రూ.17.73 కోట్ల విలువైన ఆస్తులను సైతం అటాచ్ చేస్తూ మరో నోటిఫికేషన్ జారీ అయింది. బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఆస్తులను అటాచ్ చేయడమంటే తాత్కాలికంగా జప్తు చేయడమే. కోర్టు తుది ఉత్తర్వులు నిందితులకు అనుకూలంగా వస్తే ఆ ఆస్తులను వారికి తిరిగి అప్పగిస్తారు. లేకుంటే ప్రభుత్వం శాశ్వతంగా జప్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

త్వరలో నూనె శ్రీధర్ ఆస్తులు సైతం...

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఆస్తులను సైతం త్వరలో ప్రభుత్వం జప్తు చేసే అవకాశం ఉంది. ఈ మేరకు తెలంగాణ విజిలెన్స్ కమిషన్ అనుమతిని ప్రభుత్వం కోరింది. కమిషన్ అనుమతించిన వెంటనే ఆస్తులను అటాచ్ చేయనున్నట్టు తెలిసింది.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



క్వింటాల్ పత్తి రూ.6,400

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో సోమవారం క్వింటాల్ పత్తి రూ.6,400 పలికింది. 1,408 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్రయ విక్రయాలను మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్న, కార్యదర్శులు మల్లేశం, రాజా పర్యవేక్షించారు.



రైతు కష్టం.. వర్షంతో నష్టం

వరికోతల సమయంలో రైతులను వర్షాలు భయపెడుతున్నాయి. సోమవారం కురిసిన వర్షానికి జిల్లాలో అక్కడక్కడ కోతకొచ్చిన వరి నేలవాలింది.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 31.0/25.0

వాతావరణం

జిల్లాలో వర్షం కురిసే అవకాశాలున్నాయి. గాలిలో తేమ ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి. ఎండ తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజన్న ఆలయ పరిసరాల్లోనే దర్శనం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: భీమన్న గుడిలో కాదు.. రాజన్న ఆలయ పరిసరాల్లోనే భక్తులకు దర్శనం కల్పించనున్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, దేవాదాయశాఖ అధికారులతో సోమవారం ఈ విషయంపై చర్చించారు. కోడెమొక్కుల చెల్లింపు అనాదిగా వస్తున్న ఆచారమని, భక్తుల మనోభావాలకు విరుద్ధంగా రాజన్న ఆలయానికి బదులు భీమన్న ఆలయాన్ని అంగీకరించేది లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే 30 వేల మంది బీజేపీ కార్యకర్తలతో 15 రోజులపాటు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మేడారం జాతర దృష్ట్యా, రాజన్న భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బండి సంజయ్ సూచనలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారని, అవసరమైతే ఎల్‌ఈడీ స్క్రీన్, తాత్కాలిక ఏర్పాట్లతో భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామని సిరిసిల్ల డీపీఆర్వో కార్యాలయం ప్రకటన జారీ చేసింది.

నా భూమి లాక్కుంటారా?



తహసీల్దార్‌తో రైతు వాగ్వాదం

కరీంనగర్ అర్బన్: దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమిలో అధికారులు దౌర్జన్యంగా ఖనీళ్ల పాతారంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. కోర్టు స్టే ఉండగా ఎలా సర్వే చేస్తారని కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట కంటతడి పెట్టాడు. చొప్పదండి మండలం కొలిమికుంట శివారులోని సర్వే నంబర్ 307/ఎ/3/1లో ఏడు గుంటల భూమి గోస్కుల కొమురయ్య పేరున ఉంది. గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కోర్టును ఆశ్రయించగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, అవేవీ పట్టించుకోకుండా పంటను ధ్వంసం చేశారని కొమురయ్య వాపోయాడు. తహసీల్దార్, సర్వేయర్‌లు అక్రమార్కులకు అండగా నిలుస్తుండగా, ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నించారు. ఈ క్రమంలో తహసీల్దార్ నవీన్, రైతు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పార్క్ స్థలం పరిశీలన



పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ముకరంపురలో వివాదాస్పద పార్క్ స్థలాన్ని సోమవారం నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. 'కబ్జాలపై కదలికేది!' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై స్పందించారు. ముకరంపురలోని స్థలం వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలించారు. ఈ స్థలం తనదేనంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా, స్థలయజమాని పక్షాన ఆదేశాలు జారీ అయ్యాయని డీసీపీ బషీర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ న్యాయ విభాగం సలహాల మేరకు తగిన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై రోడ్డు వేయండి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్: కేబుల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలు ఉండటంతో ఇప్పటి వరకు 15 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ముగ్గురు చనిపోయారని, వెంటనే కేబుల్ బ్రిడ్జిపైన రోడ్డు వేయాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు వేయాలని ధర్నా నిర్వహించారు. ఆవుల ఆదిత్య, సాయిఅనురాగ్, ఆనంద్, శ్రవణ్, పవన్, రఘు, సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సెపక్ తక్రాలో పతకాలు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో ఈనెల 10నుంచి 12వరకు జరిగిన 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్ను విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులను జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు కన్న కృష్ణ, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి అభినందించారు.

నిషాపై నిఘా



కరీంనగర్‌క్రైం: నగరంలోని కొరియర్, పార్సిల్, కార్గో సెంటర్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పోలీసు జాగిలాలు రాంబో, లియో, మైకీ, టైసన్ తనిఖీల్లో పాల్గొన్నాయి. సీపీ గౌస్ ఆలం స్వయంగా పర్యవేక్షించారు. కొరియర్, కార్గో ద్వారా మాదక ద్రవ్యాలు, గంజాయి, ఎక్స్‌ప్లోజివ్స్ అక్రమంగా రవాణా అవుతున్నాయనే అనుమానంతో తనిఖీలు నిర్వహించామని సీపీ తెలిపారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు పాల్గొన్నారు.

ఘన నివాళి



విద్యానగర్(కరీంనగర్): 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల పరిస్థితి దయనీయంగా మారి, దాచుకున్న డబ్బులు అందక ప్రాణాలు పోతున్నాయని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి అన్నారు. రిటైర్డ్ అయి బకాయిలు అందక మరణించిన ఉద్యోగులకు కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ప్రభాకర్‌రావు, రవీందర్, జగదీశ్వరచారి ఉన్నారు.

హనుమ వాహనంపై స్వామివారు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని యజ్ఞవరాహక్షేత్రంలో 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం దివ్య ప్రబంధ పారాయణం, అష్టోత్తర శత కలశ మహాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామివారు హనుమ వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. సర్వ వైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ శ్రీభాష్యం వరప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



హనుమవాహనంపై విహరిస్తున్న స్వామివారు

కాంక్రీట్ పిల్లర్ల రాజన్న మండపం!

- యాదాద్రి తరహాలో రాయి శిలలు వాడటం లేదా?
- రాతితో ప్రాచీన పరంపర ప్రతిబింబిస్తుందంటున్న భక్తులు
- పిల్లర్లకు పలకలు వేసినా.. నాణ్యంగానే ఉంటాయంటున్న అధికారులు
- సమ్మక్క జాతరకు ముందు రాజన్న దర్శనంపై అపోహలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్ ✍:

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఇప్పటికే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణం ఎలా సాగుతోందనే అంశం తెరపైకొచ్చింది. యాదాద్రి ఆలయాన్ని కృష్ణశిల రాయితో నిర్మించినట్టుగానే ఇక్కడ జరిగేనా లేక పిల్లర్లతో నిర్మిస్తారా? అనే చర్చ సాగుతోంది. సుమారు 70 పిల్లర్లతో స్లాబు వేసి రాజన్న ఆలయ మండపం నిర్మించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆలయ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.76కోట్లను మంజూరు చేసింది. యాదాద్రి ఆలయ నిర్మాణానికి రూ.300 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేసింది. దీన్ని బట్టి చూస్తే యాదాద్రి తరహాలో రాజన్న ఆలయ నిర్మాణం పూర్తయ్యేనా అనే అపోహలు భక్తుల్లో నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం, దేవాదాయశాఖ స్పష్టమైన వివరణ ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

పీఠాధిపతి రాకతో అపోహలు తొలగేనా?

ఈనెల 19న శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేకర భారతిస్వామి వేములవాడ ఆలయాన్ని సందర్శించి సలహాలు, సూచనలు అందించనున్నారు. ఈనేపథ్యంలో పీఠాధిపతి రాకతోనైనా ఆలయ నిర్మాణం విషయంలో స్పష్టత వచ్చేనా అని భక్తులు, స్థానికులు ఎదురుచూస్తున్నారు. స్వామీజీ సూచనల మేరకే దేవాదాయశాఖ ఆలయ పునర్నిర్మాణ విషయంలో మాస్టర్‌ప్లాన్ బ్లూప్రింట్ సిద్ధం చేసింది. ఇందులో పిల్లర్లతో నిర్మాణం చేపడుతున్నట్లు భక్తులు చర్చించుకుంటున్నారు. ఇదే కొనసాగితే రాజన్న ఆలయ ఆధ్యాత్మికతకు భంగం కలిగే అవకాశం ఉందని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే ప్రాచీనతకు అద్దం పట్టినట్లు ఉండే రాజన్న ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. యాదాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మికతకు అద్దం పట్టేలా నిర్మించారు. అంతకంటే పురాతన చరిత్ర గల రాజన్న ఆలయాన్ని అలాంటి శైలిలోనే నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. కాకతీయుల కాలం నాటి ప్రాచీన ఆలయానికి ఆధునిక పిల్లర్లు కట్టి, వాటికి రాతి పలకలు అద్దితే నాణ్యత ఎంత కాలం ఉంటుందనే విషయంపైనా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేశ్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. కాంక్రీట్ పిల్లర్లతో మండప నిర్మాణం వాస్తవమేనని, ఆ పిల్లర్లకు రాతి పలకలు తొడుగుతామన్నారు. దీని నాణ్యత చాలాకాలం ఉంటుందని స్పష్టం చేశారు.



వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయం



యాదాద్రిలో రాతి పిల్లర్ల నిర్మాణం (ఫైల్)

దర్శన భాగ్యం కలిగేనా?

రాజన్న ఆలయ పునర్నిర్మాణం జరిగే సమయంలో భక్తులకు దర్శన భాగ్యం కలిగేనా లేక నిలిపివేస్తారా? అని అనుమానాలు ఉన్నాయి. దేవాదాయశాఖ అధికారులు నిర్మాణ సమయంలో స్వామివారికి ఏకాంత సేవలు మాత్రమే కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో భక్తులకు రాజన్న దర్శనం కలిగేనా అనే అపోహలు నెలకొన్నాయి. నిర్మాణ సమయంలో భక్తులకు భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనాలు ఉంటాయని, ఉత్సవ విగ్రహాలను మూడు రోజుల క్రితమే తరలించారు. కోడెమొక్కులు కూడా భీమేశ్వరాలయంలోనే ఏర్పాటు చేశారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు భక్తులకు రాజన్న ఆలయం నిర్మాణ సమయంలో దర్శన అవకాశం కల్పించాలని ఆందోళన చేస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో రమాదేవి ఆలయం మూసివేత ఉండదని, ఆలయంలో జరిగే ఏకాంత పూజలు యథావిధిగా కొనసాగుతాయని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ యాదాద్రి కానీ, కాణిపాకం ఆలయంలో గానీ పునర్నిర్మాణ విషయంలో భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. ఇక్కడ అందుకు విరుద్ధంగా దర్శనాలు నిలిపివేయడం సరికాదంటున్నారు. మేడారం సమ్మక్క జాతర సందర్భంగా ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ.. అని ఇలాంటి సమయంలో దర్శనం విషయంలో గందరగోళం కలిగించే ప్రకటనలు సరికాదని హితవు పలుకుతున్నారు.

కదిలిన జవాన్ల పీఠాలు

- అందరికీ స్థానచలనం
- కొందరికి మాత్రం పక్క డివిజన్లు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: ఎట్టకేలకు నగరంలోని పారిశుద్ధ్య జవాన్ల పీఠాలు కాస్త కదిలాయి. నగరంలోని 66 డివిజన్లకు సంబంధించిన 61 మంది జవాన్లను అంతర్గతంగా బదిలీ చేస్తూ నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా డివిజన్లలో ఏళ్లుగా పాతుకుపోయిన జవాన్లు చెత్త పేరుతో దందా సాగిస్తుండడం, రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న తీరుపై గతంలో 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడం తెలిసిందే. కొంతమంది నేతల అండదండలతో జవాన్ల అక్రమాలకు పాల్పడుతుండడం, ఒకే డివిజన్‌లో తిష్ట వేయడంపై కథనాల్లో పేర్కొనడంతో కమిషనర్ స్పందించారు. 10 మంది ప్రభుత్వ, 51 మంది ఔట్‌సోర్సింగ్ జవాన్లను బదిలీ చేశారు. కొద్దిమందికి రెండు డివిజన్‌ల బాధ్యతలు అప్పగించారు. ముగ్గురికి నైట్‌స్వీపింగ్, ఒకరికి కంట్రోల్ రూం శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

పక్క డివిజన్లే

సుదీర్ఘకాలం తరువాత శానిటేషన్ జవాన్లకు స్థానచలనం కలిగినా, పైరవీలు పనిచేశాయనే ప్రచారం జరుగుతోంది. 'సాక్షి' గతంలోనే చెప్పినట్లు పక్క డివిజన్లకే బదిలీ అయి, మళ్లీ అదే ప్రాంతంలో తమ ఆధిపత్యం చలాయించేందుకు జవాన్లు సిద్ధం అవుతున్నారు. సోమవారం జరిగిన బదిలీలను చూస్తే కొంతమందికి పక్క డివిజన్‌కే బదిలీ చేశారు. అంటే కేవలం బదిలీ అయినట్లుగానే ఉంటుంది తప్ప, అదే ప్రాంతంలో మళ్లీ దందాను యథేచ్ఛగా సాగించే అవకాశం ఏర్పడింది. పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య జవాన్ల ప్రక్షాళన జరగాలంటే, పక్క డివిజన్ల బదిలీలను కూడా మార్చాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.



జవాన్ల దందాపై 'సాక్షి' ప్రచురించిన కథనాలు

ప్రీప్రైమరీ కేంద్రాల్లో నమోదును పెంచాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ కేంద్రాల్లో నమోదును పెంచాలని, ప్రతికేంద్రంలో 20 మంది పిల్లలు తగ్గకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఈవోలు, ఎంపీడీవోలు, సీడీపీవోలతో సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న 20 ప్రీప్రైమరీ కేంద్రాల్లో నమోదు తక్కువగా ఉందని, వారం రోజుల్లోగా ప్రతికేంద్రంలో 20 మంది పిల్లలను నమోదు చేయించాలని ఆదేశించారు. ఐసీడీఎస్, విద్యాశాఖ, ఎంపీడీవోలు సమన్వయంతో కేంద్రాల్లో వసతులు కల్పన పూర్తి చేయించాలన్నారు. డీఈవో మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

యూనిసెఫ్ కార్యక్రమాలపై సమీక్ష

కరీంనగర్ అర్బన్: రానున్న రోజుల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలపై సోమవారం యూనిసెఫ్ సంస్థ అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి సమీక్షించారు. ఈ నెల 15న గ్లోబల్ హ్యాండ్ వాష్ డే, స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రతినిధులతో చర్చించారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో విజయవంతంగా సాగుతున్న విటమిన్ గార్డెన్ గురించి తెలియజేయాలన్నారు. యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్, కన్సల్టెంట్ ఫణీంద్ర, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయ కర్తలు వేణు, రమేశ్ పాల్గొన్నారు.

డీసీసీకి 32 సిటీ ప్రెసిడెంట్‌కు 22

- తొలిరోజు కాంగ్రెస్‌లో పోటాపోటీగా దరఖాస్తులు
- సాయంత్రానికి చేరుకున్న ఏఐసీసీ పరిశీలకులు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జిల్లా, నగర అధ్యక్ష స్థానాలు ఆశిస్తున్న వారి నుంచి డీసీసీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. అధ్యక్ష స్థానాలను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ పరిశీలకులను నియమించగా, ఆ పరిశీలకులు స్వయంగా దరఖాస్తులు స్వీకరిస్తారని ముందుగా ప్రచారం జరిగింది. కాని పరిశీలకులు సోమవారం సాయంత్రానికి నగరానికి చేరుకోగా, అంతకుముందే డీసీసీ కార్యాలయ కార్యదర్శులు నాత శ్రీనివాస్, దొంతి గోపి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 18వ తేదీ వరకు కొనసాగనుంది. కాగా డీసీసీ అధ్యక్ష స్థానానికి 32 మంది, సిటీ ప్రెసిడెంట్‌కు 22 మంది దరఖాస్తు చేసుకోవడం పార్టీ వర్గాలనే ఆశ్చర్యానికి గురిచేసింది.

డీసీసీకి 32 దరఖాస్తులు

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష స్థానానికి మొదటి రోజు 32మంది దరఖాస్తు చేసుకున్నారు. వెలిచాల రాజేందర్‌రావు, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆరెపల్లి మోహన్, పత్తి కృష్ణారెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్నా రెడ్డి, కాశిపాక రాజేష్, సత్తు మల్లేశం, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఉట్కూరి నరేందర్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నెల్లి నరేశ్, మహమ్మద్ తాజుద్దీన్, మాచర్ల ప్రసాద్, దాసరి భూమయ్య, తిప్పారపు సంపత్, మహమ్మద్ ఖలీముద్దీన్, మ్యాకల రవీందర్, సయ్యద్ జమాలుద్దీన్, మూల జైపాల్, మహమ్మద్ అబ్దుల్ సలాం, ఎస్‌కే. సిరాజ్ హుస్సేన్, శ్రీపురం నాగప్రసాద్, పడాల రాహుల్, దీకొండ శేఖర్, రుద్ర సంతోష్, ప్యాట రమేష్, సారంగపాణి, చర్ల పద్మ దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు.



డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకుంటున్న పీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్

సిటీకి 22

సిటీ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి 22 మంది దరఖాస్తు చేసుకొన్నారు. బానోతు శ్రావణి నాయక్, ముల్కల ప్రవీణ్, షబానా మహమ్మద్, కొరివి అరుణ్ కుమార్, మహమ్మద్ తాజుద్దీన్, మాచర్ల ప్రసాద్, సయ్యద్ ముజీబ్ హుస్సేన్, కంకణాల అనిల్ కుమార్, సర్దార్ ధన సింగ్, మహమ్మద్ అబ్దుల్ సలాం, అస్తపురం రమేష్ ,ఎస్.కె సిరాజ్ హుస్సేన్, మహమ్మద్ జమాలుద్దీన్, అబ్దుల్ రెహమాన్, బోనాల శ్రీనివాస్, కొట్టె ప్రభాకర్, దీకొండ శేఖర్, గడ్డం శ్రీనివాస్, వీర దేవేందర్ పటేల్, వైద్యులు అంజన్ కుమార్, మహమ్మద్ ఇంతియాజ్ అలీ ఉన్నారు.

నగరానికి వచ్చిన పరిశీలకులు

ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మానె, సమన్వయకర్తలు ఆత్రం సుగుణ, శెట్టి సత్యనారాయణలు సోమవారం నగరానికి చేరుకొన్నారు. 18వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోనే ఉండి ఈ ప్రక్రియ కొనసాగిస్తారు. పరిశీలకులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ స్వాగతం పలికారు.

ప్రజావాణి.. వినరూ!

- తరలివచ్చిన అర్జీదారులు
- భూ సమస్యలు.. అధికారులపై ఫిర్యాదులు
- స్వీకరించిన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: సమస్యలతో వేగలేకపోతున్నాం, క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే మళ్లీ వారికే విచారణ బాధ్యతలు అప్పగిస్తున్నారని, తమకు పరిష్కారం ఎండమావేనని బాధితులు గగ్గోలు పెట్టారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో బాధితులు సమస్యల ఏకరవు పెట్టగా కలెక్టర్ పమేలా సత్పతి అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్వో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అర్జీలను స్వీకరించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, చిత్రంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు

భూ ఆక్రమణ నుంచి కాపాడండి



కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం పక్కన దివ్యాంగుల టీసీపీసీ నిర్మాణానికి 20 గుంటల స్థలం కేటాయించారు. పలువురు సదరు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు మోకాపై పరిశీలించారు. 45 రోజులు గడుస్తున్నా టీసీపీసీ నిర్మాణం జరగడం లేదు. సదరు నిర్మాణంతో వంద మంది దివ్యాంగులకు ఉపాధి లభించనుంది.

– లక్ష్మయ్య, దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర నేత

ప్రజావాణికి వచ్చిన
అర్జీలు: 271
మున్సిపల్ కార్పొరేషన్: 42
హౌజింగ్ పీడీ: 27
డీపీవో: 19
తహసీల్దార్ కరీంనగర్ రూరల్: 15
డీఈవో: 11
తహసీల్దార్ వీణవంక: 10
ఆర్డీవో, కరీంనగర్: 09

ప్రమాదకరంగా తీగలు.. బాధ్యులెవరు?



రోడ్డు మరమ్మతులో భాగంగా 33/11 కేవీకు అనుసంధానించే కరెంట్ తీగలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. మా అనుమతి లేకుండా మా ఇంటిపై నుంచి విద్యుత్తు వైర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయంలో ఎస్‌ఈకి కలిసి ఫిర్యాదు చేస్తే ఏలాంటి చర్యలు లేవు. అధికారుల చర్యతో మానసిక ఒత్తిడి గురవుతున్నాం. నా చావుకు కారణం విద్యుత్, నేషనల్ హైవే అధికారులే.

– గోపాల్, గట్టుదుద్దెనపల్లి, మానకొండూర్

రైతుల ప్రయోజనం చూడండి



18ఈ గేట్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం వందల మంది ప్రయోజనార్థం జరిగిన సర్వేను కాదని ఒకరిద్దరు వారి స్వార్థం కోసం ప్లానింగ్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. భూ సేకరణలో ప్రభుత్వ భూమి ఎక్కువగా పోతుండగా రైతులు తక్కువ నష్టం జరిగేలా సర్వే చేశారు. కానీ సదరు సర్వేను కాదని 500 మంది రైతులకు ఇబ్బంది కలిగేలా సర్వే ప్లాన్ మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనం చూడాలి.

– రైతులు, మదిపల్లి, చెల్పూర్, జమ్మికుంట

బిల్లులివ్వకుండా వంటలెలా?



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులం. గత ఏప్రిల్ నుంచి కోడిగుడ్ల బిల్లులు, 9, 10వ తరగతి బిల్లులు, గౌరవ వేతనం రావడం లేదు. ఎంఈవో, డీఈవోలను కలిస్తే కంటితుడుపు మాటలే. సౌకర్యాలే సరిగా లేవు. బిల్లులు ఇవ్వడం లేదు. ఎలా వంట చేయాలి. ఎన్ని రోజులు అప్పులు చేసి పిల్లలకు తిండి పెట్టాలి.

– మధ్యాహ్న భోజన కార్మికులు

క్లుప్తంగా

నీటిలో మునిగి వ్యక్తి మృతి


బండారి వెంకటయ్య మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్): మానేరువాగులో స్నానం చేసి బయటకు వస్తుండగా ఫిట్స్ వచ్చి నీటిలోనే వ్యక్తి చనిపోయిన సంఘటన పొత్తూరులో విషాదం నింపింది. మండలంలోని పొత్తూరుకు చెందిన బండారి వెంకటయ్య(48) కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం హమాలీ పనులు ముగించుకున్న తర్వాత గ్రామ పొలిమేరలోని మానేరు వాగులో స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగానే వెంకటయ్యకు ఫిట్స్ వచ్చి నీటిలోనే పడి మృతిచెందాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మానేరువాగు వైపునకు వెళ్లిన గ్రామస్తులు వెంకటయ్య మృతదేహం చూసి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై జి.లక్పతి తెలిపారు. మృతునికి కొడుకు, కూతురు ఉన్నారు.

ఎల్‌మడుగులో యువకుడి..

- విద్యుత్ మోటార్ తీస్తుండగా నదిలో గల్లంతు


సూరి(ఫైల్)

మంథనిరూరల్: ఓ రైతుకు చెందిన విద్యుత్‌మోటార్‌ను గోదావరి నదిలోంచి బయటకు తీసేందుకు యత్నించిన యువకుడు నీళ్లలో మునిగి మృతి చెందాడు. ఈఘటన మంథని మండలం ఖాన్‌సాయిపేట శివారులోని ఎల్‌మడుగులో చోటుచేసుకుంది. ఘటనలో ఖాన్‌సాయిపేటకు చెందిన గావిడి సూరి(25) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ రైతు మోటారు గోదావరి నదిలో చెడిపోయింది. దానిని బయటకు తీసేందుకు గావిడి సూరి, గిరిసంగ రాజును ఆ రైతు నది వద్దకు తీసుకెళ్లాడు. ఇద్దరు నదిలో దిగి మోటారును బయటకు తీయడం ఇబ్బందిగా మారడంతో రాజు ఒడ్డుకు వచ్చాడు. సూరి నదిలోని మోటారు తీసుకొా ప్రయత్నంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసు లు, గ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బోట్‌ల సాయంతో గాలించగా సాయంత్రం సూరి మృతదేహం లభ్యమైంది. మొసళ్లు సంచరించే ప్రాంతం కావడంతో సూరిని మొసలి లాక్కెళ్లిందని తొలుత గ్రామస్తులు భావించారు. మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

- ఢీకొట్టి వెళ్లిపోయిన గుర్తు తెలియని వాహనం


మారుపాక వినోద్ (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని పట్టణానికి చెందిన మారుపాక వినోద్ (28) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం వినోద్ వ్యవసాయ బోర్లు మరమ్మతు చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం కోరుట్ల నుంచి మోహన్‌రావుపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతోతల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వినోద్‌కు భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వెంకట్రావుపల్లిలో వ్యక్తి..

హుజూరాబాద్‌రూరల్: వెంకట్రావ్‌పల్లె గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు చింత సమ్మయ్య (46) బైక్‌పై పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సమ్మయ్య తలకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమ్మయ్యను ఢీకొట్టిన వాహనదారుడు మెట్‌పల్లి గ్రానైట్ క్వారీలో పనిచేసే వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థిని..


మనోజ్ఞ(ఫైల్)

సిరిసిల్ల: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన యువతి మరణించింది. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన బండారి అశోక్-గీత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు బండారి మనోజ్ఞ(22) హైదరాబాద్‌లో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఇటీవల దసరా పండుగకు ఇంటికొచ్చి వెళ్లిన మనోజ్ఞ హైదరాబాద్ వనస్థలిపురంలో శనివారం స్నేహితులతో కలిసి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. కారు డ్రైవర్ తాగిన మైకంలో ఉన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మనోజ్ఞను యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. మనోజ్ఞ మృతదేహాన్ని సిరిసిల్లకు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బంగారు భవిష్యత్ కోసం హైదరాబాద్‌కు వెళ్లిన యువతి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం సిరిసిల్లలో విషాదం నింపింది.

భీమన్న సన్నిధి.. భక్తుల సందడి

- బాలాలయంలో రాజన్న దర్శనాలు
- కోడెమొక్కుల చెల్లింపులు
- సౌకర్యాలపై భక్తుల సంతృప్తి
- రాజన్న ఆలయం అభివృద్ధిపై హర్షం



వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో భీమన్న ఆలయంలో దర్శనం, కోడెమొక్కులకు కల్పించిన సౌకర్యాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాలాలయంలో దర్శనాలకు ఏర్పాట్లు బాగున్నాయని.. కోడెమొక్కులు సైతం ఇక్కడే చెల్లించుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 11న స్వామి వారి ఉత్సవమూర్తులను భీమన్నగుడిలోని బాలాలయంలో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇక్కడే దర్శనాలు, కోడెమొక్కులు చెల్లించుకుంటున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తున్నారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అదే సమయంలో భీమన్నగుడిలో చేసిన ఏర్పాట్లపై సంతృప్తిగా ఉందన్నారు. భీమన్నగుడిలో దర్శనాలు పూర్తి చేసుకున్న భక్తులు ×సాక్షి౯తో మాట్లాడారు. వారి మాటల్లోనే..

దర్శనం బాగా జరిగింది



రాజన్న గుడిని విస్తరిస్తున్న క్రమంలో భీమన్నగుడిలో దర్శనాలు ఏర్పాటు చేయడం బాగుంది. ఇక్కడే దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాం. భీమన్నగుడిలోనూ సౌకర్యాలు బాగా కల్పించారు. ఎన్నో ఏండ్లకు వేములవాడ రాజన్న గుడి అభివృద్ధి జరుగుతుందంటే సంతోషంగా ఉంది.

– కాటం సత్యం-లక్ష్మి, సెంటినరీకాలనీ

అభివృద్ధికి అందరూ సహకరించాలి



రాజన్న గుడి విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నగుడిలో దర్శనాలకు మంచి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. అందరూ అధికారులకు సహకరిస్తే భవిష్యత్‌లో రాజన్న ఆలయం చరిత్రలో నిలిచిపోయేలా తయారవుతుంది.

– మహిపాల్‌రెడ్డి, కొత్తగూడెం, జనగామ జిల్లా

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



రాజన్న దర్శనానికి వస్తే భీమన్న గుడిలో దర్శనం చేసుకోవాలన్నారు. భీమన్నగుడికి వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు సాగాయి. రాజన్న ఆలయ విస్తరణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– మహేశ్వర్, ముజ్గాల్, నిర్మల్

అభివృద్ధి చేయడం మంచిదే..



మాది వంగర. నేను అమెరికాలో ఉంటున్నాను. అమెరికా నుంచి వచ్చినప్పుడల్లా రాజన్నను దర్శించుకుంటాను. ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాన్ని ఇప్పుడు విస్తరించడం చాలా సంతోషం. భీమన్న గుడిలో సౌకర్యాలు బాగానే ఉన్నాయి. అందరూ సహకరిస్తే రాజన్న గుడి ప్రఖ్యాతి చెందుతుంది.

– చంద్రసేన, వంగర, ఎన్ఆర్ఐ

భవిష్యత్‌లో మరింత ప్రాచుర్యం



మాది హైదరాబాద్. మేము చిన్నప్పటి నుంచి రాజన్న దర్శనానికి వస్తుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి డెవలప్‌మెంట్ జరుగలేదు. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. భవిష్యత్‌లో రాజన్న గుడి మరింత ప్రాచుర్యం పొందే అవకాశం ఉంది. అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. అందరూ సహకరిస్తే మంచిది.

– రాధిక- శివరాజ్, హైదరాబాద్

మూసివేస్తారనేది అబద్ధం



రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా గుడిని మూసివేస్తారని జరుగుతున్న ప్రచారం అబద్ధం. భక్తులకు ఇబ్బందులు లేకుండా భీమన్న గుడిలో దర్శనాలు ఏర్పాటు చేశాం. అదే సమయంలో రాజన్న ఆలయంలో చతుష్కాల పూజలు, కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయి. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు.

– రమాదేవి, ఆలయ ఈవో

సర్వేల ఆధారంగానే రన్‌వే

- అంతర్గాంలో విమానాశ్రయంపై నివేదిక
- అన్నీబాగుంటేనే అడుగుముందుకు
- ప్రారంభమైన వివిధ శాఖల సర్వే
- పక్కాగా ఆరంచెల విధానం అమలు


ప్రతిపాదిత విమానాశ్రయ స్థలం

రామగుండం: ఆరంచెల విధానంలో వచ్చే నివేదికల ఆధారంగానే అంతర్గాంలో విమానాశ్రయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో చేపట్టిన ప్రీఫిజిబిలిటీ నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40.53 లక్షలు మంజూరు చేయడం ద్వారా ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు తొలిఅడుగు పడినట్లు ఆశలు రేకెత్తుతున్నాయి. వివిధ విభాగాల అత్యున్నతస్థాయి నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో ఆరుదశల్లో సర్వే చేపడతారని, తుది నివేదికను ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కి అందజేస్తారని అధికారులు చెబుతున్నారు. రూపొందించనున్నారు.

ఆరు దశల్లో..

విమానాశ్రయం ఏర్పాటు జాతీయ భద్రత, పర్యావరణం, రవాణా, ఆర్థిక, ప్రజావసరాలతో ముడిపడి ఉందని అంటున్నారు. తొలిదశలో ప్రయాణికుల డిమాండ్, వాణిజ్య అవసరాలు, రవాణా సౌకర్యాలపై ఆయా విభాగాల ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తారు. మలిదశలో స్థలం ఎంపికపై భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావం, ఎత్తు, ప్రధాన పట్టణాలకుదూరం, రోడ్లు, రైలు కనెక్టివిటీ పరిశీలిస్తారు. మూడోదశలో భూమి ఎత్తుపల్లాలు, పర్వతాలు, లోయలు, నదులు, రోడ్లు, సరస్సుపై పరిశోధన చేస్తారు. నాలుగో దశలో పర్యావరణ ప్రభావంపై అధ్యయం చేస్తారు. ఐదోదశలో నిర్వాసితులకు పునరావాసం, ఉపాధి కల్పన, వ్యాపార, ప్రాంతీయ అభివృద్ధి ప్రభావంపై సర్వే చేస్తారు. ఆరోదశలో మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్, డైరెక్టర్ జనరల్ ఏవియేషన్ అథారిటీ, ఏఏఐ, కేంద్ర, రాష్ట్ర క్యాబినెట్ అత్యున్నత ప్రతినిధులతో డీపీఆర్ తయారీ, ఆర్థిక అంచనా, బడ్జెట్ ఆమోదం, నిర్మాణానికి తుది అనుమతులు, టెండర్ల విడుదల ద్వారా విమానాశ్రయానికి రన్‌వే సిద్ధమైనట్లు ప్రకటిస్తారు.

అభివృద్ధికి సహకారం



ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుంటుంది. ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తా.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

ప్రాజెక్టు పూర్తి లక్ష్యం



రామగుండం పరిశ్రమలకు నిలయంగా ఉంది. ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై పార్లమెంట్‌లో గళం వినిపించా. ప్రాజెక్టు సాధన నా లక్ష్యం

– గడ్డం వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి

అంజన్న హుండీ ఆదాయం రూ.1.08కోట్లు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ట్రస్టు సభ్యులు

మల్యాల: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకులు రాజమౌళి సమక్షంలో ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో శ్రీవేంకట అన్నమాచార్య సేవా ట్రస్టు సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు. 81రోజులకుగాను 12 హుండీలను లెక్కించగా.. రూ.1,08,72,591తోపాటు 55 విదేశీ కరెన్సీ సమకూరింది. మిశ్రమ వెండి, బంగారం తిరిగి బ్యాగుల్లో వేసి, సీల్ చేసి, హుండీలో భద్రపరిచారు. లెక్కింపులో దేశిని సునీల్‌కుమార్, నీల చంద్రశేఖర్, గుండి హరిహరనాథ్, ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌కు 'సీబీఎస్ఈ' అవార్డు


అవార్డు అందుకుంటున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్య, క్రీడారంగాల్లో అవలంబిస్తున్న విధి విధానాలకు గాను అల్ఫోర్స్ హైస్కూల్‌కు అత్యుత్తమ సీబీఎస్ఈ పాఠశాల అవార్డు లభించింది. హైదరాబాద్‌లో గ్లోబల్ ట్రెండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా కంక్లేవ్ సమావేశంలో ఈ అవార్డును అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అందుకున్నారు. విద్యారంగంలో అల్ఫోర్స్ విద్యా సంస్థలు చేస్తున్న కృషికి ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని వీఎన్ఆర్ తెలిపారు. నాణ్యమైన విద్య అందిస్తూ, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ,, ఎయిమ్స్, మెడికల్ కళాశాలలు, సీఏ పరీక్షల ఫలితాల్లో సీట్లు సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అవార్డు అందుకోవడంపై యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నేతలు, యువజన, క్రీడా సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరు మెటాఫండ్ ప్రో నిందితుల అరెస్ట్

జగిత్యాలక్రైం: మెటా ఫండ్‌ప్రో యాప్‌లో పెట్టుబడులు పెడితే మూడింతల డబ్బు వస్తుందని నమ్మించి మోసం చేసిన ఇద్దరు నిర్వాహకులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాధితుడు మెటాఫండ్ ప్రో యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన వరాల వెంకటేశ్వర్‌రావు, జగిత్యాల పట్టణానికి చెందిన కస్తూరి శ్యామ్‌సుందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మల్యాల: రాజారాం గ్రామానికి చెందిన ఓ వివాహిత వేధింపుల భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన సుమలతకు పదమూడేళ్ల క్రితం రాజారాంకు చెందిన గుర్రం నర్సయ్యతో వివాహమైంది. నర్సయ్య బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం దుబాయి వెళ్లాడు. సుమలత తన పిల్లలతో కలిసి రాజారంలోనే ఉంటోంది. సుమలత అత్తమామలు, ఆడబిడ్డలతోపాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి వేధింపులకు గురిచేయడంతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాళంవేసిన నాలుగిళ్లలో చోరీ

- బంగారం, నగదు, బైక్ ఎత్తుకెళ్లిన దొంగలు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక దొంగలు తాళం వేసిన నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఓ ఇంటి నుంచి ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన వెన్నం శ్రీనివాస్ దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆయన భార్య ఇంటికి తాళంవేసి ఊరు వెళ్లింది. ఆ ఇంట్లో నుంచి సుమారుడు మూడు తులాల బంగారం, 41 తులాల వెండి ఎత్తుకెళ్లారు. షేక్ షబానా ఇంట్లో నుంచి మూడున్నర తులాల బంగారం, 12 తులాల వెండి, రూ.50 వేలు, ద్యాగల నరేశ్ ఇంటి నుంచి రూ.1.70 లక్షలు, మూడు గారు గొలుసులు, మంథని కవిత ఇంట్లో చొరబడి బంగారం ఎత్తుకెళ్లారు. గుమ్ముల రాజేశం ఇంట్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ద్వారా విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. సోమవారం ఉదయం 2.30 గంటల నుంచి 3 గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎస్పీ పైలట్ వాహనంలో ఆస్పత్రికి..

- ప్రమాదాన్ని గమనించి ఆగిన ఎస్పీ
- తన వాహనంలో ఆస్పత్రికి తరలింపు


చర్యలకు ఆదేశిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల బైపాస్ రోడ్డులో ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తిని ఎస్పీ మహేశ్ బీ గీతే తన పైలట్ వాహనంలో ఆస్పత్రికి పంపించారు. సోమవారం బైపాస్‌రోడ్డుపై వెళ్తున్న ఎస్పీకి ప్రమాదంలో గాయపడ్డ అశోక్‌నగర్‌కు చెందిన రఫీక్‌పాషా కనిపించారు. వెంటనే తన వాహనాన్ని నిలిపి క్షతగాత్రులను తన వాహనంలో సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలింపజేశారు.

భవనం పైనుంచి తోయడంతో ఒకరు మృతి

చిగురుమామిడి: చిన్నముల్కనూర్ శివారులోని బ్రీడింగ్ అండ్ హెచరీస్ ప్రైవేటు కంపెనీలో పేయింటింగ్ పనిచేస్తున్న దాసో సోరెన్ (32)ను తోటి పేయింటర్ భవనం పైనుంచి తోయడంతో కిందపడి చనిపోయాడు. ఇన్‌చార్జి ఎస్సై స్వాతి వివరాల ప్రకారం.. సోరేన్‌ను 15 రోజుల క్రితం పశ్చిమ బెంగాల్ నుంచి కాంట్రాక్టర్ ఎస్‌కే.అర్షద్ పేయింటింగ్ వేసేందుకు తీసుకొచ్చాడు. ఇతనితోపాటు ముస్లింఖాన్ కూడా వచ్చాడు. ఆదివారం రాత్రి ఇద్దరు డబ్బుల విషయంలో గొడవపడ్డారు. మాటమాట పెరిగి ముస్లింఖాన్ సోరెన్‌ను భవనం పైనుంచి తోసేశాడు. తీవ్రంగా గాయపడిన సోరెన్‌ను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. సోమవారం శవపంచనామా చేశారు.

బంగారం కోసమే విష ప్రయోగం

- వీడిన గర్శకుర్తి వృద్ధ దంపతుల మిస్టరీ
- మత్తు మాత్రలు ఇచ్చిన తెలిసిన వ్యక్తి
- ఆపై బంగారం అపహరణ
- కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం




వివరాలు వెల్లడిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో వృద్ధ దంపతులపై జరిగిన విషప్రయోగం మిస్టరీ వీడింది. ఈ ఘటనలో వృద్ధుడు చనిపోగా.. వృద్ధురాలు ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. తెలిసిన వ్యక్తే బంగారం కోసం మత్తు మాత్రలు ఇవ్వగా.. నిందితుడిని గంగాధర పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను సీపీ గౌస్ ఆలం సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో వెల్లడించారు. గర్శకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య- లక్ష్మీ దంపతులు ఇంట్లో ఇద్దరే ఉంటారు. వారి ఇంటికి సమీపంలో ఉండే కత్తి శివ(37) వృద్ధులకు చేదోడుగా ఉంటూ మందులు తేవడం, ఇతర పనులు చేస్తుండేవాడు. శివకు పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ ఆడడంతో అప్పులయ్యాయి. అప్పు తీర్చేందుకు దంపతుల వద్ద బంగారం కాజేయాలని నిర్ణయించాడు. గతంలో ముంబైలో కల్లుడిపోలో పనిచేసిన సమయంలో అందులో వాడే మత్తు టాబ్లెట్లు వెంట తెచ్చుకున్నాడు. ఈ నెల 7వ తేదీన వృద్ధులకు అనారోగ్యం ఉండడంతో మత్తు టాబ్లెట్లు ఇచ్చాడు. అవి వేసుకుంటే జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు తగ్గుతాయని నమ్మించాడు. మాత్రలు వేసుకుని సొమ్మసిల్లిన రెండు గంటల తర్వాత ఇంట్లోకి వెళ్లి లక్ష్మి మెడలోని బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. అదే గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారికి విక్రయించి, రూ.1.85 లక్షలు తీసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న గంగాధర పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శివపై అనుమానంతో అతని కదలికలపై నిఘా పెంచారు. సోమవారం గర్శకుర్తి శివారులో అదుపులోకి తీసుకున్నారు. తానే వృద్ధులకు మత్తుమాత్రలు ఇచ్చి, బంగారం చోరీ చేశానని ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.25వేల నగదు, 11మత్తు మాత్రలు, సెల్‌ఫోన్, కట్ల శ్రీనివాసాచారి నుంచి పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ చారి, కానిస్టేబుళ్లు జంపన్న, అరవింద్‌ను సీపీ అభినందించి రివార్డు అందించారు.

నన్ను క్షమించండి..

- ఆఖరి లేఖలో భార్యాపిల్లలను కోరిన అభాగ్యుడు
- సిరిసిల్లలో విగ్రహాల తయారీదారుడి ఆత్మహత్య




ఆత్మహత్యకు పాల్పడిన విక్కుర్తి శేఖర్(ఫైల్)

సిరిసిల్ల: 'మీ అమ్మకి ఏమీ తెలియదు. చాలా అమాయకురాలు. ఇక నన్ను క్షమించండి. నేను చేసిన అప్పులుతో నా భార్యాపిల్లలకు ఏం సంబంధం లేదు. వారికి ఎలాంటి హానీ తలపెట్టవద్దు. నా భార్యాపిల్లలకు మనవి.. మీకు ఇబ్బందిగా ఉంటే.. నాతోపాటే మీరు కూడా రాగలరు. జిల్లా కలెక్టర్ గారు.. ఎస్పీ గారు.. నా భార్యాపిల్లలకు న్యాయం చేయండి.. నేను బిజినెస్‌లో నష్టపోయి.. అప్పులోళ్లకు మొహం చూపించలేక సచ్చిపోతున్నా... అప్పులోళ్లు ఇద్దరే చాలా వేధించారు..' అని సూసైడ్ నోట్ రాసి చనిపోయిన సంఘటన సిరిసిల్లలో సంచలనంగా మారింది. కరీంనగర్ శివారులోని ఎలగందులకు చెందిన విక్కుర్తి శేఖర్ (48) ఇరువై ఏళ్లుగా సిరిసిల్లలో స్థిరపడ్డారు. స్థానిక మొదటి బైపాస్‌రోడ్డులో గణపతి విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుంటారు. వ్యాపారంలో నష్టాలు రావడం.. అప్పుల వాళ్ల వేధింపులు తీవ్రమయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక సోమవారం విగ్రహాలను తయారు చేసే షెడ్డులోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్లకు చెందిన బాలసాని అంజయ్యగౌడ్ తన ప్లాటు(స్థలం) కాగితాలను బెదిరించి లాక్కున్నారని, బాలసాని యాదయ్య ఇల్లును ఆక్రమించుకోవాలని చూస్తున్నారని లేఖలో శేఖర్ పేర్కొన్నారు. అప్పులు ఇచ్చిన ఇతరులు ఏమీ అనలేదని, మూడేళ్ల సమయం ఇచ్చారని, వాళ్లంతా నన్ను క్షమించాలని లేఖలో వేడుకున్నారు. వాళ్లకు మొఖం చూపించలేక పోతున్నానని పేర్కొన్నారు. షెడ్డు ఓనర్ తన భార్య పిల్లలకు సహకరించాలని కోరారు.

కలెక్టర్, ఎస్పీలకు లేఖ

తన ఆస్తి భార్య పిల్లలకు దక్కేలా చూడాలని, కల్లు సొసైటీలో సభ్యత్వం పిల్లలకు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరారు. మృతుడికి భార్య వసుధ, పిల్లలు అఖిల్, మణిదీప్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

రైతు కష్టం.. వర్షంతో నష్టం

- భయం గుప్పిట్లో వరి రైతు
- కోతల సమయంలో రైతులను వెంటాడుతున్న వర్షాలు
- సోమవారం కురిసిన వానకు తడిసిన ధాన్యం
- అక్కడక్కడ నేలకొరిగిన పైరు
- ఈ సమయంలో వర్షాలు పడితే పంటకు తీవ్ర నష్టం
- మరో 3 రోజులు వానలుంటాయన్న వాతావరణ శాఖ
- జిల్లాలో 2.76లక్షల ఎకరాల్లో వరి సాగు


సోమవారం కురిసిన వానకు పొలంలో నిలిచిన నీరు

వీణవంక: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు కోతల్లో నిమగ్నమవగా.. రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో వానలు కురుస్తుండడం రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కొన్నిచోట్ల వరి కోతలు ఊపందుకోగా.. కళ్లాల వద్ద ధాన్యం ఆరబోశారు. సోమవారం జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం పడడంతో ఆరబోసిన ధాన్యం తడిసింది. ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. కొన్ని మండలాల్లో వర్షానికి వరి అక్కడక్కడ నేలకొరిగింది. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు కలవరపడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో మరో 3 రోజులు వానలుంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో.. రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని వాపోతున్నారు. వివిధ తెగుళ్లతో పరేషాన్ అవుతుండగా.. వాన మరింత భయాందోళనకు గురి చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 2.76లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇందులో 60వేల ఎకరాల్లో కోతలు పూర్తి కాగా.. కోత దశలో 1.20లక్షల ఎకరాలున్నాయి.

మూడేళ్లుగా ఇదే పరిస్థితి

ఉత్తర తెలంగాణలోనే వరి సాగులో కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడి నేలలు వరి పంటకు అనుకూలంగా ఉండడంతో.. రైతులు ఈ పంట వైపే మొగ్గు చూపుతున్నారు. కంపెనీలు సైతం పోటీ పడి విత్తనాలిస్తున్నాయి. మూడేళ్లుగా వరి చేతికొచ్చే సమయంలో వడగండ్లు, అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గిపోవడంతోపాటు వరి కోత యంత్రాల ఖర్చు తడిసి మోపడువుతోంది. పెట్టిన పెట్టుబడి భారంగా మారిందని వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన రైతు మధుసూదన్‌రెడ్డి వాపోయాడు. 2 రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని మండలాల్లో పైరు నేలకొరిగింది.

తడారని పొలాలు

నేలకొరిగిన పొలంలో నీరు నిల్వ ఉండడంతో గింజలు మురిగిపోయే ప్రమాదముంది. నీరు నిల్వ ఉండకుండా కాల్వల ద్వారా తోడేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దోమతోపాటు వివిధ రకాల తెగుళ్లు విజృంభించే అవకాశముంది. ఇప్పటికే పొలాలు తడారడం లేదు. ఎకరాకు రూ.25వేల పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

వర్షంతో తీవ్ర నష్టం



8 ఎకరాల్లో దొడ్డు రకం వరి పంట వేసిన. వారం క్రితం వరి కోయాల్సి ఉండగా.. పొలం తడారలేదు. ఇంతలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం కురిసిన వానకు 10 రోజుల వరకు తడారని పరిస్థితి. దిగుబడి వచ్చేట్టు లేదు. గింజలు నేల రాలిపోయే ప్రమాదముంది. ఇప్పటికే ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టాం.

– కలకొండ మధూకర్‌రెడ్డి, రైతు, మల్లన్నపల్లి.

క్లుప్తంగా

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కరీంనగర్: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారి సరస్వతి, నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేయాలన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



పాల్గొన్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని ముందుకుసాగాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణ అన్నారు. కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ బెంగళూరు సౌజన్యంతో గతనెల రోజులుగా జరుగుతున్న ఉన్నతి ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ సౌజన్యంతో కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ప్రవీణ్ కుమార్, హర్జోత్ కౌర్, బి.సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీహన్సీ రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించినట్లు వ్యాయామ విభాగాధిపతి మురళీధర్ తెలిపారు. తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన 12వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో శ్రీహన్సీ రజత పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. సోమవారం విద్యార్థిని ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డిలు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఎస్.అనిల్

కొత్తపల్లి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం ఎలగందుల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎస్.అనిల్ ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్, పీడీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లా వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్‌రూరల్: సామాజిక సేవతో పాటు విద్యారంగంలో మూడు దశాబ్దాలుగా కృషి చేసిన గోపాల్‌పూర్‌లోని శ్రీకెన్‌లీ స్కూల్ ఏవో ఆదూరి ప్రతాప్‌రెడ్డికి డే స్ప్రింగ్ థియాలజికల్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసింది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ గ్రహీత ప్రతాప్‌రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బండ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ బండ స్వప్న, సీవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిగిలిన గ్రామాలకూ హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ పరిధిలో మిగిలిపోయిన 23 గ్రామాలకు కూడా 17శాతం హెచ్‌ఆర్‌ఏ ఇప్పించాలని కోరుతూ సోమవారం తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి ఎర్రమరాజు శ్రీనివాసరాజు, జిల్లా మీడియా ఇన్‌చార్జి బొద్దుల సత్యనారాయణ, జిల్లా క్రీడా విభాగం ఇన్‌చార్జి జిట్టవేణి శ్రీను, బోనాల మదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. తాళం వేశారు

- రెండేళ్ల క్రితం ప్రారంభం.. ఆ వెంటనే తాళం
- వినియోగంలోకి రాని కార్ఖానగడ్డ శ్మశానవాటికలోని స్నానపుగదులు
- దీపావళికి అక్కడే సమాధుల పండుగ

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కార్ఖానగడ్డ దళితుల శ్మశానవాటికలో నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు అలంకారప్రాయంగా మారాయి. నిర్మాణం పూర్తి చేసుకొని రెండు సంవత్సరాల క్రితం ప్రారంభం కూడా చేసుకున్న ఈ గదులు అప్పటి నుంచి వినియోగంలోకి రావడం లేదు. కారణాలు తెలియదు కాని రెండేళ్ల క్రితం వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు.

2023లో స్నానపు గదుల ప్రారంభం


కార్ఖానగడ్డలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి వెళ్లే దారిలో మొదట్లో దళిత శ్మశానవాటికకు సంబంధించి మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించారు. 2023లో ఈ స్నానపు గదులను ప్రారంభించారు కూడా. అయితే ఆ వెంటనే గదులకు తాళం వేశారు. అప్పటి నుంచి ఆ తాళం తీయడం లేదు. గదులు, మరుగుదొడ్లు వినియోగంలోకి రావడం లేదు. దీంతో శ్మశాన వాటికకు అంతిమసంస్కారాల కోసం వస్తున్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

అలంకారప్రాయమే..

నగరంలోని అతిపెద్ద శ్మశానవాటికల్లో కార్ఖానగడ్డ దళిత స్మశాన వాటిక ఒకటి. దశాబ్దాలుగా ఈ శ్మశానవాటిక వినియోగంలో ఉంది. కాని అంతిమసంస్కారాలకు మాత్రం ప్రైవేట్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. స్థానికుల డిమాండ్ మేరకు శ్మశాన వాటికకు సంబంధించి మరుగుదొడ్లు, స్నానపు గదులను నగరపాలకసంస్థ నిర్మించింది. దీంతో ఇక నుంచి అంతిమసంస్కారం సాఫీగా సాగుతుందని అంతా భావించారు. కాని ప్రారంభించిన అనంతరం వినియోగంలోకి తేకుండానే, మూసివేయడంతో గదులు కేవలం అలంకారప్రాయంగానే మారాయి.



కార్ఖానగడ్డ శ్మశాన వాటికలో నిర్మించిన స్నానపు గదులు



గదులకు వేసిన తాళం

సమాధుల పండుగకు ఎలా?

ఏటా దీపావళి సందర్భంగా దళితులు సమాధుల పండుగ చేసుకోవడం కరీంనగర్‌లో సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీ. తమ కుటుంబ పెద్దలను గుర్తు చేసుకుంటూ సమాధాలను పూజిస్తుంటారు. ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో, దేశ విదేశాల్లో ఉన్న వారు సైతం ఇక్కడికి చేరుకుంటారు. మరో ఆరు రోజుల్లో దీపావళి పండుగ ఉండడంతో సమాధుల పండుగకు అంతా సమాయత్తమవుతున్నారు. అప్పటిలోగానైనా నగరపాలక సంస్థ అధికారులు స్నానపు గదుల తాళాన్ని తొలగించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

వినియోగంలోకి తేవాలి



శ్మశాన వాటికకు సంబంధించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించి తాళాలు వేశారు. గదులు ఉన్నా వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి. దీపావళికి దాదాపు 20వేల మందికి పైగా దళితులు సమాధుల పండుగకు శ్మశాన వాటికకు వస్తారు. నగరపాలకసంస్థ కమిషనర్ చొరవ తీసుకొని ఈ దీపావళిలోగా మరుగుదొడ్లు, స్నానపు గదులు వినియోగంలోకి తేవాలి. విద్యుత్, వాటర్ సదుపాయం కల్పించాలి.

– మెండి చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్, కరీంనగర్

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత జవాన్లు, ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ హెచ్చరించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి, పారిశుధ్యంలో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలలకే జవాన్‌లు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండి ఇంటింటి నుంచి చెత్తను సేకరించేలా చూడాలన్నారు. పండుగ తర్వాత రోడ్లపై పశువులు ఎక్కడ కనిపించినా వాటిని స్వాధీన పర్చుకొని ప్రత్యేక షెడ్డుకు తరలించాలని సూచించారు. వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియొద్దిన్, హెల్త్ ఆఫీసర్ సుమన్, వెటర్నరీ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ రెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ శ్యామ్, ఎస్సైలు జవానులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో ప్రత్యేక ఏర్పాట్లు

దీపావళి పండుగ సందర్భంగా శ్మశాన వాటికలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని శ్మశాన వాటికను పరిశీలించారు. కార్ఖానగడ్డ శ్మశానవాటికతో పాటు పూజలు ఆచరించే పలు శ్మశాన వాటికల్లో కలుపు మొక్కల తొలగించి, చదును చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేక పూజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు చేపడుతున్నామని అన్నారు. నగరపాలకసంస్థ ఆరోగ్య అధికారి సుమన్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు



ఇంటి నిర్మాణానికి ముగ్గుపోస్తున్న నరేందర్‌రెడ్డి


కరీంనగర్‌రూరల్: ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, జూబ్లీనగర్, బొమ్మకల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిరుపేదలందరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. అర్హులై ఉండి ఇళ్లు మంజూరు కానివారికి రాబోయేరోజుల్లో ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జె.నర్సయ్య, రాము, పంచాయతీ కార్యదర్శులు శ్రావణి, వెంకటేశ్వర్‌రావు, ఏవో సత్యం, కాంగ్రెస్ నాయకులు ఎస్.తిరుపతి, కె.రాంరెడ్డి, బి.ఆంజనేయులు, ఎం.సాయిలు, గంగయ్య, నరేశ్‌రెడ్డి, బి.నారాయణ, స్వామి,రంగయ్య, కనుకయ్య, శంకరయ్య, గంగయ్య, రామస్వామి,దామోదర్‌రెడ్డి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో 579 ఇంటి నంబర్లు రద్దు

- ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు ఉన్నట్లు గుర్తింపు
- పాత భవనాలుంటే ఆధారాలు చూపాలన్న అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఖాళీ స్థలాలకున్న ఇంటినంబర్లను నగరపాలకసంస్థ అధికారులు రద్దు చేశారు. నగరంలో ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు జారీ చేసి, అక్రమాలకు పాల్పడుతున్న వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం తెలిసిందే. ఇప్పటికే రేకుర్తిలో 1,002 ఇంటినంబర్లను గుర్తించి రద్దు చేశారు. నగరంలోని 66 డివిజన్లలో ఎలాంటి నిర్మాణాలు లేకుండా ఉన్న ఇంటినంబర్లపై ఇటీవల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 66 డివిజన్లలో 579 ఇంటినంబర్లకు సంబంధించి ఎలాంటి నిర్మాణాలు లేవని వార్డు అధికారులు గుర్తించారు. దీంతో ఈ ఇంటినంబర్లను రద్దు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాత, శిథిల భవనాలను కూల్చివేయడం ద్వారా ఏర్పడిన ఖాళీ స్థలాలు కూడా జాబితాలో ఉండడంతో, అధికారులు వారికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఖాళీ స్థలంగా ఉండి, గతంలో భవనాలు ఉంటే సరైన ఆధారాలతో తమకు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియొద్దిన్ తెలిపారు. ఆన్‌లైన్‌లో చూస్తే ఇంటినంబర్లు రద్దు అయింది తెలుస్తుందని, పాత భవన యజమానులు ఆధారాలతో తమను సంప్రదిస్తే, వారి ఇంటి నంబర్లు పునరుద్ధరిస్తామన్నారు.

అభినందన



అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన బోధి వరల్డ్ రికార్డ్ అధికారిక ప్రయత్నంలో పాల్గొని అప్రిసియేషన్ సర్టిఫికేట్ అందుకున్న అన్వర్ ఖాన్, అతడి కుమారులు ఫర్హాన్ ఖాన్, అర్మాన్‌ఖాన్‌లను ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అభినందించారు. అన్వర్‌ఖాన్ తన కుటుంబసభ్యులను కరాటేలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దడమే కాకుండా పేద విద్యార్థులకు స్వీయ రక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించే శిక్షణ అందిస్తూ కరీంనగర్‌కు గౌరవం తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హర్మీందర్ సింగ్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ రాజు, కోటేష్, మల్లేశం పాల్గొన్నారు.

రావి చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: గుంటూరుపల్లిలో అక్రమంగా రావి చెట్లను తొలగించడంపై మాజీ ఉప సర్పంచ్ చెట్టి జగన్‌పటేల్ సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో నాటిన చెట్లను గృహనిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో కొంతమంది వ్యక్తులు పెద్దసంఖ్యలో నరికివేసినట్లు వివరించారు. హిందువులు ఆరాధించే రావిచెట్లను తొలగించడం సమంజసం కాదని, అక్రమంగా చెట్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరారు.

సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు

కరీంనగర్‌రూరల్: ఆసిఫాబాద్ జిల్లా గోలేటీ టౌన్‌షిప్‌లో ఈనెల 10వ తేదీ నుంచి 12వరకు నిర్వహించిన సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో తీగలగుట్టపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.శ్రీవర్ష, ఎండీ సుహనా, ఎండీ సోఫియాలు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీవర్ష అత్యంత ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సోమవారం క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు కరుణ, పీఈటీ అజయ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తి మానేరు వాగునుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు చామనపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన అరవేణి లక్ష్మణ్, దుర్శేడ్‌కు చెందిన ఎల్కపల్లి అన్వేష్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణాదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

విదేశీ నియామక డ్రైవ్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన నమోదిత నియామక సంస్థ రాష్ట్రానికి చెందిన అర్హత కలిగిన, నైపుణ్యం గల కార్మికుల కోసం విదేశీ నియామక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు తెలిపారు. గ్రీస్‌లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాల్లో వివిధ పాత్రల్లో తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ 1000 విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందిందని వీటికి జీతం రూ.92వేల నుంచి 1.22 లక్షల వరకు ఉంటుందని అన్నారు. ఈ ఉద్యోగాలకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, డిగ్రీ, లేదా ప్రభుత్వ అనుమతిలో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీసా, ప్రాసెసింగ్ ఖర్చులు భారతీయ వైపు నుంచి అభ్యర్థి భరించాల్సి ఉంటుందని, ఆసక్తిగల అర్హత ఉన్న అభ్యర్థులు తమ బయోడెటాను ఆన్‌లైన్‌లో పంపాలని అన్నారు. పూర్తి వివరాలకు 9440052081, 9440051452 నంబర్‌లలో సంప్రదించవచ్చని సూచించారు.

సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల కళాభారతిలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో నగరంలోని పద్మనగర్‌లో గల మానేరు సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. స్మార్ట్ అగ్రికల్చర్ పేరిట విద్యార్థులు ఉగ్రమ, క్రితిక, మధు స్వరణి, చైత్ర, ఇషాన్, రెహాన్, అమీన్, సర్వర్, ధృవ్, క్రిష్ వర్షిత్ ప్రదర్శించిన నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను మానేరు విద్యాసంస్థల చైర్మన్ అనంతరెడ్డితో పాటు డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని జ్యోతినగర్‌లో నెలరోజులుగా రోడ్డుపై ఉన్న చెత్తను ఎట్టకేలకు నగరపాలకసంస్థ పారిశుధ్య సిబ్బంది సోమవారం తొలగించారు. రోడ్లపై చెత్త కుప్పలుగా పేరుకుపోతుండడం, చెట్ల కొమ్మలు కొట్టి కూడా రోడ్డుపైనే పడవేస్తుండడంపై జ్యోతినగర్‌కు చెందిన నీలిగొండ పద్మ సమస్యను 'సాక్షి' వాట్సప్ శీర్షిక ద్వారా సోమవారం వెలుగులోకి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన నగరపాలక సంస్థ అధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించారు.

సాక్షి ఎఫెక్ట్..

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

17న 'ఫెరియా ఫియెస్టా 2 - స్వదేశీ ఉత్సవ్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 17న ఫెరియా ఫియెస్టా 2- స్వదేశీ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం ఉత్సవంకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలన్నారు. ఎకో బజార్ విద్యార్థులకు సృజనాత్మకత, వ్యాపార అవగాహన, సామాజిక బాధ్యతను నేర్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి వరలక్ష్మి, పరీక్ష నియంత్రణాధికారి శ్రీనివాస్ రెడ్డి, సహాయ పరీక్ష నియంత్రణాధికారి రాజనీదేవి, విద్యా సమన్వయ కర్తలు మనోజ్ కుమార్, విద్య, తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్' బకాయిలు విడుదల చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలలకు బకాయిలు విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బీమా సాహెబ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, గజ్జెల శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లిసాగర్‌లు సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించేందుకు 50ఏళ్ల క్రితం ప్రవేశ పెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీంలో ప్రభుత్వం ఎంపిక చేసిన 230 ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, బట్టలు, వసతి కల్పిస్తున్నారని తెలిపారు. రూ.220 కోట్లు ప్రైవేటు పాఠశాలలకు బకాయి ఉండటంతో యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అక్టోబర్ 6నుంచి సమ్మె చేస్తున్నారని అన్నారు. గిరిజన, ఎస్ఎఫ్ఐ నాయకులు కునుసోత్ శ్రీనివాస్, రాము, సన్నిహిత్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయించాలి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినప్పటికీ మరమ్మతు చేయించకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని రైతు బండి మల్లయ్య సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా తమ పొలంలో వేసిన నాలుగు విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరినప్పటికీ విద్యుత్‌శాఖ ఏతః పట్టించుకోవడం లేదని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేయించడంతో పాటు స్తంభాలను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ఉత్తమ వైద్యసేవలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్‌రావు

కరీంనగర్‌టౌన్: సమాజం పట్ల బాధ్యతగా, అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో ఉత్తమ వైద్యసేవలు అందించడమే లక్ష్యమని చందా న్యూరో ట్రామా కేర్ నిర్వాహకులు, న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చందా న్యూరో ట్రామా కేర్ సెంటర్ 6వ వార్షికోత్సవం సందర్భంగా రూ.2 లక్షల ఖరీదు చేసే వెన్నెముఖ శస్త్రచికిత్సను రూ.66,666కే అందించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 14 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందన్నారు. చందా ట్రస్ట్ ద్వారా గతంలో ఉచిత సర్జరీలతో పాటు క్లిష్టమైన సర్జరీలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియాలజిస్ట్ లీలా శర్వాణి, ఫిజీషియన్ స్వాతి, ఆసుపత్రి ఏవో శంకర్‌రావు పాల్గొన్నారు.

నల్లజెండాలతో ఎమ్మార్పీఎస్ నిరసన



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ దళితుడైన బీఆర్ గవాయ్ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. అనుభవం కలిగిన రిటైర్డ్ జడ్జిలతో దర్యాప్తు జరిపించాలని, ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తునికి వసంత్, చెంచాల నవీన్, కనకం అంజిబాబు, కొత్తూరి రాజన్న, తడగొండ శంకర్, చిలుముల రాజయ్య, దండు వరలక్ష్మి, బొద్దుల వాని, దండు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్లూ డాల్ఫిన్ రూల్ గురించి ఎప్పుడైనా విన్నారా? మనకు రోజూ ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. మనతో మనం మాట్లాడుకుంటూ ఉంటాం. నాన్‌స్టాప్‌గా వచ్చే ఆలోచనలలో నెగెటివ్ థాట్స్ కూడా ఉంటాయి. వాటికి అడ్డుకట్ట వేయడమే బ్లూ డాల్ఫిన్ రూల్ మెథడ్. హార్వర్డ్ సైకాలజిస్ట్ డేనియల్ వెగ్నర్ ఈ మెథడ్‌ను పాపులర్ చేశాడు.

దారులు ఏర్పరచేవారెప్పుడూ ఒంటరిగానే బయలుదేరుతారు!
చెప్పకనే ఆ బాటను పదిమందికీ గమ్యంగా మారుస్తారు.
అలా పురుషుల రంగమైన క్రికెట్‌లో మహిళలను కామెంటరీ బాక్స్ వరకు నడిపించిన వ్యక్తి చంద్ర నాయుడు.
ఆమెను పరిచయం చేస్తోంది ఈ వారం పాత్ మేకర్..

పాత్ మేకర్

జెండర్ 'బౌండరీ' దాటిన ఫస్ట్ కామెంటేటర్


చంద్ర నాయుడు




తండ్రి సీకే నాయుడుతో చంద్రనాయుడు

ఇప్పుడిప్పుడే క్రికెట్‌లో మహిళల ఉనికి, ఉన్నతి కనిపిస్తోంది. కామెంటరీ రంగంలోనూ మహిళా గళాలు వినిపిస్తున్నాయి. క్రికెట్ నేపథ్యం కాకపోయినా మందిరా బేడీ క్రికెట్ యాంకర్‌గా, కామెంటేటర్‌గా కనిపించి, వినిపించి కలకలం రేపింది. అంజుమ్ చోప్రా, ఇసా గుహా, లీసా స్థాలేకర్, స్నేహల్ ప్రధాన్ లాంటి క్రికెటర్స్ కూడా ఆట నుంచి రిటైరైపోయి కామెంటేటర్స్‌గా మారినవారే! వీళ్లందరికీ ఆ ధైర్యం, స్ఫూర్తిని పంచింది మాత్రం 1970ల్లోని క్రికెట్ ప్లేయర్.. చంద్ర నాయుడు. మగాళ్లే వినిపించే క్రికెట్ వ్యాఖ్యానంలోకి మైక్ పట్టుకుని వచ్చిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. ఆ రంగంలో మహిళలు రావడానికి దారిని ఏర్పరచారు.

ఘనకీర్తి వారసత్వం

చంద్రనాయుడు.. దేశపు తొలి టెస్ట్‌మ్యాచ్ కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు కూతురు. 1932లో లార్డ్స్ స్టేడియంలో మన దేశం ఇంగ్లండ్‌తో ఆడిన తొలి టెస్ట్‌మ్యాచ్‌లో మన జట్టుకు ఆయనే సారథ్యం వహించారు. అతని సోదరులైన సీఎల్ నాయుడు, సీఆర్ నాయుడు, సీఎస్ నాయుడు కూడా క్రికెటర్లే. అలా క్రికెట్ కుటుంబంలో పుట్టిన చంద్ర నాయుడు రక్తంలో కూడా క్రికెట్ ఉండటంతో ఊహ తెలియని వయసు నుంచే క్రికెట్ బ్యాట్ పట్టుకున్నారావిడ. ఊహ తెలిసేప్పటికి ఆమె ఆసక్తి, ఇష్టం అన్నీ క్రికెటే అయ్యాయి. ప్రాక్టీస్‌తో ఆటలో ప్రావీణ్యం సంపాదించి దేశపు తొలితరం మహిళా క్రికెటర్లలో ఒకరిగా స్థానం సంపాదించుకున్నారు.

సల్వార్, కమీజ్‌తో రోల్ మోడల్‌గా..

ఇటు చదువు.. అటు ఆటలు.. రెండిట్లోనూ చంద్ర చురుకే! 1950ల్లో తన కాలేజీ రోజుల్లో ఉత్తరప్రదేశ్ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. సల్వార్, కమీజ్‌తోనే క్రికెట్ ఆడేవారు ఆమె. ఈ ఆట కోసం ప్యాంట్, షర్ట్ ధరించాల్సిన అవసరం ఉండదని, సంప్రదాయ దుస్తుల్లోనే చక్కగా ఆడొచ్చని తోటి అమ్మాయిలు గ్రహిస్తారని! క్రీడారంగంలో ముఖ్యంగా క్రికెట్‌లోకి వీలైనంత ఎక్కువ మంది అమ్మాయిలు రావాలని చంద్ర ఆశించారు. అందుకే స్పోర్ట్స్‌వేర్‌తో వాళ్లు వెనుకడుగు వేయకుండా తనను ఓ రోల్‌మోడల్‌గా చూపేందుకు ప్రయత్నించారు ఆమె.

ట్రయల్ బ్లేజర్

ఎన్నో విజయాల తర్వాత క్రికెట్ ఆట నుంచి ఆమె దృష్టి క్రికెట్ మ్యాచ్ వ్యాఖ్యానం మీదకు మళ్లింది. రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల కోసం రేడియోలో వ్యాఖ్యానం చెప్పడం మొదలుపెట్టారు. ఆల్ ఇండియా రేడియో కోసం కాకుండా స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న ప్రేక్షకుల కోసం నేరుగా వ్యాఖ్యానం చేయాలని ఉత్సాహపడ్డారు. ఆ అవకాశం 1977లో వచ్చింది బాంబే (అప్పటి) – మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ మధ్య జరిగిన మ్యాచ్‌తో! ఆ ఆటను వ్యాఖ్యానించడానికి స్టేడియంలో తొలిసారిగా మైక్ పట్టుకున్నారు చంద్ర నాయుడు. ఆ సందర్భమే ఆమెను తొలి మహిళా కామెంటేటర్ అనే ఖ్యాతిని తెచ్చిపెట్టింది. చరిత్రలో నిలిపింది. భారతీయ క్రికెట్ బ్రాడ్‌కాస్టింగ్‌లోనే ఓ సంచలనంగా మారింది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌కి ఆల్ ఇండియా రేడియోలో ఆమె చెప్పిన వ్యాఖ్యానానికి బీబీసీ మేల్ కామెంటేటర్స్ అబ్బురపడ్డారట.

టీచర్‌గా ...

క్రికెట్ కామెంటరీ నుంచి రిటైరయ్యాక చంద్ర నాయుడు ఇండోర్ వెళ్లిపోయి.. అక్కడి ప్రభుత్వ మహిళా పీజీ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరారు. చివరి వరకు అక్కడే పనిచేసి ప్రిన్సిపల్‌గా రిటైరయ్యారు. ఆమె తండ్రి తొలి టెస్ట్ మ్యాచ్‌కి ఎక్కడైతే కెప్టెన్‌గా వ్యవహరించారో అక్కడే ఆ లార్డ్స్ స్టేడియంలోనే 1982లో ఇండియా, ఇంగ్లండ్‌కు మధ్య జరిగిన గోల్డెన్ జూబ్లీ టెస్ట్ మ్యాచ్‌కు చంద్ర నాయుడు ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారు. ఆమె ఇండోర్‌లో.. 2021, ఏప్రిల్‌లో తన 88వ ఏట తుదిశ్వాస విడిచారు.

లేట్ ప్రెగ్నెన్సీతో 'డౌన్స్' సిండ్రోమ్

ఇటీవల కెరియర్ లాంటి అనేక కారణాలతో మహిళలు పెళ్లిని, తద్వారా గర్భధారణను వాయిదా వేస్తున్నారు. పెద్దవయసులో గర్భధారణ వల్ల వచ్చే అనర్థాల్లో ఒకటి డౌన్స్ సిండ్రోమ్. క్రోమోజోముల్లో తేడాల వల్ల పుట్టబోయే బిడ్డలో చప్పిడి ముక్కు, వికాసం ఆలస్యం కావడం వంటి అనర్థాలు తెచ్చే ఈ డౌన్స్ సిండ్రోమ్ అంటే ఏమిటో తెలిపే కథనం...

'సాక్షి హెల్త్ డిజిటల్' పేజీలో...

సమ్‌థింగ్ స్పెషల్

కలెక్టర్‌గారిని బంగారు రథంలో ఊరేగించారు!



అధికారులు ఒక చోటు నుంచి మరో చోటుకి బదిలీ కావడం, పని చేసిన చోట సత్కారాలు, సన్మానాలు అందుకోవడం సహజం. మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సంస్కృతి జైన్ భోపాల్‌కు బదిలీ అయ్యారు. సిబ్బంది, ఆమెతో పనిచేసిన ఉద్యోగులతో పాటు ప్రజలు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.

బంగారు రథంలో సంస్కృతి జైన్‌నూ, ఆమె ఇద్దరు చిన్న కూతుళ్లను కూర్చోబెట్టుకొని ఊరేగించారు. ఈ ఉత్సాహభరిత వేడుక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

సియోని కలెక్టర్‌గా పదిహేను నెలల కాలంలో ఎన్నో ప్రభావంతమైన కార్యక్రమాలతో ప్రజలలో మంచి గుర్తింపు పొందారు సంస్కృతి. లాడ్లీ బెహన్ పథకాన్ని అటల్ పెన్షన్ యోజనతో విలీనం చేశారు. కమ్యూనిటీ భాగస్వామ్య కార్యక్రమాలతో ప్రాథమిక పాఠశాలల పరిస్థితి మెరుగుపరిచారు. అట్టడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేశారు.

స్ఫూర్తి

సెక్యూరిటీ గార్డ్ టు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



కొన్ని సంవత్సరాల క్రితం...

ఉద్యోగం వెదుక్కోవడానికి ఇంటి నుంచి వెయ్యి రూపాయలు తీసుకొని ముంబైకి బయలుదేరాడు అబ్దుల్ అలీమ్. ఉద్యోగం దొరకక నెలరోజులు వీధుల్లో ఉండాల్సి వచ్చింది.

'ఈ కష్టాలు అవసరమా? ఇంటికి వెళ్లిపోదాం' అనుకున్నాడు. నిజానికి ఇంటికి వెళ్లడానికి అవసరమైన డబ్బు కూడా తన చేతిలో లేదు. 'ఎలాగైనా సరే ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాల్సిందే' అని గట్టిగా నిర్ణయించుకున్నాడు. అలా సాఫ్ట్‌వేర్ కంపెనీ 'జోహో' కార్యాలయంలో సెక్యూరిటీ గార్డ్‌గా చేరాడు. పన్నెండు గంటల షిఫ్ట్. ఒకరోజు 'జోహో'లోని సీనియర్ ఉద్యోగి శిబు అలెక్సిస్, అలీమ్‌ను దగ్గరకి పిలిచి... 'నీ కళ్లలో ఏదో సాధించాలనే పట్టుదల కనిపిస్తుంది' అన్నాడు. తాను పదవ తరగతి మాత్రమే చదువుకున్నానని చెప్పాడు అలీమ్. 'నేర్చుకోవాలనే తపన ఉంటే చదువు అనేది పెద్ద విషయం కాదు' అని మార్గనిర్దేశం చేయడమే కాదు ఎనిమిది నెలల పాటు ప్రతి సాయంత్రం ప్రోగ్రామింగ్ పాఠాలు చెప్పేవాడు శిబు. చాలా ఆసక్తి, అంకితభావంతో పాఠాలు నేర్చుకున్నాడు అలీమ్.

శిబు ప్రయత్నం ఫలించింది. కొన్ని నెలల తరువాత యూజర్ ఇన్‌పుట్‌ను విజువలైజ్ చేసే యాప్‌ను రూపొందించాడు అలీమ్. విషయం తెలిసిన 'జోహో' మేనేజర్ ఆలిమ్‌ను ఇంటర్వ్యూకు పిలిచాడు. 'జోహో'కు కావాల్సింది నైపుణ్యమే. డిగ్రీలతో పనిలేదు' అని ధైర్యం చెప్పాడు మేనేజర్. 'జోహో'లో డెవలపర్‌గా చేరాడు అలీమ్.

తన ఉద్యోగ ప్రస్థానం గురించి లింక్డిన్‌లో అలీమ్ పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

బ్యూటిప్



టేబుల్ స్పూన్ అరటిపండు గుజ్జులో అర టేబుల్ స్పూన్ టొమాటో రసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని మెడకు, ముఖానికి చేతులకి పట్టించి 20 నిమిషాల తరవాత వేడినీటితో కడిగేయాలి. పార్టీకి వెళ్లే గంటముందు ప్యాక్ వేసుకుంటే చర్మం తాజాగా కాంతివంతంగా ఉంటుంది.



బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) అక్టోబర్ 13న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,30,310	1,27,130	1,25,400	1,27,130	1,30,200	1,25,720
బంగారం (22 క్యారెట్లు)	1,17,279	1,14,950	1,14,950	1,18,400	1,19,780	1,15,250
వెండి	1,92,000	1,73,000	1,97,000	1,73,400	1,79,000	1,95,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
చిత్త కార్తె: అక్టోబర్ 14 నుంచి

పగ బట్టిన పండు ఈగ!

తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా పండ్ల, కూరగాయ తోటలకు విస్తరించిన పండు ఈగ ముప్పు

మామిడిలో 30% నుంచి 70% వరకు దిగుబడి నష్టం

జామ, బొప్పాయి, సపోటా, రేగు వంటి పంటల్లో 20% నుంచి 50% వరకు దిగుబడి నష్టం



పండు ఈగ (ఫ్రూట్ ఫ్లై) అనేక పండ్లు, కూరగాయ తోటలకు పెను నష్టాన్ని కలిగిస్తూ రైతులను అల్లాడిస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితం మామిడికే పరిమితమై ఉండే పండు ఈగ ఇప్పుడు అనేక పంటలకు విస్తరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పండు ఈగ ముప్పు ఏటేటా పెరుగుతోంది. దాదాపు 20కి పైగా పండ్లు, కూరగాయ తోటలకు పండు ఈగ ఆశిస్తూ రైతులకు పెను నష్టం కలిగిస్తోంది. మామిడిలో 30% నుంచి 70% దిగుబడి నష్టం జరుగుతోంది. జామ, బొప్పాయి, సపోటా, రేగు వంటి పంటల్లో 20% నుంచి 50% దిగుబడి నష్టాలకు కారణమవుతున్న పండు ఈగపై కేంద్ర వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్' (ఎన్‌ఐపీహెచ్‌ఎం) శాస్త్రవేత్తలు **డాక్టర్ మరియదాస్, డాక్టర్ పైలా జ్యోతి, డాక్టర్ ఆలిస్ ఆర్‌పీ సుజీత** సూచనలతో ప్రత్యేక కథనం. పండు ఈగ సోకకుండా జీవనియంత్రణ పద్ధతులను అనుసరించటమే మేలని వారు రైతులకు సూచిస్తున్నారు.



పండ్ల ఈగలు (ప్రధానంగా బాక్ట్రోసెరా జాతులు బి. డోర్సాలిస్, బి. జోనాటా, బి. కుకుర్బిటే వంటివి) ఎన్నో రకాల పండ్లు, కూరగాయలను ఆశించి నాశనం చేసే పురుగులు. అందుకే వీటిని 'పాలీఫాగస్ పెస్ట్' అంటారు. ఒకప్పుడు కొన్ని పండ్లు, కూరగాయ రకాలకు నష్టం చేకూర్చేవి. క్రమంగా అనేక ఇతర పంటలకు కూడా వ్యాపించి నష్టం చేస్తున్నాయి. అకాల వర్షాలు, అస్థిర వాతావరణ పరిస్థితులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఉద్యాన తోటల్లో పండు ఈగల త్వరితగతిన వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. దీనివల్ల గత సీజన్‌లో కూడా మామిడి కాయలకు తీవ్ర నష్టం కలిగింది. పండు ఈగ వల్ల మామిడి ఎగుమతులు కూడా తగ్గిపోతాయి. అనేక ఇతర పంటలను కూడా పండు ఈగ చుట్టుముడుతోంది.

ఈ తోటలకు ముప్పు

పండ్ల జాతులు: మామిడి, జామ, సీతాఫలం, రేగు, బొప్పాయి, సపోటా, అరటి, దానిమ్మ, బత్తాయి, పుచ్చతో పాటు కివి వంటి అన్యదేశ పండ్లను కూడా పండు ఈగలు ఆశిస్తున్నాయి. కూరగాయలు, దోసకాయలు: టమాటా, వివిధ రకాల తీగ జాతి కూరగాయ పంటలకు పండు ఈగ సమస్యగా మారింది. బీర, సొర, కాకర, నేతి బీర, పొట్ల, గుమ్మడి, దొండ, దోస, కీర దోస తదితర ఉద్యాన పంటలకు పండు ఈగ ముప్పు పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బాక్ట్రోసెరా జాతి పండ్ల ఈగలు విజృంభిస్తున్నాయి. వందలాది పంటలను ఆశిస్తున్నాయి. అకాల వర్షాలు, తేమతో పాటు వెచ్చని రాత్రులతో మారుతున్న వాతావరణం చీడపీడలు వేగంగా విస్తరించటానికి సహాయపడుతున్నది. ఇది తెలంగాణ, ఆంధ్రలో ఇటీవలి మామిడి నష్టాలకు ప్రధాన కారణం బాక్ట్రోసెరా జాతి పండ్ల ఈగలే. పక్వానికి వచ్చిన కాయల కోత ఆలస్యమై పండ్లు చెట్లపై ఎక్కువ కాలం ఉన్నప్పుడు పండు ఈగలు వాటిని ఆశించి, ఆ పండ్ల లోపలికి గుడ్లు చొప్పించడానికి ఎక్కువ అవకాశం దొరుకుతున్నది.

నష్టాలు.. ఎగుమతి చిక్కులు


జామనాశించు పండుఈగ బ్యాక్ట్రోసెరా కరేక్టా


మామిడినాశించు పండుఈగ బ్యాక్ట్రోసెరా డోర్సాలిస్


పుచ్చకాయను ఆశించు పండుఈగ బ్యాక్ట్రోసెరా కుకుర్బిటే

చెట్లకు వేలాడుతున్న పండ్ల తొక్కకు ఆడ పండు ఈగలు బెజ్జం చేసి, వాటి లోపల గుడ్లు పెడతాయి. గుడ్ల నుంచి తయారయ్యే పురుగులు ఆ పండు లోపలే ఉండి గుజ్జును తింటూ ఉంటాయి. దీనివల్ల పండు పైకి చూపులకు అంతా బాగానే కనిపిస్తున్నా లోపల్లోపల కుళ్ళి మెత్తబడుతుంది. అకాలంగా పండ్లు రాలిపోతుంటాయి. ఇది పంట కోత తర్వాత కాలంలో అధిక నష్టాలకు దారితీస్తుంది. పండు ఈగలు ఎక్కువగా ఆశిస్తే పంట దిగుబడితో పాటు మార్కెట్‌లో ధరలు, ఎగుమతులు కూడా తగ్గిపోతాయి. పండు ఈగల దాడిని సరిగ్గా నియంత్రించకపోతే పండ్లు, కూరగాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయి, రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక నష్టాలు సంభవిస్తాయి. మామిడిలో 30% నుంచి 70% వరకు పంట నష్టం జరుగుతుంది. జామ, బొప్పాయి, సపోటా, రేగు తదితర పంటల్లో సీజన్‌ను, పండు ఈగల తీవ్రతను బట్టి 20% నుంచి 50% వరకు పంట నష్టం జరుగుతుంది.

పండు ఈగలు పెద్ద సంఖ్యలో ఆశిస్తే విదేశాలకు ఎగుమతైన పండ్లు అక్కడికి వెళ్లిన తర్వాత తిరస్కరణకు గురయ్యే రిస్క్ పెరుగుతుంది. ఎగుమతికి సిద్ధం చేసే ప్రక్రియలో ఖర్చులు కూడా పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో సరుకు ఎగుమతి ఆర్డర్ల రద్దుకు సైతం దారితీస్తుంది. ఇది భారతీయ ఉత్పత్తులకు విదేశీ మార్కెట్లలో వాణిజ్య భాగస్వామ్యాన్ని తగ్గిస్తుంది. ఈ పరిస్థితిని నివారించడానికి పండ్లు ఈగలతో ప్రభావితమైన పండ్లను ఎగుమతి కాకుండా చూడాలి. అందుకు అనుగుణంగా కఠినమైన ఫైటో శానిటరీ శుద్ధి ప్రక్రియలు చేపట్టటం అవసరం. వేడి నీటి చికిత్స, వేడి ఆవిరి చికిత్స, చల్ల నీటి చికిత్స, వికిరణ చికిత్స, రసాయన ద్రావణాల్లో పండ్లను ముంచటంతో పాటు ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా పండు ఈగ రహిత ధ్రువీకరణను ప్రవేశపెట్టటం వంటి పటిష్ఠ చర్యలు తీసుకుంటే పండు ఈగ వల్ల ఎగుమతులు దెబ్బతినకుండా చూసుకోవచ్చు.



పండు ఈగ నియంత్రణకు మేలైన యాజమాన్య పద్ధతులు

- తోటలో చెట్ల నుంచి రాలిపోయిన లేదా పండు ఈగ సోకిన పండ్లను సేకరించి మట్టిలో రెండు అడుగుల (60 సెం.మీ.ల) లోతు గుంత తీసి పాతిపెట్టాలి.
- పండ్ల చెట్ల కొమ్మలను తగుమాత్రంగా కత్తిరించి, కత్తిరింపులను తోటలో నుంచి తొలగిస్తే పండు ఈగలు పెరగకుండా చూసుకోవచ్చు.
- పండిన పండ్లను పండినట్లు ఎప్పటికప్పుడు వెంటనే కోయండి. పండిన పండ్లను చెట్లపై వదిలివేయవద్దు.
- జొన్న, ఆముదం, తులసి, క్రిసెండలం వంటి పురుగులను ఆకర్షించే జాతుల మొక్కలను తోటల గట్లు/ సరిహద్దుల్లో పెంచటం ద్వారా ప్రధాన పంటను పండు ఈగల నుంచి రక్షించుకోవచ్చు.
- మగ ఈగలను ఆకర్షించటం కోసం సామూహిక ఉచ్చులు ఏర్పాటు చేయటం ద్వారా పండు ఈగ సంతతిని నియంత్రించి తోటలను కాపాడుకోవచ్చు. పండ్ల తోటల్లో మిథైల్ యూజినాల్ ఉచ్చులు పెట్టాలి. తీగజాతి కూరగాయ పంటల్లో క్యూ-లూర్ ఉచ్చులను ఉపయోగించాలి. ఎకరానికి 6-10 ఉచ్చులు పెట్టాలి. ఒకసారి పెడితే చాల్లే అనుకోకండి. ప్రతి 30-40 రోజులకు ఒకసారి ఎరలను మార్చుతూ ఉండాలి. తక్కువ ఖర్చుతో కూడిన 'ఫ్రూట్ ఫ్లై బాటిల్ ట్రాప్ టెక్నాలజీ'ని ఎన్‌ఐపీహెచ్‌ఎం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దాన్ని ఉపయోగించుకోవచ్చు.
- అధిక విలువైన పండ్లను పండు ఈగ నుంచి కాపాడుకోవటం కోసం పండ్లకు రక్షక సంచులు తొడగాలి. పండ్లకు కాగితం లేదా ప్లాస్టిక్ సంచులు తొడగండి. ఇది పండుపై ఈగ గుడ్లు పెట్టకుండా అడ్డుకుంటుంది. పురుగుమందుల అవశేషాలను తగ్గిస్తుంది. ఎగుమతి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పండ్లు ఉండేలా చేస్తుంది. శ్రమతో కూడుకున్న పని అయినప్పటికీ చిన్న తోటలన్నిటిలో, దేశీయ /ఎగుమతి మార్కెట్ల కోసం ఉద్దేశించిన తోటల్లో చెట్లపై కాయలకు సంచి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది.
- తోటలో చెట్లు / మొక్కల కింద ఉన్న మట్టిని కుళ్లగించి, ఆ మట్టిలో ఉండే పండు ఈగ ప్యూపాలను చంపడానికి క్లోర్‌పైరిఫోస్ 20% ద్రావణాన్ని లీటరు నీటికి 2.5 ఎం.ఎల్. చొప్పున కలిపి చల్లండి.



- బ్యూవేరియా బాసియానా, మెటారైజియం అనిసోప్లియా వంటి ఎంటోమో పాథోజెనిక్ శిలీంధ్రాలను ఆకులపై పిచికారీ చేయండి.
- మగ, ఆడ కీటకాలను చంపడానికి ఎర స్ప్రేలను పిచికారీ చేయవచ్చు. ఏదైనా ఒక పురుగుమందును (మలాథియాన్ 50% ద్రావణం లీటరు నీటికి 2 ఎం.ఎల్./ లేదా డెల్టామెథ్రిన్ 2.8% ద్రావణం లీటరు నీటికి 2 ఎం.ఎల్. చొప్పున) ప్రోటీన్ హైడ్రోలైజేట్ లేదా మొలాసిస్ లేదా బెల్లంలకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయండి. పండు ఈగలు ఎక్కువగా ఉన్నప్పుడల్లా 2 వారాల వ్యవధిలో పిచికారీ చేయండి.





జపాన్ ఓపెన్ స్క్వాష్ టోర్నీ విజేత జోష్నా చినప్ప

అంచనాలకు మించి రాణించిన భారత స్క్వాష్ స్టార్ జోష్నా చినప్ప తన కెరీర్‌లో 11వ అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. యోకోహామాలో సోమవారం ముగిసిన జపాన్ ఓపెన్ ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) టూర్ చాలెంజర్ టోర్నీలో 39 ఏళ్ల జోష్నా చాంపియన్‌గా నిలిచింది. 38 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ప్రపంచ 117వ ర్యాంకర్ జోష్నా 11-5, 11-9, 6-11, 11-8తో ప్రపంచ 53వ ర్యాంకర్, మూడో సీడ్ హయా అలీ (ఈజిప్ట్)పై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో జోష్నా 11-7, 11-1, 11-5తో ప్రపంచ 73వ ర్యాంకర్, నాలుగో సీడ్ రాణా ఇస్మాయిల్ (ఈజిప్ట్)పై గెలుపొందింది. తాజా టైటిల్‌తో జోష్నా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-100లోకి వచ్చింది. ఈ టోర్నీలో 117వ ర్యాంక్ హోదాలో బరిలోకి దిగిన జోష్నా విజేతగా నిలవడంతో ఆమె ఖాతాలో 300 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. తాజా ర్యాంకింగ్స్‌లో ఆమె ఏకంగా 30 స్థానాలు ఎగబాకి 87వ ర్యాంక్‌లో నిలిచింది. 22 ఏళ్ల తన అంతర్జాతీయ కెరీర్‌లో జోష్నా 2016లో కెరీర్ బెస్ట్ 10వ ర్యాంక్‌కు చేరుకుంది. ఓవరాల్‌గా 187 టోర్నీల్లో పోటీపడ్డ జోష్నా మొత్తం 428 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 253 మ్యాచ్‌ల్లో గెలిచి, 175 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

గట్టెక్కిన దక్షిణాఫ్రికా

ఉత్కంఠపోరులో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు

అర్ధ సెంచరీలతో ఆదుకున్న ట్రయాన్, కాప్ ● హడలెత్తించిన బంగ్లాదేశ్ బౌలర్లు



క్లో ట్రయాన్



మరిజన్ కాప్

సాక్షి, విశాఖపట్నం: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా కష్టపడి గెలిచింది. లక్ష్యఛేదనలో 78 పరుగులకే 5 వికెట్లను కోల్పోయి ఓటమి కోరల్లో చిక్కుకున్న సఫారీ జట్టును మరిజన్ కాప్ (71 బంతుల్లో 56; 4 ఫోర్లు, 1 సిక్స్)... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్లో ట్రయాన్ (69 బంతుల్లో 62; 6 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత పోరాటంతో గట్టెక్కించారు. దీంతో దక్షిణాఫ్రికా ఆఖరి ఓవర్‌దాకా పోరాడి 3 బంతులు మిగిలి ఉండగా 3 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై నెగ్గింది. సఫారీకిది వరుసగా మూడో విజయం కాగా... బంగ్లాదేశ్‌కు మూడో పరాజయం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫర్జానా హక్ (30; 3 ఫోర్లు), రుబియా హైదర్ (25) తొలి వికెట్‌కు 53 పరుగులతో చక్కని ఆరంభాన్నిచ్చారు. వీళ్లిద్దరు అవుటయ్యాక... టాపార్డర్ బ్యాటర్ షర్మిన్ అక్తర్ (77 బంతుల్లో 50; 6 ఫోర్లు), కెప్టెన్ నిగార్ సుల్తానా (42 బంతుల్లో 32; 5 ఫోర్లు) కుదురుగా ఆడి మరో పెద్ద భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మూడో వికెట్‌కు 77 పరుగులు జోడించారు. షర్మిన్ అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. ఆఖర్లో షోర్నా అక్తర్ (35 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడింది. రీతూ మోనీ (8 బంతుల్లో 19 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి వేగంగా పరుగులు జతచేసింది. సఫారీ బౌలర్లలో ఎంలాబా 2 వికెట్లు, డి క్లెర్క్, ట్రయాన్ చెరో వికెట్ తీశారు. అనంతరం 233 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 49.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసి గెలిచింది. ఆరంభంలోనే బ్రిట్స్ (0) వికెట్ కోల్పోగా... లారా వోల్‌వార్ట్ (56 బంతుల్లో 31; 5 ఫోర్లు), అనికె బాష్ (35 బంతుల్లో 28; 6 ఫోర్లు) జట్టు స్కోరును 50 పరుగులు దాటించారు. అయితే 20 పరుగుల వ్యవధిలో క్రీజులో పాతుకుపోయిన వీరిద్దరితో పాటు డెర్క్‌సెన్ (2), సినాలో జాఫ్టా (4) నిష్క్రమించారు. దీంతో 78/5 స్కోరు వద్ద సఫారీకి పరాజయం తప్పదనిపించింది. ఈ దశలో మరిజన్ కాప్, ట్రయాన్ ఆరో వికెట్‌కు 85 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికా గెలుపు ట్రాక్‌లో పడింది. ఇద్దరు అర్ధసెంచరీలు పూర్తయ్యాక అవుటయ్యారు. అయితే డిక్లెర్క్ (29 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది. భారత్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాగేసినట్లే కీలకమైన పరుగులతో బంగ్లాదేశ్‌తోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. ఇంకో 3 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించింది. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా అక్తర్ 2, రబియా ఖాన్, ఫాహిమా, రీతు మోని తలా ఒక వికెట్ తీసి సఫారీని ఇబ్బంది పెట్టారు. కొలంబోలో **నేడు జరిగే మ్యాచ్‌లో శ్రీలంకతో న్యూజిలాండ్ తలపడుతుంది.**


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గెలుపు వాకిట్లో భారత్

వెస్టిండీస్‌పై రెండో టెస్టు గెలిచేందుకు, సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు భారత్ 58 పరుగుల దూరంలోనే ఉంది. ఆఖరి రోజు లంచ్ బ్రేక్‌కు ముందే ఈ లాంఛనం పూర్తి చేసేందుకు సిద్ధమైంది. అంతకుముందు వెస్టిండీస్ చాన్నాళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు క్రికెట్‌లో పోరాడింది. నిర్జీవమైన పిచ్‌పై ఓవర్‌నైట్ బ్యాటర్లు క్యాంప్‌బెల్, షై హోప్ ఇద్దరు శతకాల మోత మోగించడంతో భారత్ లక్ష్యఛేదనకు దిగాల్సి వచ్చింది. ఫలితంగా మ్యాచ్ ఐదో రోజుకు చేరింది.

విజయానికి 58 పరుగులే దూరం

- 'శత'క్కొట్టిన క్యాంప్‌బెల్, షై హోప్
- రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 390 ఆలౌట్
- భారత్ లక్ష్యం 121 ; ప్రస్తుతం 63/1



క్యాంప్‌బెల్
షై హోప్



న్యూఢిల్లీ: భారత్ ఆఖరి టెస్టులో గెలుపు వాకిట నిలిచింది. మంగళవారం ఉదయం ఆ లాంఛనాన్ని పూర్తిచేస్తే చాలు టీమిండియా రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేస్తుంది. ఎట్టకేలకు వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లకు పని పెట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో కఠిన సవాళ్లు విసిరారు. తొలి టెస్టును మూడే రోజుల్లో ముగించిన ఆతిథ్య జట్టు... స్పిన్‌కు అచ్చొచ్చే ఢిల్లీ పిచ్ ఈసారి నిర్జీవంగా మారడంతో వికెట్లు తీసేందుకు చెమటోడ్చింది. పేసర్లు బుమ్రా (3/44), సిరాజ్ (2/43), స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (3/104), రవీంద్ర జడేజా (1/102), వాషింగ్టన్ సుందర్ (1/80) సమష్టిగా రాణించారు. స్పిన్ త్రయం 5, పేస్ ద్వయం 5 ఇలా చెరో సగం వికెట్లతో ప్రత్యర్థి జట్టును కూల్చారు. దీంతో వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 118.5 ఓవర్లలో 390 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ (199 బంతుల్లో 115; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), షై హోప్ (214 బంతుల్లో 103; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. అనంతరం 121 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (8) అవుటవ్వగా, కేఎల్ రాహుల్ (54 బంతుల్లో 25 బ్యాటింగ్; 2 ఫోర్లు), సాయి సుదర్శన్ (47 బంతుల్లో 30 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 9 వికెట్లున్న భారత్ విజయానికి ఇంకా 58 పరుగులు కావాలి.

కదంతొక్కిన హోప్, క్యాంప్‌బెల్

ఓవర్‌నైట్ స్కోరు 173/2తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కరీబియన్ బ్యాటర్లు క్యాంప్‌బెల్, హోప్ కదంతొక్కారు. పేస్, స్పిన్ బౌలింగ్‌పై యథేచ్ఛగా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో ఓపెనర్ క్యాంప్‌బెల్ టెస్టు క్రికెట్‌లో తొలి సెంచరీ ముచ్చటను తీర్చుకున్నాడు. జడేజా ఓవర్లో భారీ సిక్సర్‌తో క్యాంప్‌బెల్ శతకాన్ని సాధించగా, షై హోప్ కూడా సెంచరీ దిశగా సాగిపోయాడు. దీంతో ఈ సెషన్‌లో భారత బౌలర్లకు కఠిన పరీక్ష తప్పలేదు. క్యాంప్‌బెల్‌ను జడేజా ఎల్బీగా అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 177 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. హోప్‌కు కెప్టెన్ రోస్టన్ చేజ్ జతవ్వగా... విండీస్ 252/3 స్కోరు వద్ద లంచ్ విరామానికెళ్లింది. రెండో సెషన్ మొదలైన కాసేపటికే భారత్ కొత్త బంతిని తీసుకుంది. నింపాదిగా ఆడుతున్న హోప్ కూడా శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. చేజ్ (72 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో పాతుకుపోవడంతో నాలుగో వికెట్ భాగస్వామ్యం కూడా సాఫీగా సాగిపోయింది. ఈ దశలో సిరాజ్... హోప్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి 59 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

గ్రీవెస్ అర్ధశతకం

తర్వాత కుల్దీప్ మ్యాజిక్‌కు స్వల్ప వ్యవధిలోనే 3 వికెట్లు కూలాయి. మొదట ఇమ్లాచ్ (13)ను అవుట్ చేసిన కుల్దీప్ తర్వాతి ఓవర్లో చేజ్, పియర్ (0)లను బోల్తా కొట్టించాడు. జట్టు స్కోరు 300 దాటాక బుమ్రా నిప్పులు చెరగడంతో వారికెన్ (3), ఫిలిప్ (2)లు నిష్క్రమించారు. దీంతో 311 పరుగుల వద్ద తొమ్మిదో వికెట్ కూలింది. ఇక ఆఖరి వికెటే కదా ఆలౌట్ తేలికే అనుకుంటే... మిడిలార్డర్ బ్యాటర్ జస్టిన్ గ్రీవెస్ (85 బంతుల్లో 50 నాటౌట్; 3 ఫోర్లు) మొండిగా పోరాడాడు. దీంతో రెండో సెషన్ నుంచి ఆఖరి సెషన్ వరకు గ్రీవెస్, జేడెన్ సీల్స్ (67 బంతుల్లో 32; 1 ఫోర్, 1 సిక్స్)తో భాగస్వామ్యమే లాక్కొచ్చింది. గ్రీవెస్ అర్ధసెంచరీ పూర్తయిన తర్వాత... సీల్స్‌ను బుమ్రా అవుట్ చేయడంతో విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది. చివరి వికెట్‌కు సీల్స్, గ్రీవెస్ ఏకంగా 79 పరుగులు జోడించడం విశేషం. భారత్ ముందు వంద పైచిలుకు లక్ష్యానికి, ఐదో రోజు పొడిగింపునకు ఈ భాగస్వామ్యమే కారణమైంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; **వెస్టిండీస్ తొలిఇన్నింగ్స్:** 248; **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** క్యాంప్‌బెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 115; తేజ్ చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10; అతనేజ్ (బి) సుందర్ 7; షై హోప్ (బి) సిరాజ్ 103; చేజ్ (సి) సబ్-పడిక్కల్ (బి) కుల్దీప్ 40; ఇమ్లాచ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 12; గ్రీవెస్ (నాటౌట్) 50; పియర్ (సి) నితీశ్ రెడ్డి (బి) కుల్దీప్ 0; వారికెన్ (బి) బుమ్రా 3; ఫిలిప్ (సి) జురేల్ (బి) బుమ్రా 2; సీల్స్ (సి) సుందర్ (బి) బుమ్రా 32; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం** (118.5 ఓవర్లలో ఆలౌట్) 390. **వికెట్ల పతనం:** 1-17, 2-35, 3-212, 4-271, 5-293, 6-298, 7-298, 8-307, 9-311, 10-390. **బౌలింగ్:** సిరాజ్ 15-3-43-2, జడేజా 33-10-102-1, సుందర్ 23-3-80-1, కుల్దీప్ 29-4-104-3, బుమ్రా 17.5-5-44-3, జైస్వాల్ 1-0-3-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికెన్ 8; రాహుల్ (బ్యాటింగ్) 25; సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 30; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (18 ఓవర్లలో వికెట్ నష్టానికి) 63.** **వికెట్ల పతనం:** 1-9. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0, వారికెన్ 7-1-15-1, పియర్ 6-0-24-0, చేజ్ 2-0-10-0.

సాక్షి సినిమా

మిత్రమండలి అలరిస్తుంది - శ్రీ విష్ణు



● ప్రియదర్శి, శ్రీవిష్ణు, బన్నీ వాసు, భాను ప్రతాప, కల్యాణ్ మంతెన

''మిత్రమండలి' మూవీ సీక్వెన్స్ బాగున్నాయి. ఫ్రెండ్స్‌తో కలిసి ఈ సినిమాని చూసి ఎంజాయ్ చేయండి. ప్రేక్షకులను ఈ సినిమా అలరిస్తుంది. ఇది నా ప్రామిస్'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎం జంటగా నటించిన సినిమా 'మిత్ర మండలి'. ఎస్. విజయేందర్ దర్శకత్వంలో బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు శ్రీవిష్ణు ముఖ్య అతిథిగా హాజరై, 'తెల్లకోడి నల్లకోడి కళ్ల ముందే జోడి కూడి..'పాటను విడుదల చేశారు. దర్శకులు వివేక్ ఆత్రేయ, కల్యాణ్, ఆదిత్యా హాసన్, అనుదీప్ అతిథులుగా హాజరై, సినిమా విజయాన్ని ఆకాంక్షించారు. అనంతరం ప్రియదర్శి మాట్లాడుతూ-''మిత్రమండలి' హిట్ కాకపోతే నా నెక్ట్స్ సినిమా చూడొద్దు. 'కోర్ట్' సినిమా టైమ్‌లో నాని అన్న చెప్పిందే కాపీచేసి, 'మిత్రమండలి' కోసం నేను చెబుతున్నాను'' అన్నారు. **బన్నీ వాసు మాట్లాడుతూ**- ''క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిత్రమండలి'. ఈ దీపావళికి రిలీజ్ అయ్యే నాలుగు సినిమాలూ హిట్ కావాలి. అందరితో పాటుగా మనం కూడా ఎదగాలని కోరుకునే వ్యక్తిని నేను. డబ్బులు పెట్టి పక్క సినిమాపై ట్రోలింగ్ చేసి ఎదుగుదాం అనుకుంటే మాత్రం... పైన దేవుడు ఉన్నాడు.. చూసే ప్రేక్షకులు ఉన్నారు. వాళ్లే చూసుకుంటారు. సినిమా బాగుంటే చూస్తారు. లేకపోతే నీదైనా, నాదైనా.. ఏ సినిమానైనా ఆడియన్స్ పక్కన పెడతారు. ఎంతమంది ఏం చేసినా నేను పరిగెడుతూనే ఉంటాను. అదే నా విజయం అని నమ్ముతాను'' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ''సినిమా చాలా బాగా వచ్చింది. హిట్ కొడుతున్నాం అని ప్రోత్సహించిన కల్యాణ్ మంతెన, భాను, విజయేందర్, సోమరాజుగార్లకి థ్యాంక్స్'' అన్నారు ఎస్. విజయేందర్. ''మా సినిమా ట్రైలర్‌కి మంచి స్పందన లభిస్తోంది. కానీ, కొంతమంది హేటర్స్ కూడా ఉన్నారు. వాళ్లు మా సినిమా ప్రీమియర్స్‌కి కూడా వస్తారని తెలుసు. వాళ్లకు మేము ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ హాయిగా నవ్వించడం'' అన్నారు నిర్మాత భాను ప్రతాప. ''ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే సినిమా ఇది'' అన్నారు నిర్మాత విజయేందర్. ఈ వేడుకలో చిత్రయూనిట్ పాల్గొంది.



● కృతీ ప్రసాద్, శ్రీనిధీ శెట్టి, సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, నీరజ కోన

తెలుసు కదా అందరికీ నచ్చుతుంది

- సిద్ధు జొన్నలగడ్డ

''డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల్లో నేను పోషించిన టిల్లు లాంటి పాత్ర నుంచి బయటికి రావాలంటే 'తెలుసు కదా' లాంటి సినిమాలు చేయాలి. టిల్లు అమాయకుడు. కానీ, 'తెలుసు కదా'లో నేను చేసిన వరుణ్ పాత్ర చాలా తెలివైనది. ఆ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. మా సినిమా యువత, కుటుంబ సభ్యులతో పాటు అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అని సిద్ధు జొన్నలగడ్డ చెప్పారు. నీరజ కోన దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, శ్రీనిధీ శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కానుంది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నీరజ కోన మాట్లాడుతూ- ''దర్శకురాలిగా 'తెలుసు కదా' నా తొలి చిత్రం.. అందుకే నాకు చాలా ప్రత్యేకం. ట్రైలర్‌లో మీరు చూసిన దానికి పది రెట్లు సినిమా ఉంటుంది'' అని చెప్పారు. ''ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న టీమ్ విషయంలో గర్వంగా ఉంది'' అన్నారు కృతీ ప్రసాద్. ''మా సినిమాని అందరూ చూసి సపోర్ట్ చేయాలి'' అన్నారు రాశీ ఖన్నా. ''సినిమా విడుదల కోసం చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను'' అని శ్రీనిధీ శెట్టి పేర్కొన్నారు. నటుడు వైవా హర్ష, మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు.

అబ్బాయిగారు 60 ప్లస్



● వెంకటేశ్

హీరో వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా తెరకెక్కుతోంది. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేశ్ కెరీర్‌లోని ఈ 77వ సినిమాకు 'ఆనంద నిలయం, వెంకటరమణ కేరాఫ్ ఆనందనిలయం'.. వంటి టైటిల్స్‌ను మేకర్స్ అనుకుంటున్నారనే ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ సినిమాకు 'అబ్బాయిగారు 60 ప్లస్' అనే టైటిల్‌ను కూడా యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ తెరపైకి వచ్చింది. వెంకటేశ్ కెరీర్‌లో ఆల్రెడీ 'అబ్బాయి గారు' అనే సూపర్‌హిట్ ఫిల్మ్ ఉండటం, త్రివిక్రమ్ సినిమాల టైటిల్స్ ఎక్కువగా 'అ, ఆ' అక్షరాలతో మొదలయ్యే సంప్రదాయం ఉండటంతో 'అబ్బాయిగారు 60 ప్లస్' ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు ఇండస్ట్రీ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి. ఈ సినిమాని వచ్చే ఏడాది వేసవి సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

హిందీలో సంక్రాంతికి వస్తున్నాం?

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన బ్లాక్ బస్టర్ సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజై, సూపర్ హిట్ అయింది. కాగా, ఈ సినిమాని హిందీలో రీమేక్ చేయాలని 'దిల్' రాజు ప్రయత్నాలు చేస్తున్నారట. ఇందులో అక్షయ్ కుమార్ హీరోగా నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. పూర్తి వివరాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

జోక్యం చేసుకోలేదు

- జైన్స్ నాని



''సినిమా అంటే చిన్నప్పటి నుంచే నాకు ప్యాషన్. కిరణ్ అబ్బవరంతో ఏడాదిన్నర ప్రయాణం చేశాను. 'కె-ర్యాంప్' చిత్ర కథ రాసుకుంటున్న సమయంలో తనకు అనిపించింది నాతో షేర్ చేసుకునేవారాయన. అంతేకానీ నా కథ, స్క్రిప్ట్ విషయంలో కిరణ్ ఎక్కడా జోక్యం చేసుకోలేదు'' అని డైరెక్టర్ జైన్స్ నాని చెప్పారు. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజ జోడీగా నటించిన చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించారు. ఈ మూవీ ఈ నెల 18న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జైన్స్ నాని మాట్లాడుతూ-''మాది నెల్లూరు. మద్రాస్ ఐఐటీలో చదువుకున్నా. అక్కడ కొన్ని షార్ట్ ఫిలింస్ చేశాను. ఇండస్ట్రీకి వెళతానన్నప్పుడు మా నాన్నగారు.. 'ఉద్యోగమా? డైరెక్టరా? అన్నది నువ్వే నిర్ణయించుకో?' అని ప్రోత్సహించారు. 'కె-ర్యాంప్' లో హీరో క్యారెక్టర్ పేరు కుమార్. కథకు, హీరో పాత్రకి సరిపోయేలా 'కె-ర్యాంప్' అనే టైటిల్ పెట్టాం. పక్కాగా ఫ్యామిలీస్ చూడాల్సిన సినిమా మాది. ఈ మూవీ ద్వారా కిరణ్, యుక్తి తరేజాకి మంచి పేరొస్తుంది. ఫ్రెష్ నెస్ కోసమే కేరళ నేపథ్యం తీసుకున్నాం. 47 రోజుల్లోనే షూటింగ్ పూర్తి చేశాం. ఫైనల్ కాపీ చూశాక రాజేష్, శివగార్లు నన్ను అభినందించారు. దీపావళికి తెలుగులో బాగా పోటీ ఉంది. అయితే అన్ని సినిమాలూ హిట్ కావాలి. మా చిత్రం ఇంకొంచెం పెద్ద హిట్ కావాలి. నాకు ఎనర్జీతో ఉండే వినోదాత్మక చిత్రాలంటే ఇష్టం'' అని చెప్పారు.

రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను


- మమిత బైజు

''డ్యూడ్' సినిమాలోని కొన్ని భావోద్వేగమైన సన్నివేశాలు నాకు సవాల్‌గా అనిపించాయి. ఆ సన్నివేశాల కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. అలా చేయడం నాకు సవాల్‌గా, ఉత్సాహంగా అనిపించింది'' అని హీరోయిన్ మమిత బైజు తెలిపారు. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా శరత్ కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ అవుతోంది. మమిత బైజు మాట్లాడుతూ - ''డ్యూడ్'లో నేను చేసిన కురల్ పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. ఇప్పటి వరకు నేను అలాంటి పాత్ర చేయలేదు. ఈ సినిమాని కీర్తీశ్వరన్ అద్భుతంగా తీశారు. ప్రదీప్ రంగనాథ్ సెట్స్‌లో చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటారు. శరత్ కుమార్‌గారి లాంటి సీనియర్‌తో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. సాయి అభ్యంకర్ మ్యూజిక్ మా సినిమాకి బిగ్ ఎసెట్. నవీన్, రవిశంకర్‌గార్లు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. సినిమాని చాలా గ్రాండ్‌గా తీశారు. మా చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.





● సందీప్ కిషన్



● ఆనంద్ దేవరకొండ

దక్షిణ భారత కథలతో...

ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఆరు కొత్త తెలుగు, తమిళ ఒరిజినల్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను సోమవారం ప్రకటించింది. వాటిలో భాగంగా ఆనంద్ దేవరకొండ హీరోగా దర్శకుడు వినోద్ అనంతోజు తెరకెక్కించనున్న తెలుగు చిత్రం 'తక్షకుడు'. ఈ సినిమాలో ఆనంద్ అంధుడి పాత్రలో కనిపించనున్నారు. అదేవిధంగా సందీప్ కిషన్ హీరోగా మల్లిక్ రామ్ దర్శకత్వంలో ఓ తెలుగు వెబ్ సిరీస్ రూపొందనుంది. అలాగే ప్రియాంక మోహన్, పార్క్ హై-జిన్ ప్రధాన పాత్రల్లో రా కార్తీక్ దర్శకత్వంలో 'మేడ్ ఇన్ కొరియా' అనే తమిళ చిత్రం తెరకెక్కనుంది. అదేవిధంగా ఆర్. మాధవన్, నిమిషా సజయన్ ముఖ్య తారలుగా చారుకేశ్ శేఖర్ దర్శకత్వంలో 'లెగసీ' (తమిళం), గోమతి శంకర్ ప్రధాన పాత్రలో మిథున్ డైరెక్షన్‌లో 'స్టీఫెన్'(తమిళం) చిత్రాలు, అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి జంటగా బాలాజీ మోహన్ దర్శకత్వంలో '# లవ్'(తమిళం) అనే వెబ్ సిరీస్ రూపొందనుంది. ''పైన పేర్కొన్న సినిమాలు, సిరీస్‌ల ద్వారా దక్షిణ భారత భాషల్లోని కథలను ప్రోత్సహించడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నాం'' అని నెట్‌ఫ్లిక్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మోనికా శెర్గిల్ పేర్కొన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్



● 'చిత్రం' శ్రీను, సుష్మ

'చిత్రం' శ్రీను, రామ్ బండారు, సుష్మ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మేఘన'. సుధాకర రెడ్డి వర్ర దర్శకత్వంలో నంది వెంకట్ రెడ్డి నిర్మించారు. ఈ మూవీ పోస్టర్, టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'చిత్రం' శ్రీను మాట్లాడుతూ-''క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మేఘన'. మంచి కంటెంట్‌తో రూపొందిన మా సినిమా విజయం సాధిస్తుంది'' అని చెప్పారు. ''ఈ కథలో మానవ సంబంధాలు, భావోద్వేగాలు ప్రధానంగా ఉంటాయి'' అని తెలిపారు సుధాకర రెడ్డి వర్ర. ''సమాజానికి సందేశం ఇచ్చేలా, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా ఈ సినిమాను ఉంటుంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చెప్పారు నంది వెంకట్ రెడ్డి. ''మా నాన్న చనిపోయి మూడేళ్లవుతోంది. ఆ తర్వాత నా బర్త్ డేను సెలబ్రేట్ చేసుకోలేదు. కానీ, ఈ వేడుకలో నా బర్త్ డే వేడుకలు జరగడం భావోద్వేగంగా ఉంది'' అని పేర్కొన్నారు సుష్మ. ''ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు నటుడు కుప్పిలి శ్రీనివాస్, దర్శకుడు సంజీవ్.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
174	58
82,327	25,227

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,667	△	462
డోజోన్స్	46,081	△	601
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,444	△	16
డాక్స్	24,380	△	138
షాంఘై	3,897	▽	37
నికాయ్	48,088	▽	492

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.15	120.12
€	యూరో	ఎస్‌బీఐ	101.84	104.64
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.51	59.78
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.35	70.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

పసిడి, వెండి జిగేల్

సరికొత్త రికార్డుల మోత

- ఢిల్లీలో బంగారం ధర 1,27,950
- 1,79,000కు కిలో వెండి
- అంతర్జాతీయంగా ఔన్స్ 4,137 డాలర్లకు జంప్



న్యూఢిల్లీ: అమెరికా–చైనా మధ్య మరోసారి వాణిజ్య ఉద్రిక్తతలు ఏర్పడడం పసిడి, వెండి ధరలకు ఆజ్యం పోసింది. దేశీయంగాను, అంతర్జాతీయంగా సోమవారం సరికొత్త గరిష్ట రికార్డులు నమోదయ్యాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ.1,950 పెరిగి రూ.1,27,950 స్థాయిని నమోదు చేసింది. దేశీయంగా పసిడికి ఇదో నూతన రికార్డు గరిష్ట ధర. వెండి ధర సైతం కిలోకి రూ.7,500 ర్యాలీ చేయడంతో రూ.1,79,000 నూతన గరిష్ట మార్క్‌ను చేరింది. అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలతో పెట్టుబడులకు సురక్షిత సాధనంగా ఉన్న పసిడికి డిమాండ్ ఏర్పడినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశ ఉత్పత్తులపై 100 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించడం తెలిసిందే. ఈ పరిస్థితులకు తోడు పెట్టుబడుల వరంగానూ డిమాండ్ తోడైనట్టు త్రివేది తెలిపారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 2 శాతం పెరిగి 4,085 డాలర్ల వద్ద కొత్త గరిష్ట స్థాయికి చేరింది. కామెక్స్ ఫ్యూచర్స్‌లోనూ ఔన్స్ బంగారం రెండున్నర శాతం మేర ఎగసి (120 డాలర్లకు పైగా) 4,137 డాలర్ల వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. స్పాట్ సిల్వర్ ఔన్స్‌కు 3 శాతం పెరిగి 51.74 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత బుల్‌ర్యాలీ కొనసాగడానికి కారణాలున్నట్టు ట్రేడర్లు పేర్కొంటున్నారు. స్థిరమైన పెట్టుబడులకు తోడు, సీజన్ వారీ కొనుగోళ్లు కూడా తోడైనట్టు చెప్పారు.

ఇక 100% ఈపీఎఫ్ విత్‌డ్రా!

- విత్‌డ్రా నిబంధనలు మరింత సులభతరం
- పాక్షిక ఉపసంహరణల పరిమితులు పెంపు
- మూడు కేటగిరీలుగా విభజన
- సెంట్రల్ బోర్డు కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులు ఇకపై తమ ముఖ్యమైన అవసరాల కోసం భవిష్యనిధి నుంచి నూరు శాతం (తన వాటా, యాజమాన్యం వాటాలు) ఉపసంహరించుకోవచ్చు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన భేటీ అయిన ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సభ్యుల జీవనాన్ని సులభతరం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్షిక ఉపసంహరణల పరిమితులను సైతం పెంచింది. 13 క్లిష్టమైన నిబంధనలన్నింటినీ కలిపేసి ఒక్కటిగా మార్చింది. నిత్యావసరాలు (అనారోగ్యం, విద్య, వివాహ అవసరాలను), గృహావసరాలు, ప్రత్యేక అవసరాలు పేరుతో ఉపసంహరణలను మూడు కేటగిరీలుగా వర్గీకరించింది.

నిబంధనల మేరకు ఉపసంహరించుకునే చాన్స్..



➤ విద్యావసరాల కోసం 10 పర్యాయాలు భవిష్యనిధిని వెనక్కి తీసుకోవచ్చు. వివాహం కోసం 5 పాక్షిక ఉపసంహరణలకు ఇకపై అనుమతి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ రెండింటి కోసం మూడు పర్యాయాలు మాత్రమే అనుమతించేవారు.

➤ ఇకపై పాక్షిక ఉపసంహరణలకు 12 నెలల కనీస సర్వీస్ (పదవీకాలం) ఉంటే సరిపోతుంది.

➤ ప్రత్యేక సందర్భాల్లో భవిష్యనిధి ఉపసంహరణకు గాను.. ప్రకృతి విపత్తు, సంస్థల మూసివేత/ఉద్యోగుల తొలగింపు, ఉపాధి లేకుండా ఉండడం, అంటువ్యాధి తదితర వాటిల్లో ఒక కారణాన్ని పేర్కొనాల్సి వచ్చేది. దీంతో ఉపసంహరణ దరఖాస్తులు కొన్ని సందర్భాల్లో తిరస్కరణకు గురయ్యేవి. ఇకపై ప్రత్యేక అవసరాల కోసం చేసే పాక్షిక ఉపసంహరణకు కారణాన్ని వెల్లడించనక్కర్లేదు.

➤ సభ్యులు తమ చందా మొత్తంలో 25% కనీస బ్యాలన్స్‌గా అన్ని సమయాల్లోనూ కొనసాగించాల్సి ఉంటుంది. తద్వారా అధిక వడ్డీ రేటు ప్రయోజనం, కాంపౌండింగ్ ప్రయోజనాలను పొందే వీలుంటుంది. ఒకవైపు తాత్కాలిక అవసరాలకు నిధుల సాయం పొందుతూ.. మరోవైపు రిటైర్మెంట్ సమయానికి కొంత నిధిని సమకూర్చుకునేందుకు వీలుగా దీన్ని ప్రవేశపెట్టారు. మిగిలిన వాటా నుంచి 100% తీసుకోవచ్చు.

➤ ఈపీఎఫ్‌వో తుది సెటిల్‌మెంట్‌ను ప్రస్తుతం రెండు నెలల ముందుగా పొందడానికి అవకాశం ఉండగా, దీన్ని 12 నెలలకు పెంచారు. తుది పింఛను ఉపసంహరణ గడువును సైతం 2 నెలల నుంచి 36 నెలలకు పొడిగించారు.

➤ ఈపీఎస్ 95 పింఛనుదారులు తమ ఇంటి నుంచే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించేందుకు వీలుగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుతో అవగాహన ఒప్పందానికి ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకు పెన్షనర్లు ఒక్కొక్కరు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

➤ జరిమానాలను క్రమబద్ధీకరించడం ద్వారా వివాదాలను తగ్గించేందుకు 'విశ్వాస్ స్కీమ్'ను ఈపీఎఫ్‌వో తీసుకొచ్చింది. పీఎఫ్ చందాలను సంస్థలు ఆలస్యంగా జమ చేయడం జరిమానాలకు ప్రధాన కారణమని కేంద్ర కార్మిక శాఖ పేర్కొంది. 2025 మే నాటికి ఇలాంటి జరిమానాలు, నష్ట పరిహారం మొత్తం రూ.2,406 కోట్లుగా ఉంది. విశ్వాస్ స్కీమ్ కింద జరిమానా మొత్తాన్ని ఫ్లాట్ 1%కి తగ్గించారు.

➤ కాగా, ఈపీఎఫ్‌వో డెట్ పెట్టుబడుల నిర్వహణకు నాలుగు ఫండ్ మేనేజర్ల (హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఆదిత్య బిర్లా ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్) ఎంపికకు సైతం సెంట్రల్ బోర్డు ఆమోదముద్ర వేసింది.

స్వల్ప నష్టాలతో ముగింపు

- చైనాపై ట్రంప్ 100% అదనపు టారిఫ్ ఎఫెక్ట్
- సెన్సెక్స్ 174 పాయింట్ల పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం స్వల్ప నష్టంతో ముగిసింది. చైనా ఉత్పత్తులపై అదనంగా 100% ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఫలితంగా సెన్సెక్స్ 174 పాయింట్లు నష్టపోయి 82,327 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు కోల్పోయి 25,227 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడినట్లైంది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభమైన క్షణాల్లోనే సెన్సెక్స్ 458 పాయింట్లు కోల్పోయి 82,043 వద్ద, నిఫ్టీ 133 పాయింట్లు పతనమై 25,152 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి. అయితే, భారత-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, హమాస్–ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందంతో కొంతమేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. ఆసియాలో కొరియా, చైనా, హాంగ్‌కాంగ్ మార్కెట్లు 1% మేర నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. అమెరికా సూచీలు 1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➜ ఫైనాన్షియల్ సర్వీసెస్, యుటిలిటీస్, విద్యుత్, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో రంగాల వారీగా ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్‌ఎంసీజీ 1% చొప్పున క్షీణించాయి. టెలికమ్యూనికేషన్, ఫార్మా సూచీలు అరశాతం పతనమయ్యాయి. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.43%, 0.18 శాతం నష్టపోయాయి.



టాటా క్యాపిటల్ లిస్టింగ్.. అక్కడక్కడే!

టాటా గ్రూప్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ టాటా క్యాపిటల్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.326)తో పోలిస్తే 1% స్వల్ప లాభంతో రూ.330 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో రూ.326 వద్ద కనిష్టాన్ని, రూ.333 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 0.12% అతి స్వల్ప లాభంతో రూ.330.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.40 లక్షల కోట్లుగా నమోదైంది. లిస్టింగ్ సందర్భంగా కంపెనీ ఎండీ సబర్వాల్ మాట్లాడుతూ... వచ్చే మూడేళ్లలో కంపెనీ లోన్ బుక్ రెట్టింపు చేయకోవడం తమ కంపెనీ లక్ష్యమన్నారు.

ధరల దూకుడు తగ్గింది...

- ఎనిమిదేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- సెప్టెంబర్‌లో 1.54%



న్యూఢిల్లీ: కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాల ధరలు నెమ్మదించడంతో సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 శాతంగా నమోదైంది. ఇది ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి. చివరిసారిగా 2017 జూన్‌లో 1.46 శాతంగా రికార్డు కాగా, గతేడాది సెప్టెంబర్‌లో 5.49 శాతంగా, ఈ ఏడాది ఆగస్టులో 2.07 శాతంగా నమోదైంది. ఈ ఏడాది రిటైల్ ద్రవ్యోల్బణం రెండు శాతం లోపే రికార్డు కావడం ఇది రెండోసారి. రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో 53 బేసిస్ పాయింట్లు తగ్గిందని, 2017 జూన్ తర్వాత ఇదే కనిష్టమని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) వెల్లడించింది. 'బేస్ ఎఫెక్ట్‌తో పాటు కూరగాయలు, నూనెలు, పండ్లు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, గుడ్లు, ఇంధనం మొదలైన ఉత్పత్తుల ధరలు నెమ్మదించడమనేది రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుదలకు కారణం' అని పేర్కొంది. గతేడాది సెప్టెంబర్‌లో 9.24%గా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ఈసారి ఆగస్టులో మైనస్ 0.64%గా, సెప్టెంబర్‌లో మైనస్ 2.28%గా నమోదైంది.



ప్రైవేట్ రంగానికీ పీఎం గతి శక్తి పోర్టల్

న్యూఢిల్లీ: లాస్ట్–మైల్ డెలివరీ సేవలను మెరుగుపర్చుకోవడంలో, మౌలిక సదుపాయాల సంబంధ సాధనాలను అభివృద్ధి చేయడంలో ప్రైవేట్ రంగానికి తోడ్పాటు అందించేలా కేంద్రం కీలక చర్య తీసుకుంది. ప్రైవేట్ రంగానికి కూడా పీఎం గతి శక్తి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. యూనిఫైడ్ జియోస్పేషియల్ ఇంటర్‌ఫేస్ (యూజీఐ) ద్వారా 'పీఎం గతిశక్తి పబ్లిక్'ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆవిష్కరించారు. ఇది విజయవంతంగా ఉపయోగపడుతున్న సందర్భాలను, ఉత్తమ వినియోగ విధానాలను వివరించే పీఎం గతిశక్తి కాంపెన్డియమ్ మొదలైన వాటిని కూడా ఆయన విడుదల చేశారు. మౌలిక సదుపాయాల ప్రణాళికలు వేసుకునేందుకు, పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకునేందుకు ఎన్‌ఎంపీ (నేషనల్ మాస్టర్ ప్లాన్)లోని నిర్దిష్ట డేటా ఈ వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా ప్రైవేట్ సంస్థలు, కన్సల్టెంట్లు, పరిశోధకులకు అందుబాటులో ఉంటుంది. మౌలిక సదుపాయాల అసెట్స్‌కి సంబంధించిన 230 డేటా సెట్స్ వివరాలను పొందేందుకు, సైట్ యోగ్యతను విశ్లేషించుకునేందుకు, కనెక్టివిటీ.. అలైన్‌మెంట్ ప్లానింగ్ మొదలైన వాటికి ఈ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హెచ్‌సీఎల్ క్యూ2 ఫ్లాట్
రియల్టీలోకి పీఈ పెట్టుబడులు డౌన్

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – ఏపీ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం – రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 10 మేనేజర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10.
» పోస్టుల వివరాలు: మేనేజర్–06, డిప్యూటీ మేనేజర్–03, అసిస్టెంట్ జనరల్ మేనేజర్–01
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంబీఏ లేదా పీజీడీబీఎంలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 08.08.2025 నాటికి డిప్యూటీ మేనేజర్‌కు 30 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 35 నుంచి 45 ఏళ్లు, మేనేజర్‌కు 24 నుంచి 36 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు డిప్యూటీ మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.1,35,020 వేతన శ్రేణి అందుతుంది.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 08.10.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.10.2025
» వెబ్‌సైట్: https://sbi.bank.in

సెబీలో 110 గ్రేడ్-ఏ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులు

ముంబైలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) వివిధ స్ట్రీమ్‌లలో గ్రేడ్–ఏ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 110.
» స్ట్రీమ్‌ల వారీగా ఖాళీలు: జనరల్–56, లీగల్–20, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–22, రీసెర్చ్–04, అఫీషియల్ లాంగ్వేజ్–03. ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్)–02, ఇంజనీరింగ్(సివిల్)–03.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ /బీటెక్ /ఎల్ఎల్‌బీ/పీజీ/సీఏ/సీఎఫ్ఏ/సీఎస్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30.09.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.62,500 నుంచి రూ.1,26,100 వేతన శ్రేణి లభిస్తుంది.
» ఎంపిక విధానం: ఫేజ్–1, ఫేజ్–2 పరీక్షలు, ఫేజ్–3(ఇంటర్వ్యూ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.10.2025
» వెబ్‌సైట్: www.sebi.gov.in/index.html

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా లేదా పీజీ లేదా పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.57,700 నుంచి రూ.1,82,400 వేతన శ్రేణి అందుతుంది.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.10.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.11.2025
» వెబ్‌సైట్: https://sportsauthorityofindia.nic.in

డీజీఎఫ్‌టీ, విశాఖపట్నంలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

విశాఖపట్నంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02.
» పోస్టుల వివరాలు: యంగ్ ప్రొఫెషనల్–01, యంగ్ ప్రొఫెషనల్(లీగల్)–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.07.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.56,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2025.
» వెబ్‌సైట్: https://www.dgft.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 50 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 50.
» పోస్టుల వివరాలు: మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్)–01, సీనియర్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్)–25, చీఫ్ మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్)–02, సీనియర్ మేనేజర్ సీ.ఐసీ రిలేషన్‌షిప్ మేనేజర్–16, చీఫ్ మేనేజర్.ఐసీ రిలేషన్‌షిప్ మేనేజర్–06.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ, సీఏ, సీఎంఏ, సీఎస్, సీఎఫ్ఏ, డిప్లొమా, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 25 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.93,960, సీనియర్ మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280, చీఫ్ మేనేజర్‌కు రూ.1,02,300 నుంచి రూ.1,20,940.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 10.10.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.10.2025.
» వెబ్‌సైట్: https://bankofbaroda.bank.in

బీఆర్ఐసీ-ఎన్‌సీసీఎస్‌లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

పుణె(మహారాష్ట్ర)లోని బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(బీఆర్ఐసీ) నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్స్(ఎన్‌సీసీఎస్) సెల్ అండ్ మాలిక్యులర్ మోడరన్ బయాలజీలో పరిశోధనకు పీహెచ్‌డీ మార్చి–2026 సెషన్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: పీజీ ఉత్తీర్ణతతో పాటు సీఎస్ఐఆర్–యూజీసీ, డీబీటీ, ఐసీఎంఆర్, బీఐఎస్‌సీ నుంచి చెల్లుబాటు అయ్యే ఫెలోషిప్‌ను కలిగి ఉండాలి. లేదా డిసెంబర్ 2024లో ఎన్‌సీబీఎస్/టీఐఎఫ్ఆర్ నిర్వహించిన జేజీఈఈబీఐఎల్ఎస్ పరీక్షలో హాజరై ఉండాలి.
» ఎంపిక విధానం: జేజీఈఈబీఐఎల్ఎస్ కటాఫ్ స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: 09.12.2025.
» ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ అయిన అర్హుల జాబితా తేది: 19.12.2025.
» మొదటి రౌండ్ ఇంటర్వ్యూ తేది: 05.01.2026 నుంచి 07.01.2026.
» మొదటి రౌండ్ ఇంటర్వ్యూ ఫలితాలు: 07.01.2026.
» చివరి రౌండ్ ఇంటర్వ్యూ తేది: 08.01.2026 నుంచి 09.01.2026.
» ఫలితాల తేది: 19.01.2026.
» వెబ్‌సైట్: http://https//nccs.res.in

ఇంటర్‌తోనే హెడ్‌కానిస్టేబుల్

» ఢిల్లీ పోలీస్ విభాగంలో 509 హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్
» దేశవ్యాప్తంగా ఉన్న మహిళా, పురుష అభ్యర్థులు అర్హులు

కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీస్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ (మినిస్టీరియల్) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి, అర్హతలున్న అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నేపథ్యంలో.. హెడ్‌కానిస్టేబుల్ (మినిస్టీరియల్) ఇన్ ఢిల్లీ పోలీస్ ఎగ్జామినేషన్ పూర్తి వివరాలు..

✦ మొత్తం పోస్టుల సంఖ్య: 509

పోస్టుల వివరాలు

హెడ్‌కానిస్టేబుల్ మేల్(పురుషులు): 341 పోస్టులు, హెడ్‌కానిస్టేబుల్ ఫీమేల్ (మహిళలు):168 పోస్టులు

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10+2/ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు ఇంగ్లిష్‌లో టైపింగ్ స్పీడ్ నిమిషానికి 30 పదాలు లేదా హిందీ టైపింగ్ స్పీడ్ నిమిషానికి 25 పదాలు చేయగలగాలి.

వయసు

01.07.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

నెలకు రూ.25,500 నుంచి రూ.81,100 వేతన శ్రేణి అందుతుంది.

ఎంపిక విధానం

✦ కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్, టైపింగ్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
✦ కంప్యూటర్ ఆధారిత పరీక్షను ఎస్ఎస్‌సీ 100 మార్కులకు నిర్వహిస్తుంది.
✦ టైపింగ్ టెస్టును ఢిల్లీ పోలీస్ విభాగం 25 మార్కులకు జరుపుతుంది.
✦ ఫిజికల్ ఎండ్యూరెన్స్ అండ్ మెజర్‌మెంట్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ అర్హత పరీక్షలు మాత్రమే. వీటిని కూడా ఢిల్లీ పోలీస్ విభాగమే నిర్వహిస్తుంది.

వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలిదశలో 100 ప్రశ్నలు–100 మార్కులకు కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలు–20 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు, కంప్యూటర్ ఫండమెంటల్స్ 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 0,25 మార్కు తగ్గిస్తారు.

ప్రిపరేషన్ పక్కాగా..

✦ జనరల్ అవేర్‌నెస్‌లో అడిగే ప్రశ్నలు తన చుట్టూ జరుగుతున్న తాజా పరిణామాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో మార్పులపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలించేలా ఉంటాయి. ఇందులో భారత్, పొరుగుదేశాలు, ముఖ్యంగా చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, భారత ఆర్థిక వ్యవస్థ, జనరల్ పాలిటీ, రాజ్యాంగం, క్రీడలు, శాస్త్రపరిశోధనలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఈ విభాగంలో స్కోర్ కోసం జాతీయంగా, అంతర్జాతీయంగా జరుగుతున్న తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా స్కూల్ స్థాయి సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలి.
✦ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో .. నంబర్ సిస్టమ్స్, హోల్ నంబర్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, రిలేషన్‌షిప్ బిట్వీన్ ద నంబర్స్, ఫండమెంటల్ అరిథమెటికల్ ఆపరేషన్స్, పర్సంటేజెస్, రేషియోస్ అండ్ ప్రపోర్షన్స్, యావరేజెస్, ఇంట్రస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, డిస్కౌంట్, మెన్సురేషన్, టైమ్ అండ్ డిస్టెన్స్, రేషియో అండ్ టైమ్, టైమ్ అండ్ వర్క్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించేందుకు అభ్యర్థులు పదో తరగతి స్థాయి వరకూ గణితంపై పట్టు సాధించాలి. తొలుత స్కూల్ స్థాయి గణిత పాఠ్య పుస్తకాల ద్వారా ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రీవియస్ ప్రశ్నలతోపాటు సాధ్యమైనన్ని మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ చేయాలి.
✦ జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో నాన్ వెర్బల్ ప్రశ్నలు అడగడం ద్వారా అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ఇందులో అనాలజీస్, సిమిలారిటీస్, డిఫరెన్సెస్, స్పాటియల్ విజువలైజేషన్,స్పాటియల్ ఓరియంటేషన్, విజువల్ మెమొరీ, డిస్క్రిమినేషన్, అబ్జర్వేషన్స్, రిలేషన్‌షిప్ కాన్సెప్ట్స్, అరిథమెటికల్ రీజన్స్, ఫిగరల్ క్లాసిఫికేషన్, అరిథమెటిక్ నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ సిరీస్, కోడింగ్, డికోడింగ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో మంచి మార్కులు సాధించేందుకు అభ్యర్థులు గత ప్రశ్నలను, మోడల్ ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
✦ ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో.. ఇడియమ్స్, సెంటెన్స్ కరెక్షన్, వొకాబ్యులరీ, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్‌పై అవగాహన పొందాలి. ఇంగ్లిష్ వొకాబ్యులరీ నైపుణ్యం సాధించాలి. ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, వినియోగిస్తున్న పదజాలం, వాక్య నిర్మాణంపై దృష్టి పెట్టాలి.
✦ కంప్యూటర్ ఫండమెంటల్స్ విభాగంలో.. ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, వెబ్‌బ్రౌసర్ విభాగం నుంచి అడిగే ప్రశ్నలు రోజువారీ కంప్యూటర్ వినియోగంపై అభ్యర్థి అవగాహనను పరీక్షించేలా ఉంటాయి. ఇందుకోసం ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ వాడకం, ఈమెయిల్ బేసిక్స్, మెయిల్ పంపడం, రిసీవ్ చేసుకోవడం, వెబ్ బ్రౌజింగ్, ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్స్, వీడియో కాన్ఫరెన్సింగ్, ఈ బ్యాంకింగ్ తదితర అంశాలను తెలుసుకోవాలి.



ముఖ్య సమాచారం

✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
✦ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది: 24.09.2025.
✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 20.10.2025
✦ దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది: 21.10.2025.
✦ దరఖాస్తు సవరణ తేదీలు: 27.10.2025 నుంచి 29.10.2025 వరకు
✦ సీబీటీ పరీక్ష: డిసెంబర్ 2025/జనవరి 2026.
✦ వెబ్‌సైట్: https://ssc.gov.in

క్లుప్తంగా...



ఎన్నారైలు తమ గ్రామాలను దత్తత తీసుకోవాలి

సహస్రావధాని గరికపాటి పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఎన్నారైలు తమ గ్రామాలను దత్తత తీసుకోవాలని, దేశానికి తమ వంతు కృషి చేస్తే వారికి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని పద్మశ్రీ, ప్రఖ్యాత సహస్రావధాని గరికపాటి నరసింహారావు అన్నారు. లండన్, బర్మింగ్‌హామ్, మాంచెస్టర్, ఇతర ప్రదేశాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీఐటీఎస్‌ఎస్–బ్రిటిష్ ఇండియన్ తెలుగు సంస్కృతి సంఘం నైతిక, ధార్మిక విలువలపై నిర్వహించిన కార్యక్రమంలో వేలాది మంది ఎన్నారైలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ధర్మం (ధర్మబద్ధమైన జీవనం), జాతి నిర్మాణం కోసం ఎన్నారైలు ఏం చేయగలరనే దాన్ని వివరించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు సచిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిత రసాయన శాస్త్రానికి వేదికగా ఐఐసీటీ

సీఎస్ఐఆర్ – ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సుస్థిర రసాయన శాస్త్రం, రసాయన జీవశాస్త్ర రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) మార్గం సుగమం చేస్తుందని సీఎస్ఐఆర్ – ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఎస్ఐఆర్–ఐఐసీటీ ఆధ్వర్యంలో సోమవారం రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. 'ఫ్రాంటియర్స్ ఇన్ సస్టైనబుల్ ఆర్గానిక్ సింథసిస్ అండ్ కెమికల్ బయాలజీ (ఎఫ్ఎస్ఓఎస్‌సీబీ – 2025)'పేరుతో సోమ, మంగళ వారాల్లో తార్నాకలోని ఐఐసీటీలో ఈ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణానికి హానికరం కాని సాంకేతిక పద్ధతులను అభివృద్ధి చేయడం ఇప్పుడు అవసరమని తెలిపారు. సదస్సులో ప్రపంచ ప్రసిద్ధ ఆర్గానిక్ కెమిస్టు ప్రొఫెసర్ ఫిల్ ఎస్.బారన్ భారత్‌లో తన తొలి శాస్త్రీయ ఉపన్యాసం ఇవ్వడం ఆకర్షణగా నిలిచింది. సదస్సులో 500 మంది ప్రతినిధులు పాల్గొంటున్నట్లు ఐఐసీటీ చీఫ్ సైంటిస్టు డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. 100కు పైగా ఔషధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు వివరించారు.

ఇసుక రవాణా వాహనాలకు 'కేంద్రీకృత వ్యవస్థ'

- టీజీఎండీసీలో ఏకీకృత పర్యవేక్షణ వ్యవస్థ
- ఇసుక తవ్వకాలు, నిలువ, విక్రయాల్లో పారదర్శకత లక్ష్యంగా ప్రణాళికలు
- జీపీఎస్ లేని వాహనాలను సులువుగా గుర్తించేందుకు దోహదం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇసుక వెలికితీత, విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇసుక వెలికితీత, రవాణాలో ఉపయోగించే వాహనాల జీపీఎస్ సమాచారాన్ని ఏకీకృతం చేసి పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని భావిస్తోంది. ఆయా వాహనాలు జీపీఎస్ వ్యవస్థను అమర్చుకోవడాన్ని టీజీఎండీసీ ఇదివరకే తప్పనిసరి చేసింది. వేర్వేరు జీపీఎస్ ప్రొవైడర్ల ద్వారా ఈ వాహనాల్లో జీపీఎస్ పరికరాలను అమర్చారు. అయితే ఈ ప్రొవైడర్ల వద్ద ఉన్న వాహనాల కదలికల సమాచారం టీజీఎండీసీ వద్ద ఏకీకృతంగా అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా, వెలికితీతలో నిమగ్నమైన వాహనాల వివరాలను తమ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ) సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానం చేయాలని జీపీఎస్ ప్రొవైడర్లను టీజీఎండీసీ ఆదేశించింది.

జీపీఎస్ లేని వాహనాల గుర్తింపు

జీపీఎస్ వాహన పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఇసుక రవాణాలో జీపీఎస్ పరికరాలను లేకుండా పాల్గొంటున్న వాహనాలను గుర్తించడం సాధ్యమవుతుందని టీజీఎండీసీ భావిస్తోంది. జీపీఎస్ డేటా ఏకీకృతం కాకపోవడంతో జరుగుతున్న నష్టాలను అధిగమించేందుకు ఈ చర్య దోహదం చేస్తుందని అంచనా వేస్తున్నారు. ఏపీఐతో అనుసంధానమయ్యే వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, కో ఆర్డినేట్లు (అక్షాంశాలు, రేఖాంశాలు) తదితరాలను జీపీఎస్ ప్రొవైడర్లు అందజేయాల్సి ఉంటుంది.

రియల్ డేటాను పంచుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకం, నిలువ, విక్రయాల్లో సుమారు 40వేలకు పైగా యంత్రాలు, రవాణా వాహనాలు నిమగ్నమై ఉన్నాయి. వీటిలో 70శాతానికి పైగా వాహనాల్లో వివిధ జీపీఎస్ ప్రొవైడర్ల ద్వారా పరికరాలను అమర్చారు. టీజీఎండీసీ రూపొందించిన ఏపీఐతో అనుసంధానం చేయడం ద్వారా వాహనాల కదలికల (రియల్ టైమ్ డేటా) సమాచారాన్ని తెలుసుకోవచ్చు. తద్వారా కేంద్రీకృత వాహన పర్యవేక్షక వ్యవస్థను బలోపేతం చేయడానికి వీలవుతుంది. అయితే ఇప్పటివరకు 8 వేల వాహనాల జీపీఎస్ డేటా మాత్రమే ఏపీఐతో అనుసంధానమైంది. ఈ నేపథ్యంలో మిగతా వాహనాల జీపీఎస్ సమాచారాన్ని కూడా ఏపీఐతో అనుసంధానం చేసేందుకు జీపీఎస్ ప్రొవైడర్లతో టీజీఎండీసీ సంప్రదింపులు జరుపుతోంది. 30 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించింది.



యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తదితరులు

వైద్య రంగంలో అంకిత భావం అవసరం

యశోద ఆసుపత్రి అవయవదానం సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: వైద్య రంగంలో రీసెర్చ్, నాలెడ్జ్, కమిట్‌మెంట్.. మూడూ ముఖ్యమైనవని, వాటిని సమర్థవంతంగా సమతూకం చేసినపుడే నాణ్యమైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో అవయవ దానంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవయవ దానం అంటే మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వడం లాంటిదన్నారు. జీవన్‌దాన్ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని చెప్పారు. నాణ్యమైన వైద్యం అందిస్తున్నందునే ప్రపంచ దేశాల నుంచి హైదరాబాద్‌కు వైద్య సేవల కోసం వస్తున్నారని తెలిపారు. హెల్త్‌కేర్ ఆఫ్ నేషన్‌గా, ఫార్మా హబ్‌గా హైదరాబాద్ వెలుగొందుతోందని కొనియాడారు. తెలంగాణ గవర్నర్‌గా ఉండటం సంతోషంగా ఉందని అన్నారు. మూడేళ్లలో 300 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసిన యశోద ఆసుపత్రి వైద్యుల బృందం, దాతలకు ఆయన అభినందనలు తెలిపారు. యశోద ఆసుపత్రి వైద్యుడు రాజశేఖర చక్రవర్తి మాట్లాడుతూ.. దేశంలో 20 శాతం మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఏటా ఒక దఫా రక్త, యూరిన్ పరీక్షలు చేయించుకుంటే ముందుగానే ఈ సమస్యలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. డా.శ్రీనివాస్ మాట్లాడుతూ కిడ్నీ దానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. 30 ఏళ్ల క్రితం కిడ్నీ దానమిచ్చిన వారు సైతం ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. యశోద హాస్పిటల్స్ ఎండీ డా.జీఎస్ రావు మాట్లాడుతూ బంధువులు, రక్తసంబంధీకులకే కిడ్నీ దానం చేసినా వారి పాలిట దాతలు దేవుళ్లతో సమానమని కొనియాడారు. అనంతరం వైద్యుల బృందాన్ని, కిడ్నీ దాతలను గవర్నర్ సత్కరించారు.

అక్రమ లావాదేవీలకు నవీన్‌మిట్టల్ అనుమతి

- క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలి
- దస్తగిరి షరీఫ్ పిటిషన్.. నేడు హైకోర్టు విచారణ

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 181లోని దాదాపు 50 ఎకరాల భూదాన్ భూముల అక్రమంగా లావాదేవీలకు అనుమతించారని ఆరోపిస్తూ సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్, ఇతర రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది. దీనిపై ట్రయల్‌కోర్టు 2024లో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దస్తగిరి షరీఫ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జస్టిస్ కె.సుజన.. విచారణ వాయిదా వేశారు. భూదాన్ భూముల బదిలీ, రిజిస్ట్రేషన్‌లో చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ దస్తగిరి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదును దిగువ కోర్టు కొట్టివేసింది. ఆ సమయంలో భూదాన్ యజ్ఞ బోర్డు కస్టోడియన్ హోదాలో నవీన్ మిట్టల్, అప్పటి మండల రెవెన్యూ అధికారి.. 2006లో హైకోర్టు జారీ చేసిన యథాతథస్థితి ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ భూములపై లావాదేవీలు, అమ్మకపు పత్రాల నమోదుకు అనుమతించారన్నది పిటిషనర్ ఆరోపణ.

పలు సెక్షన్లు నమోదు చేయాలని ఫిర్యాదు..

భారత శిక్షాస్మృతిలోని నేరపూరిత కుట్ర, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన, ప్రభుత్వ ఉద్యోగుల చట్టానికి అవిధేయత, తప్పుడు సమాచారం అందించడం (సెక్షన్లు 177, 181, 182) కింద కేసు నమోదు చేయాలని పిటిషనర్ ఫిర్యాదు చేశారు. అలాగే రిజిస్ట్రేషన్ చట్టంలోని 81, 82 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22అ కింద నిషేధిత కేటగిరీ కింద భూమిని జాబితా చేసినప్పటికీ, 2023 కౌంటర్ అఫిడవిట్‌లో ప్రభుత్వం అది భూదాన్ భూమి అని ధ్రువీకరించినప్పటికీ, అధికారులు అనేక మంది ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా రిజిస్ట్రేషన్, పట్టాదార్ పాస్‌బుక్‌లను జారీ చేయడానికి వీలు కల్పించారని పిటిషనర్ వాదన. దర్యాప్తునకు ముందు దశలో ఫిర్యాదును తోసిపుచ్చడంలో మేజిస్ట్రేట్ కోర్టు తప్పు చేసిందని పేర్కొంటూ, దర్యాప్తు చేయమని మహేశ్వరం పోలీసులను ఆదేశించాలని కోరారు.



కలెక్టర్ సార్.. మమ్మల్ని బడికి పంపండి

కైలాస్‌నగర్: 'కలెక్టర్ సార్.. మమ్మల్ని బడికి పంపండి'అంటూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) విద్యార్థులు వేడుకున్నారు. తమ తల్లిదండ్రులతో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టర్ బయటకు రావాలంటూ నినదించారు. ప్రజావాణి అనంతరం వారి వద్దకు వచ్చిన కలెక్టర్‌కు తమ గోడు వినిపించారు. ప్రభుత్వం ఫీజులు విడుదల చేయడం లేదంటూ దసరా సెలవులకు ఇంటికి వెళ్లొచ్చిన పిల్లలను యాజమాన్యాలు బడిలోకి రానివ్వడం లేదని ఆవేదన చెందారు. కలెక్టర్ రాజర్షి షా స్పందిస్తూ సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి పిల్లలను బడుల్లో కొనసాగించేలా చూస్తామన్నారు. అనంతరం వారు ఆందోళన విరమించారు. అలాగే ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట కూడా బీఏఎస్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

కొత్త ఎంపీడీవోలకు శిక్షణ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నియమితులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీవోలు) శిక్షణ ప్రారంభమైంది. సోమవారం టీఎస్ఐఆర్‌డీలో ప్రారంభమైన ఈ శిక్షణ ఈనెల 27 వరకు కొనసాగనుంది. ఇటీవల గ్రూప్–1 కింద ఎంపికైన అభ్యర్థుల్లో.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 139 మంది ఎంపీడీవోలను కేటాయించగా 131 మంది రిపోర్ట్ చేసినట్లు తెలుస్తోంది. నూతన పంచాయతీరాజ్ చట్టం–2018, జాతీయ ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ మిషన్‌పై వారికి అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో మెరుగైన సంబంధాలు వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌ల నిర్మాణం, అధికారాలు, విధులు, ఎన్నికల ప్రక్రియ, నిధుల వినియోగంపై వివరించనున్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, ఇతర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు.

గ్రూప్–2 ద్వారా ఎక్సైజ్‌కు 97 మంది ఎస్సైలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు 97 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. గ్రూప్–2 కింద కొత్తగా వచ్చిన వీరందరికీ ఆ శాఖ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసింది. ఈ 97 మందిలో హైదరాబాద్ మల్టీజోన్–2కు 34 మందిని, వరంగల్ మల్టీజోన్–1కు 63 మందిని ఎంపిక చేయగా, అందులో 96 మంది సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరయ్యారు. హైదరాబాద్ జోన్‌కు ఎంపికైన వారిలో ఒకరు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాలేదని ఎక్సైజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా, వీరికి త్వరలోనే శిక్షణ ప్రారంభం కానుంది. గ్రూప్–1 కింద అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారులు (ఏఈఎస్)గా ఎంపికైన 30 మందితో కలిపి కొత్తగా వచ్చిన 97 మంది ఎస్సైలకు కూడా త్వరలోనే మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

పూలే విద్యానిధి కోటా పెంపు!

సీఎం కార్యాలయం వెల్లడి.. అధికారికంగా వెలువడని ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం కింద కోటాను పెంచినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇప్పటివరకు బీసీలకు ఈ పథకం కింద ఏటా 300 మందికి అవకాశం కల్పిస్తుండగా.. ఇప్పుడు ఆ సంఖ్యను 700కు పెంచినట్లు వెల్లడించింది. ఇప్పటికే షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోటాను 210 నుంచి 500కు పెంచామని, గిరిజన విద్యార్థుల కోటాను 100 నుంచి 200కు పెంచామని సీఎంవో అధికారులు పేర్కొన్నారు. అలాగే మైనారిటీ విద్యార్థులకు ఏటా 500 మందిని ఈ పథకం కింద ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఓవర్సీస్ విద్యానిధి పథకాల కింద ఏటా 1,900 మందికి లబ్ధి కలుగుతుందని, ఈ పథకాల కింద ఎంపికైన ఒక్కో విద్యార్థికి గరిష్ఠంగా రూ.20 లక్షల ఆర్థిక సాయం అందుతుందని వెల్లడించారు. అయితే బీసీ విద్యార్థుల కోటా పెంపు ఉత్తర్వులు ఇప్పటివరకు వెలువడలేదని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనరేట్ అధికారులు సోమవారం 'సాక్షి'కి తెలిపారు. ఇందుకు సంబంధించిన సమాచారం కమిషనరేట్ కార్యాలయానికి అందలేదన్నారు.

క్లుప్తంగా...

త్వరలో జేఈఈ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్)కు త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఇందుకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేస్తోంది. రెండు విడతలుగా ఈ పరీక్షను నిర్వహిస్తారు. పూర్తి ఆన్‌లైన్ విధానంలో జరిగే మెయిన్స్ తొలి దశ జనవరిలో నిర్వహించాలని భావిస్తున్నారు. రెండో దశను ఏప్రిల్ లేదా మే నెలలో నిర్వహించే వీలుంది. గతేడాది పరీక్ష కేంద్రాల్లో వచ్చిన సమస్యలు, క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా పరీక్ష కేంద్రాల్లో మార్పులు చేర్పులపై రాష్ట్రాల వారీగా కసరత్తు చేస్తున్నారు. పరీక్ష నోటిఫికేషన్‌కు ముందే పరీక్ష కేంద్రాలపై స్పష్టత తీసుకోవాలని భావిస్తున్నారు.

డిసెంబర్ 14న ఏపీపీ రాత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా డిసెంబర్ 14న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు టీఎస్ఎల్పీఆర్బీ (తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు వెల్లడించారు. మొదటి పేపర్ డిసెంబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలను హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 118 ఏపీపీ పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈనెల 11తో ముగిసింది. మొత్తం 118 పోస్టులకు గాను 3,132 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 1,908 మంది పురుషులు, 1,224 మహిళా అభ్యర్థులు ఉన్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో రిజర్వేషన్ కేటగిరీల వారీగా చూస్తే.. ఓసీలు 18 శాతం మంది, బీసీలు 47 శాతం మంది, ఎస్సీలు 26 శాతం మంది, ఎస్టీలు 9 శాతం మంది ఉన్నట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

27 నుంచి డీఎస్పీల శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీలుగా ఎంపికైన 113 మందికి ఈనెల 27 నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులంతా ఈనెల 26న రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో రిపోర్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. త్వరలో పోలీస్ అకాడమీలో ప్రారంభమయ్యే డీఎస్పీల శిక్షణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ 'సాక్షి'కి తెలిపారు. ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేసినట్టు చెప్పారు.

ఫార్మా, బయో టెక్నాలజీలో తొలి విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ఫార్మసీ, బయోటెక్నాలజీ, బయో మెడికల్, ఫార్మా డీ కోర్సుల తొలి విడత సీట్ల కేటాయింపును సోమవారం చేపట్టారు. ఇంటర్ సైన్స్ గ్రూపు విద్యార్థులకు ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈఏపీ సెట్ నిర్వహించారు. ఇందులో 71,309 మంది అర్హత సాధించారు. మొత్తం 10,708 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో బీ ఫార్మసీ సీట్లు 8,017, ఫార్మా డీ 1,637, బయో మెడికల్ ఇంజనీరింగ్ 48, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ 108, బయో టెక్నాలజీ 202 సీట్లు భర్తీ అయినట్టు సాంకేతిక విద్యా విభాగం తెలిపింది.

ఐదేళ్లు.. 3.63 లక్షల కిడ్నీ కేసులు



- గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పెరిగిన కిడ్నీ, కేన్సర్ సమస్యలు
- నాలుగు జిల్లాల్లో మరీ అధికం.. ఆందోళనలో ఆరోగ్యశాఖ
- గత ఐదేళ్లలో 13 వ్యాధులకు సంబంధించి 12.59 లక్షల కేసులు
- ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు చెల్లించిన మొత్తం రూ.3 వేల కోట్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ వ్యాధులకు చికిత్సలు అందించాలని సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కిడ్నీ, కేన్సర్, గుండె జబ్బులకు సంబంధించిన కేసులు భారీగా పెరుగుతున్నాయి. గత ఐదేళ్లలో జిల్లాలలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఈ వ్యాధులకు సంబంధించిన నమోదైన కేసులు, జరిగిన చికిత్సలు, అయిన ఖర్చు చూసి ఆరోగ్యశాఖ కూడా ఆందోళన చెందుతోంది. 13 వ్యాధులకు సంబంధించి ఐదేళ్లలో ఆరోగ్య శ్రీ కింద నమోదైన కేసులు ఏకంగా 12.59 లక్షలు ఉన్నట్లు తేలింది. ఈ వ్యాధులకు సగటున ప్రభుత్వం నెలకు ఆస్పత్రులకు చెల్లించిన మొత్తం రూ.50 కోట్లు. అంటే ఐదేళ్లలో ఏకంగా రూ.3,000 కోట్లు ఈ వ్యాధుల చికిత్సలకు మాత్రమే ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ కింద చెల్లించినట్లు లెక్క తేల్చారు. ఇందులో కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

రాష్ట్రంలో 2020 నుంచి 2025 ఆర్థిక సంవత్సరం వరకు ఆరోగ్యశ్రీ కింద 12 వ్యాధులకు సంబంధించి 12.59లక్షల కేసులు నమోదు కాగా, అందులో అత్యధికంగా మూత్రపిండాలకు సంబంధించి 3,63,197 కేసులు నమోదయ్యాయి. వీటిలో 80% డయాలసిస్ కేసులే కావడం గమనార్హం.

25 కి.మీ.పరిధిలో ఓ డయాలసిస్ కేంద్రం

రాష్ట్రంలో 102 ప్రభుత్వ డయాలసిస్ సెంటర్లు ఉండగా, పెరుగుతున్న రోగులకు ఈ కేంద్రాలు సరిపోవడం లేదు. దీంతో జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లోని డయాలసిస్ సెంటర్లను రోగులు ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లాల్లో డయాలసిస్ సెంటర్ల సంఖ్యను భారీగా పెంచాలని నిర్ణయించారు. ఎక్కడి నుంచైనా 25 కిలోమీటర్ల పరిధిలో ఓ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ప్రైవేటు ఆస్పత్రులకు రోగుల తాకిడిని నిరోధించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిసింది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల తరువాత అత్యంత ఆందోళన కలిగించే వ్యాధిగా కేన్సర్‌ను గుర్తించారు. గత ఐదేళ్లలో కేన్సర్ సంబంధ వ్యాధులతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్న వారి సంఖ్య 3,06,702గా గుర్తించారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఎంజీఎం ప్రభుత్వ కేన్సర్ ఆస్పత్రి ఒక్కటే ఉంది. ఉస్మానియా, గాంధీ, ఇతర జిల్లా ఆస్పత్రుల్లో కేన్సర్‌కు మందులు తప్ప పూర్తిస్థాయి చికిత్స అందించే సౌకర్యాలు లేవు. నిమ్స్‌తోపాటు ప్రైవేటు రంగంలో కేన్సర్ చికిత్స అత్యంత ఖరీదైనదిగా మారింది. ఆరోగ్యశ్రీ కింద కేన్సర్ వ్యాధికి చికిత్స లభిస్తుండటంతో జిల్లాల్లోని ఆస్పత్రులలో వైద్యం పొందుతున్నారు. ప్రైవేటు బోధనాస్పత్రులు కేన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందిస్తూ క్లెయిమ్ చేసుకుంటున్నాయి. అంకాలజీ విభాగాన్ని ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసేందుకు గల అవకాశాలపై నివేదిక అందజేయాలని మంత్రి దామోదర అధికారులను ఆదేశించారు.

గుండె, ఆర్థోపెడిక్ కూడా



➔ కిడ్నీ, కేన్సర్ తరువాత అధికంగా నమోదవుతున్న కేసుల్లో ఆర్థోపెడిక్ మూడో స్థానంలో ఉంది. ప్రమాదాలు సంభవించినప్పుడు దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే.. కాళ్లు, చేతులు విరిగి అంగ వికలులుగా మారేవారు మరి కొందరు. ఈ ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కింద నమోదైన ఆర్థోపెడిక్ కేసులు 1,91,852. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రహదారులపై ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 లోపే ట్రామా కేర్ సెంటర్లు ఉండగా, మరో 74 ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. త్వరలోనే వీటిని ఏర్పాటుచేసేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆమోదం తెలిపారు. అలాగే గుండె సంబంధ వ్యాధుల కేసులు కూడా 1,45,814 నమోదయ్యాయి. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్డియాలజీ విభాగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. 2డీ ఈకో, ఆంజియోగ్రామ్, స్టెంట్స్ వేసే సౌకర్యాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇవి కాకుండా ఐదేళ్లలో జనరల్ మెడిసిన్‌లో 73,697 కేసులు, ఆప్తల్మాలజీలో 57,639 కేసులు, న్యూరోలో 40,667 కేసులు, జనరల్ సర్జరీలో 31,214 కేసులు, పీడియాట్రిక్స్‌లో 28,924, గైనకాలజీలో 9,517 కేసులు, ఈఎన్‌టీలో 7,251 కేసులు, గ్రాస్ట్రో ఎంటరాలజీ కింద 1,636, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్‌లో 1,272 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధులకు వైద్య సౌకర్యాలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ 'సాక్షి'కి తెలిపారు.

అంతరిక్ష 'న్యాయం'



బార్ కౌన్సిల్ సిఫార్సు

- భవిష్యత్‌లో 'స్పేస్ లా'కు డిమాండ్
- జాతీయ స్థాయిలో అధ్యయనం
- కొన్నేళ్ల క్రితమే దీనిపై అధ్యయనం చేసిన మండలి చైర్మన్
- తెలంగాణ లా కాలేజీల్లోనూ కోర్సుకు ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద కోర్సులను ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా అంతరిక్ష చట్టాలకు సంబంధించిన కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీని కోసం బార్ కౌన్సిల్ సహా పలువురు న్యాయ నిపుణుల సూచనలు తీసుకుంది. ఇటీవల న్యాయవాద విద్యకు సంబంధించి ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. ఇటీవల కాలంలో అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనలు పెరుగుతున్నాయి. దీంతోపాటు వైమానిక రంగం విస్తృతమవుతోంది. ఆయా రంగాల్లో ఇప్పటి వరకూ పరిశోధనలు, ఉపాధి అవకాశాలపై మాత్రమే సంస్థలు దృష్టి పెట్టాయి. అంతరిక్ష చట్టాలకు సంబంధించిన కోర్సులు దేశంలో అరుదుగా ఉన్నాయి. వైమానిక, అంతరిక్ష కంపెనీలకు చట్టాలపై అవగాహన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ రంగంలో అంతరిక్ష న్యాయవాద కోర్సులు చేసిన వారి డిమాండ్ పెరిగింది. వచ్చే ఏడాది నుంచి ఈ కోర్సును దేశవ్యాప్తంగా ప్రధాన లా కాలేజీల్లో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నల్సార్ వర్సిటీలో విధులు నిర్వర్తించే సమయంలో స్పేస్ లాపై ప్రత్యేక అధ్యయనం చేశారు. లా జర్నల్‌లో ప్రచురితమైన ఈ అంశాలు ప్రస్తుతం కీలకంగా మారబోతున్నాయి.

స్పెషలైజేషన్ కోర్సులు

దేశంలో ప్రస్తుతం మూడు, ఐదేళ్ల లా కోర్సులు ఉన్నాయి. వీటిలో క్రిమినల్, సివిల్, కంపెనీ చట్టాలకు సంబంధించిన చాప్టర్లకు ఎక్కువ ప్రాచుర్యం ఉంది. స్పేస్ లాను మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం చేసిన తర్వాత ప్రత్యేక కోర్సుగా తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ కోర్సులో అంతర్జాతీయ చట్టాలను కూడా మేళవించి చేయాలని నిర్ణయించారు. ప్రత్యేక కోర్సు గా అందుబాటులోకి తేవాలని కేంద్రం భావిస్తున్న ఈ కోర్సులో వివిధ దేశాల చట్టాలు, బీమా సంస్థల న్యాయపరమైన అంశాలను క్రోడీకరించే యోచనలో ఉన్నారు. ఇప్పటికే స్పేస్ ఎక్స్, ఇస్రో వంటి సంస్థలు లా కాలేజీల భాగస్వామ్యంతో స్పేస్‌లా కోర్సులను పరిమితంగా అందిస్తున్నాయి. అంతరిక్ష ప్రయోగాలు, ఉపగ్రహాలు, ప్రైవేట్ స్పేస్ కంపెనీలు, దేశాల మధ్య ఒప్పందాలు, స్పేస్‌లో ఆస్తుల హక్కులు వంటి అంశాలను నియంత్రించే అంశాలను ఇందులోకి తేవాలన్న సూచనలు కేంద్రానికి వచ్చాయి. కోర్సులో స్పేస్ మిషన్లకు సంబంధించిన భద్రతా చట్టాలు, స్పేస్ మిషన్ల వల్ల జరిగే ప్రమాదాలకు బాధ్యత, స్పేస్‌లో ఆస్తుల హక్కులు, మిలిటరీ ఉపయోగం, ప్రైవేట్ కంపెనీల కార్యకలాపాలు కోర్సులో ప్రధాన చాప్టర్లుగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న డిమాండ్

స్పేస్‌లా చేసిన వారికి విస్తృత ఉపాధి అవకాశాలున్నాయి. ఇస్రో, డీఆర్‌డీవో వంటి సంస్థల్లో లీగల్ కౌన్సెల్‌లో తీసుకుంటున్నారు. యూఎన్ ఆఫీస్ ఫర్ అవుట్ స్పేస్ ఎఫైర్స్‌లో మంచి వేతనంతో ఉద్యోగం లభించే వీలుంది. అంతర్జాతీయ ఎన్జీవోలు, స్పేస్ కంపెనీలు (స్పేస్ ఎక్స్, బ్లూ ఆర్జిన్, ఒన్ వెబ్, స్కైరూట్, అగ్నికుల్ వంటి సంస్థల్లో వీరికి లీగల్ కన్సల్టెంట్‌గా లేదా పాలసీ అడ్వైజర్‌గా అవకాశం కల్పిస్తున్నారు. స్పేస్ టూరిజం, ఉపగ్రహ వ్యాపారం, డేటా ప్రైవసీ, భద్రతా చట్టాలు.. ఇవన్నీ కొత్త కెరీర్ మార్గాలుగా నిపుణులు చెబుతున్నారు.

ఇస్రో తోడ్పాటుతో ఉన్న కోర్సులు	
సంస్థ	కోర్సు
నల్సార్	అడ్వాన్స్‌డ్ స్పేస్‌లా అండ్ టెలికమ్యూనికేషన్
గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ	సెంటర్ ఫర్ ఎయిర్ అండ్ స్పేస్‌లా
ఇస్రో-యూఎన్ ఆఫీస్ ఫర్ అవుటర్ స్పేస్ ఎఫైర్స్	ఆన్‌లైన్ స్పేస్ లా కోర్సులు
ఇండియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్నేషనల్ లా, న్యూఢిల్లీ	స్పేస్‌లాలో శిక్షణ కార్యక్రమాలు
విదేశాల్లో ఉన్న ప్రధాన కోర్సులు	
ఎంసీ గిల్లీ యూనివర్సిటీ (కెనడా)	ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎయిర్ స్పేస్ లా
లీడెన్ యూనివర్సిటీ (నెదర్లాండ్స్)	అడ్వాన్స్‌డ్ ఎల్ఎల్ఎం ఇన్ ఎయిర్ అండ్ స్పేస్ లా
యూనివర్సిటీ ఆఫ్ మిస్సిసిప్పీ (అమెరికా)	సెంటర్ ఫర్ ఎయిర్ స్పేస్ లా

న్యాయ వృత్తికి సరికొత్త కవచం



చాలామందికి ఏరో స్పేస్, వైమానిక వ్యవస్థ గురించే తెలుసు. ఈ రంగంలో రక్షణ, భద్రత, బీమా వంటి కీలకమైన అంశాలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. వైమానిక పరిశోధన, అంతరిక్ష శోధన పెరుగుతున్న తరుణంలో ఇందుకు సంబంధించిన చట్టాలపై నైపుణ్యం అవసరం. ఈ కోర్సులను విస్తృతంగా అందుబాటులోకి తేవాల్సిన అవసరం కూడా ఉంది.

– ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి
ఉన్నత విద్యామండలి చైర్మన్

వీటి అవసరం చాలా ఉంది



అంతరిక్ష వివాదాల పరిష్కారంపై ఆధిపత్యం అవసరం. న్యాయవాద వృత్తిలో ఇందుకు సంబంధించిన చట్టాలను ఆధునీకరించి అందించడం కీలకం. వైమానిక ప్రమాదాల సమయంలో నిబంధనలు, బీమా పొందేందుకు ఉండే చట్టపరమైన అంశాలను పరిశీలించాలంటే ఈ రంగంలో ఉన్న న్యాయపరమైన అంశాలపై పట్టు ఉండాలి. ఈ తరహా కోర్సుల అవసరం చాలా ఉంది.

– జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి

సీజనల్ వ్యాధులు తగ్గాయి!



గతేడాది కంటే తక్కువగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు

ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల తీవ్రత గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. సోమవారం రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానాల పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సచివాలయంలో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు గణనీయంగా తగ్గాయని ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ మంత్రికి వివరించారు. గతేడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకూ చికున్‌గున్యా కేసులు 361 నమోదవగా, ఈ ఏడాది జనవర్ నుంచి సెప్టెంబర్ వరకు 249 కేసులు మాత్రమే నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో 226 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది 209 కేసులు మాత్రమే వచ్చాయన్నారు. గతేడాది టైఫాయిడ్ కేసులు 10,149 నమోదవగా, ఈ ఏడాది 4,600 మాత్రమే నమోదయ్యాయని, గతేడాదితో పోలిస్తే డెంగీ కేసులు 2,900 తక్కువగా నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండటం అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇంజనీరింగ్ ఫీజులపై త్వరలో స్పష్టత

మౌలిక వసతుల ఆధారంగానే ఫీజులు

కొత్త ఫీజు అమలు వచ్చే ఏడాది నుంచే..



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజులపై త్వరలో స్పష్టత రానుంది. ప్రభుత్వం ఫీజుల నిర్ధారణతో జీవో విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. కొన్ని కాలేజీలకు ఫీజులు పెంచి, మరికొన్ని కాలేజీలకు ఫీజులు తగ్గించాలని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో కమిటీ చేసిన సిఫార్సులను కొలమానంగా తీసుకున్నట్టు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారంలో పీఠముడి పడిన విషయం తెలిసిందే. తొలుత ఎఫ్ఆర్‌సీ చేసిన ఫీజుల ప్రతిపాదనను ప్రభుత్వం నిలిపివేసింది. కాలేజీల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, జాతీయ ర్యాంకుల ఆధారంగా ఫీజులు ఉండాలని భావించింది. ఈ దిశగా కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. దీని తర్వాత ఎఫ్ఆర్‌సీ మరో దఫా కాలేజీలతో సంప్రదింపులు జరిపింది. ఆడిట్ రిపోర్టులను పరిశీలించింది. వీటి ఆధారంగా మూడు కేటగిరీలుగా కాలేజీలను విడగొట్టినట్టు తెలిసింది. ర్యాంకులు, వసతులు, ఫ్యాకల్టీ పరంగా ఉన్న కాలేజీలను మొదటి కేటగిరీలోకి చేర్చారు. వీటికి గతంలో నిర్ధారించిన ఫీజులే అమలుచేసే వీలుంది. ర్యాంకులు లేకున్నా, ఫ్యాకల్టీ, వసతులు ఉన్న కాలేజీలను మరో కేటగిరీలోకి చేర్చారు. వీటి ఫీజుల పెంపును 15 శాతం మించకుండా చూడాలని భావిస్తున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా లేని కాలేజీలకు ఫీజులు తగ్గించే యోచనలో ఉన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ క్లాసులు మొదలయ్యాయి. ఈ కారణంగా పెరిగే ఫీజును వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఆలూరు రంగనాథస్వామి మూలవిరాట్



పచ్చని ఎత్తయిన కొండల నడుమ ఆలూరు కోన రహదారి


ప్రకృతి స్వర్గం.. ఆధ్యాత్మిక ధామం

చుట్టూ ఎత్తైన కొండలు.. వినసొంపైన పక్షుల కిలకిలరావాలు... ఆకట్టుకునే పచ్చదనం... సెలయేళ్ల సవ్వడి.. వాటి మధ్యన శేషతల్పంపై పవళింపు సేవలో దర్శనమిస్తున్న ఆలూరు రంగనాయకులస్వామి. మనస్సుకు ప్రశాంతతను అందించే ప్రకృతి అందాలతో స్వర్గాన్ని తలపిస్తోంది అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని ఆలూరు కోన క్షేత్రం. ప్రముఖ ఆధ్యాత్మిక ధామంగా వెలుగొందుతున్న ఈ ప్రాంతం తాడిపత్రి నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పుణ్య క్షేత్రానికి తాడిపత్రి బస్టాండ్ నుంచి రోజూ బస్సు సర్వీసులు ఉన్నాయి. అంతేకాక ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదానం ఉంటుంది. బస చేసేందుకు వీలుగా అద్దె గదులూ ఉన్నాయి. మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక్కసారి ఆలూరు రంగనాథుడిని సందర్శించుకుని ప్రకృతి ఒడిలో సేదదీరుదాం రండి...

– తాడిపత్రి టౌన్







చెట్ల నడుమ శ్రీవారి కోనేరు

ఆలూరు కోన జలపాతం

చూడముచ్చటగా పారుతున్న సెలయేరు

క్లుప్తంగా...

ఆదాయం పెంపునకు మంత్రుల కమిటీ

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణకు వినూత్న చర్యలను గుర్తించి అమలు చేయడం కోసం ఆరుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, హోం మంత్రి అనిత ఉన్నారు.

వచ్చేనెల 24న 'ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్'పై చలో ఢిల్లీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చింది. వచ్చేనెల 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహిస్తున్నట్టు సమాఖ్య అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్ రావు ఓ ప్రకటనలో తెలిపారు.

మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల

సాక్షి, అమరావతి: వేటకు వెళ్లి చనిపోయిన 106 మంది మత్స్యకారుల కుటుంబాలకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్స్యూ స్కీమ్ (జీపీఐఎస్) కింద రూ.5 లక్షల చొప్పున చెల్లించేందుకు రూ.5.30 కోట్ల పరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, రాష్ట్రస్థాయి పశు వ్యాధుల నిర్ధారణ లేబొరేటరీలలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న 157 మంది ల్యాబ్ టెక్నీషియన్స్‌ను మరో ఏడాదిపాటుకొనసాగిస్తూ ఆదేశాలు జారీచేసింది.

అఖిల భారత వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలు ప్రారంభం

సాక్షి, అమరావతి/మంగళగిరి టౌన్ : ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025–26 పోటీలు సోమవారం మంగళగిరిలోని 6వ బెటాలియన్, ఏపీ స్పెషల్ పోలీస్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనితతో పాటు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా అంశాల్లో పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, యోగా పోటీలు అమరావతి విట్‌లో జరుగుతాయి.

'అగ్రి' కోర్సుల దరఖాస్తుకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్, బీఎస్సీ అగ్రికల్చర్ ఎన్ఆర్ఐ కోటా, ఆఖరి దశ బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో 2025కి దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఈనెల 27 వరకూ పొడిగిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులకు కమిటీ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు పదోన్నతులు ఖరారు చేయడానికి పదిమంది మంత్రులతో కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో ఉప ముఖ్యమంత్రి, సాంఘిక సంక్షేమశాఖ, ఆర్థికశాఖ, మున్సిపల్ పరిపాలనశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయశాఖ, హోంశాఖ, రెవెన్యూశాఖ, ఇంధన శాఖ, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రులున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలశాఖ కార్యదర్శి ఈ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

పర్యాటక హరివిల్లు.. పొల్లూరు

ప్రకృతిసిద్ధ అందాలకు నెలవు అల్లూరి జిల్లాలోని పొల్లూరు. ఈ ప్రాంతం జలవిద్యుత్ ఉత్పత్తిలోనే కాకుండా పర్యాటకంగానూ గుర్తింపు ఉంది. ఇక్కడి ప్రకృతి అందాలు మంత్రముగ్ధులను చేస్తుండగా.. పొల్లూరు జలపాతం.. సీలేరు నది ఉరకలేస్తూ పర్యాటకుల్లో ఉత్సాహం నింపుతోంది. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం, ఏవీపీ డ్యామ్, ఫోర్‌బే డ్యామ్ ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్న కట్టడాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



వర్షాలకు పరవళ్లు తొక్కుతున్న పొల్లూరు జలపాతం

అలసిసొలసిన మనసుకు ఆటవిడుపు

- పాలపొంగులా జలపాతం పరవళ్లు
- వెలుగుల దివ్వె పుట్టింది ఇక్కడే
- ఆధ్యాత్మికంగానూ గుర్తింపు
- సినిమా షూటింగులకు ఫోర్‌బే డ్యాం
- వనాల మధ్య గలగలా సీలేరు నదీ ప్రవాహం

మోతుగూడెం: సీజన్‌తో సంబంధం లేకుండా ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ప్రముఖ పర్యాటక కేంద్రం మారేడుమిల్లి వచ్చిన వారంతా ఈ ప్రాంత సందర్శనకు వస్తుంటారు.

- ఇక్కడి జలవిద్యుత్ కేంద్రం రాష్ట్రంలోనే గుర్తింపు పొందింది. ఇక్కడ 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా అదనంగా మరో 230 మెగావాట్ల ఉత్పత్తికి 5,6 యూనిట్లు నిర్మిస్తున్నారు.
- పొల్లూరు జలపాతం..అలసిపోయిన మనసుకు ఈ ప్రాంతం ఎంతో హాయినిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉరకలేస్తోంది. చూడచక్కని ప్రకృతిలో కొండలమధ్య ప్రవహిస్తూ సందర్శకుల మదిని దోచేస్తోంది. డొంకరాయి ఏవీపీ డ్యామ్ అదనపు నీరు, కొండవాగుల ప్రవాహం ఈ జలపాతంలో చేరుతుంది.
- ఫోర్‌బే డ్యామ్ ప్రత్యేక కట్టడంగా గుర్తింపు పొందింది. పవర్ కెనాల్ నుంచి వచ్చే నీటిలో సుమారు 0.5 టీఎంసీలు ఐదు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ డ్యామ్‌లో నిల్వ ఉంటుంది. ఇక్కడి నుంచి అండర్‌గ్రౌండ్ టన్నల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి వెళ్తుంది. దీనిని పూర్తిగా మట్టితో నిర్మించారు. కొండలు, పచ్చదనంతో పరిసరాలు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు
- సీలేరు నది.. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం విడుదలైన నీరు పొల్లూరు నుంచి ప్రారంభమై చింతూరు వద్ద శబరినదిలో కలుస్తుంది. నది పొడవునా దట్టమైన వనాలతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. నది వడివడిగా ప్రవహించడం వల్ల దిగేందుకు పర్యాటకులు సాహసించరు.

సరిహద్దు పండగ.. మన్యంకొండ జాతర

ఇక్కడికి సమీపంలోని ఒడిశాకు చెందిన మన్యం కొండ గ్రామం ఆధ్యాత్మికంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో మూడేళ్లకోసారి జరిగే మన్యంకొండ జాతర ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ప్రసిద్ధి చెందింది. కొండ గుహలో పోతురాజు, బాలరాజు, కన్నమరాజు దేవతా మూర్తులు కొలువుదీరారు. మూడేళ్లకోసారి వీరి ఉత్సవ విగ్రహాలను బయటకు తీసుకువచ్చి జాతర నిర్వహిస్తారు. మన్యంకొండనుంచి భారీ ఊరేగింపుతో సీలేరు నదిని దోనెపై దాటించి పొల్లూరు జలపాతం వద్దకు తీసుకువెళ్లి మంగళ స్నానం చేయిస్తారు. ఈ సమయంలో దర్శనమిచ్చే బంగారు చేపకు నమస్కరించుకుంటారు. గిరిజన సంప్రదాయ ప్రకారం నవంబర్, డిసెంబర్ నెలల్లో తేదీ నిర్ణయించి పండగ జరిపిస్తారు. మల్కన్‌గిరి కలెక్టర్ ఆధ్వర్యంలో జాతర జరుగుతుంది. ఇరు రాష్ట్రాల్లో సరిహద్దు ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.



దేవతామూర్తులను పడవపై సీలేరు నదిని దాటిస్తున్న మన్యం కొండ గిరిజనులు (ఫైల్)

మౌలిక వసతులపై అటవీశాఖ దృష్టి



పొల్లూరు జలపాతం ప్రవేశ ద్వారం

- జాతీయ రహదారి నుంచి జలపాతం వద్దకు వెళ్లే మార్గాన్ని గ్రావెల్‌తో నిర్మించింది. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు సౌకర్యం కల్పించింది.
- పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, తాత్కాలిక షెడ్లు నిర్మించింది. జలపాతంలోకి పూర్తిగా వెళ్లకుండా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేసింది. వీటికి రూ.13 లక్షలు వెచ్చించినట్టు అటవీశాఖ రేంజర్ నానాజి తెలిపారు.ఫోర్‌బే డ్యామ్, పుష్ప బ్రిడ్జి, సీలేరు నది ప్రాంతాల్లో సందర్శకుల సౌకర్యార్థం వసతులు కల్పిస్తున్నామన్నారు. పర్యాటకులకు ప్రదేశాన్ని చూపించేందుకు నియమించిన ఐదుగురు యువకులు ఉపాధి పొందుతున్నారన్నారు.

రూ.45 లక్షల మంజూరు

పొల్లూరు జలపాతంతోపాటు ఇతర ప్రదేశాల్లో పర్యాటకులకు సదుపాయాలు కల్పించేందుకు రూ.45 లక్షలు ఏపీ జెన్‌కో నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అటవీశాఖ ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోంది.



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం ఏరియల్ వ్యూ



పుష్ప సినిమాలో సన్నివేశాలు చిత్రీకరించిన ఫోర్‌బే జలాశయ డ్యామ్

అద్భుతం జలపాతం



విజయవాడ నుంచి సుమారు 15 మంది మిత్రులతో కలిసి పొల్లూరు, మోతుగూడెం పరిసర ప్రాంతాలు తిలకించేందుకు వచ్చాం. పొల్లూరు జలపాతం అద్భుతంగా ఉంది. ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలు మైమరిపించాయి.

– సతీష్, జియాలజిస్ట్, విజయవాడ

చాలా సరదాగా గడిపాం



పొల్లూరు జలపాతం, సీలేరు నది అందాలు చాలా ఆకట్టుకున్నాయి. కుటుంబ సభ్యులతో ఈ ప్రాంతంలో ఎంతో ఆహ్లాదాన్ని పొందాం. సాయంత్రం వరకు ఎంతో ఆనందంగా గడిపాం. మరిచిపోలేనంతగా అనుభూతి పొందాం.

– కె.రూప, భద్రాచలం

'గిరిజన' పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తోన్న గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తోన్న పండిట్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తోన్న భాషా పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ వారిని విస్మరించడం తగదన్నారు.

టీచర్ల పదోన్నతుల సర్వీస్ రూల్స్ మార్చాలి

ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఉపాధ్యాయుల సర్వీసు ఎంఈవో, డీవైఈవో స్థాయిలోనే ఆగిపోతోందని, డీఈవో స్థాయి పదోన్నతులు పొందేలా సర్వీసు నిబంధనలు తేవాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో కార్యాలయంలో సేవలందించే సిబ్బంది సైతం డీఈవోలుగా పదోన్నతులు పొందుతున్నారని, విద్యాపరమైన అన్ని అంశాలు తెలిసిన టీచర్లు ఎందుకు డీఈవోలు కాకూడదని ఆయన ప్రశ్నించారు.

బదిలీ అయిన టీచర్లకు న్యాయం చేయండి

బదిలీ అయినా కొత్త పాఠశాలల్లో చేరని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ విద్యాశాఖను డిమాండ్ చేశారు. డీఎస్సీ టీచర్లను నియమించినా ఇంకా చాలా మంది ఉపాధ్యాయుల రిలీవ్ కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లకు జీవో 90లో చెప్పినట్లు మెరిట్–కం–రోస్టర్ ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టలేదని ఆక్షేపించారు.

ఇమాజినోవేట్‌కు విశాఖలో 4.05 ఎకరాలు కేటాయింపు

సాక్షి, అమరావతి: రూ.140 కోట్ల పెట్టుబడితో విశాఖలో ఐటీ క్యాంపస్ నిర్మాణానికి ముందుకొచ్చిన ఇమాజినోవేట్ టెక్నో సొల్యూషన్స్‌కు కాపుల ఉప్పాడ వద్ద ఎకరం రూ.2 కోట్ల చొప్పున 4.05 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్యాంపస్‌కు చేరుకోవడానికి రహదారితో పాటు డ్రెయినేజ్ వ్యవస్థను ఏపీఐఐసీ అభివృద్ధి చేయనుంది. ఏపీ ఐటీ అండ్ జీసీసీ పాలసీ 2024–29 కింద రాయితీలను అందించనున్నారు. ఈ పెట్టుబడి ద్వారా 2,600 మందికి ఉపాధి లభించనున్నట్టు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

లోకేశ్ అధ్యక్షతన ఐటీ అడ్వైజరీ కౌన్సిల్

రాష్ట్రంలో ఐటీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఐటీ మంత్రి లోకేశ్ అధ్యక్షతన 16 మంది సభ్యులతో ఐటీ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ కమిటీలో ఐటీ కంపెనీల ప్రతినిధులతోపాటు పలు ఐటీ అసోసియేషన్స్ సభ్యులుగా ఉన్నారు. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్స్ (జీసీసీ)ను ఆకర్షించడానికి లోకేశ్ అధ్యక్షతన 11 మంది సభ్యులతో జీసీసీ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది.

కేబినెట్ హోదా సలహాదారులు నలుగురికి మరిన్ని సౌకర్యాలు

- సతీష్‌రెడ్డి, సుచిత్ర, గాంధీ, సోమనాథ్‌లకు సదుపాయాల కల్పన
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: కేబినెట్ హోదా కలిగిన నలుగురు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులకు వసతి, రవాణా, విమానయాన సౌకర్యాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. సలహాదారులు జి.సతీష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా, కె.పి.సి.గాంధీ, శ్రీధర పనికర్ సోమనాథ్‌లకు ఈ వసతులు కల్పించారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న మేరకు వీరికి..

- ప్రైవేట్ సెక్రటరీ, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ బాధ్యతలు నిర్వర్తించడానికి అధికారిని నియమించాలి.
- సందర్శనల సమయంలో సంబంధిత విభాగాధిపతి ఆఫీసులో కార్యాలయగదిని, ఒక సహాయకుడిని, వాహనాన్ని సమకూర్చాలి. తగిన ప్రభుత్వ అతిథి గృహం లేదా హోటల్‌లో బస ఏర్పాట్లు చేయాలి.
- రాష్ట్రం లోపల, వెలుపల అధికారిక సందర్శనల కోసం దేశీయ విమానాల్లో బిజినెస్ క్లాస్ ప్రయాణానికి అర్హత కల్పించాలి.

'తోతాపురి' రైతులకు రూ.185 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తోతాపురి మామిడి రైతులకు రూ.185 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ కింద రూ.260 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేయగా, ఆ మేర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలో మొత్తం 40,795 మంది రైతుల నుంచి 4.62 లక్షల టన్నుల మామిడి సేకరించినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు పంపిన నివేదిక ఆధారంగా రూ.4 చొప్పున రూ.185.02 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం

సాక్షి, అమరావతి : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల (ఐ అండ్ పీఆర్) శాఖ సంచాలకులుగా కేఎస్ విశ్వనాథన్ సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో విశ్వనాథన్ అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్‌గా, నరసాపురం సబ్‌కలెక్టర్‌గా, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్‌కు సమాచార శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఏపీ ట్రాన్స్‌కోను బలోపేతం చేయడమే లక్ష్యం

జేఎండీగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌చంద్

సాక్షి, అమరావతి: ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ)గా జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సోమవారం విజయవాడలోని విద్యుత్‌సౌధలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు తాను కృషిచేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యతా ప్రమాణాలను పాటించేందుకు ఏపీ ట్రాన్స్‌కో అనేక ఉత్తమ పద్ధతులను అమలుచేస్తుందన్నారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషితో ఏపీ ట్రాన్స్‌కోను దేశంలోని అగ్రభాగాన నిలిపేందుకు కృషిచేస్తామన్నారు.

పాఠశాలల్లో లైబ్రరీలకు పుస్తకాలు పంపండి

సమగ్ర శిక్ష ఎస్పీడీ వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లోని లైబ్రరీలకు పాఠ్యేతర పుస్తకాలు సరఫరా చేసేందుకు ఆసక్తి గలవారు వివరాలు పంపాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 1–12 తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం ఈ లైబ్రరీలు ఏర్పాటుచేశామని.. ఇందులో కథలు, కామిక్స్, సాహిత్య ప్రక్రియ పుస్తకాల ఎంపిక నిమిత్తం ప్రచురణ సంస్థలు, రచయితలు ఆయా పుస్తకాలు ఒక్కో కాపీ ఈనెల 30లోగా పంపాలని కోరారు. పరిశీలన అనంతరం టెండరు ప్రక్రియ ద్వారా వాటిని కొనుగోలు చేస్తామన్నారు.

ఒంగోలు జాతి పశువుల అమ్మకాన్ని ఆపాలి

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఒంగోలు జాతి పశువుల అమ్మకానికి సంబంధించి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం గుంటూరు లాం ఫారం మంగళవారం నిర్వహించ తలపెట్టిన బహిరంగ వేలంపాటను నెలరోజులు వాయిదా వేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలం పాట నిర్వహణకు ఇచ్చిన ప్రకటనలో 'గోవధశాలలకు పంపిణీ చేయకూడదు' అనే నిబంధన లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ మేనేజింగ్ బాడీలో రామారావు

సాక్షి, న్యూఢిల్లీ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జాతీయ మేనేజింగ్ బాడీకి కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వై.డి.రామారావు ఎన్నికయ్యారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామారావును ఎన్నుకున్నారు. రెండేళ్ల పదవీకాలానికి గాను పన్నెండు మంది సభ్యులను కూడా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్‌కు రామారావు చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా 2018–19కి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వయోపరిమితి 60 ఏళ్లే

సమగ్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితి 60 ఏళ్లేనని ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచినప్పటికీ కాంట్రాక్టు ఉద్యోగుల వయోపరిమితి మాత్రం 60 ఏళ్లేనని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో ప్రాజెక్టు కింద పనిచేస్తున్న కొందరు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ వయసు దాటి కొనసాగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సమగ్ర శిక్ష కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి పదవీ విరమణ వయసును 60 ఏళ్లుగా మాత్రమే పాటించాలన్నారు.

హెల్త్



మహిళల్లో గర్భధారణ ఆలస్యమవుతున్న కొద్దీ పుట్టబోయే బిడ్డలో కొన్ని మానసిక, శారీరక సమస్యలు వచ్చే అవకాశాలూ పెరుగుతూపోతాయి. ఆరోగ్యకరమైన బిడ్డ కావాలనుకునేవాళ్లు త్వరగా బిడ్డను కనేలా ప్లాన్ చేసుకోవాలి. ఒకవేళ ఉద్యోగరీత్యా లేదా లైఫ్‌లో సెటిల్ అవ్వడంలో ఆలస్యమైనవాళ్లు... లేట్‌గా బిడ్డను ప్లాన్ చేసుకోవాలనుకునేవారు... లేదా కారణాలు ఏవైనా లేటు వయసులో గర్భధారణ కోరుకునే పరిస్థితి వచ్చిన వాళ్లు కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవడం మేలు. లేట్ వయసులో గర్భధారణ జరిగితే ఆ బిడ్డ 'డౌన్స్ సిండ్రోమ్'తో పుట్టేందుకు అవకాశాలు ఎక్కువ. అందుకే లేట్ వయసులో గర్భధారణను ప్లాన్ చేసుకున్నవారు... డౌన్స్ సిండ్రోమ్ ముప్పును నివారించుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేసే కథనం.



డా. శివనారాయణ రెడ్డి వెన్నపూస
సీనియర్ నియోనేటాలజిస్ట్ & పీడియాట్రీషియన్

• ప్రెగ్నెన్సీ ఆలస్యం?

లేట్ ప్లాన్... కిడ్స్ 'డౌన్'

డౌన్స్ సిండ్రోమ్‌లో ఏం జరుగుతుంది అంటే...?

ఈ భూమ్మీద పుట్టిన ప్రతి ప్రజాతి (స్పీసీస్)కి చెందిన ప్రతి జీవికీ నిర్దిష్టమైన క్రోమోజోముల సంఖ్య ఉంటుంది. ఆ సంఖ్యను బట్టే ఆ జీవి ఏమిటన్నది నిర్ణయమవుతుంది. మనిషిలోని క్రోమోజోముల సంఖ్య 46. అందుకే ప్రత్యుత్పత్తి జరగడానికి వీలుగా... పురుషుడి వీర్యకణంలో 23, మహిళలోని అండంలో 23 క్రోమోజోములుంటాయి. వీర్యకణం... అండంతో కలిసినప్పుడు ఈ 23 జతలు కలుసుకుని 46 క్రోమోజోములతో కొత్త బిడ్డ పుట్టేలా ప్రకృతి ఏర్పాటు చేస్తుంది. మనిషి విషయంలో లాగే... ప్రతి జీవిలోనూ ఇదే జరుగుతుంది. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల ఈ క్రోమోజోముల సంఖ్యలో మార్పు వస్తే...? అది సహజమూ, స్వాభావికమూ కాదు. అలా ఉండవలసిన క్రోమోజోముల కంటే ఎక్కువగానో లేదా తక్కువగానో ఉంటే పుట్టిన బిడ్డలో కొన్ని అసాధారణమైన రుగ్మతలు కనిపిస్తాయి.

మనిషిలో ఉండాల్సిన 46 (అంటే ఇరవైమూడు జతల) క్రోమోజోములకు బదులుగా... ఒకవేళ ఏదైనా కారణాల వల్ల ఈ సంఖ్య కాస్తా 47కు చేరితే... అప్పుడు ఆ బిడ్డలో కనిపించే రుగ్మత పేరే 'డౌన్స్ సిండ్రోమ్'. అంటే... ఇందులో 21వ క్రోమోజోము తాలూకు 'కాపీ' ఒకటి అదనంగా ఏర్పడుతుంది. ఫలితంగా 46 క్రోమోజోములు కాస్తా 47గా మారిపోతాయి. ఇలా జరిగినప్పుడు అలా పుట్టిన పిల్లలకు కొన్ని మానసికమైన లోపాలు కనిపిస్తుంటాయి. ఇంగ్లాండుకు చెందిన ఫిజీషియన్ జాన్ లాంగ్‌డన్ డౌన్ ఈ కండిషన్‌ను కనుగొన్నారు. దాంతో ఈ మెడికల్ కండిషన్‌కు ఆయన పేరిట 'డౌన్స్' సిండ్రోమ్‌గా పేరు పెట్టారు.

డౌన్స్ సిండ్రోమ్‌లో రకాలు...

ఇందులోనూ కొన్ని రకాలు ఉన్నాయి. ఉదాహరణకు...

- **ట్రైజోమీ:** రెండు జతలుగా ఉండాల్సిన 21వ క్రోమోజోమ్‌కు మరొకటి అదనంగా చేరడం వల్ల కలిగే కండిషన్. డౌన్స్ సిండ్రోమ్‌తో బాధపడేవారిలో 94 శాతం మందిలో సాధారణంగా ఈ కండిషనే ఉంటుంది. దీన్ని 'ట్రైజోమీ' అంటారు.
- **ట్రాన్స్‌లొకేషన్ :** 21వ క్రోమోజోమ్ నుంచి ఒక ముక్క విడివడి అది వేరే క్రోమోజోమ్‌కు అంటుకోవడాన్ని ట్రాన్స్‌లొకేషన్ అంటారు. ఈ తరహా కారణంతో డౌన్స్ సిండ్రోమ్ రావడం మరో 4 శాతం మందిలో కనిపిస్తుంది.
- **మొసాయిజమ్ :** ఇది కేవలం 2 శాతం మందిలోనే ఉండే అరుదైన పరిస్థితి. ఇది పై రెండు విధాల కంటే భిన్నంగా ఉంటుంది.

గర్భధారణ లేట్ అయిన కొద్దీ పెరుగుతుండే డౌన్స్ సిండ్రోమ్ రిస్క్!

వివాహాన్ని ఆలస్యం చేస్తూ, దానివల్ల గర్భధారణ కూడా ఆలస్యంగా జరగడం వల్ల కలిగే దుష్పరిణామం ఇది. మహిళ వయసు పెరుగుతూ ఎంత ఆలస్యంగా గర్భధారణ జరుగుతుంటే... డౌన్స్ సిండ్రోమ్ వచ్చే ముప్పు అంతగా పెరుగుతుంది. అందుకే మహిళలు తమ గర్భధారణను 35 ఏళ్లకు ముందుగానే జరిగేలా చూసుకోవడం మేలు.

డౌన్స్ సిండ్రోమ్ పిల్లల్లో కనిపించే లోపాలు...

సాధారణంగా డౌన్స్ సిండ్రోమ్‌తో పుట్టిన పిల్లల్లో కొన్ని శారీరక, మానసిక లోపాలు కనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవి..

- కండరాల పటుత్వం తగ్గి పుట్టడం.
- మెడ వెనక భాగంలో దళసరి చర్మం ఉండటం
- ముక్కు చప్పిడిగా ఉండటం (ఫ్లాటెన్డ్ నోస్),
- పుర్రెలోని ఎముకల మధ్య ఖాళీలు కాస్త ఎక్కువగా ఉండటం
- సాధారణంగా మన అరచేతిలో పైన రెండు గీతలు ఉంటాయి. కానీ డౌన్స్ సిండ్రోమ్ ఉన్నవారి అరచేతిలో ఒకటే గీత ఉంటుంది (సిమియన్ క్రీస్)
- చెవి డొప్పలు (ఇయర్ పిన్నా) చిన్నవిగా ఉండటం
- నోరు చిన్నదిగా ఉండటం
- కళ్లు పైవైపునకు తిరిగినట్టుగా ఉండటం
- చేయి వెడల్పుగా, చేతి వేళ్లు పొట్టిగా ఉండటం
- కంట్లోని నల్లగుడ్డులో తెల్లమచ్చలు (బ్రష్‌ఫీల్డ్ స్పాట్స్) ఉండటం.
- మిగతావారితో పోలిస్తే తల కాస్త తక్కువ సైజులో ఉండటం. చూడగానే తల ఆకృతిలో ఏదో మార్పు (అబ్‌నార్మాలిటీ) ఉన్నట్లు కనిపించడం.
- పిల్లలు పెద్దగా ఎత్తు పెరగకపోవడం
- మానసిక వికాసం కాస్త ఆలస్యంగా జరుగుతుండటం.

వీటితో పాటు మరికొన్ని అదనపు ఆరోగ్య సమస్యలూ ఉండవచ్చు. అవి...

- గుండెకు సంబంధించిన లోపాలు కనిపించవచ్చు. అంటే గుండె గదుల్లో పై గదుల మధ్య గోడలో లోపం (ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్) గాని, కింది గదుల మధ్య గోడలో లోపం (వెంట్రిక్యులార్ సెప్టల్ డిఫెక్ట్)గాని ఉండేందుకు అవకాశాలెక్కువ.
- ఈ పిల్లల్లో మతిమరపు ఎక్కువగా కనిపించవచ్చు.
- కాటరాక్ట్ కంటి సమస్యలు రావడం.
- జీర్ణకోశ వ్యవస్థలో అడ్డంకులు/సమస్యలు (డియొడినల్ అట్రీసియా)
- తుంటి ఎముక తన స్థానం నుంచి తొలగిపోవడం (హిప్ డిస్‌లొకేషన్),
- మలబద్ధకం
- హైపోథైరాయిడిజమ్ వంటి శారీరక సమస్యలు రావచ్చు.

మహిళ వయసు	డౌన్స్ సిండ్రోమ్ రిస్క్
* 25 ఏళ్ల వయసులో గర్భధారణ జరిగితే	1,250 మందిలో ఒకరికి
* 30 ఏళ్ల వయసులో గర్భధారణ జరిగితే	1,000 మందిలో ఒకరికి
* 35 ఏళ్ల వయసులో గర్భధారణ జరిగితే	400 మందిలో ఒకరికి
* 40 ఏళ్ల వయసులో గర్భధారణ జరిగితే	100 మందిలో ఒకరికి
* 45 ఏళ్ల వయసులో గర్భధారణ జరిగితే	30 మందిలో ఒకరికి

అంటే మహిళల్లో వయసు పెరుగుతున్న కొద్దీ డౌన్స్ సిండ్రోమ్ ముప్పు కూడా అదే క్రమంలో పెరుగుతుందని పక్కన ఉన్న పట్టిక వల్ల తెలుస్తుంది.

పుట్టక ముందే నిర్ధారణ ఎలా...?

వివాహం ఆలస్యంగా చేసుకోవడమో లేదా ఏదైనా కారణాల వల్ల ఆలస్యంగా పిల్లల్ని కనేలా ప్లాన్ చేసుకోవడమో జరిగితే ఆ దంపతులు... పుట్టబోయే చిన్నారిలో డౌన్స్ సిండ్రోమ్ కండిషన్ వచ్చేందుకు అవకాశాలెలా ఉన్నాయనే విషయాన్ని తెలుసుకునేందుకు కొన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఆ పరీక్షల సహాయంతో ముప్పును చాలావరకు ముందుగానే తెలుసుకోవచ్చు. ఇందుకు కొన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. (అయితే ఈ పరీక్షలు చాలావరకు ఖచ్చితమైన సమాచారాన్నే అందిస్తాయి. కానీ పూర్తి నిర్ధారణ బిడ్డ పుట్టిన తర్వాతే అవుతుందని కాబోయే తల్లిదండ్రులు గుర్తించాలి. ఆ పరీక్షలేమిటో చూద్దాం...

స్క్రీనింగ్ పరీక్షలు

- **ఈ పరీక్షల్లో చాలా ప్రాచుర్యం ఉన్నది 'ట్రిపుల్ స్క్రీన్' అనే పరీక్ష.** ఇందులో మూడు రకాలైన పరీక్షలను కలగలిపి ట్రిపుల్ స్క్రీన్ అంటారు. ఈ పరీక్షల్లో రక్తంలోని కొన్ని అంశాల విలువలను మూడుసార్లు పరీక్షించి సరిపోల్చి డౌన్స్ సిండ్రోమ్ వచ్చే అవకాశాన్ని నిర్ధారణ చేస్తారు. ఈ పరీక్షను గర్భవతికి గర్భధారణ జరిగిన 15వ వారం నుంచి 20వ వారం మధ్యలో నిర్వహిస్తారు.
- **అల్ట్రాసాండ్ స్కానింగ్ పరీక్షలు :** మిగతా పరీక్షలతో పాటు అల్ట్రా సాండ్ స్కాన్ చేస్తూ... బిడ్డ ఎదుగుదలలో మార్పులను పరిశీలిస్తుంటారు. ఈ పరీక్ష వల్ల బిడ్డ తాలూకు భౌతికమైన అంశాలు (ఫిజికల్ ఫీచర్స్) ఎలా ఉన్నాయో తెలుస్తాయి. తరచూ స్కాన్ చేయిస్తూ... ఆ స్కాన్ ఫలితాలను డౌన్స్ సిండ్రోమ్ లక్షణాలతో సరిపోలుస్తూ తరచూ పరిశీలిస్తూ ఉంటారు.

డయాగ్నస్టిక్ పరీక్షలు (నిర్ధారణ కోసం)

- గర్భధారణ జరిగాక 12 నుంచి 20వ వారాల మధ్య సమయంలో గర్భసంచి నుంచి ఉమ్మనీరు తీసి 'అమ్నియోసెంటెసిస్' అనే పరీక్ష నిర్వహిస్తారు
- గర్భధారణ సమయంలోని 8వ వారం నుంచి 12వ వారం వరకు 'కోరియానిక్ విల్లస్ శాంప్లింగ్' అనే పరీక్ష చేస్తారు
- గర్భధారణ సమయంలోని 20వ వారంలో 'పర్క్యుటేనియస్ అంబిలికల్ బ్లడ్ శాంప్లింగ్' అనే పరీక్ష చేస్తారు.

డౌన్స్ సిండ్రోమ్ నిర్ధారణ పరీక్షలివి...

అలాగే అల్ట్రా సాండ్ స్కానింగ్‌లోనూ ఒక ప్రత్యేకమైన స్కానింగ్ పరీక్షను చేస్తారు. ఈ పరీక్షకే 'న్యూకల్ ట్రాన్స్‌లుయెన్సీ' (ఎన్‌టీ) పరీక్షగా అని పేరు. ఇందులో బిడ్డ మెడ వెనకభాగంలోని చర్మం వెనక ఉన్న ఉమ్మనీటిని పరీక్షిస్తారు. సాధారణంగా డౌన్స్ సిండ్రోమ్ ఉన్న బిడ్డలకు ఈ నీటి మందం ఎక్కువగా ఉంటుంది. దీన్ని బట్టి పుట్టబోయే బిడ్డకు డౌన్స్ సిండ్రోమ్ వచ్చే అవకాశాలను అంచనా వేస్తారు. ఇక కోరియానిక్ విల్లస్ శాంప్లింగ్ (సీవీఎస్) పరీక్ష లేదా ఉమ్మనీటిని తీసి చేసే పరీక్షల ద్వారా గర్భస్థ శిశువు దశలోనే పుట్టబోయే బిడ్డకు ఏవైనా ఆరోగ్య సమస్యలున్నాయా అన్న విషయమూ తెలుస్తుంది.

కోరియానిక్ విల్లస్ శాంప్లింగ్ (సీవీఎస్) : గర్భధారణ జరిగాక 10వ వారంలో బిడ్డ తాలూకు బొడ్డు తాడు నుంచి చిన్న ముక్కను సేకరించి చేసే అల్ట్రా సౌండ్ పరీక్ష ఇది.

అమ్నియోసెంటెసిస్ : సాధారణంగా గర్భధారణ తర్వాత 15వ వారం నుంచి 22వ వారం వరకు ఈ పరీక్ష చేయవచ్చు. ఇందులో తల్లి గర్భంలోంచి ఇంజెక్షన్ నీడిల్ ద్వారా కొంత ఉమ్మనీటిని సేకరిస్తారు. ఇలా సేకరించడానికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ సహాయం తీసుకుంటారు. స్కానింగ్‌లో తల్లి గర్భాన్ని పరిశీలిస్తే సిరెంజీ పంపడం ద్వారా సరిగ్గా ఉమ్మనీటినే తీసుకుంటున్నామా అన్న విషయాన్ని పరిశీలిస్తూ ఈ నీటిని డాక్టర్లు సేకరిస్తుంటారు.

ఒకవేళ అప్పటికే చిన్నారి డౌన్స్ సిండ్రోమ్‌తో పుడితే...

కారణాలు ఏవైనప్పటికీ ఒకవేళ డౌన్స్ సిండ్రోమ్‌తో పిల్లలు పుడితే ముందుగా వాళ్లలో డౌన్స్ సిండ్రోమ్ నిర్ధారణ కోసం కొన్ని పరీక్షలూ. అలాగే ఆ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడటం కోసం కొన్ని వైద్య పరీక్షలను క్రమం తప్పకుండా చేయిస్తూ ఉండటం అవసరం. అవి...

చిన్నారిలో డౌన్స్ సిండ్రోమ్ నిర్ధారణ ఇలా...

ఒక చిన్నారిలో డౌన్స్ సిండ్రోమ్ ఉందని నిర్ధారణ చేయడానికి క్రోమోజోముల పరీక్షను నిర్వహించాలి. దీనికోసం చిన్నారి నుంచి సేకరించిన రక్తంతో 'కారియోటైపిక్ క్రోమోజోమల్ స్టడీ' అనే రక్త పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఈ ప్రధాన పరీక్షతో పాటు గుండెలో ఏవైనా లోపాలున్నాయేమోనని తెలుసుకోడానికి ఎకోకార్డియోగ్రామ్ చేయాలి. ఇక ఈసీజీ, ఛాతీ, జీర్ణకోశవ్యవస్థ తాలూకు పరిస్థితిని తెలుసుకోడానికి ఎక్స్-రే పరీక్షలూ చేయించాలి.

చిన్నారికి డౌన్స్ సిండ్రోమ్ ఉంటే క్రమం తప్పకుండా చేయించాల్సిన పరీక్షలు...

డౌన్స్ సిండ్రోమ్ ఉన్న పిల్లలకు క్రమం తప్పకుండా కొన్ని వైద్య పరీక్షలు చేయిస్తూ ఉండాలి. అవి...

- చిన్నతనంలో ప్రతి ఏడాదిలో కనీసం ఒకసారి కంటి పరీక్షలు చేయించాలి
- ప్రతి 6 నుంచి 12 నెలలకు ఒకసారి చెవి పరీక్షలు చేయించాలి. (పిల్లవాడి వయసును బట్టి ఆరు నెలలకొకసారి చేయించాలా లేదా 12 నెలలకు ఒకసారా అన్న వ్యవధిని డాక్టర్లు నిర్ణయిస్తారు)
- ప్రతి ఆర్నెల్లకోసారి దంతాల పరీక్షలు
- ప్రతి 3 నుంచి 5 ఏళ్లకు ఒకసారి ఛాతీ, మెడ భాగాన్ని ఎక్స్-రే పరీక్ష తీసి పరీక్షిస్తూ ఉండాలి
- అమ్మాయిల్లో యుక్త వయసు రాగానే లేదా 21 ఏళ్ల వయసులోగాని పాప్ స్మియర్ పరీక్ష చేయించాలి
- ప్రతి 12 నెలలకోసారి థైరాయిడ్ పరీక్ష చేయిస్తూ ఉండాలి.





ఈ పరీక్షలన్నీ సంయుక్తంగా...

డౌన్స్ సిండ్రోమ్ నిర్ధారణ కోసం పైన పేర్కొన్న రక్తపరీక్షలు, అల్ట్రా సౌండ్ పరీక్షలను ఒక పద్ధతి ప్రకారం అన్నీ సంయుక్తంగా చేస్తుంటారు. రక్త పరీక్షల్లో రక్తనమూనాలను సేకరించి వాటిలో కొన్ని నిర్దిష్టమైన ప్రొటీన్లను, హార్మోన్లను పరిశీలిస్తారు. ఇలా కొన్ని రకాల ప్రోటీన్లు, హార్మోన్ల మోతాదులు సాధారణ విలువల కంటే ఎక్కువగా ఉంటే.. ఆ మార్కర్స్‌ను బట్టి అది డౌన్స్ సిండ్రోమ్‌కు సూచికలు కావచ్చంటూ అనుమానిస్తారు. ముందుగా చెప్పినట్లుగా ఇవన్నీ ముందస్తుగా అంచనా తెలిసిందేకు చేసే పరీక్షలు. ఈ పరీక్షలు చాలావరకు కరెక్ట్‌గానే విషయాన్ని ముందే తెలుపుతాయి. అయితే అతడికి డౌన్స్ సిండ్రోమ్ ఉందన్న విషయం బిడ్డ పుట్టాక మాత్రమే నూరు శాతం తెలుస్తుందని గుర్తుంచుకోవాలి.

చికిత్స

ఇది క్రోమోజోముల తేడా వల్ల వచ్చిన కండిషన్ కావడంతో దీనికి చికిత్స లేదు. అయితే ఇలా పుట్టిన పిల్లలను మామూలు పిల్లల్ల పెంచడానికి ఫిజియోథెరపిస్ట్, భాషను చక్కదిద్దడం, చక్కగా వచ్చేల చేయడానికి సహాయపడే లాంగ్వేజ్/స్పీచ్ థెరపిస్ట్, పెద్దయ్యాక వారు స్వతంత్రంగా బతికేలా తోడ్పడేందుకు ఆక్యుపేషనల్ థెరపిస్టులూ, మంచి ఆహారాన్ని అందించేందుకు డైటీషియన్, వినికిడి సమస్యల పరిష్కారానికి ఆడియాలజిస్ట్, కంటి సమస్యలను చక్కదిద్దడానికి ఆఫ్తాల్మాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణుడు, గుండె వైద్య నిపుణుల సహాయం... ఇలా ఇంతమంది నిపుణుల సహాయం అవసరమవుతూ ఉంటుంది.

ముందస్తు నివారణే మేలు...

బిడ్డ పుట్టిన తర్వాత బాధపడటం కంటే దంపతులు కొద్దిపాటి జాగ్రత్తలతో, కొన్ని వైద్య పరీక్షల సహాయంతో బిడ్డలో ఇది రాకుండా లేదా వచ్చేందుకు అవకాశమున్న విషయాన్ని తెలుసుకోవాలి. ఒకవేళ అలా డౌన్స్ సిండ్రోమ్‌తో బిడ్డ పుట్టే అవకాశముందని తెలుసుకున్నప్పుడు డాక్టర్లు, క్రోమోజోమల్ స్పెషలిస్టుల ఆధ్వర్యంలో తప్పక కౌన్సెలింగ్ తీసుకోవాలి. ఇలాంటి సమస్య రాకుండానే ఉండేందుకు వీలైనంతవరకు మహిళలో గర్భధారణ 35 ఏళ్ల కంటే ముందుగానే జరిగేలా ప్లాన్ చేసుకోవడం, కుటుంబంలో ఎవరికైనా డౌన్స్ సిండ్రోమ్ ఉంటే ఆ విషయాన్ని గర్భధారణకు ముందుగానే డాక్టర్లకు చెప్పి తగిన కౌన్సెలింగ్ తీసుకోవడమన్నది దంపతులు తప్పనిసరిగా చేయాల్సిన పనులు.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

ఆర్‌బీఎల్ బ్యాంక్‌పై ఎమిరేట్స్ ఎన్‌బీడీ కన్ను




న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంకులో మెజారిటీ వాటాలను దక్కించుకోవడంపై ఎమిరేట్స్ ఎన్‌బీడీ దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గత కొద్ది నెలలుగా దీనిపై సంప్రదింపులు జరుగుతున్నాయని, 51 శాతం వాటాను కొనుగోలు చేయడంపై ఎమిరేట్స్ ఎన్‌బీడీ ఆసక్తిగా ఉందని వివరించాయి. అయితే, ఇంకా డీల్ నిబంధనలేమీ ఖరారు కాలేదని, ఈ చర్చలు ఫలవంతమవుతాయా లేదా అనేది చెప్పలేమని పేర్కొన్నాయి. ప్రమోటర్లెవరూ లేకపోవడంతో ఆర్‌బీఎల్‌లో 100 శాతం వాటాలు పబ్లిక్ షేర్‌హోల్డర్ల వద్దే ఉన్నాయి. 1963లో నేషనల్ బ్యాంక్ ఆఫ్ దుబాయ్‌గా ప్రారంభమైన ఎమిరేట్స్ ఎన్‌బీడీ ప్రస్తుతం భారత్‌లో చెన్నై, గురుగ్రామ్, ముంబై శాఖల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ. 17,786.79 లక్షల కోట్లుగా ఉంది. దీని బట్టి చూస్తే 51 శాతం వాటాల విలువ సుమారు రూ. 9,071 కోట్లుగా ఉంటుందని అంచనా.

టైటాన్ నుంచి స్టెలార్ 3.0 వాచీల శ్రేణి

వ్యాండరింగ్ హవర్స్ ధర రూ. 1,79,995



హైదరాబాద్: వాచీల దిగ్గజం టైటాన్ తాజాగా స్టెల్లార్ 3.0 కలెక్షన్ కింద 9 టైమ్‌పీస్‌ల శ్రేణిని ప్రవేశపెట్టింది. వీటిలో మూడు లిమిటెడ్ ఎడిషన్ వాచీలు ఉన్నాయి. టైటానియంలో అమర్చిన రెండు శాటిలైట్ డిస్కులతో రూపొందించిన వ్యాండరింగ్ హవర్స్ వాచ్ ధర రూ. 1,79,995గా ఉంటుందని సంస్థ తెలిపింది. ఇవి కేవలం 500 పీస్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇక ఉల్క శకలంతో రూపొందించిన ఐస్ మెటియోరైట్ వాచీ ధర రూ. 1,39,995గా, నార్తర్న్ లైట్స్‌ని తలపించే అరోరా సెలమ్ ధర రూ. 95,995గా ఉంటుందని సంస్థ సీఈవో (వాచెస్ అండ్ వేరబుల్స్) కురువిల్లా మార్కోస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-10-2025

విశాఖ	510-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,439.00	2.1
BAJAJ-AUTO	9,081.00	1.5
BAJFINANCE	1,039.00	1.48
SHRIRAMFIN	673	1.2
BAJAJFINSV	2,023.90	0.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	664	-2.2
INFY	1,492.40	-1.49
WIPRO	245.15	-1.43
HINDUNILVR	2,496.60	-1.28
NESTLEIND	1,185.20	-1.19

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,101
ఎన్ఎస్ఈ	91,723
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,45,434
ఎఫ్ఐఐ	- 240
డీఐఐ	+ 2,333

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	59.70 (రాత్రి 11.30కు)	$ 58.09 (క్రితం ముగింపు)
బ్రెంట్	63.49 (రాత్రి 11.30కు)	$ 62.73 (క్రితం ముగింపు)

హెచ్‌సీఎల్ క్యూ2 ఫ్లాట్

నికర లాభం రూ. 4,235 కోట్లు
- ఆదాయం రూ. 31,942 కోట్లు
- గైడెన్స్ 4–5 శాతానికి పెంపు



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 4,235 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం పుంజుకుని రూ. 31,942 కోట్లను తాకింది. అయితే త్రైమాసికవారీగా(క్యూ1లో రూ. 3,843 కోట్లతో పోలిస్తే) నికర లాభం 10 శాతం ఎగసింది. పూర్తి ఏడాదికి సర్వీసుల ఆదాయం 4–5 శాతం స్థాయిలో పురోగమించగలదని కంపెనీ తాజాగా అంచనాల(గైడెన్స్)ను సవరించింది. ఇంతక్రితం 3–5 శాతం ఆదాయ అంచనాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉద్యోగులందరికీ వేరియబుల్ పే అమలు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అక్టోబర్ నుంచి ఇంక్రిమెంట్లకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. ఈ కాలంలో 3,489 మందికి ఉపాధి కల్పించడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,26,440కు చేరింది. ఫ్రెషర్స్‌తో కలిపి 5,1196 మందిని విధుల్లోకి తీసుకుంది.

షేరుకి రూ. 12 డివిడెండ్

వాటాదారులకు షేరుకి రూ. 12 చొప్పున హెచ్‌సీఎల్ టెక్ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 17 రికార్డ్ డేట్. క్యూ2లో అడ్వాన్స్‌డ్ ఏఐ ఆదాయం 10 కోట్ల డాలర్లను(రూ. 876 కోట్లు) అధిగమించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సి.విజయకుమార్ పేర్కొన్నారు. నిర్వహణ లాభ మార్జిన్ 17.5 శాతంగా నమోదైంది. మార్జిన్లు త్రైమాసికవారీగా 1.16 శాతం బలపడగా.. 16 శాతం అధికంగా 2.6 బిలియన్ డాలర్ల(రూ. 22,500 కోట్లు) విలువైన కాంట్రాక్టులు అందుకుంది. ఎలాంటి భారీ డీల్ లేకుండానే తొలిసారి ఆర్డర్లు 2.5 బిలియన్ డాలర్లను తాకినట్లు విజయకుమార్ పేర్కొన్నారు. హెచ్1బీ వీసా ఫీజు పెంపు నేపథ్యంలో గ్లోబల్ డెలివరీ మోడల్ 5 ద్వారా వీసాలపై ఆధారపడటాన్ని తగ్గించుకున్నట్లు వెల్లడించారు. గతేడాదితోపోలిస్తే ఈ ఏడాది ఫ్రెషర్స్‌ను అధికంగా తీసుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 12.9 శాతం నుంచి 12.6 శాతానికి స్వల్పంగా తగ్గింది. కాగా.. ఆదాయంలో 56 శాతం వాటాగల యూఎస్ బిజినెస్ 2.4 శాతం పుంజుకోగా.. యూరప్ 7.6 శాతం బలపడింది.

మార్కెట్లు ముగిశాక కంపెనీ ఫలితాలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో రూ. 1,495 వద్ద యథాతథంగా ముగిసింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు 6% అప్


ఇప్పటివరకు రూ. 11.89 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 12 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా రూ. 11.89 లక్షల కోట్లకు చేరాయి. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన రూ. 11.18 లక్షల కోట్లతో పోలిస్తే 6 శాతం పెరిగాయి. కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు పెరగడం, రిఫండ్‌లు నెమ్మదించడం ఇందుకు కారణం. ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 12 వరకు రిఫండ్‌ల జారీ 16 శాతం తగ్గి రూ. 2.03 లక్షల కోట్లకు పరిమితమైంది. నికర కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ. 4.92 లక్షల కోట్ల నుంచి రూ. 5.02 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్‌యేతర పన్ను వసూళ్లు రూ. 5.94 లక్షల కోట్ల నుంచి రూ. 6.56 లక్షల కోట్లకు పెరిగాయి. ఇక సమీక్షాకాలంలో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) వసూళ్లు రూ. 30,630 కోట్ల నుంచి రూ. 30,878 కోట్లకు చేరాయి. రిఫండ్‌లను సర్దుబాటు చేయక ముందు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 2.36 శాతం పెరిగి రూ. 13.92 లక్షల కోట్లకు చేరాయి.

ఐపీవో ప్రణాళికల్లో ట్రైఫ్యాక్టా

రూ. 1,330 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: యూఎస్ సంస్థ ట్రైఫ్యాక్టా ఇంక్ పబ్లిక్ ఇష్యూ యోచనలో ఉంది. ఈ నెలాఖరుకల్లా గిఫ్ట్ సిటీలోని ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజీలలో లిస్టికావాలని భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ముసాయిదా పత్రాలను దాఖలు చేయనుంది. తద్వారా 10–15 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,330 కోట్లవరకూ) సమీకరించాలని ప్రణాళికలు వేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం గిఫ్ట్ సిటీ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కోసం ఒకే ఒక కంపెనీ ఫైలింగ్ చేసింది. ముంబైకి చెందిన ఎడ్యుకేషనల్ ప్లాట్‌ఫామ్ ఎక్స్ఈడీ ఆగస్ట్‌లోనే ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. తద్వారా సమకూర్చుకోనున్న నిధులను వర్కింగ్ క్యాపిటల్, టెక్నాలజీపై వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. ప్రస్తుతం గిఫ్ట్ సిటీలో ఇండియా ఐఎన్ఎక్స్, ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజీ ఏర్పాటయ్యాయి. కాలిఫోర్నియా కేంద్రంగా 1996లో ఏర్పాటైన ట్రైఫ్యాక్టా యూఎస్‌లోని ప్రభుత్వ, సంస్థాగత క్లయింట్లకు ఐటీ సర్వీసులు, టెక్నాలజీ, స్టాఫింగ్, పేరోలింగ్ తదితర సర్వీసులు అందిస్తోంది.

ఇటలీ మార్కెట్లోకి హీరో మోటోకార్ప్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఇటలీ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ద్విచక్ర వాహనాల దిగ్గజం హీరో మోటోకార్ప్ వెల్లడించింది. ఇందుకోసం స్థానిక పెల్పి ఇంటర్నేషనల్ సంస్థతో జట్టు కట్టినట్లు తెలిపింది. ప్రాథమికంగా కీలక నగరాల్లో 36 మంది డీలర్లతో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు, క్రమంగా ఈ సంఖ్యను 54కి పెంచుకోనున్నట్లు తెలిపింది. ముందుగా ఎక్స్‌పల్స్ 200 4వీ, ఎక్స్‌పల్స్ 200 4వీ ప్రో, హంక్ 440ని ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ భాన్ తెలిపారు. తమకు అంతర్జాతీయంగా ఇది 49వ మార్కెట్ అని వివరించారు. ద్విచక్ర వాహనాల పంపిణీ, సేల్స్, సర్వీస్‌కి సంబంధించి 160 మంది డీలర్లతో ఇటలీలో అతి పెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటిగా పెల్పి ఇంటర్నేషనల్ కార్యకలాపాలు సాగిస్తోంది.

నాట్కో ప్రతిపాదనకు 'యాడ్‌కాక్' షేర్ హోల్డర్లు ఓకే



జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాకు చెందిన 135 ఏళ్ల ఫార్మా సంస్థ యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్‌లో దేశీ ఫార్మా దిగ్గజం నాట్కో ఫార్మా గణనీయంగా వాటాలు కొనుగోలు చేసేందుకు మార్గం మరికాస్త సుగమమైంది. దీనికి సంబంధించి ఆర్డినరీ షేర్ల కొనుగోలు ప్రతిపాదనకు యాడ్‌కాక్ ఇన్‌గ్రాం షేర్‌హోల్డర్లు ఆమోదముద్ర వేశారు. సుమారు 4.2 బిలియన్ సౌతాఫ్రికన్ రాండ్స్ (దాదాపు 292 మిలియన్ డాలర్లు) విలువ చేసే డీల్ అనంతరం సంస్థను స్టాక్ ఎక్స్ఛేంజీ నుంచి డీలిస్ట్ చేసి, ప్రైవేట్ కంపెనీగా మారుస్తారు. నాట్కో, బిడ్‌వెస్ట్ సహయజమానులుగా ఉంటాయి. బిడ్‌వెస్ట్ మెజారిటీ వాటాదారుగా ఉంటుంది. కంపెనీ షేర్ల కొనుగోలు కోసం నాట్కో జులైలో ఆఫర్ ఇచ్చినప్పుడు యాడ్‌కాక్ షేరు 20 శాతం పెరిగింది. దక్షిణాఫ్రికా మార్కెట్లో విస్తరించడానికి, కొత్త ఆదాయ మార్గాలను అందిపుచ్చుకోవడానికి ఈ డీల్‌తో అవకాశం లభిస్తుందని నాట్కో ఫార్మా సీఈవో రాజీవ్ నన్నపనేని తెలిపారు.

'ఫిషింగ్' వసతులు మెరుగుపరచాలి

నీతి ఆయోగ్ పిలుపు

న్యూఢిల్లీ: మత్స్య పరిశ్రమ అభివృద్ధికి వీలుగా నీతి ఆయోగ్ కీలక సూచనలు చేసింది. చేపలు పట్టేందుకు ఉద్దేశించిన వసతులు, సామర్థ్యాల విస్తరణ (బోట్లు, పడవలు), ఆధునికీకరణకు పిలుపునిచ్చింది. తద్వారా బ్లూ ఎకానమీ (సముద్ర ఉత్పత్తులకు సంబంధించి)ని ప్రోత్సహించాలని కోరింది. చేపల ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఒక కార్యాచరణను రూపొందించుకోవాలని, కీలకమైన మౌలిక వసతుల అంతరాన్ని భర్తీ చేయాలని పేర్కొంది. పెంపకానికి ఉద్దేశించిన చేపల రకాల ఎంపిక జాగ్రత్తగా ఉండాలని, సుస్థిరమైన పెంపకం విధానాలను ప్రోత్సహించాలని సూచించింది. మన దేశానికి 11,098 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. 2023–24లో చేపలు, చేపల ఉత్పత్తుల ఎగుమతుల రూపంలో ఆర్థిక వ్యవస్థకు రూ.60,523 కోట్ల ఆదాయం సమకూరడం గమనార్హం. ఈ నేపథ్యంలో నీతి ఆయోగ్ చేసిన సూచనలకు ప్రాధాన్యం ఏర్పడింది.

రూ.799కే జియో భారత్ ఫోన్

'సేఫ్టీ ఫస్ట్ మొబైల్ ఫోన్' పేరుతో విడుదల



హైదరాబాద్: భారతీయ కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకొని రిలయన్స్ జియో 'జియో భారత్ బి2–సేఫ్టీ ఫస్ట్ మొబైల్' ఆవిష్కరించింది. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కొత్త సేఫ్టీ ఫీచర్ కస్టమర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. రియల్‌టైమ్ లొకేషన్ ట్రాకింగ్, వినియోగ నిర్వహణ, ఫోన్ హెల్త్ మానిటరింగ్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. అత్యంత సమర్థవంతమైన బ్యాటరీ ఇందులో ఉంది. ఏడు రోజుల వరకు బ్యాటరీ బ్యాకప్ అందిస్తుంది. ఈ ఫోన్‌ను కేవలం రూ.799కే సొంతం చేసుకోవచ్చు. దీపావళి వేడుక ఆఫర్ కింద మొదట రూ. 100 చెల్లించి బుకింగ్ చేసుకొనే వీలుంది. దేశవ్యాప్తంగా ఉన్న జియో స్టోర్స్, ప్రముఖ మొబైల్ రిటైల్ అవుట్‌లెట్లతో పాటు జియోమార్ట్, అమెజాన్, మరియు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంది.

ముందస్తు హెచ్చరికల వ్యవస్థను పటిష్టపరచాలి

మ్యూచువల్ ఫండ్స్ ట్రస్టీలకు సెబీ చీఫ్ ఆదేశాలు



ముంబై: ముందుగా హెచ్చరించే వ్యవస్థలను మరింత పటిష్టపరచవలసిందిగా మ్యూచువల్ ఫండ్స్ ట్రస్టీలను తుహిన్ కాంతా పాండే ఆదేశించారు. వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా అవకతవకలను ముందుగానే గుర్తించడం, సమయానుగుణ చర్యలు, ఇన్వెస్టర్ల పరిరక్షణకు వీలుంటుందని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ పాండే పేర్కొన్నారు. సెబీ సంస్కరణల అమలులో నిర్లిప్తతను ప్రదర్శించకుండా ఇన్వెస్టర్ల పరిరక్షణకు క్రియాశీలంగా వ్యవహరించాలని కోరారు. అవసరమైతే ట్రస్టీలు ప్రశ్నించడం, కలుగజేసుకోవడం వంటివి చేపట్టాలని సూచించారు. ఇన్వెస్టర్ల విశ్వాసానికి ట్రస్టీలు వెన్నెముకలాంటి వారు అని వ్యాఖ్యానించారు. డెరివేటివ్స్, ఈఎస్‌జీ ఇన్వెస్టింగ్, ప్రత్యామ్నాయ ఆస్తులు, రిస్క్ అనలిటిక్స్ తదితర వర్ధమాన అంశాలలో ట్రస్టీలు అప్‌డేటెడ్‌గా ఉండాలని సలహా ఇచ్చారు. ఇందుకు ప్రత్యేక శిక్షణ, నిరంతర కృషి అవసరముంటుందని, దీంతో ప్రభావవంతంగా పనిచేసేందుకు వీలుంటుందని వివరించారు. గత దశాబ్ద కాలంలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ వేగవంత వృద్ధిని అందుకోగా.. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) ఆరురెట్లు జంప్‌చేసిందని తెలియజేశారు. దీంతో ఏయూఎం రూ. 12 లక్షల కోట్ల నుంచి 2025 సెప్టెంబర్‌కల్లా రూ. 75.6 లక్షల కోట్లకు ఎగసినట్లు వెల్లడించారు. ఫండ్స్ ఇన్వెస్టర్ల సంఖ్య సైతం కోటి నుంచి 5.6 కోట్లకు బలపడినట్లు తెలియజేశారు. క్రమానుగత పెట్టుబడి పథకాలు(సిప్)కు నెలవారీగా పెట్టుబడులు సగటున రూ. 28,000 కోట్లు చొప్పున లభిస్తున్నట్లు పేర్కొన్నారు. 2016 ఏప్రిల్‌లో నెలవారీ సిప్ పెట్టుబడులు రూ. 3,000 కోట్లు మాత్రమేనని ప్రస్తావించారు. ఇది రిటైల్ ఇన్వెస్టర్లకు ఫండ్ పరిశ్రమపై పెరుగుతున్న నమ్మకానికితోడు.. పెట్టుబడులతో మరింత మంది ముందుకు వస్తున్నట్లు తెలియజేశారు.

త్వరలో అమెరికాతో ఒప్పందం!

ఈ వారంలో అగ్ర రాజ్యానికి వాణిజ్య బృందం



న్యూఢిల్లీ: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) తొలి దశ సాకారానికి వీలుగా అమెరికా, భారత్ మధ్య ఈ వారంలో మరో విడత చర్చలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం భారత వాణిజ్య బృందం అమెరికాకు వెళ్లనుంది. ఈ విషయాన్ని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్ నాటికి తొలి దశ ఒప్పందం కుదుర్చుకోవాలన్నది ప్రణాళిక కాగా, ఇప్పటి వరకు ఐదు విడతలుగా రెండు దేశాల మధ్య చర్చలు కొనసాగాయి. అనుకున్న సమయానికి తొలి దశ బీటీఏపై చర్చలను ముగించేందుకు రెండు దేశాలు సానుకూల దృక్పథంతో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన అధికారుల బృందం గత నెలలో న్యూయార్క్‌లో చర్చలు నిర్వహించడం తెలిసిందే. వీలైనంత త్వరలో పరస్పర ఆమోదయోగ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలను కొనసాగించాలని నిర్ణయించడం గమనార్హం. అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, యూఎస్ రాయబారి సెర్గియో గోర్‌తో మంత్రి గోయల్ చర్చలు నిర్వహించారు. 2030 నాటికి రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ప్రధాని మోదీ, యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో అంగీకారానికి రావడం తెలిసిందే.

కీలక అంశాలపై చర్చలు

కీలక ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు, నియంత్రణపరమైన సహకారం, ఇంధనం, టెక్నాలజీ రంగాల్లో సహకారం పెంపుపై ఈ విడతలో చర్చలు ఉంటాయని తెలుస్తోంది. అమెరికా నుంచి మరింతగా సహజ వాయువు, పునరుత్పాదక ఇంధన వనరుల సాంకేతికతలను దిగుమతి చేసుకునేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. ఇంధన సహకారం కీలక అంశంగా ఉందని, అమెరికా నుంచి దీర్ఘకాలానికి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోవాలని అనుకుంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రియల్టీలోకి పీఈ పెట్టుబడులు డౌన్

జులై–సెప్టెంబర్‌లో 15 శాతం క్షీణత
- 819 మిలియన్ డాలర్లకు పరిమితం
- అనరాక్ క్యాపిటల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై–సెప్టెంబర్) దేశీయంగా రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు 819మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే వ్యవధిలో నమోదైన 967 బిలియన్ డాలర్లతో పోలిస్తే 15 శాతం తగ్గాయి. ప్రాపర్టీ కన్సల్టెంట్ అనరాక్ అనుబంధ సంస్థ అనరాక్ క్యాపిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఇక 2025–26 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో పీఈ పెట్టుబడులు 2.6 బిలియన్ డాలర్ల నుంచి 15 శాతం క్షీణించి 2.2 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో వచ్చిన మొత్తం ఇన్వెస్ట్‌మెంట్లలో విదేశీ పెట్టుబడుల వాటా 73 శాతంగా ఉంది. తొలి త్రైమాసికంలో కాస్త ఆశావహ ధోరణి కనిపించినప్పటికీ అది కొన్నాళ్ల ముచ్చటే అయిందని, రెండో త్రైమాసికంలో కార్యకలాపాలు నెమ్మదించాయని అనరాక్ క్యాపిటల్ సీఈవో శోభిత్ అగర్వాల్ తెలిపారు. పూర్తి సంవత్సరం ప్రాతిపదికన చూస్తే పీఈ పెట్టుబడులు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయని వివరించారు. 2021 ఆర్థిక సంవత్సరంలో 6.4 బిలియన్ డాలర్ల నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో 3.7 బిలియన్ డాలర్లకు పడిపోయాయని పేర్కొన్నారు.



రెసిడెన్షియల్ సెగ్మెంట్లో అమ్మకాల జోరు..

రెసిడెన్షియల్ విభాగంలో రియల్ ఎస్టేట్ అమ్మకాల పరిమాణం భారీగా ఉందని, దీంతో డెవలపర్లకు నగదు ప్రవాహం గణనీయంగా మెరుగుపడిందని అగర్వాల్ తెలిపారు. దీనితో వారు ఖరీదైన ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్)పై ఆధారపడటం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే బ్యాంకుల వద్ద కూడా పుష్కలంగా నిధులు ఉండటంతో, గతానికి భిన్నంగా, అవి రియల్టీకి రుణాలిచ్చేందుకు మరింత సానుకూలంగా ఉన్నాయని ఆయన వివరించారు. అటు కమర్షియల్ రియల్ ఎస్టేట్ విషయం తీసుకుంటే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రస్తుతం చాలా అనిశ్చితి నెలకొన్నట్లు చెప్పారు. దీనితో ద్రవ్యోల్బణంతో పాటు అంతర్జాతీయంగా ఇతరత్రా స్థూల ఆర్థిక అనిశ్చితి కూడా పెరుగుతోందని వివరించారు. 'అందుకే విదేశీ పెట్టుబడుల ప్రవాహం నెమ్మదించింది. భారత్ గణనీయంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గానే కాకుండా పెట్టుబడులు వృద్ధి చెందేందుకు ఆస్కారమున్న అతి తక్కువ దేశాల్లో ఒకటిగా నిలుస్తోంది కాబట్టి ఇది తాత్కాలిక ధోరణే కావొచ్చు. అనిశ్చితులు తొలగిపోయి, స్పష్టత వచ్చిందంటే చాలు కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లోకి పీఈ పెట్టుబడులు మళ్లీ పుంజుకుంటాయి' అని అగర్వాల్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ విభాగంలోకి పీఈ పెట్టుబడులు అసలు రాలేదు. రిటైల్, మిక్స్‌డ్–యూజ్, కమర్షియల్ అసెట్స్ విభాగంలో గణనీయంగా వచ్చాయి. హోటల్స్, డేటా సెంటర్లలోకి కూడా పెట్టుబడులు మెరుగ్గానే వచ్చినట్లు అనరాక్ క్యాపిటల్ తెలిపింది.

జోరుగా ఈక్విటీ పెట్టుబడులు

సెప్టెంబర్ త్రైమాసికంలో 3.8 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: దేశ రియల్ ఎస్టేట్ రంగంలోకి ఈక్విటీ పెట్టుబడుల రాక సెప్టెంబర్ త్రైమాసికంలో బలంగా నమోదైంది. 48 శాతం అధికంగా 3.8 బిలియన్ డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు వచ్చినట్లు సీబీఆర్ఈ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈక్విటీ పెట్టుబడుల రాక 2.6 బిలియన్ డాలర్లుగానే ఉంది. ప్రధానంగా భూ సమీకరణ, అభివృద్ధి, ఆఫీస్/రిటైల్ ఆస్తుల నిర్మాణంపై ఇన్వెస్టర్లు పెట్టుబడులు కుమ్మరించారు. ఇక ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో రియల్ ఎస్టేట్ రంగంలో ఈక్విటీ పెట్టుబడులు 14 శాతం ఎగసి 10.2 బిలియన్ డాలర్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 8.9 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. 2024 సంవత్సరం మొత్తం మీద వచ్చిన ఈక్విటీ పెట్టుబడులు 11.4 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. "వేగవంతమైన వృద్ధి దశలోకి రియల్ ఎసెట్ రంగం అడుగు పెట్టింది. ఇన్వెస్టర్ల నుంచి స్థిరమైన విశ్వాసం ఇందుకు మద్దతుగా నిలుస్తోంది. రానున్న త్రైమాసికాల్లో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అభివృద్ధికి బలమైన డిమాండ్ ఉంటుంది. ఇళ్లు, ఆఫీస్, మిశ్రమ వినియోగ వసతులు, డేటా సెంటర్లు, పారిశ్రామిక, రవాణా వసతుల వ్యాప్తంగా సమతూకం ఉంటుంది" అని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజిన్ తెలిపారు. పెట్టుబడుల్లో మరింత వైవిధ్యం ఉన్నట్టు, నిర్మాణం పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ఆస్తుల్లోకి పెట్టుబడులు వస్తున్నట్టు సీబీఆర్ఈ ఎండీ గౌరవ్ కుమార్ పేర్కొన్నారు.



తొలి టైటిల్ వేటలో...



● డెన్మార్క్ ఓపెన్ బరిలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ
● ఈ సీజన్‌లో భారత ద్వయం ఖాతాలో చేరని టైటిల్

ఒడెన్స్: ఈ ఏడాది అందని ద్రాక్షగా ఊరిస్తున్న డబుల్స్ టైటిల్ కోసం భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మరో ప్రయత్నం చేయనుంది. నేడు మొదలయ్యే డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం బరిలోకి దిగనుంది. ఆరో సీడ్‌గా పోటీపడుతున్న సాత్విక్-చిరాగ్ జోడీ తొలి రౌండ్‌లో క్రిస్టోఫర్ గ్రిమ్లే-మాథ్యూ గ్రిమ్లే (స్కాట్లాండ్) ద్వయంతో తలపడుతుంది. పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి మరో జంట పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయిప్రతీక్ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఇటీవల సాత్విక్-చిరాగ్ ద్వయం వరుసగా చైనా ఓపెన్, హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీల్లో ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో, సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో, ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో, మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ సెమీఫైనల్లో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ జోడీ డెన్మార్క్ ఓపెన్‌లోనూ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుంది.

పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి బరిలో ఉన్నారు. ప్రపంచ 28వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి తొలి రౌండ్‌లో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో... ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో ఎన్‌హట్ నుగుయెన్ (ఐర్లాండ్)తో ఆడతారు. మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి కేవలం అన్‌మోల్ ఖరబ్ మాత్రమే పోటీపడుతోంది. గతవారం ఆర్కిటిక్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన అన్‌మోల్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ పుత్రి కుసుమ వర్ధాని (ఇండోనేసియా)తో తలపడనుంది. మహిళల డబుల్స్‌లో రుతపర్ణ-శ్వేతాపర్ణ పాండా... సెల్వం కవిప్రియ-సిమ్రన్... మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక శివాని-రోహన్ కపూర్... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల... లక్షిత-మోహిత్ జగ్లాన్ జోడీలు పోటీపడతాయి.

3 డెన్మార్క్ ఓపెన్ టోర్నీ చరిత్రలో భారత్ నుంచి ముగ్గురు క్రీడాకారులు టైటిల్స్ సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రకాశ్ పడుకోన్ (1980లో), కిడాంబి శ్రీకాంత్ (2017లో)... మహిళల సింగిల్స్ విభాగంలో సైనా నెహ్వాల్ (2012లో) చాంపియన్స్‌గా నిలిచారు.


మనిక

పోరాడి ఓడిన భారత టీటీ జట్టు

భువనేశ్వర్: ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టుకూ నిరాశ ఎదురైంది. నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించిన భారత జట్టు ఈ అడ్డంకిని అధిగమించి పతకం రేసులో నిలవడంలో విఫలమైంది. సింగపూర్ జట్టుతో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 2-3 తేడాతో ఓటమి పాలైంది. తొలి మ్యాచ్‌లో మనిక బత్రా 8-11, 7-11, 11-6, 8-11తో టాన్ జావో యున్ చేతిలో పరాజయం చవిచూసింది. రెండో మ్యాచ్‌లో దియా చిటాలె 11-3, 10-12, 9-11, 11-5, 9-11తో జెంగ్ జియాన్ చేతిలో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో యశస్విని 11-7, 11-8, 11-8తో సెర్ లిన్ కియాన్‌పై... నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 11-9, 8-11, 11-8, 12-10తో జెంగ్ జియాన్‌పై గెలవడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో దియా చిటాలె 6-11, 5-11, 4-11తో టాన్ జావో యున్ చేతిలో ఓడిపోవడంతో భారత ఓటమి ఖరారైంది.



భళా బెంగళూరు!

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో బెంగళూరు టోర్పెడస్ జోరు కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు టోర్పెడస్ 17-15, 14-16, 17-15, 16-14తో చెన్నై బ్లిట్జ్ జట్టును ఓడించింది. ఈ లీగ్‌లో బెంగళూరు జట్టుకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. జోయల్ బెంజమిన్, సేతు, ముజీబ్, జిష్ణు, నితిన్ మన్హాస్ సమన్వయంతో ఆడి బెంగళూరు విజయంలో ముఖ్య పాత్ర పోషించారు. పది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో బెంగళూరు జట్టు 11 పాయింట్లతో అగ్రస్థానంలో.. ముంబై మెటియోర్స్ 9 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్ మినహా మిగతా తొమ్మిది జట్లు గెలుపు బోణీ కొట్టాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో ముంబై మెటియోర్స్‌తో కొచ్చి బ్లూ స్పైకర్స్; కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌తో గోవా గార్డియన్స్ తలపడతాయి.


టోనీ డి జోర్జి

దక్షిణాఫ్రికా 216/6

లాహోర్: పాకిస్తాన్ జట్టుతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు తడబడింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 216 పరుగులు సాధించింది. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు దక్షిణాఫ్రికా మరో 162 పరుగుల దూరంలో ఉంది. టోనీ డి జోర్జి (140 బంతుల్లో 81 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్), సెనురణ్ ముత్తుస్వామి (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ మరో 65 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 378 పరుగుల వద్ద ఆలౌటైంది. సల్మాన్ ఆఘా (93; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఏడు పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ముత్తుస్వామి 117 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు.


వెన్నెల


జ్ఞానదత్తు


విష్ణు, కీర్తి

వెన్నెల, జ్ఞానదత్తు శుభారంభం

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

గువాహటి: సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగంలో భారత క్రీడాకారులు శుభారంభం చేశారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ క్రీడాకారులు టంకర తలశిల జ్ఞానదత్తు, కలగోట్ల వెన్నెల తొలి రౌండ్‌లో విజయాలు సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 17 ఏళ్ల జ్ఞానదత్తు 5-15, 15-7, 15-7తో మిలాన్ మెస్టెర్‌హాజి (హంగేరి)పై... మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వెన్నెల 15-1, 15-6తో సియోఫ్రా ఫ్లిన్ (ఐర్లాండ్)పై గెలుపొందారు. 'నేను తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్నాను. దాంతో తొలి గేమ్‌లో కాస్త ఒత్తిడికి గురయ్యా. యూరోప్ ప్లేయర్‌తో రెండోసారి తలపడ్డా. దాంతో యూరోప్ ఆటగాళ్ల ఆటతీరును అర్థం చేసుకోవడానికి కాస్త సమయం తీసుకున్నా. రెండో గేమ్ నుంచి నేను సహజశైలిలో ఆడి విజయాన్ని అందుకున్నా' అని ఈ మెగా ఈవెంట్‌లో టీమ్ విభాగంలో తొలిసారి కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న జ్ఞానదత్తు వ్యాఖ్యానించాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన కోడె విష్ణుకేదార్-మంచాల కీర్తి ద్వయం కూడా గెలుపు బోణీ కొట్టింది. తొలి రౌండ్‌లో విష్ణు-కీర్తి జోడీ 15-7, 15-8తో మొస్లెనా కొరామా-ఒబపోంబా అదుమింటా (ఘనా) జంటపై గెలిచింది.

ఆంధ్ర రంజీ జట్టు కెప్టెన్‌గా రికీ భుయ్



సాక్షి, విశాఖపట్నం: రేపటి నుంచి మొదలయ్యే దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్ర క్రికెట్ జట్టును ప్రకటించారు. రికీ భుయ్ సారథ్యంలో ఆంధ్ర జట్టు ఈ సీజన్‌లో పోటీపడనుంది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో ఉన్న ఆంధ్ర జట్టు ఈనెల 15 నుంచి జరిగే తమ తొలి మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ జట్టుతో కాన్పూర్‌లో తలపడుతుంది. గ్రూప్ 'ఎ'లో ఆంధ్ర, ఉత్తరప్రదేశ్‌లతోపాటు బరోడా, తమిళనాడు, నాగాలాండ్, ఒడిశా, విదర్భ, జార్ఖండ్ జట్లున్నాయి.

ఆంధ్ర రంజీ జట్టు

రికీ భుయ్ (కెప్టెన్, విశాఖపట్నం), కోన శ్రీకర్ భరత్ (విశాఖపట్నం), అభిషేక్ రెడ్డి (చిత్తూరు), షేక్ రషీద్ (గుంటూరు), కరణ్ షిండే (కర్నూలు), పీవీఎస్ఎన్ రాజు (తూర్పు గోదావరి), కేవీ శశికాంత్ (విశాఖపట్నం), సౌరభ్ కుమార్ (గెస్ట్ ప్లేయర్), వై.పృథ్వీరాజ్ (విజయనగరం), టి.విజయ్ (శ్రీకాకుళం), ఎస్.ఆశిష్ (విశాఖపట్నం), అశ్విన్ హెబ్బర్ (నెల్లూరు), రేవంత్ రెడ్డి (నెల్లూరు), కె.సాయితేజ (తూర్పు గోదావరి), చీపురపల్లి స్టీఫెన్ (తూర్పు గోదావరి), వై.సందీప్ (కృష్ణా).



హరియాణా గెలుపుబాట

ఐదు పరాజయాల తర్వాత పట్నా పైరేట్స్‌పై విజయం

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో హరియాణా స్టీలర్స్ తమ వరుస పరాజయాల పరంపరకు బ్రేకులేసింది. సోమవారం ఇక్కడ జరిగిన లీగ్ మ్యాచ్‌లో హరియాణా 39-32తో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. ఐదు పరాజయాల తర్వాత స్టీలర్స్ పట్టుదలగా ఆడి ఈ మ్యాచ్ నెగ్గింది. హరియాణా తరఫున రెయిడర్ శివమ్ (12 పాయింట్లు) కీలకపాత్ర పోషించాడు. 13 సార్లు కూతకెళ్లిన అతను 11 పాయింట్లు తెచ్చాడు. ప్రత్యర్థి రెయిడర్‌ను టాకిల్ చేసి మరో పాయింట్ గెలిచాడు. రెయిడర్ వినయ్ (4), ఆల్‌రౌండర్ సాహిల్ నర్వాల్ (3) మెరుగ్గా ఆడగా... డిఫెండర్లలో కెప్టెన్ జైదీప్ (6), రాహుల్ (4), హర్దీప్ (3) రాణించారు. పట్నా జట్టులో రెయిడర్ అయాన్ (17) ఒంటరి పోరాటం చేశాడు. 24 సార్లు కూతకెళ్లిన అయాన్ 15 పాయింట్లు తెచ్చిపెట్టాడు. టాకిల్‌లోనూ 2 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో డిఫెండర్ నవ్‌దీప్ (4) మినహా ఇంకెవరూ చెప్పుకోదగిన ప్రదర్శనే ఇవ్వలేకపోయారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 40-24తో యూ ముంబాపై విజయం సాధించింది. యోధాస్ జట్టులో రెయిడర్ గుమన్ సింగ్ (12) అదరగొట్టాడు. సహచరుల్లో భవాని రాజ్‌పుత్ (5), మహేందర్ సింగ్ (4), హితేశ్ (4) ఆషు సింగ్ (3) రాణించారు. యూ ముంబా జట్టులో రెయిడర్లు సందీప్ (7), అజిత్ చౌహాన (5) ఆకట్టుకున్నారు. నేడు ఇదే వేదికపై జరిగే పోటీల్లో పట్నా పైరేట్స్‌తో గుజరాత్ జెయింట్స్, యూపీ యోధాస్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

బిహార్ రంజీ జట్టు వైస్ కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ



పట్నా: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో పోటీపడే బిహార్ జట్టును సోమవారం ప్రకటించారు. ఐపీఎల్ సహా యూత్ సిరీస్‌లో రాణించిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనకు ప్రోత్సాహకంగా వైస్ కెప్టెన్‌గా నియమించారు. సకీబుల్ గని నాయకత్వం వహిస్తాడు. రేపటి నుంచి జరిగే రంజీ ట్రోఫీలో బిహార్ ప్లేట్ డివిజన్‌లో పోటీపడనుంది. ఈ నెల 15 నుంచి జరిగే తొలి మ్యాచ్‌లో బిహార్... అరుణాచల్ ప్రదేశ్‌తో తలపడుతుంది. రెండేళ్ల క్రితం 12 ఏళ్ల వయసులోనే రంజీ క్రికెట్‌తో దేశవాళీ క్రికెట్ ఆడిన వైభవ్ ఈ ఏడాది ఐపీఎల్‌లో లీగ్ చరిత్రలోనే రెండో వేగవంతమైన సెంచరీని సాధించాడు. గుజరాత్‌తో జరిగిన పోరులో రాజస్తాన్ తరఫున బరిలోకి దిగిన సూర్యవంశీ 35 బంతుల్లోనే శతకాన్ని పూర్తిచేశాడు. వచ్చే ఏడాది జింబాబ్వే, నమీబియాల్లో అండర్-19 ప్రపంచ కప్ జరగనున్న నేపథ్యంలో వైభవ్ ఈ సీజన్ అసాంతం రంజీలు ఆడే అవకాశం లేదు.

ఘనా ఐదోసారి...

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత

అక్రా: వచ్చే ఏడాది జరిగే పురుషుల ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆఫ్రికా జోన్ నుంచి ఘనా జట్టు అర్హత సాధించింది. ఆఫ్రికాక్వాలిఫయింగ్‌లో భాగంగా గ్రూప్ 'ఐ' విజేత హోదాలో ఘనా జట్టుకు ప్రపంచకప్ బెర్త్ ఖరారైంది. కోమోరోస్ జట్టుతో 'డ్రా' చేసుకుంటే ప్రపంచకప్ బెర్త్ ఖాయమయ్యే పరిస్థితిలో ఘనా జట్టు 1-0 గోల్ తేడాతో గెలిచింది. ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్‌లో టోటెన్‌హామ్ జట్టుకు ఆడే మొహమ్మద్ కుడుస్ 47వ నిమిషంలో గోల్ చేసి ఘనా జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి అమెరికా, కెనడా, మెక్సికో ఉమ్మడిగా ఆతిథ్యమివ్వనున్నాయి. మొత్తం 48 జట్లు పాల్గొంటాయి. ఇప్పటికి 19 జట్లు అర్హత పొందాయి. ఇందులో ఆతిథ్య దేశాలైన అమెరికా, కెనడా, మెక్సికో జట్లకు నేరుగా అర్హత దక్కింది. ఆఫ్రికా జోన్ నుంచి 9 జట్లకు అవకాశం ఉండగా... ఇప్పటికి ఐదు జట్లు (మొరాకో, ట్యునీషియా, ఈజిప్ట్, అల్జీరియా, ఘనా) బెర్త్‌లు దక్కించుకున్నాయి. ఐదోసారి ప్రపంచకప్ ఆడనున్న ఘనా జట్టు 2010లో క్వార్టర్ ఫైనల్ చేరి తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది.





పారిస్ ఒలింపిక్స్ పతక విజేతలకు ఐఓఏ సన్మానం

న్యూఢిల్లీ: గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలను అందజేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులకు చెక్‌లను ప్రదానం చేశారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ మొత్తం ఆరు పతకాలను సాధించింది. ఇందులో ఒక రజతం, ఐదు కాంస్యాలు ఉన్నాయి. పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్ చోప్రా రజత పతకం నెగ్గగా... షూటింగ్‌లో మనూ భాకర్ (2 పతకాలు), సరబ్‌జోత్ సింగ్, స్వప్నిల్ కుసాలే... రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్ కాంస్యం... హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత పురుషుల హాకీ జట్టు కాంస్యం సాధించాయి. రజతం నెగ్గిన నీరజ్ చోప్రాకు రూ. 75 లక్షలు ప్రదానం చేశారు. విదేశాల్లో ఉన్నందున నీరజ్ చోప్రా బదులు భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధికారి ఈ నగదు పురస్కారాన్ని స్వీకరించారు. కాంస్యం నెగ్గిన భారత హాకీ జట్టు సభ్యులకు రూ. 10 లక్షల చొప్పున ఇచ్చారు. అమన్ సెహ్రావత్‌కు రూ. 50 లక్షలు... స్వప్నిల్‌కు రూ. 50 లక్షలు... మనూ భాకర్‌కు రూ. 50 లక్షలు లభించాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గిన మనూ-సరబ్‌జ్యోత్ జోడీకి రూ. 37 లక్షల 50 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష కూడా పాల్గొన్నారు.

భారత్ x సింగపూర్

మడ్గావ్: ఆసియా కప్-2027 క్వాలిఫయర్స్‌లో భాగంగా ఈరోజు సింగపూర్ జట్టుతో భారత్ తలపడనుంది. ఆసియా కప్‌కు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో భారత్ తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. డిఫెండర్ సందేశ్ జింగాన్‌పై ఒక మ్యాచ్ సస్పెన్షన్ విధించడంతో అతను ఈ కీలక మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఈనెల 9న సింగపూర్‌తో సింగపూర్‌లో జరిగిన మ్యాచ్‌ను భారత జట్టు 1-1తో 'డ్రా' చేసుకుంది. గ్రూప్ 'సి'లో భారత్ రెండు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.



హమాస్ చెర నుంచి బందీల విడుదలను లైవ్‌లో తిలకించేందుకు వీలుగా టెల్‌అవీవ్‌లో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ వద్ద గుమికూడిన జనం



హమాస్ చెర నుంచి విడుదలైన ఆనందంలో తన కుటుంబసభ్యులతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న ఐటన్ మోర్(మధ్యలో వ్యక్తి)



గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంలో నాస్సెర్ ఆస్పత్రి వద్ద సోమవారం పాలస్తీనా ఖైదీలకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

చీకటి 'వేదం'!


43 ఏళ్ల చీకటి తర్వాత వెలుగు.. కానీ అంతలోనే కారుచీకట్లు! నిర్దోషిగా విడుదలైన ఆ అమాయకుడికి ఆ ఆనందం మిగల్లేదు. వేదనల 'వేదం' విషాదానికి అంతేలేదు. ఇది న్యాయమా? మానవత్వమా? అంటే సమాధానాలే లేవు. కళ్ల ముందు రెండు తరాలు గడిచిపోయాయి. కానీ ఆయన మాత్రం ఏం మారలేదు. చేయని నేరానికి నాలుగు దశాబ్దాలకు పైగా (43 ఏళ్లు) జైలు గోడల మధ్య నలిగిపోయిన సుబ్రహ్మణ్యం 'సుబు' వేదం (64), ఎట్టకేలకు న్యాయం గెలిచి, నిర్దోషిగా విడుదలయ్యాడు. జీవితం, స్వేచ్ఛ, కుటుంబం.. ఈ బంధాల రుచి మళ్లీ చూడబోతున్నానని ఆశపడ్డాడు. కానీ ఆ ఆనందం ఎంతోసేపు లేదు. అమెరికా చట్టం అతన్ని మళ్లీ బందీగా మార్చింది.

అప్పుడు తప్పుడు శిక్ష.. ఇప్పుడు దేశ బహిష్కరణ ముప్పు

చేయని హత్య కేసులో నాలుగు దశాబ్దాలకు పైగా జైలు శిక్ష అనుభవించిన తర్వాత, సుబ్రహ్మణ్యం 'సుబు' వేదం ఎంతో కాలంగా ఎదురుచూసిన స్వేచ్ఛకు బదులుగా, కొత్త కష్టాలు ఎదురయ్యాయి. పెద్దగా పరిచయం లేని భారతదేశ బహిష్కరణ ముప్పు అతనికి ఏర్పడింది. తనపై ఉన్న హత్య కేసు శిక్షను రద్దు చేయడంతో, అక్టోబర్ 3న పెన్సిల్వేనియాలోని హంటింగ్‌డన్ స్టేట్ కరెక్షనల్ ఇన్‌స్టిట్యూషన్ నుండి విడుదలైన 64 ఏళ్ల సుబు వేదంను, వెంటనే అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదుపులోకి తీసుకుంది.

చేయని హత్యకు చెరసాలలో మగ్గి..

కేవలం తొమ్మిది నెలల వయసులో భారత దేశం నుండి అమెరికాకు వచ్చిన వేదం, శాశ్వత అమెరికా నివాసి. కానీ 1980లో పెన్సిల్వేనియాలో జరిగిన 19 ఏళ్ల థామస్ కిన్సర్ కాల్చివేత కేసులో.. దాదాపు మొత్తం వయోజన జీవితాన్ని జైలులోనే గడిపాడు. స్టేట్ కాలేజ్ సమీపంలోని సింక్‌హోల్‌లో కిన్సర్ మృతదేహం లభించింది, అతనితో చివరిగా కనిపించిన వ్యక్తి వేదం (కిన్సర్ మాజీ హైస్కూల్ సహ విద్యార్థి) అని పోలీసులు ఆరోపించారు. వేదం తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది.



అతన్ని 1983, 1988లలో రెండుసార్లు దోషిగా నిర్ధారించారు. పెరోల్ కూడా లేకుండా జీవిత ఖైదు విధించారు.

శిక్ష రద్దు, ఎఫ్‌బీఐ నివేదిక

ఆగస్టు 2025లో, ఒక సెంటర్ కౌంటీ న్యాయమూర్తి అతని శిక్షను రద్దు చేస్తూ, ప్రాసిక్యూటర్లు చట్టవిరుద్ధంగా ఒక ఎఫ్‌బీఐ నివేదికను డిఫెన్స్ న్యాయవాదుల నుండి దాచిపెట్టారని తీర్పు చెప్పారు. ఈ తీర్పు తరువాత, సెంటర్ కౌంటీ జిల్లా అటార్నీ బెర్నీ కాంటోర్నా అన్ని అభియోగాలను అధికారికంగా కొట్టివేశారు. 'కాలం గడిచిపోవడం, కీలక సాక్షుల నష్టం, వేదం దశాబ్దాల జైలు శిక్షను కారణాలుగా' పేర్కొన్నట్లు 'ది ఫిలడెల్ఫియా ఎంక్వైరర్' వెల్లడించింది.

సుదీర్ఘ అన్యాయం

'వేదం.. పెన్సిల్వేనియా చరిత్రలో సుదీర్ఘకాలం అన్యాయంగా శిక్షకు గురైన వ్యక్తిగా, అమెరికాలో అత్యధిక కాలం శిక్ష అనుభవించిన వారిలో ఒకరిగా నిలబెట్టింది. 'వేదం.. తన జీవితంలో అత్యంత విలువైన నాలుగు దశాబ్దాల కాలాన్ని తప్పుడు శిక్ష వల్ల కోల్పోయాడు. ఇప్పుడాయన వయసు 64. ఈ దేశంలోనే ఆయన సోదరి, మేనకోడళ్లు, మనవరాళ్లు.. కుటుంబ బంధాలు అన్నీ ఉన్నాయి. ఏ బంధుత్వం, ఏ పరిచయం లేని దేశానికి, తను ఏమాత్రం తెలియని భారత్‌కు పంపాలని నిర్ణయించడం ఏం న్యాయం?'.. అని ఆయన న్యాయవాది ఆవేదన వ్యక్తం చేశారు.

చీకటిలోనూ అక్షర దీపం

సుబు తన జైలు జీవితాన్ని దుఃఖంతో ముగించలేదు. ఆయన తన చుట్టూ ఉన్న చీకటిలో జ్ఞాన దీపాలను వెలిగించారు. జైలులో ఖైదీల కోసం అక్షరాస్యత తరగతులు, డిప్లొమా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు డిగ్రీలు, 4.0 జీపీఏతో ఎంబీఏ కూడా పూర్తి చేసి, 150 ఏళ్ల జైలు చరిత్రలోనే అరుదైన ఖైదీగా నిలిచారు.

మా పోరాటం మానవత్వం కోసమే..

సుబు మేనకోడలు జోయ్ మిల్లర్ వేదం మాటలు ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలిస్తాయి. '43 ఏళ్ల పాటు జైలులో బంధించి వేదం జీవితాన్ని తీసేసుకున్నారు. ఇప్పుడు, ఆయనను ప్రేమించే వారందరికీ దూరంగా, ఏమీ తెలియని ప్రపంచానికి పంపడం అనేది, ఆ అన్యాయాన్ని మరింత పెంచడమే. వేదం తల్లిదండ్రులు ఆయన్ని చూసేందుకు ఏళ్ల తరబడి జైలుకు వచ్చి కన్ను మూశారు. దయచేసి, మా కుటుంబాన్ని ఇకనైనా కలవనివ్వండి. ఈ పోరాటం చట్టం గురించి కాదు... మానవత్వం కోసం'.. అని కన్నీటిపర్యంతమయ్యారు. తప్పుడు శిక్ష పడిన ఒక వ్యక్తి స్వేచ్ఛ కోసం, కుటుంబంతో కలవడం కోసం చేస్తున్న ఈ ఆఖరి పోరాటానికి న్యాయస్థానం ఎలా స్పందిస్తుందోనని యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది.

ఆర్మీ వ్యతిరేక వ్యాఖ్యల కేసు..
రాహుల్ విచారణపై సుప్రీం మళ్లీ స్టే

న్యూఢిల్లీ: భారత ఆర్మీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2022లో భారత్ జోడో యాత్ర సమయంలో చేసిన వ్యాఖ్యలపై లక్నో కోర్టులో కేసు నమోదైంది. అయితే, తదుపరి విచారణ చర్యలు చేపట్టకుండా ఆగస్టు 4వ తేదీన స్టే ఇచ్చింది. ఈ స్టేను పొడిగించాలంటూ వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'పిటిషనర్ వినతి మేరకు తదుపరి విచారణ నవంబర్ 25వ తేదీకి వాయిదా వేస్తున్నాం. ఆగస్టు 4వ తేదీన ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను అప్పటి వరకు పొడిగిస్తున్నాం'అని ధర్మాసనం తెలిపింది. దిగువ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను మే 29వ తేదీన అలహాబాద్ హైకోర్టు కొట్టి వేయడాన్ని సవాల్ చేస్తూ రాహుల్ వేసిన పిటిషన్‌ను సైతం ఈ ధర్మాసనం విచారిస్తోంది. గాంధీ పిటిషన్‌తోపాటు మరో రెండు వేర్వేరు పిటిషన్లను కూడా నవంబర్ 25వ తేదీన విచారించనుంది.

ఏడాదిలో వెయ్యి మంది
మావోయిస్టుల లొంగుబాటు

- త్వరలోనే మరికొందరు సీనియర్ నేతలు బయటకు వచ్చే అవకాశం
- నవంబర్‌లో ప్రభావిత రాష్ట్రాలతో కేంద్రం కీలక సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా సాగుతున్న కేంద్ర బలగాలు, పోలీసుల చర్యలతో లొంగిపోతున్న మావోయిస్టుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు లొంగిపోయిన మావోయిస్టుల సంఖ్య 1,040కు చేరుకుందని నివేదికలు వెల్లడించాయి. గత ఏడాది మొత్తమ్మీద లొంగుబాట పట్టిన వారు 881 మంది. కాగా, ఈ ఏడాది చివరికి మరింత మంది హింసామార్గం వీడి రానున్నారని కేంద్రం అంచనా వేస్తోంది. వామపక్ష తీవ్రవాదం నిర్మూలనకు కేంద్రం తీసుకుంటున్న చర్యల ఆధారంగా 2020లో 344 మంది మావోయిస్టులు లొంగిపోగా, 2021లో 544, 2022లో 417, 2023లో 414 మంది లొంగిపోయారు. ఈ వారంలో పలువురు సీనియర్ నేతలు లొంగిపోయే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే వీరు మధ్యవర్తుల ద్వారా బలగాలను సంప్రదించినట్లుగా చెబుతున్నారు. నవంబర్ 1న జరిగే రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ప్రధాని మోదీ ఛత్తీస్‌గఢ్ పర్యటనకు రానున్న దృష్ట్యా, అంతకుముందే పెద్ద సంఖ్యలో మావోల లొంగుబాటు ఉంటుందనే అంచనా ఉంది. కూంబింగ్ చర్యలతో మావోయిస్టు పార్టీలోని కేంద్ర కమిటీ సభ్యుల సంఖ్య 40 నుంచి 10కి తగ్గింది. పూర్తిస్థాయిలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై హోం మంత్రి వచ్చే నెలలో రెండు రోజులపాటు మావోల ప్రభావిత రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో కీలక భేటీ నిర్వహించనున్నారు.

ముల్ల పెరియార్ డ్యామ్ పటిష్టతకు మార్గదర్శకాలు అవసరం: సుప్రీం

కేంద్రం, కేరళ, తమిళనాడు, ఎన్‌డీఎంఏలకు నోటీసులు

న్యూఢిల్లీ: కేరళలోని 130 ఏళ్ల ముల్ల పెరియార్ డ్యామ్ భద్రత, నిర్మాణ స్థిరత్వంపై ఉన్న ఆందోళనల నేపథ్యంలో.. ఈ డ్యామ్‌ను పటిష్టం, బలోపేతం చేయడానికి కొన్ని మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. ఈ విషయమై కేంద్రం, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అలాగే జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఎంఏ)లకు నోటీసులు జారీ చేసింది. పాత డ్యామ్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త డ్యామ్ నిర్మించాలని కోరుతూ సేవ్ కేరళ బ్రిగేడ్ అనే ఎన్‌జీఓ సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంపై (పిల్) చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తాజా నోటీసులు జారీ చేసింది. డ్యామ్ భద్రతా అంశాలను అంచనా వేయడానికి, అలాగే కొత్త నిర్మాణం అవకాశాలను పరిశీలించడానికి నిపుణుల బృందం ద్వారా సమీక్ష చేయించాలని కూడా పిల్ కోరడం గమనార్హం. 1895లో కేరళ ఇడుక్కీ జిల్లాలోని పెరియార్ నది మీద ముల్ల పెరియార్ డ్యామ్ నిర్మాణం జరిగింది. లీజ్ అగ్రిమెంట్ ప్రాతిపదికన ఈ డ్యామ్‌ను తమిళనాడు రాష్ట్రం నిర్వహిస్తోంది.

పాలియేటివ్ కేర్‌పై మార్గదర్శకాల అమలు విధానాన్ని తెలపండి

కేంద్రానికి సుప్రీం మూడు వారాల గడువు

న్యూఢిల్లీ: పాలియేటివ్ కేర్‌పై 2017లో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ జారీ చేసిన మార్గదర్శకాల అమలుపై వివరాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు మూడు వారాల గడువు ఇచ్చింది. కేసు తదుపరి విచారణను నవంబర్ 25కు వాయిదా వేసింది. టర్మినల్ ఇల్‌నెస్ (వ్యాధి)తో బాధపడుతున్న రోగులకు జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పాలియేటివ్ కేర్ విధానాన్ని వర్తింపజేయాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా బెంచ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రానికి ఈ ఆదేశాలను జారీ చేసింది. కేంద్రం మాత్రమే కాకుండా రాష్ట్రాల నుండి కూడా సమగ్ర సమాచారం సేకరించి తెలియజేయాలని కేంద్రం తరఫు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్, సీనియర్ న్యాయవాదిని ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

పాలియేటివ్ కేర్: తీవ్రమైన లేదా చివరి దశ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందించే ప్రత్యేక వైద్య సంరక్షణ విధానం.

టర్మినల్ ఇల్‌నెస్ రోగి: నయంకాని వ్యాధి లేదా వైద్య పరిస్థితితో బాధపడుతూ, చివరికి మరణానికి దారితీసే అవకాశం ఉన్న వ్యక్తి.

హిజాబ్ వివాదంతో స్కూల్‌కు సెలవు

కొచ్చి: కొచ్చిలోని పళ్లూరుత్తిలో ఒక క్రైస్తవ యాజమాన్యం నడుపుతున్న ప్రైవేట్ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని హిజాబ్ ధరించడంపై.. విద్యాసంస్థ యాజమాన్యానికి.. విద్యార్థిని తల్లిదండ్రులతో వివాదం తీవ్రమవడంతో రెండు రోజుల సెలవు ప్రకటించవలసి వచ్చింది. ఈ విద్యార్థిని తల్లిదండ్రులకు సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అనే ఇస్లామిస్ట్ (ఎస్‌డీపీఐ) అనుకూల రాజకీయ సంస్థ మద్దతు ఉందని, ఆ పార్టీ సభ్యులు ఎక్కువగా క్రైస్తవ సన్యాసినులైన విద్యాసంస్థ అధికారులతో దురుసుగా ప్రవర్తించారని పాఠశాల పీటీఏ అధికారి ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఎస్‌డీపీఐ ఇంకా స్పందించలేదు. సెయింట్ రీటాస్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ హెలెనా ఆర్‌సీ విడుదల చేసిన ఒక లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఈ వివాదం బహిర్గతమైంది. ఈ లేఖలో సోమ, మంగళవారాల్లో పాఠశాలకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. నిర్ణీత యూనిఫాం లేకుండా వచ్చిన విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు.. పాఠశాలకు సంబంధం లేని వ్యక్తుల ఒత్తిడితో మానసిక ఒత్తిడి ఎదుర్కొన్న కొంతమంది విద్యార్థులు, సిబ్బంది సెలవు కావాలని కోరారని ప్రిన్సిపాల్ లేఖలో పేర్కొన్నారు. దీంతో పేరెంట్ టీచర్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులతో సంప్రదించాక.. అక్టోబర్ 13, 14 తేదీల్లో సెలవులు ప్రకటించాలని నిర్ణయించినట్లు ఆ లేఖలో తెలిపారు. 'దేశం హామీ ఇచ్చిన స్వేచ్ఛకు, పాఠశాల యాజమాన్యాల హక్కులకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. మీ నిరంతర సహకారాన్ని ఆశిస్తున్నాం'.. అని అందులో పేర్కొన్నారు.

భయాందోళనలు సృష్టించారు.

పీటీఏ సభ్యుడు జోషి కైతవలప్పిల్ పీటీఐతో మాట్లాడుతూ, పాఠశాల 30 సంవత్సరాలుగా ఒకే విధమైన డ్రెస్ కోడ్‌ను అనుసరిస్తోందని, అన్ని వర్గాల విద్యార్థులు దీనిని పాటించారని స్పష్టం చేశారు. 'అయితే, ఒక విద్యార్థిని తల్లిదండ్రులు ఆమె తలపై దుపట్టా కప్పుకుని పంపుతామని పట్టుబట్టారు. ఇటీవల, వారు ఒక గుంపుతో పాఠశాలకు వచ్చి రచ్చ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులలో భయాందోళనలు సృష్టించారు. అందుకే రెండు రోజుల సెలవు ప్రకటించాలని నిర్ణయించుకున్నాం'.. అని వివరించారు.

సిస్టర్స్‌తో అనుచిత ప్రవర్తన

పాఠశాల యాజమాన్యం పోలీసు రక్షణ కోసం కేరళ హైకోర్టును ఆశ్రయించి, అనుకూల ఉత్తర్వులు పొందిందని కైతవలప్పిల్ తెలిపారు. 'పాఠశాలకు వచ్చిన వ్యక్తులు తాము ఎస్‌డీపీఐకి చెందినవారిమని చెప్పుకున్నారు, సిస్టర్స్‌తో సరిగ్గా ప్రవర్తించలేదు'.. అని ఆయన ఆరోపించారు. కాగా, విద్యార్థిని తండ్రి మీడియాతో మాట్లాడుతూ.. తన కుమార్తె ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాలలో చేరిందని చెప్పారు. 'ఆమె తలపై దుపట్టా ధరించడం వల్ల సమానత్వం దెబ్బ తింటుందని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. ఇంతకుముందు, ఆమెను తరగతి గదిలో దుపట్టా తీసివేయమని అడిగేవారు. కానీ ఇప్పుడు వారు పాఠశాల గేటు వద్ద కూడా అభ్యంతరం చెప్పడం ప్రారంభించారు'.. అన్నారు. దీనిపై జిల్లా విద్యాధికారికి, సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. 'తలపై దుపట్టా కప్పుకోవడానికి అనుమతించకపోతే మా కుమార్తెను మరో పాఠశాలలో చేర్పుతాం.'అని స్పష్టం చేశారు.

యుద్ధం ఆపకుంటే ఉక్రెయిన్‌కు తొమహాక్‌లు ఇస్తాం

- రష్యాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఉక్రెయిన్‌కు ఈ ఆయుధాలు అందాలని రష్యా కోరుకోదని వ్యాఖ్య

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో సుదీర్ఘకాలంగా చేస్తున్న యుద్ధాన్ని రష్యా వెంటనే ఆపకుంటే తాము ఉక్రెయిన్‌కు అత్యంత శక్తిమంతమైన దీర్ఘశ్రేణి క్షిపణులైన తొమహాక్‌లు అందిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఇజ్రాయెల్‌కు వెళ్తూ తన విమానం ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. 'ఈ యుద్ధానికి ముగింపు పలకకుంటే నేను వారికి (ఉక్రెయిన్) తొమహాక్‌లు అందజేస్తాను. తొమహాక్‌లు చాలా ప్రత్యేకమైనవి, శక్తిమంతమైనవి, ప్రభావవంతమైనవి. నిజంగా చెప్తున్నా ఉక్రెయిన్ చేతికి ఇలాంటి ఆయుధాలు అందటం రష్యాకు అస్సలు మంచిది కాదు. ఉక్రెయిన్‌కు తొమహాక్‌లు ఇచ్చే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. కానీ, యుద్ధాన్ని ముగించేందుకు అదే సరైన పని. ఇలాంటి పరిస్థితి రావాలని రష్యా కోరుకోదనే అనుకుంటున్నా. ఈ అంశంపై నేను రష్యాతోనూ మాట్లాడే అవకాశాలు లేకపోలేదు'అని ట్రంప్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ సందర్భంగా ఉక్రెయిన్‌కు తొమహాక్ క్షిపణులు అందజేసేందుకు సిద్ధమని చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. ఉక్రెయిన్‌పై కీలకమైన ఆయుధాలు వాడకుండా రష్యాపై కూడా తాను ఒత్తిడి తీసుకురాగలనని పేర్కొన్నారు. కాగా, ఉక్రెయిన్‌కు తొమహాక్ క్షిపణులు అందిస్తే రష్యా– అమెరికా మధ్య సంబంధాలు దారుణంగా దెబ్బతింటాయని పుతిన్ ఇటీవలే హెచ్చరించారు.

ఏమిటి తొమహాక్‌ల ప్రత్యేకత?

తొమహాక్ క్షిపణుల పూర్తిపేరు బీజీఎం–109 తొమహాక్ లాండ్ అటాక్ మిస్సైల్స్ (టీఎల్ఏఎం). ఇవి ఎలాంటి వాతావరణంలో అయినా లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేయగలవు. జెట్ ఇంజన్ శక్తిగత ఈ సబ్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ప్రస్తుతం అమెరికా నేవీ, రాయల్ ఆస్ట్రేలియన్ నేవీలు వాడుతున్నాయి. వీటిని యుద్ధనౌకలు, సబ్‌మెరైన్ల ద్వారా ప్రయోగిస్తారు. జాన్‌హాప్‌కిన్స్ యూనివర్సిటీలోని అప్లయిడ్ ఫిజిక్స్ లేబొరేటరీ వీటిని అభివృద్ధి చేసింది. 1970 దశకంలో వీటిని జనరల్ డైనమిక్స్ మొదట ఉత్పత్తి చేసింది. ఆ తర్వాత కాలానుగుణంగా వీటిని అభివృద్ధి చేస్తూ వస్తున్నారు. వీటితో బహుళ లక్ష్యాలను ఛేదించవచ్చు. యుద్ధనౌకలతోపాటు భూమిపై ఉండే లక్ష్యాలను కూడా ధ్వంసం చేయవచ్చు. ఒక్కో క్షిపణి ఖరీదు దాదాపు రూ.18 కోట్ల వరకు ఉంటుంది. ఇందులో వివిధ రకాలున్నాయి. టీఎల్ఏఎం బ్లాక్ 2 క్షిపణి రేంజ్ 2,500 కిలోమీటర్లు. బ్లాక్ 3 రేంజ్ 1,300 కిలోమీటర్లు. సబ్‌మెరైన్స్ నుంచి ప్రయోగించే క్షిపణుల రేంజ్ వేరుగా ఉంటుంది. ఇవి శత్రు రాడార్లను ఏమార్చి దాడులు చేయగలవు.

అమెరికాలో హైవేపై కుప్పకూలిన విమానం

ఇద్దరు మృతి, రోడ్డుపై ఉన్న ఒకరికి గాయాలు

డార్ట్‌మౌత్: అమెరికాలోని మాసాచుసెట్స్ రాష్ట్రంలోని హైవేపై సోమవారం ఉదయం చిన్న విమానం కుప్పకూలింది. డార్ట్‌మౌత్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో విమానంలోని ఇద్దరు వ్యక్తులు చనిపోగా, రోడ్డుపై ఉన్న ఒకరు గాయపడ్డారు. బలమైన గాలులు, వర్షం కురుస్తున్న సమయంలో ఘటన చోటుచేసుకుంది.న్యూబెడ్‌ఫోర్డ్ ఎయిర్‌పోర్టు నుంచి ఈ విమానం టేకాఫ్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విమానం కుప్పకూలిన ప్రాంతంలో శకలాలు చెల్లాచెదురుగా పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. ప్రమాదానికి కారణాలు, బాధితుల వివరాలు తెలియాల్సి ఉంది.

బిహార్ ఎన్నికల్లో 'గో రక్షకులు'

- మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ పోటీ
- జ్యోతి పీఠం శంకరాచార్య స్వామి ప్రకటన

పట్నా: జ్యోతి పీఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకూ 'గో రక్షకులు' అభ్యర్థులుగా నిలబెడతామన్నారు. సెప్టెంబర్ 13న చేపట్టిన 'గోమాతా సంకల్ప' యాత్ర ముగింపు సందర్భంగా ఈ ప్రకటన చేశారు. ''యాత్రలో బిహార్ మూలాలు క్షుణ్ణంగా పరిశీలించాను. ఇక్కడంతా సంస్కృతి, సంప్రదాయ విలువకు కట్టుబడి ఉన్నారు. మొత్తం 38 జిల్లాల ప్రజలు 'గో రక్షణ' మద్దతునిచ్చారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఈ సమస్యను విస్మరిస్తున్నందున.., గో పరిరక్షణకు కట్టుబడిన అభ్యర్థులను పోటీకి నిలబెడుతున్నాము''అన్నారు. అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ దాఖలు ప్రారంభించారని, ఈ ప్రక్రియ పూర్తయ్యాక పేర్లను వెల్లడిస్తామన్నారు. పేర్ల గోపత్యతో వారికి ఎలాంటి రాజకీయ ఇబ్బందులు రాకుండా చూడొచ్చన్నారు. అయితే ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని, 'గో రక్షక్'అభ్యర్థులకు ప్రచారం చేయడంతో పాటు వారికి విజయానికి తన వంతుగా ధన సాయం చేస్తానన్నారు. గో సంరక్షకులు అని చెప్పుకొనే కొన్ని పార్టీలు గోవధ చేసే వారి నుంచే ముడుపులు తీసుకుంటున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు చేశారు. తాను ప్రధాని మోదీకి వ్యతిరేకం కాదని, మోదీ శ్రేయస్సు కోరుకునే వారిలో ప్రథముడని చెప్పుకొచ్చారు. ''నేను రాజకీయాలు చేయడం లేదు. ధర్మ రక్షణ బాధ్యత నిర్వర్తిస్తున్నాను. గోవులను చంపేవారు, గో మాంసం తినేవారు పాపులతో సమానం. అలాంటి రాజకీయ పార్టీలకు మద్దతు ఇవ్వకూడదు''అంటూ అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రజలకు పిలుపునిచ్చారు.

చిన్న పార్టీలకిచ్చే సీట్లపై జేడీయూ, బీజేపీ మంతనాలు

పట్నా: బిహార్ ఎన్నికల్లో ఎన్డీయేలోని మిత్రపక్షాలకు వదిలిపెట్టే సీట్లను ఖరారు చేసేందుకు బీజేపీ, జేడీయూలు సోమవారం చర్చలు జరిపాయి. 243 సీట్లున్న అసెంబ్లీలో ఈ రెండు పార్టీలు చెరో 101 చోట్ల పోటీ చేసేందుకు అంగీకారానికి రావడం తెల్సిందే. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ, రాంవిలాస్)పార్టీకి 29 సీట్లను, ఎంపీ ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా(ఆర్ఎల్ఎం), కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ ఆవామ్ మోర్చా(హెచ్ఏఎం)లకు చెరో ఆరు సీట్లివ్వాలని కూడా అంగీకారం కుదిరించింది. అయితే, ఏఏ స్థానాలను ఈ పార్టీలకు ఇవ్వాలనేది బీజేపీ, జేడీయూలు చర్చించి, నిర్ణయించాల్సి ఉంది. అయితే, ఎల్‌జేపీ కంటే తమకు తక్కువ సీట్లివ్వడంపై జితన్ రామ్ మాంఝీ అసంతృప్తితో ఉన్నారు. అయితే, ఎన్డీయే నుంచి వైదొలగడం లేదంటూ స్పష్టత ఇచ్చారు.

మహువా నుంచి తేజ్ ప్రతాప్ పోటీ

పట్నా: ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహువా స్థానం నుంచి బరిలోకి దిగనున్నారు. తేజ్ ప్రతాప్ ఇటీవల సొంతంగా ఏర్పాటు చేసుకున్న జనశక్తి జనతా దళ్(జేజేడీ) సోమవారం 21 సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. అనుష్క అనే యువతితో రిలేషన్ షిప్‌లో ఉన్నానంటూ సోషల్ మీడియాలో ప్రకటించిన తేజ్ ప్రతాప్‌ను మేలో లాలు ప్రసాద్ పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు. దీంతో, తేజ్ ప్రతాప్ కొత్త పార్టీని ఏర్పాటు చేయడం తెల్సిందే. వైశాలి జిల్లాలోని మహువా సీటుకు తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని జేజేడీ రాష్ట్ర చీఫ్ మదన్ యాదవ్ సోమవారం చెప్పారు. 2020 ఎన్నికల వరకు తేజ్ ప్రతాప్ మహువాకు ప్రాతినిధ్యం వహించారు. లాలు తొమ్మిది మంది సంతానంలో తేజస్వీ, తేజ్ ప్రతాప్ సహా నలుగురు క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు.

తమిళనాడు డ్రగ్ కంట్రోల్ అధికారుల ఇళ్లలో ఈడీ సోదాలు

సాక్షి, చెన్నై: తమిళనాడు ఔషధ నియంత్రణ అధికారులే లక్ష్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బృందాలు సోమవారం ఏడు చోట్ల సోదాలు చేపట్టాయి. మధ్యప్రదేశ్‌లో 20 మంది చిన్నారుల మరణానికి కారణమైన దగ్గుమందు తయారీ సంస్థ యజమాని రంగనాథన్ నుంచి భారీగా ముడుపులు పొందినట్లుగా వచ్చిన సమాచారంతో ఈ మేరకు తనిఖీలు జరిపినట్లు తెలిపింది. చెన్నై, శ్రీపెరంబదూరు, సుగువారి సత్రంలలోని డ్రగ్ కంట్రోలర్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీప, క్వాలిటీ కంట్రోల్ విభాగం జాయింట్ డైరెక్టర్ కార్తికేయన్ నివాసాలు, శ్రేసన్ సంస్థ యజమాని రంగనాథన్ నివాసం, ఫ్యాక్టరీ అధికారుల నివాసాల్లో గట్టి భద్రత నడుమ సోదాలు జరిగాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఉపయోగించిన దగ్గు మందు కోల్డ్రిఫ్ కాంచీపురం జిల్లా సుగువారి సత్రంలోని కంపెనీలో తయారయిందనే విషయం తెలిసిందే. ఆ కంపెనీని ప్రభుత్వం పూర్తిగా మూసివేసింది. ఔషధ తయారీ తనిఖీల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు.

జమాత్, హురియత్ నేతల ఇళ్లలో సోదాలు

శ్రీనగర్: నిషేధిత జమాత్–ఇ–ఇస్లామీ, హురియత్ కాన్ఫరెన్స్‌లకు చెందిన పలువురు వ్యక్తులు, ప్రాంతాల్లో సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసులు సోదాలు చేపట్టారు. ముస్తాక్ అహ్మద్ భట్ అలియాస్ గోగా షాహిబ్, మహ్మద్ అష్రాఫ్ సెహ్రాయి, మెహ్రాజుద్దీన్ కల్వాల్, జమీర్ అహ్మద్ షేక్ ఇళ్లలోనూ తనిఖీలు జరిగాయని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం చేపట్టిన ఈ సోదాల్లో నిషేధిత సంస్థలకు చెందిన ఫొటోలు, సాహిత్యం, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్ర నెట్‌వర్క్, వేర్పాటువాద సానుభూతిపరులు, మద్దతుదారుల వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేయడమే లక్ష్యంగా సోదాలు జరిపామన్నారు.

స్లోవేకియాలో రెండు రైళ్లు ఢీ.. డజన్ల మందికి గాయాలు

బ్రాటిస్లావా: స్లొవేకియాలో వేగంగా ప్రయాణిస్తున్న రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. రొజ్నావా పట్టణానికి సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన సమయంలో రైలులో 80 మంది వరకు ప్రయాణికులున్నట్లు చెబుతున్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మిగతా వారికి ఎటువంటి ప్రమాదం లేదని ప్రభుత్వం తెలిపింది. ఘటనలో ఒక రైలింజను తీవ్రంగా దెబ్బతినగా మరో రైలు పట్టాలు తప్పింది. మానవ తప్పిదమే కారణమని భావిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారని వెల్లడించింది.

దక్షిణాఫ్రికాలో బస్సు ప్రమాదం.. 42 మంది మృతి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ఉత్తరాన కొండప్రాంతంలో బస్సు బోల్తా పడిన ఘటనలో కనీసం 42 మంది ప్రాణాలు కోల్పోయారు. లింపోపో ప్రావిన్స్‌లోని ఎన్1 జాతీయ రహదారిపై ఆదివారం ఈ ఘోరం చోటుచేసుకుంది. కొండ ప్రాంతం గుండా వెళ్తున్న బస్సు అదుపుతప్పి దిగువకు దూసుకుపోయి బోల్తా పడింది. క్షతగాత్రుల సంఖ్య తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈస్టర్న్ కేప్ ప్రావిన్స్ నుంచి వస్తున్న ఈ బస్సులో అత్యధికులు సొంతూళ్లకు వెళ్తున్న జింబాబ్వే, మలావీ దేశస్థులని పేర్కొన్నారు. క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో మొత్తం ఐదుగురి అరెస్ట్

కోల్‌కతా/భువనేశ్వర్: పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్ పట్టణంలో వైద్య విద్యార్థిని సామూహిక అత్యాచారం ఘటనలో మరో ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్‌చేశారు. దీంతో మొత్తం ఐదుగురి అరెస్ట్ పూర్తయింది. మరోవైపు కేసు దర్యాప్తు సజావుగా సాగట్లేదంటూ విపక్షాల నుంచి వస్తున్న ఆరోపణలకు బాధితురాలి తండ్రి వంతపాడారు. ''సమగ్రస్థాయిలో దర్యాప్తు జరగట్లేదు. బెంగాల్‌లో శాంతిభద్రతలపై నాకు నమ్మకం పోయింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం మహిళే కదా. అలాంటప్పుడు ఎలా అంత నిర్దయగా మాట్లాడుతుంది? మహిళలు చదువులు, ఉద్యోగాలు మానేసి ఇంట్లో కూర్చోవాలా? ఈమె వైఖరి చూస్తుంటే బెంగాల్ ఔరంగజేబు తరహా అధ్వాన్న పరిపాలనలో ఉన్నట్లు కనిపిస్తోంది. స్వరాష్ట్రం ఒడిశాకు నా కుమార్తెను తీసుకెళ్తా. ఆమె జీవితాన్ని కాపాడటమే మాకు ముఖ్యం.ఆ తర్వాతే ఆమె కెరీర్''అని బాధితురాలి తండ్రి అన్నారు.

తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

తొలి మధ్యయుగం

తొలి మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఉత్తర భారతదేశాన్ని 36 రాజపుత్ర వంశాలు పాలించాయి. వీటిలో ప్రతీహారులు, పరమారులు, చౌహాన్‌లు, సోలంకీలతోపాటు మరికొన్ని రాజ వంశాలు కూడా ప్రఖ్యాతి చెందాయి. ఈ రాజవంశాలు తమ పాలన ద్వారా ఉత్తర భారత సంస్కృతికి, వాస్తుశిల్ప కళలకు అమూల్య సేవలందించాయి.

చాందేలులు

వీరు ఘూర్జర ప్రతీహారుల తర్వాత జేజకభుక్తి (బుందేల్‌ఖండ్) ప్రాంతాన్ని పాలించారు. వీరు శాసనాల్లో తమను చంద్రవంశ క్షత్రీయులుగా పేర్కొన్నారు. వీరి రాజధాని ఖజురహో. క్రీ.శ. 9 నుంచి 14వ శతాబ్దం వరకు పాలించారు. వీరి కాలంలో దాదాపు 80 ఆలయాలను నిర్మించారు. వాటిలో 30కి పైగా ఆలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

నన్నుక: చాందేల వంశాన్ని స్థాపించినవాడు. చాందేలుల వంశంలో తొలిరాజుగా నన్నుకను పేర్కొంటారు.

వాక్పతి: నన్నుక అనంతరం రాజ్యానికి వచ్చిన వాడు వాక్పతి. తన సమకాలీన పాల వంశ రాజు దేవపాలుడితో, ప్రతీహార రాజు భోజుడితో ఇతడు పలు యుద్ధాలు చేశాడు.

జయశక్తి: వాక్పతి కుమారుడు జయశక్తి. ఇతడు తన తండ్రి అనంతరం రాజ్యానికి వచ్చాడు. ఇతడి పేరు మీదుగానే ఈ రాజ్యాన్ని జేజకభుక్తి రాజ్యం అని పిలిచేవారు.

యశోవర్మన్: జయశక్తి అనంతరం విజయశక్తి, రాహిలుడు అనే రాజుల తర్వాత యశోవర్మన్ రాజ్యానికి వచ్చాడు. తన దండయాత్రల ద్వారా అనేక ప్రాంతాలను జయించి చాందేలులను ఒక గొప్పశక్తి రూపొందించాడు. తన రాజధాని ఖజురహోలో ఇతడు చతుర్భుజ స్వామి అనే విష్ణు ఆలయాన్ని నిర్మించాడు. దీన్నే లక్ష్మణ ఆలయం అని కూడా పిలుస్తారు.

ధంగ: ఇతడు 50 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ కాలంపాటు చాందేల రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలనలో చాందేలులు తిరుగులేని శక్తిగా ఎదిగారు. ఇతడి రాజ్యం విదిష నుంచి గ్వాలియర్ వరకు, వారణాసి నుంచి నర్మద వరకు విస్తరించింది. ధంగ హయాం వాస్తుకళలకు పేరొందింది. రాజధాని ఖజురహోలో ఇతడు విశ్వనాథ, పార్శ్వనాథ ఆలయాలను నిర్మించాడు. ఇతడి కాలంలో పంజాబ్‌పై గజనీరాజు సబక్తజిన్ దాడి చేశాడు. ఈ దాడి నుంచి హిందూ షాహీరాజు జయపాలుడిని రక్షించేందుకు ధంగ కొన్ని రాజ్యాల కూటమిని ఏర్పరిచి ఈ దాడిని ఎదుర్కొన్నాడు.



గండ: తన తండ్రిలాగే ఇతడు కూడా విదేశీ దండయాత్రలను ఎదుర్కొనేందుకు పంజాబ్ షాహీ రాజుల కూటముల్లో చేరాడు. ఇతడి కాలంలో క్రీ.శ. 1008లో మహ్మద్ గజనీ పంజాబ్‌పై దాడి చేశాడు. ఖజురహోలో గండ రెండు దేవాలయాలను నిర్మించాడు. అవి - దేవి జగదాంబి ఆలయం (వైష్ణవాలయం), చిత్రగుప్త ఆలయం (సూర్య దేవాలయం).

విద్యాధర: ఇతడు తన సమకాలీనులైన కాలచూరి రాజులను, పరమార రాజులను ఓడించి రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఇతడి పాలనా కాలంలో మహ్మద్ గజనీ క్రీ.శ. 1019, 1022లో రెండుసార్లు చాందేల రాజ్యంపై దాడి చేశాడు. ఖజురహోలోని దేవాలయాలన్నింటిలోకి తలమానికమైన కందరియ మహాదేవ ఆలయాన్ని విద్యాధరుడే నిర్మించాడు.

మదనవర్మన్: విద్యాధరుడి అనంతరం విజయపాల, దేవవర్మన్, కీర్తివర్మన్ మొదలైన బలహీన రాజుల పాలన అనంతరం మదనవర్మన్ రాజ్యానికొచ్చాడు. ఇతడు త్రిపురి పాలకులైన కాలచూరి రాజులను, పరమార రాజులను, గహద్వాలులను ఓడించాడు. కానీ ఇతడు మూడో పృథ్వీరాజు చౌహాన్ చేతిలో ఓడిపోయాడు.

పరమార్థి దేవ: ఇతడి కాలంలో కుతుబుద్దీన్ ఐబక్ వీరి రాజ్యంపై దాడి చేసి మహోబా, కళింజర్ మొదలైన ప్రాంతాలను ఆక్రమించా డు. పరమార్థి దేవ అనంతరం త్రిలోక్య వర్మన్, వీరవర్మన్ అనే రాజులు పాలించారు. కానీ క్రీ.శ. 1309లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కల్యాణీ చాళుక్య రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

గహద్వాలులు

వీరు తాము సూర్య చంద్ర వంశాలకు చెందిన వారమని, యయాతి వారసులమని పేర్కొ న్నారు. కానీ వీరిని రాష్ట్రకూటుల శాఖకు చెంది నవారిగా చరిత్రకారులు భావించారు.

యశో విగ్రహ: ఇతడు గహద్వాల వంశస్థాపకుడు.

చంద్రదేవ: ఇతడిని స్వతంత్ర గహద్వాల రాజ్య స్థాపకుడిగా భావిస్తారు. ఇతడు పలు ప్రాంతాలను ఆక్రమించి బనారస్‌ను తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. ముస్లింల దాడులను ఎదుర్కొనేందుకు తన ప్రజల నుంచి తురుష్క దండన అనే పన్ను విధించాడు.

గోవిందచంద్ర: చంద్రదేవ అనంతరం కొద్దికాలం మదనపాలుడు పాలించాడు. తర్వాత అతడి కుమారుడు గోవిందచంద్ర రాజ్యానికొచ్చాడు. ఇతడిని ఈ వంశంలో అందరికంటే గొప్పవాడిగా పరిగణిస్తారు. ఇతడు పాల, బేధి, చాందేల రాజులను ఓడించాడు. గజనీరాజు మూడో మసూద్‌షా సైనికుల దాడిని తిప్పికొట్టాడు. కాశ్మీర్ రాజు జయసింహుడితో, గుజరాత్ పాలకుడు సిద్ధరాజుతో స్నేహ సంబంధాలను కలిగి ఉన్నాడు. ఇతడి ఆస్థానంలోనే లక్ష్మీధరుడు (యుద్ధమంత్రి) కృత్యకల్పతరు/ కల్పద్రుయ అనే గ్రంథాన్ని రచించాడు.

ఇతడి ఆస్థానంలోని మరో కవి దామోదరశర్మ ఉక్తి-వ్యక్తి-ప్రకరణం అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. గోవిందచంద్ర రాణి కుమారదేవి సారనాథ్‌లో బౌద్ధ విహారాన్ని నిర్మించింది.

విజయచంద్ర: తన తండ్రిలాగే ఇతడు కూడా వాయవ్యం నుంచి జరిగే విదేశీ దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. విజయచంద్రుడి విజయాల గురించి విజయప్రశస్తి అనే గ్రంథాన్ని శ్రీహర్షుడు రచించాడు.

జయచంద్రుడు: పృథ్వీరాజరాసో గ్రంథం లో ఇతడి కుమార్తె రాణి సంయుక్తకు, మూడో పృథ్వీరాజ్‌కు మధ్య గల ప్రేమాయణం గురించి వివరించారు. పృథ్వీరాజ్‌తో ఇతడికి బద్ధ వైరముంది. ఇతడి కాలంలోనే ఘోరీ మహ్మద్... చౌహాన్ రాజ్యాన్ని అంతం చేశాడు. చివరికి 1193-94లో ఘోరీ... కనౌజ్‌పై దాడి చేసి జయచంద్రుడిని వధించి గహద్వాల రాజ్యాన్ని ఆక్రమించాడు. కానీ జయచంద్రుడి కుమారుడు హరిశ్చంద్రుడిని తన సామంతుడిగా చేసుకొని గహద్వాల రాజ్యాన్ని తిరిగి అప్పగించాడు.

జయచంద్రుడి ఆస్థానంలోని ప్రముఖ సంస్కృత కవి శ్రీహర్షుడు. ఇతడు నైషధ చరితం, ఖండన ఖండ ఖాద్య అనే గ్రంథాలను రచించాడు. చివరికి ఇల్‌టుట్‌మిష్ కాలంలో ఈ రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో విలీనమైంది.

పాలవంశం

తొలి మధ్య యుగంలో తూర్పు భారతదేశాన్ని పాలించిన వంశాల్లో పాలవంశం ప్రముఖ మైంది. తొలుత పాటలీపుత్రం, తర్వాత మాంఘీర్ రాజధానులుగా పాలరాజులు బెంగాల్, బీహార్, ఒరిస్సా మొదలైన ప్రాంతా లను క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకు పాలించారు. భారతదేశంలో బౌద్ధ మతా న్ని ఆదరించిన చివరి రాజవంశంగా పాలవంశాన్ని పేర్కొనవచ్చు. వీరు వజ్రయాన మతాన్ని గొప్పగా ఆదరించారు. వీరి కాలంలోనే ఈ మతం టిబెట్‌కు కూడా వ్యాప్తి చెందింది.

గోపాల: గౌడ శశాంకుడి తదనంతరం బెంగాల్‌లో మత్స్యన్యాయం రాజ్యమేలింది. దాదాపు 100 సంవత్సరాలు సాగిన ఈ రాజకీయ అనిశ్చితిని అంతం చేసి గోపాల క్రీ.శ.750లో పాలరాజ్యాన్ని స్థాపించాడు. ఇతడిని ప్రజలే తమ రాజుగా ఎన్నుకున్నారు. గోపాలుడు తన రాజ్యంలో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాడు. బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఓదంతపురి విహారాన్ని నిర్మించాడు.

ధర్మపాల: కనౌజ్ కోసం జరిగిన త్రిరాజ్య యుద్ధాల్లో పాల్గొన్న మొదటి పాలరాజు ధర్మపాల. కనౌజ్ ఆక్రమణ కోసం ప్రతీహారులతో, రాష్ట్రకూటులతో ఇతడు యుద్ధాలు చేశాడు. ప్రతీహార సామంతుడు ఇంద్రాయుధుడిని ఓడించి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ ప్రతీహార రెండో నాగభటుడు ఇతడిని మాంఘీర్ యుద్ధంలో ఓడించాడు. ధర్మపాలుడు కూడా గొప్ప బౌద్ధ మతాభిమాని. ఇతడు విక్రమపుర, సోమపుర బౌద్ధ విశ్వవిద్యాలయాలను స్థాపించాడు. అంతేకాకుండా గుప్తుల కాలంలో స్థాపించిన నలంద విశ్వవిద్యాలయాన్ని పునరుద్ధరించి దాని నిర్వహణకు రెండు వందల గ్రామాలను దానంగా ఇచ్చాడు. బౌద్ధ బిక్షువుల కోసం దాదాపు 50 మత సంస్థలను స్థాపించాడు. ఇతడి ఆస్థానంలో హరిభద్రుడు అనే గొప్ప బౌద్ధ పండితుడు ఉండేవాడు.

మాదిరి ప్రశ్నలు

1. ఖజురహో దేవాలయాల గురించి తొలిసారిగా ప్రస్తావించిన విదేశీ చరిత్రకారుడు/ రచయిత?
   1) సులేమాన్, అల్‌మసూదీ
   2) అల్‌బెరూనీ, ఇబ్న్‌బతూతా
   3) అబ్దుల్ రజాక్, అబ్దుల్ రహీం
   4) వి.ఎ. స్మిత్, రాబర్ట్ సీవెల్
2. పంజాబ్ హిందూషాహీరాజు ఆనంద పాలుడి కూటమిలో చేరి మహ్మద్ గజనీ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) ధంగ 2) గండ
   3) జయపాల 4) యశోవర్మన్
3. ఖజురహోలోని కందరీయ మహాదేవ ఆలయ నిర్మాత?
   1) విద్యాధర 2) గండ
   3) ధంగ 4) నన్నుక
4. కుతుబుద్దీన్ ఐబక్ దాడిని ఎదుర్కొన్న చాందేల రాజు?
   1) త్రిలోక్య వర్మన్ 2) మదన వర్మన్
   3) పరమార్థి దేవ 4) వీరవర్మన్
5. ఖజురహో దేవాలయాలను ఏ వాస్తు శిల్పకళాశైలికి పరాకాష్ఠగా భావిస్తారు?
   1) ద్రావిడ 2) నగర
   3) వెస్సార 4) ఇండో-పర్షియన్
6. తొలిసారిగా హిందీలో శాసనాలను జారీ చేసినవారు?
   1) చౌహాన్‌లు 2) చాందేలులు
   3) గహద్వాలులు 4) ప్రతీహారులు
7. కామసూత్ర శిల్పాలతో దేవాలయాలను నిర్మించినవారు?
   1) చాందేలులు 2) చోళులు
   3) పరమారులు 4) పాలరాజులు
8. కనౌజ్ రాజధానిగా పాలించిన రాజ వంశాలు?
   1) మౌఖరీలు
   2) మౌఖరీలు, ప్రతీహారులు
   3) మౌఖరీలు, ప్రతీహారులు, గహద్వాలులు
   4) ఎవరూ కాదు
9. తురుష్క దండన అనే పన్నును విధించిన రాజు?
   1) మూడో పృథ్వీరాజ్ చౌహాన్
   2) గహద్వాల జయచంద్ర
   3) చంద్రదేవ 4) ఆనంద పాలుడు
10. లక్ష్మీధరుడు కృత్యకల్పతరు గ్రంథాన్ని ఎవరి ఆస్థానంలో రచించాడు.
    1) సిద్ధరాజ జయసింహ
    2) గోవింద చంద్ర
    3) పృథ్వీరాజ 4) జయచంద్ర
11. బంగారు నాణేలను జారీ చేసిన ఏకైక గహద్వాల రాజు?
    1) గోవిందచంద్ర 2) జయచంద్ర
    3) విజయచంద్ర
    4) యశోవిగ్రహ
12. నైషధ చరితం గ్రంథకర్త?
    1) శ్రీహర్షుడు 2) శ్రీనాథుడు
    3) లక్ష్మీధరుడు 4) జయచంద్రుడు
13. మహ్మద్‌ఘోరీ ఏ యుద్ధంలో గహద్వాలులను అంతం చేశాడు?
    1) మొదటి తరైన్
    2) రెండో తరైన్
    3) బనారస్ యుద్ధం
    4) చాందావార్ యుద్ధం
14. కల్హణుడు ఏ కాశ్మీర్ రాజుకు సమకాలీనుడు?
    1) హర్ష 2) క్షేమగుప్త
    3) అవంతీవర్మన్
    4) లలితాదిత్య ముక్తాపీడ
15. దిలికపుర (ఢిల్లీ) నగరాన్ని నిర్మించిన రాజవంశం?
    1) చౌహాన్‌లు 2) ప్రతీహారులు
    3) గహద్వాలులు 4) తోమారులు

సమాధానాలు:

1) 2; 2) 2; 3) 1; 4) 3; 5) 2; 6) 2; 7) 1; 8) 3; 9) 3; 10) 2; 11)1; 12) 1; 13) 4; 14) 1; 15) 4.

పక్షుల్లో ఎన్ని గదుల గుండె ఉంటుంది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జీవశాస్త్ర పరిచయం

జీవశాస్త్రం (బయాలజీ) అనే పదం బయోస్ (జీవం), లాగస్ (అధ్యయనం) అనే గ్రీకు పదాల నుంచి ఉద్భవించింది. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322) అనేక జీవశాస్త్ర ప్రాథమిక భావనలు ఇచ్చారు. అందువల్ల ఆయనను 'జీవశాస్త్ర పితామహుడు' అంటారు.

★ జీవశాస్త్రంలో రెండు విభాగాలుంటాయి. 1. జంతు శాస్త్రం (జువాలజీ - జోవన్ అంటే జంతువు, లాగోస్ అంటే అధ్యయనం)
2. వృక్షశాస్త్రం (బోటనీ - బొటానె అనే మాటకు మొక్క అని అర్థం)

★ మొక్కలు స్వయం పోషకాలు. అంటే తమ ఆహారాన్ని తామే తయారుచేసుకుంటాయి. కిరణజన్య సంయోగక్రియలో సూర్యరశ్మి సమక్షంలో కార్బన్ డై ఆక్సైడ్, నీరు కలవడం వల్ల పిండిపదార్థం లేదా కార్బో హైడ్రేట్ ఏర్పడుతుంది. ఈ చర్యకు అవసరమైన క్లోరోఫిల్ (పత్రహరితం) మొక్కల్లో ఉంటుంది. శిలీంద్రాల్లో పత్రహరితం ఉండదు. అవి సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ జంతువులు ఆహారం కోసం ఇతర జీవులపై ఆధారపడతాయి. అందువల్ల వీటిని పరపోషకాలు (Heterotrophs) అంటారు.

★ కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడే జీవులు 'పూతికాహారులు (Saprophytes)' ఇవి కళేబరాలపై ఆధారపడి జీవిస్తాయి.

★ ఆహారం లేదా ఆవాసం లేదా రెండింటి కోసం ఇతర జీవుల శరీరాన్ని అంటిపెట్టుకునే జీవులను 'పరాన్నజీవులు' అంటారు. అతిథేయి శరీరం బయటకు అంటి పెట్టుకునేవి బాహ్య పరాన్నజీవులు ఉదా: జలగ.
అతిథేయి లోపలి భాగాల్లో నివసించేవి అంతర పరాన్న జీవులు
ఉదా: ఆస్కారిస్ (ఏలికపాము)

★ సహజీవనంలో రెండు రకాల జీవులు పరస్పర సహకారం అందించుకుంటాయి.

పోషణ

★ జీవుల ప్రధాన లక్షణం జీవనక్రియలు జరుపుకోవడం. ఈ క్రియల్లో జీర్ణక్రియ ఒకటి. శక్తి కోసం జీర్ణక్రియ అవసరం.

★ ఏకకణ జీవులైన ప్రాథమిక జీవుల్లో జీర్ణవ్యవస్థ ప్రత్యేకంగా అభివృద్ధి చెంది ఉండదు.

★ ఏకకణ జీవుల్లో కణాంతర జీర్ణక్రియ ఉంటుంది.

కణం: జీవి ప్రాథమిక ప్రమాణం కణం. దీన్ని రాబర్ట్ హుక్ గుర్తించాడు.

కణజాలం: ఒకే విధమైన నిర్మాణం కల్గి, ఒకే పనిని నిర్వర్తించే కణాల సమూహాన్ని కణజాలం అంటారు. భిన్న కణజాలాలు కలిసి అవయవం ఏర్పడుతుంది.

* ఎగిరే పక్షుల శరీరం పడవ ఆకారంలో ఉంటుంది.
  వీటి ఎముకలు గుల్లగా ఉంటాయి. వీటిలో వాయుసంచులు ఉంటాయి.
* బయాలజీ అనే పదాన్ని కనుగొన్నది 'లామార్క్'.
* సరీసృపాల్లోని గుండె గదుల సంఖ్య 'మూడు'.
  కానీ మొసలిలో నాలుగు గదుల గుండె ఉంటుంది.



వ్యవస్థ: భిన్న అవయవాలు కలిసి ఒకే పనిని నిర్వర్తిస్తే దాన్ని 'అవయవ వ్యవస్థ' అంటారు.

జీవి శరీరంలో జీర్ణ, శ్వాస, విసర్జన, ప్రత్యుత్పత్తి, నాడీ, రక్తప్రసరణ, అంతస్రావ వ్యవస్థలుంటాయి. జంతువులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1. వెన్నెముక లేని జీవులు. 2. వెన్నెముక ఉన్న జీవులు

వెన్నెముక లేని జీవులను 9 వర్గాలుగా విభజించారు.

★ **ప్రోటోజోవా:** ప్రోటో అంటే ప్రాథమిక, జోవన్ అంటే జంతువులు అని అర్థం.

★ **పొరిఫెరా:** పొరి అంటే పోరస్ (రంధ్రాలు ఉన్న), ఫెరిన్ అంటే కల్గి ఉండేవి అని అర్థం. రంధ్రాలు కల్గిన జీవులు.
ఉదా: స్పంజికలు

★ **సీలెంటరేటా:** ఆయికులాస్ ఎంటిరాన్ పదాల కలయికతో సీలెంటరేటా వచ్చింది. ఆయికులాస్ అంటే గొట్టం, ఎంటిరాన్ ఆహారనాళం అని అర్థం. వీటిలో గొట్టం లాంటి ఆహారనాళం ఉంటుంది. ఇవి ద్విస్తరిత (డిప్లోబ్లాస్టిక్) జీవులు. ఉదా: హైడ్రా.

★ **ప్లాటీ హెల్మింథిస్:** ప్లాట్ అంటే బల్లపరుపు, హెల్మింథ్స్ అంటే పురుగులు అని అర్థం. ఇవి బల్లపరుపు శరీర నిర్మాణం కల్గిన జీవులు. ఇవి పరాన్నజీవులు.
ఉదా: టీనియా సోలియం(బద్దెపురుగులు)

★ **నిమాటి హెల్మింథిస్:** ఇవి గుండ్రటి పురుగులు. ఎక్కువగా పరాన్నజీవులు.
ఉదా: ఏలిక పాము (ఆస్కారిస్)

★ **అనెలిడా:** అక్యులస్ అంటే వలయాకార ఖండితాలు అని అర్థం. ఈ జీవుల్లో ఇలాంటి అవయవ వ్యవస్థలుంటాయి. సీలోం (శరీర కుహరం) ఉంటుంది.
ఉదా: వానపాము, జలగ.

★ **ఆర్థ్రోపొడా:** ఆర్థ్రాస్ అంటే కీళ్లు కలిగిన పోడియం - కాళ్లు. కీళ్లు కల్గిన (ఖండితాలున్న) కాళ్లు ఉండటం వీటి లక్షణం. బాహ్య అస్థిపంజరం కల్గిన కీట కాలుంటాయి.
ఉదా: బొద్దింక, ఈగ, దోమ.

★ **మొలస్కా:** మెత్తని శరీరం కల్గినది అని అర్థం. దీంట్లో కర్పరాలుంటాయి.
ఉదా: ఆల్చిప్ప, నత్త.

★ **ఇఖైనోడెర్మేటా:** ఇఖినస్ అంటే ముళ్లు, డర్మా అంటే చర్మం. చర్మంపై ముళ్లు కల్గిన జీవులు అని అర్థం. ఉదా: సముద్ర నక్షత్రం.

వెన్నెముక ఉన్న జీవులు

వీటిని నాలుగా రకాలుగా విభజించారు.

★ **చేపలు:** జలచరాలు. శీతల రక్త జీవులు (పరిసర ఉష్ణోగ్రత మారినప్పుడు రక్తం ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది). వీటిలో రెండుగదుల గుండె ఉంటుంది. ఇవి చాలా వరకు అండోత్పాదకాలు.

★ **ఆంఫిబియా (ఉభయచరాలు):** నేలపైనా, నీటిలోనూ నివసిస్తాయి. ఇవి కూడా శీతల రక్తజీవులు. 3 గదుల గుండె ఉంటుంది. ఇవి అండోత్పాదకాలు.

★ **సరీసృపాలు:** ఇవి నేలపై పాకే జీవులు. శీతల రక్తజీవులు. 3 గదుల గుండె (2 కర్ణికలు, అసంపూర్తిగా విభజితమైన జఠరిక) ఉంటుంది. ఇవి అండోత్పదకాలు.
ఉదా: పాము, బల్లి, మొసలి.

★ **పక్షులు:** ఉష్ణరక్త జీవులు. అంటే రక్తం ఉష్ణోగ్రత పరిసర ఉష్ణోగ్రతలో మారకుండా స్థిరంగా ఉంటుంది. 4 గదుల గుండె ఉంటుంది. ఇవి ఈకలు కల్గిన జీవులు, అండోత్పదకాలు.

★ **క్షీరదాలు:** పాలిచ్చే శిశుత్పాదకాలు. నాలుగు గదుల గుండె ఉంటుంది. ఉష్ణరక్త జంతువులు.
ఉదా: ఆవు, మేక, కుక్క, మానవుడు.

మాదిరి ప్రశ్నలు

1. బయాలజీ అనే పదానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
   1) గ్రీకు - అరిస్టాటిల్
   2) గ్రీకు - లామార్క్
   3) ఫ్రెంచ్ - లామార్క్
   4) ఏదీకాదు
2. 'జీవశాస్త్ర పితామహుడు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) లామార్క్ 2) థియోఫ్రాస్టస్
   3) అరిస్టాటిల్ 4) ప్లేటో
3. బొటానె అనే మాటకు అర్థం?
   1) విత్తనం 2) వేరు
   3) మొక్క 4) ఫలం
4. కిందివాటిలో ఏ గ్రీకు పదానికి జంతువు అనే అర్థం ఉంది?
   1) బొటానె 2) జోవన్
   3) లాగస్ 4) బయోస్
5. బయోస్, లాగస్ అనే పదాల నుంచి బయా లజీ ఉద్భవించింది. కిందివాటిలో వీటి అర్థాలు వరుసగా..
   1) అధ్యయనం, మొక్కలు
   2) జంతువులు, శాస్త్రం
   3) మొక్కలు, జంతువులు
   4) జీవం, అధ్యయనం
6. మొక్కలు, జంతువుల పోషణకు సంబంధించి కిందివాటిలో సరైన ప్రవచనం?
   1) మొక్కలు పరాన్నజీవులు, జంతువులు పరపోషకాలు
   2) జంతువులు పరపోషకాలు, మొక్కలు స్వయం పోషకాలు
   3) మొక్కలు పూతికాహారులు, జంతు వులు పరాన్నజీవులు
   4) జంతువులు పరపోషకాలు, మొక్కలు పర పోషకాలు
7. జలగ ఏ రకానికి చెందిన జీవి?
   1) పూతికాహార జీవి
   2) అంతర పరాన్న జీవి
   3) స్వయంపోషకం
   4) బాహ్య పరాన్న జీవి
8. ఏ రకమైన జీవులు కుళ్లుతున్న సేంద్రియ పదార్థాలపై ఆధారపడి జీవిస్తాయి?
   1) పరాన్నజీవులు 2) పూతికాహారులు
   3) సహభోజకులు 4) పరపోషకాలు
9. ప్రొటోజోవా వర్గానికి చెందిన ఏకకణ జీవుల్లో ఈ రకానికి చెందిన జీర్ణక్రియ జరుగుతుంది?
   1) కణబాహ్య జీర్ణక్రియ
   2) అసంపూర్ణ జీర్ణక్రియ
   3) కణాంతర జీర్ణక్రియ
   4) ఎక్స్ట్రా కార్పోరియర్ జీర్ణక్రియ
10. ఏలికపాము, బద్దెపురుగు, స్పంజికలు వరుసగా ఏ వర్గాలకు చెందుతాయి?
    1) ప్లాటిహెల్మింథిస్, నిమాటి హెల్మింథిస్, పొరిఫెరా
    2) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మింథిస్, మొలస్కా
    3) ప్లాటిహెల్మింథిస్, ఇఖైనోడెర్మేటా, ప్రోటోజోవా
    4) నిమాటి హెల్మింథిస్, ప్లాటిహెల్మిం థిస్, పొరిఫెరా
11. ఆల్చిప్ప ఏ వర్గానికి సరైన ఉదాహరణ?
    1) మొలస్కా 2) ఇఖైనోడెర్మేటా
    3) పొరిఫెరా 4) అనెలిడా
12. ఇఖైనోడెర్మేటా జీవుల ప్రధాన లక్షణం?
    1) రంధ్రాలు కల్గి ఉండటం
    2) శరీరత్వచం రెండు పొరలతో ఉండటం
    3) శరీరంపై ముళ్లు ఉండటం
    4) ఖండితాలు కల్గిన కాళ్లు ఉండటం
13. కిందివాటిలో సరైన ప్రవచనం ఏది?
    1) అమీబా బహుకణ జీవి
    2) హైడ్రా ద్విస్తరిత జీవి
    3) బొద్దింక అనెలిడా వర్గానికి చెందింది
    4) బద్దెపురుగు పరాన్నజీవి కాదు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 4; 11) 1; 12) 3; 13) 2.

'రామదాసు'గా బిరుదు పొందిన వ్యక్తి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఏపీ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు



1. హాలుడు రచించిన గాథాసప్తశతిలో కృష్ణుడు గురించి ఏమని పేర్కొన్నారు?
   1) సుందరుడు 2) మోహనాంగుడు
   3) మధుమథనుడు 4) రతివల్లభుడు
2. శాతవాహన యుగంలో 'శ్రేణి ధర్మం' అంటే?
   1) యుద్ధ సమయంలో కాల్బలం పాటించవలసిన నియమాలు
   2) శాతవాహన రాజు రాజ్యపాలనలో పాటించవలసిన నియమాలు
   3) నికాయసేణు సభ్యులు పాటించవలసిన నియమాలు
   4) శాతవాహన రాణి కి తన రాజుపట్ల ఉండే బాధ్యత
3. ఆంధ్రుల ప్రశంస దేనిలో కనిపిస్తుంది?
   ఎ) ఐతరేయ బ్రాహ్మణం
   బి) మార్కండేయ పురాణం
   సి) రామాయణం
   1) ఎ,బి 2) బి,సి
   3) ఎ,సి 4) పైవన్నీ
4. శాతవాహన యుగంలో సుగంధ ద్రవ్యాలను తయారుచేసే వారిని ఏ పేరుతో వ్యవహరించేవారు?
   1) గధికులు 2) సేల వధకులు
   3) చంకుకారులు 4) తిలపిష్టకులు
5. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని వి.ఎస్. సుక్తాంకర్ దేని ఆధారంగా చెప్పాడు?
   1) నాసిక్ శాసనం
   2) హిరహడగల్లి శాసనం
   3) నానాఘట్ శాసనం
   4) భట్టిప్రోలు శాసనం
6. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) దక్షిణాపథపతి - మొదటి శాతకర్ణి
   బి) దక్షిణాపథేశ్వరుడు-వాసిష్ఠీపుత్ర పులోమావి
   సి) దక్షిణాపథ సామ్రాట్టు- వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు
   1) ఎ,బి 2) ఎ మాత్రమే
   3) ఎ,సి 4) పైవన్నీ
7. నాగార్జున కొండలో బౌద్ధ విహారాన్ని నిర్మించిన ఎహువల శాంతమూలుని సోదరి?
   1) శాంతిశ్రీ 2) హర్మ్యశ్రీ
   3) షష్ఠిశ్రీ 4) కొడబలిసిరి
8. శాసనాలు వీర పురుషదత్తుడిని ఏ పేరుతో పేర్కొంటున్నాయి?
   1) మాఢరీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   2) వాసిష్ఠీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   3) గౌతమీపుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
   4) శాంతిశ్రీ పుత్ర శ్రీ వీర పురుషదత్తుడు
9. కింది వాటిలో సరైన జత ఏది?
   ఎ) గోరంట్ల శాసనం - అత్తివర్మ
   బి) మట్టిపాడు తామ్ర శాసనం - దామోదర వర్మ
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ,బి 4) ఎ,బి కాదు
10. క్రీ.శ.130 ప్రాంతంలో భారతదేశాన్ని సందర్శించిన టాలెమీ కృష్ణాముఖద్వారంలోని ఏ ప్రాంతం వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని చెప్పాడు?
    1) ఘంటసాల 2) భట్టిప్రోలు (పిటింద్ర)
    3) ధరణికోట 4) నాగార్జున కొండ
11. ఇక్ష్వాకుల కాలంనాటి శిల్పాలలో 'మాంధాత శిల్పం' అతి ముఖ్యమైంది. ఈ శిల్పం ఎక్కడ లభించింది?
    1) జగ్గయ్యపేట 2) నాగార్జున కొండ
    3) అమరావతి 4) ఘటప్రభ
12. 'త్రిపురమర్త్య మహేశ్వర'గా కీర్తి పొందిన వేంగీ చాళుక్యుల రాజు?
    1) ఒకటో విజయాదిత్యుడు
    2) రెండో విజయాదిత్యుడు
    3) మూడో విజయాదిత్యుడు
    4) నాల్గో విజయాదిత్యుడు
13. త్రికాలయోగి సిద్ధాంత దేవునికి రామతీర్థంలో 'రామకొండ' అనే గుహాలయాన్ని నిర్మించి ఇచ్చిన రాజు?
    1) రెండో విజయాదిత్యుడు
    2) రాజరాజనరేంద్రుడు
    3) చాళుక్య భీముడు 4) విమలాదిత్యుడు
14. బెజవాడలో జైన సన్యాసుల కోసం 'నడుంబి వసతి' అనే బసదిని నిర్మించిన రాణి?
    1) రుద్ర భట్టారిక
    2) ఉపాసిక బోధిశ్రీ 3) చల్లవ్వ
    4) అయ్యణ మహాదేవి
15. జతపరచండి.
    జాబితా-I
    a) బెజవాడ శాసనం
    b) చీపురుపల్లి శాసనం
    c) కందుకూరి శాసనం
    d) విప్పర్ల శాసనం
    జాబితా-II
    i) గుణగ విజయాదిత్యుడు
    ii) కుబ్జ విష్ణువర్ధనుడు
    iii) రెండో యుద్ధమల్లుడు
    iv) జయసింహ వల్లభుడు
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-iii, b-ii, c-i, d-iv
    3) a-iii, b-i, c-iv, d-ii
    4) a-ii, b-iv, c-i, d-iii
16. 'శబ్దచంద్రిక', శబ్దరత్నాకరం' అనే నిఘంటువులను రచించింది?
    1) నన్నయ్య భట్టు 2) కేతన
    3) వామనభట్టు 4) శ్రీనాథుడు
17. తెలుగులో కావ్య లక్షణాలు కనిపిస్తున్న అతి పురాతన గ్రంథం? (పండితుల అభిప్రాయం ప్రకారం)
    1) మహాభారతం 2) కుమార సంభవం
    3) ఆంధ్ర మహాభాగవతం
    4) నిర్వచనోత్తర రామాయణం
18. కింది వారిలో 'చండ చాళుక్యులు' అని ఎవరిని పిలిచేవారు ?
    1) వేంగీ చాళుక్యులు
    2) బాదామి చాళుక్యులు
    3) కళ్యాణి చాళుక్యులు 4) రెడ్డి రాజులు
19. కింది వాటిలో పాత రాతి యుగానికి చెందిన ప్రదేశం?
    1) పాతపాడు 2) కీసరవల్లి
    3) నందికనుమ 4) ఉట్నూరు
20. ఆంధ్ర దేశంలో అతి ప్రాచీన బౌద్ధ స్తూపం ఎక్కడ ఉంది?
    1) అమరావతి 2) నాగార్జున కొండ
    3) భట్టిప్రోలు 4) ఘంటసాల
21. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని వ్యాఖ్యానించినవారు?
    ఎ) నికోలో కొంటి బి) శ్రీకృష్ణదేవరాయలు
    సి) సి.పి. బ్రౌన్ డి) వినుకొండ వల్లభామాత్యుడు
    1) ఎ,బి 2) బి,సి 3) బి,డి 4) ఎ,సి
22. మోటుపల్లి అభయవర్తక శాసనాన్ని అమలుపరచడానికి గణపతిదేవుడు ఎవరిని నియమించాడు?
    1) జాయపసేనాని 2) రేచర్ల రుద్రుడు
    3) గంగయ్య సేనాని 4) సిద్ధయ్య దేవుడు
23. 'సాగర గౌతమీ సవిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ' బిరుదువహించిన రెడ్డి రాజు?
    1) ప్రోలయ వేమారెడ్డి 2) అనవేమారెడ్డి3) పెదకోమటి వేమారెడ్డి 4) కొమరగిరి రెడ్డి
24. సవరం ఎల్లయ్య అనే రాజ్య పౌరుడు ఏ రెడ్డి రాజును చంపాడు?
    1) రాచవేమారెడ్డి 2) కొమరగిరి రెడ్డి
    3) అనవోతారెడ్డి 4) ప్రోలయ వేమారెడ్డి
25. పెదకోమటి వేమభూపతి రచించిన గ్రంథం?
    1) నృత్య రత్నావళి 2) గీతా రత్నావళి
    3) వేమభూపాల చరితం 4) శృంగార దీపిక
26. పల్నాటి యుద్ధంలో పాల్గొన్న కాకతీయ రాజు?
    1) గణపతి దేవుడు
    2) రెండో ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు 4) ఎవరూ కాదు
27. నిమ్నకులాల వారికి ఆలయ ప్రవేశం కల్పించడం కోసం బ్రహ్మనాయుడు నిర్మించిన ఆలయం?
    1) రుద్రేశ్వర ఆలయం
    2) ప్రసన్న కేశవాలయం
    3) చెన్నకేశ్వర ఆలయం
    4) రామప్ప దేవాలయం
28. బ్రహ్మ సమాజ కార్యకలాపాల్లో మచిలీపట్నంలో ప్రముఖ పాత్ర వహించింది?
    1) కోకా వెంకటరత్నం
    2) కందుకూరి వీరేశలింగం
    3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    4) దేశిరాజు పెదబాపయ్య
29. 1898లో రాజా ఆర్.వి. కృష్ణారావు ప్రారంభించిన 'సరస్వతి' అనే పత్రిక కోసం కొంతకాలం పనిచేసిన వ్యక్తి?
    1) చిలకమర్తి లక్ష్మీనరసింహం
    2) న్యాపతి సుబ్బారావు
    3) కందుకూరి వీరేశలింగం
    4) కొక్కొండ వెంకటరత్నం
30. మహిళలకు సమానత్వం, శాస్త్రీయ విద్యా విధాన ఆవశ్యకత గురించి వివరించిన 'హిత సూచిని' గ్రంథ రచయిత?
    1) కందుకూరి వీరేశలింగం
    2) పరవస్తు వేంకట రంగాచార్యులు
    3) ఏనుగుల వీరాస్వామి
    4) స్వామినేని ముద్దు నరసింహం
31. రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్ర బ్రహ్మోపాసన మందిరాన్ని ఎక్కడ నెలకొల్పాడు?
    1) మచిలీపట్నం 2) కాకినాడ
    3) రాజమండ్రి 4) సికింద్రాబాద్
32. దత్తమండలాలకు థామస్ మన్రోను ప్రధాన కలెక్టర్‌గా ఎప్పుడు నియమించారు?
    1) 1879 అక్టోబర్ 4
    2) 1800 అక్టోబర్ 4
    3) 1801 అక్టోబర్ 4
    4) 1807 అక్టోబర్ 4
33. కమ్యూనిస్ట్ పార్టీ మొదటిసారిగా 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే నినాదాన్ని ఇచ్చింది?
    1) 1952 2) 1950
    3) 1948 4) 1946
34. ఆంధ్రదేశంలో ప్రారంభించిన స్వరాజ్య పార్టీ శాఖ అధ్యక్షుడు?
    1) వి.రామదాసు
    2) ఉన్నవ లక్ష్మీనారాయణ
    3) మద్దూరి అన్నపూర్ణయ్య
    4) దర్శి చెంచయ్య
35. 'చెన్నపట్నం స్వదేశీ సంఘం' కింది ఏ శిస్తు వసూలు పద్ధతిని సూచించింది?
    1) శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి
    2) రైత్వారీ పద్ధతి 3) గ్రామవారీ పద్ధతి
    4) ఏదీకాదు
36. కింది వారిలో 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించనివారు?
    1) రమాభూపతి దేవుడు
    2) తమ్మన్న దొర
    3) పులికంటి సాంబయ్య
    4) అంబుల్ రెడ్డి
37. బ్రిటిష్ వారు అనుసరించిన పన్నుల విధానాన్ని ఉద్దేశించి 'ఉప్పుకు పన్ను, పప్పుకు పన్ను' అని వ్యాఖ్యానించింది?
    1) కొండా వెంకటప్పయ్య
    2) గరిమెళ్ల సత్యనారాయణ
    3) బసవరాజు అప్పారావు
    4) త్రిపురనేని రామస్వామి చౌదరి
38. గాంధీజీ ఆస్థాన కవిగా ఎవరిని పేర్కొంటారు?
    1) పట్టాభి సీతారామయ్య
    2) తుమ్మల సీతారామమూర్తి
    3) వావిలాల గోపాలకృష్ణయ్య
    4) జమలాపురం కేశవరావు
39. ఆంగ్ల విద్యావ్యాప్తికి ఏర్పడిన అనువైన పరిస్థితుల గురించి దాసు శ్రీరామకవి ఏ కావ్యంలో పేర్కొన్నాడు?
    1) ఆంధ్రనాడు 2) తెలుగుదేశం
    3) ఆంధ్రదేశం 4) తెలుగునాడు
40. ఆంధ్రదేశంలో మొదటి బాలికా పాఠశాలగా దేనిని పేర్కొంటారు?
    1) విక్టోరియా బాలికా పాఠశాల
    2) రెవరెండ్ నోబెల్ పాఠశాల
    3) వివేకవర్ధిని బాలికా పాఠశాల
    4) రాజమండ్రి బాలికా పాఠశాల
41. 1879లో జరిగిన రంపా తిరుగుబాటుకు ప్రధాన కారణమైన చిగురు పన్నును ఎవరిపై విధించారు?
    1) కల్లుతీసే గిరిజనులపై
    2) పోడు వ్యవసాయం చేసే గిరిజనులపై
    3) నేత కార్మికులపై
    4) పశువుల కోసం కోసే గడ్డిపై
42. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో ఆర్థర్ కాటన్‌కి సహకరించిన భారతీయ అధికారి?
    1) కెప్టెన్ ఓర్ 2) వీనం వీరన్న
    3) కావలి బొర్రయ్య
    4) దామెర్ల వెంకటాద్రి
43. జతపరచండి.
    జాబితా-I
    a) బొబ్బిలి యుద్ధం
    b) చందుర్తి యుద్ధం
    c) కొండూరు యుద్ధం
    d) వందవాసి యుద్ధం
    జాబితా-II
    i) 1757
    ii) 1758
    iii) 1759
    iv) 1760
    1) a-i, b-ii, c-iii, d-iv
    2) a-ii, b-i, c-iii, d-iv
    3) a-i, b-ii, c-iv, d-iii
    4) a-i, b-iii, c-ii, d-iv
44. కావలి సోదరులు అంటే ఎవరు?
    1) వెంకటాద్రి, అయ్యప్ప
    2) దామోదర్, బాలకృష్ణ
    3) బొర్రయ్య, బాలకృష్ణ
    4) బొర్రయ్య, వెంకట రామస్వామి
45. కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ) ఆంధ్ర నేతాజీ - పర్వతనేని వీరయ్య చౌదరి
    బి) ఆంధ్ర వాల్మీకి-వావికొలను సుబ్బారావు
    సి) ఆంధ్ర గాంధీ-వావిలాల గోపాలకృష్ణయ్య
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) సి మాత్రమే 4) ఎ,బి
46. 'రామదాసు'గా బిరుదు పొందిన వ్యక్తి?
    1) కొండా వెంకటప్పయ్య
    2) పట్టాభి సీతారామయ్య
    3) పింగళి వెంకయ్య
    4) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
47. మద్రాస్ ప్రభుత్వం నిషేధించిన నాటకం?
    1) గయోపాఖ్యానం 2) మా భూమి
    3) కన్యాశుల్కం 4) ద్రౌపదీ పరిణయం
48. థామస్ మన్రో నివేదిక ప్రకారం దత్త మండలాల్లో ఎంతమంది పాలెగాళ్లు ఉండేవారు?
    1) 100 2) 45 3) 13 4) 80
49. గుంటూరు నుంచి వెలువడే దేశాభిమాని పత్రికకు అనేక వ్యాసాలు రాసి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సమర్థించింది?
    1) జొన్నవిత్తుల గురునాథం
    2) కొండా వెంకటప్పయ్య
    3) శేషగిరిరావు 4) ఉన్నవ లక్ష్మీనారాయణ
50. 1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ ఐదో సమావేశానికి అధ్యక్షుడు ఎవరు?
    1) న్యాపతి సుబ్బారావు
    2) కొండా వెంకటప్పయ్య
    3) మోచర్ల రామచంద్రరావు
    4) రామరాయనింగార్
51. 1903-1904 మధ్య గుంటూరులో స్థాపించిన సంస్థ కింది వాటిలో ఏది?
    1) యువజన స్వరాజ్య సమితి
    2) యువజన సాహితీ సమితి
    3) బాల భారత సమితి
    4) మహిళా భారతి సంఘం
52. 1884లో మే 16న ఆవిర్భవించిన మద్రాస్ మహాజన సభకు అధ్యక్షుడు, కార్యదర్శి (వరుసగా)?
    1) సుబ్రమణ్య అయ్యర్, ఆనందాచార్యులు
    2) ఆనందాచార్యులు, రంగయ్య నాయుడు
    3) రంగయ్య నాయుడు, ఆనందాచార్యులు
    4) రంగయ్య నాయుడు, సుబ్రమణ్య అయ్యర్
53. 1950లో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి మద్రాస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన విభజన సంఘానికి అధ్యక్షుడు?
    1) కుమార రాజా
    2) టంగుటూరి ప్రకాశం
    3) నీలం సంజీవరెడ్డి
    4) భక్తవత్సలం
54. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) కందుకూరి వీరేశలింగం గురువు - ఆత్మూరి లక్ష్మీ నరసింహం
    బి) టంగుటూరి ప్రకాశం పంతులు గురువు - హనుమంతరావు నాయుడు
    1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ,బి సరైనవి 4) ఎ,బి సరైనవి కావు
55. ఫజల్ అలీ అధ్యక్షుడిగా రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని ఎప్పుడు నియమించారు?
    1) 1953 డిసెంబర్ 22
    2) 1953 డిసెంబర్ 29
    3) 1954 ఏప్రిల్ 3 4) 1955 సెప్టెంబర్ 30
56. 1949 నవంబర్ 26న ఏర్పాటు చేసిన విశాలాంధ్ర మహాసభ ప్రధాన కేంద్రం?
    1) వరంగల్లు 2) హైద్రాబాద్
    3) విజయవాడ 4) కర్నూలు

సమాధానాలు

1) 3	2) 3	3) 4	4) 1	5) 2
6) 4	7) 4	8) 1	9) 3	10) 2
11) 1	12) 3	13) 4	14) 4	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 3	22) 4	23) 2	24) 1	25) 4
26) 3	27) 3	28) 3	29) 1	30) 4
31) 2	32) 2	33) 4	34) 1	35) 3
36) 1	37) 2	38) 2	39) 4	40) 1
41) 1	42) 2	43) 1	44) 4	45) 1
46) 4	47) 2	48) 4	49) 3	50) 2
51) 2	52) 3	53) 1	54) 3	55) 2
56) 3				

What is the total distance between...

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.

Certain number of people was seated in a linear row facing north. One of them was seated at the end. Information about some of them is known. There were not more than 13 people. At least six people were seated between P and U where P was to the right of U. V was to the immediate right of S. T was seated second from the right end of the row. The number of people to the left of Q was more than twice the number of people to the right of Q. Only one person was seated between R and S. There were not more than 5 people sitting between R and Q. R was not seated adjacent to U. No three people mentioned were sitting together.

1. How many people were seated in the row?
   a) 8 b) 12 c) 10 d) 11
   e) Cannot be determined
2. Who was seated second to the left of R?
   a) P b) Q c) U
   d) No body e) Data insufficient
3. How many people were seated between Q and S?
   a) 3 b) 5 c) 7 d) 8
   e) Cannot be determined
4. What is the position of T with respect to U?
   a) Second to the right
   b) Tenth to the right
   c) Fourth to the left
   d) Immediate right
   e) Immediate left
5. How many people were seated to the left of S?
   a) 6 b) 4 c) 9
   d) 3 e) 7

Directions (Q.No.6-10): Study the following information carefully and answer the questions given below.

Eight persons A, B, C, D, E, F, G and H went to a conclave. It was seen that each person was of a different age. The partial sequence of their ages is as follows:

___>___> F >___ >___>___> __
(39) (27) (23)
D > ___

They were seated in a straight row facing the North. The partial arrangement is shown below:

___ B ___ ___ ___ ___ ___ G
(25) (36)

The numbers shown in the brackets denote age.

» The person aged 31 was seated 3rd to the left of the one who was aged 27.
» B was aged more than G.
» The person who was 39 years old was seated 2nd to the left of F
» E was the 2nd eldest person and was seated to the immediate right of C.
» The person aged 23 was to the immediate right of the one who was aged 22
» A was seated 3rd to the left of the one who was 19 years old
» D was not the eldest.

6. What was the age of the person who was at the extreme left end of the row?
   a) 31 b) 19 c) 22
   d) 39 e) Cannot be determined
7. What was the difference between the age of A and C?
   a) 1 year b) 2 years
   c) 3 years d) 4 years
   e) 9 years
8. Who among the following was seated to the immediate left of D?
   a) A b) E c) F
   d) B e) H
9. Who among the following was the 3rd youngest person?
   a) D b) B c) C
   d) A e) F
10. If all the digits at odd positions in the number "324846237" are changed to previous digit in the number series and all the digits at even positions are changed to next digit in the number series, then which digit appears more than twice in the number thus formed?
    a) More than one such digit is there
    b) 7 c) 2
    d) 3 e) No such digit is there

Directions (Q.No.11-15): Study the information carefully and answer the questions given below.

Six people were born in different years with the current base is taken as 2018. None of them is older than 90 years old. They like different colours Red, Orange, Green, Blue, Black and Yellow.

A was born in the year 1981. The difference of age between A and C is 23 years. B's age is sum of the digits of the year in which C was born. The one who likes Blue colour is 6 years elder to B. The one who likes green colour is just younger than F. F's age is either the last two digits or reverse of the last two digits of the year in which the person who likes Blue colour was born. The difference between the age of D and the one who likes Green colour is 25 years. D is older than E. F is not the eldest. The one who likes Red colour is just elder than the one who likes Black colour. C does not like Orange colour.

Note - If mentioned the last two digits or reverse of the last two digits of the year in which a person is born can be the age of some other person.(Like A is born in 1943 and age of b is denoted by the last two digits of the birth year of A. Then B's age will be either 34 or 43).

11. Who among the following likes Orange colour?
    a) A b) D c) E
    d) B e) None of these
12. Who among the following is the eldest?
    a) A b) D c) C
    d) E e) None of these
13. Which of the following combination is true?
    a) A - 1981 - Black
    b) B - 2012 - Blue
    c) C - 2006 - Yellow
    d) F - 1958 - Black
    e) None of these
14. Which of the following statement is correct?
    a) A is three years younger than the one who likes Black
    b) C is the eldest
    c) E likes Blue colour
    d) E is born before A
    e) All are correct
15. In which of the following year F was born?
    a) 1995 b) 1958 c) 1956
    d) 2004 e) None of these

Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below.

Eight persons P, Q, R, S, T, U, V, W are sitting around a rectangular table but not necessarily in the same order. Those who are sitting next to each have different distance from each other. Each of them facing towards the center. Some of them are sitting at the corners while some are sitting on the side of the table. The area of the rectangular table is 540m^2. The length of the table is 7m more than the breadth of the table. R sits at one of the corners of the table. T sits second to the left of R. P is sitting at a distance of 14m from T. Only two persons sit between P and Q. The distance between R and U is twice of the distance between R and V. W faces R. P sits immediate right of W and at a distance of 13m, Neither Q nor S is an immediate neighbour of R. The distance between R and U is 2m more than the distance between P and T. U is not an immediate neighbour of T. The distance between Q and W is equal to the distance between R and U. The distance between Q and S is half of the distance between V and T. T does not sit at the corner of the table.

16. What is the total distance between V and W?
    a) 40 m b) 15 m c) 24 m
    d) 39 m e) 49 m
17. Who among the following sits second to the left of Q?
    a) T b) W c) V
    d) P e) R
18. Which of the following is not true regarding U?
    a) U sits second to the left of S
    b) The distance between U and V is 24 m
    c) W sits third to the right of U
    d) P is an immediate neighbour of U
    e) All are correct
19. How many persons sits between T and U when counted from the left of U?
    a) Three b) One
    c) No one d) Four e) Two
20. What is the position of P with respect to S?
    a) Third from the right
    b) Second from the left
    c) Second from the right
    d) Fourth from the left
    e) None of these

KEY

1) b	2) c	3) a	4) b	5) b
6) d	7) d	8) c	9) d	10) d
11) d	12) b	13) d	14) c	15) b
16) d	17) e	18) d	19) e	20) c